


# ఈనాడు





విజయవాడ 4-1-2023 బుధవారం సిటీ సంపుటి 49 . సంచిక 145

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


# సభలపై ఆంక్షల కత్తి

- రోడ్లపై నిర్వహణకు అనుమతి రద్దు
- ఆంక్షలు విధిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు
- ప్రత్యేక, అరుదైన సందర్భాల్లోనే అనుమతి



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, మున్సిపల్, పంచాయతీ రోడ్లపై ఇలాంటివి నిర్వహించేందుకు అనుమతివ్వబోమని ప్రకటించింది. రహదారులకు దూరంగా ఉండే ప్రభుత్వ మైదానాలు, ప్రైవేటు స్థలాల్లో వీటిని నిర్వహించుకోవాలని సూచించింది. అయితే ప్రత్యేక పరిస్థితులు, అరుదైన సందర్భాలతో పాటు రోడ్లపైనే సభలు, సమావేశాల నిర్వహించాల్సిన కారణాలను లిఖితపూర్వకంగా పేర్కొని అనుమతి కోరితే ఆ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. సభ నిర్వహణకు అనుమతి కోరిన రోడ్డు వెడల్పు, ఎంత సమయం జరుగుతుంది? జరిగే ప్రదేశం, అక్కడ ఉన్న నిష్క్రమణ మార్గాలు, ఎంత జనం హాజరయ్యే అవకాశం ఉంది? రద్దీ నిర్వహణ చర్యలు ఎలా ఉన్నాయి? అనే అంశాల్ని పరిశీలిస్తామని వివరించింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సభలు, సమావేశాలు, ర్యాలీలను రోడ్లపై కాకుండా, వాటికి దూరంగా నిర్వహించుకునేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ప్రాంతాల్ని పోలీసులు సూచించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం, పోలీసులు కలిసి.. వారి పరిధిలో బహిరంగ సభల నిర్వహణకు (మిగతా 2లో)

### దుర్మార్గపు నిర్ణయం



ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతుల్ని అణగదొక్కేందుకే ప్రభుత్వం చీకటి జీవో తెచ్చింది. ప్రజలు, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయకూడదన్న ఉద్దేశంతో తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు ప్రజాస్వామ్యాన్ని హరించడమే. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు అసలు సభలే పెట్టకూడదనేలా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం దుర్మార్గం.

\- అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు

### అధికారంలో ఉన్నవాళ్లు పాదయాత్రలు చేయలేదా?



రోడ్లపై చాలా మంది పాదయాత్రలు చేశారు. ఎవరు చేసినా బాధ్యత ఉండాలి. పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన వైకాపా సభలు-సమావేశాలు నియంత్రణ చేస్తూ తెచ్చిన జీవోను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేదు? ఈ కారణంగా ప్రభుత్వ కోణంపై అనుమానాలు వస్తున్నాయి.

\- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

### జీవించే హక్కునీ హరిస్తారు



రాజ్యాంగం 19వ అధికరణం ద్వారా ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛలో రాజకీయ పార్టీల కార్యక్రమాలూ ఉంటాయి. 19వ అధికరణను ఏపీలో నిషేధించాలని వైకాపా ప్రభుత్వం నిర్ణయించిందా? కచ్చితంగా ఏదో ఒక రోజు జీవించే హక్కునీ హరిస్తారు.

\- నాదెండ్ల మనోహర్, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్

### ప్రజాస్వామ్యం ఖూనీ..



జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. కందుకూరు, గుంటూరు ప్రమాద ఘటనలను సాకుగా చూపి జగన్ సర్కారు నిరంకుశ నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణాలు మానుకుంటారా? మానుకోమంటారా?

\- కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

### సమావేశాలు అడవుల్లో పెట్టుకోవాలా?



రోడ్డు షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు ప్రభుత్వం ఓ పనికిమాలిన జీవో విడుదల చేసింది. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. సభలు, సమావేశాలు అడవిలో పెట్టుకోవాలా? ఊరికి దూరంగా, ప్రజలతో సంబంధం లేకుండా సభలు నిర్వహించుకోమనడం మాకు ఆమోదయోగ్యం కాదు.

\- వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి



## చంద్రబాబు రోడ్‌షో, సభలకు అనుమతి నిరాకరణ

పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి వెల్లడి

3లో

## ఆ జీవో లక్ష్యం ప్రతిపక్షాల గొంతు నొక్కడమే

తీవ్రంగా మండిపడుతున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు




వేదికపై పింఛను కానుక నమూనా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు ముత్యాలనాయుడు, వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, ఎంపీ భరత్‌రామ్, మాజీ మంత్రి కన్నబాబు, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, కలెక్టర్ మాధవీలత, రుడా ఛైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు పింఛన్ల పంపిణీ

మంచి చేసే అవకాశం ఇస్తే అందరికీ మేలు చేస్తా ● రాజమహేంద్రవరంలో సీఎం జగన్

2లో

## ప్రశ్నిస్తే పక్కన పెట్టారు



ఆనంను ఏకాకిని చేసేలా వైకాపా అధిష్ఠానం నిర్ణయం

వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్‌కు పార్టీ బాధ్యతలు

పర్చూరుకు ఆమంచి కృష్ణమోహన్ నియామకం

**ఈనాడు, అమరావతి:** ప్రశ్నించడాన్ని వైకాపా అధిష్ఠానం జీర్ణించుకోలేకపోతోంది. అది ప్రతిపక్షమైనా.. స్వపక్షీయులైనా.. ప్రశ్నిస్తే తొక్కేస్తోంది. వెంకటగిరి నియోజకవర్గంలో రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు తదితర సమస్యలపై బాహాటంగా ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిపై పరోక్ష చర్యలకు తెరతీసింది. వెంకటగిరిలో ఎమ్మెల్యేగా ఆయన ఉన్నా.. నియోజకవర్గ పార్టీ సమన్వయ బాధ్యతలను ఆయన వైరివర్గమైన నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి అప్పగించింది. నెల్లూరు జిల్లాలోనే ఉండాలని ఆనం దృఢంగా కోరుకున్నా, జిల్లాల విభజన సమయంలో ఆయన నియోజకవర్గాన్ని తిరుపతిలోకి కలిపారు. రాపూరు ఆనం సొంత నియోజకవర్గం. 2009లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో అది రద్దయింది. అందుకే రాపూరును నెల్లూరు జిల్లాలో కొనసాగించుకోవాలని ఆనం పట్టుబట్టి సాధించుకున్నారు. తర్వాత సమీకరణలు మారాయి. ఆయన పదే పదే ప్రశ్నిస్తుండటంతో (మిగతా 12లో)






(c) eenadu

# ఎన్నారైలను భయపెడితే ఎలా?

- వారు సేవా కార్యక్రమాలెలా చేస్తారు
- ఉయ్యూరు శ్రీనివాస్ మంచి వ్యక్తి
- గుంటూరు ఘటనపై ఎమ్మెల్యే వసంత వ్యాఖ్యలు

**మైలవరం, న్యూస్‌టుడే:** 'సేవను రాజకీయ కారణాలతో విమర్శించడం మంచి పద్ధతి కాదు. కొంత మంది వ్యక్తులు ఎన్నారైలను వారి పనులు వారు చూసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఎన్నారైలను భయపెడితే ఎలా' అని ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైకాపా శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. ఇలాగైతే వారు సేవా కార్యక్రమాలెలా చేస్తారని ప్రశ్నించారు. ప్రవాసులతో దేశంలో చాలా అభివృద్ధి జరుగుతోందని వివరించారు. ప్రవాసుల సాయాన్ని ఆపాలనుకోవటం అవివేకమవుతోందని పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుడు, ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వాహకుడు ఉయ్యూరు శ్రీనివాస్ మంచి వ్యక్తి అని, తనకు చాలాకాలంగా స్నేహితుడని తెలిపారు. గుంటూరులో రాజకీయ వేదికపైకి వచ్చారనే ఉద్దేశంతో కావాలని శ్రీనివాస్‌పై ఉన్నవి, లేనివి కల్పించి చెప్పి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. గతంలో చాలా మంది దుస్తుల పంపిణీ తదితర అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని పేర్కొన్నారు. పేదల పట్ల అభిమానం ఉన్న శ్రీనివాస్ పెద్ద ఎత్తున కార్యక్రమం చేయబోయి అవస్థల పాలయ్యారని, ప్రజలకు కష్టం కలగాలని ఎవరూ కోరుకోరని వివరించారు. ఆయన మంచి మనిషని, పేదలకు అండగా ఉన్నారని చెప్పారు. గుంటూరు సంఘటన అనంతరం ఎన్నారైలకు సంబంధించి మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఎమ్మెల్యే వసంత ఇలా మాట్లాడటం విశేషం. పైగా గుంటూరు ఘటనను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ, తెదేపాను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నాలు, విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ సభ్యుడే ప్రభుత్వ చర్యలను తప్పుబడుతున్నట్లు మాట్లాడటం గమనార్హం.

# ఇంటర్ బోధన ఎలా?

## ఈ నెలతో ముగియనున్న ఒప్పంద అధ్యాపకుల గడువు

**ఈనాడు, అమరావతి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల గడువు జనవరితో ముగియనుండడంతో పాఠాల బోధనపై అయోమయం నెలకొంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 10 నెలల కాలానికి వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ గడువు జనవరి నెలతో ముగుస్తుంది. ఇప్పటివరకు వీరి సర్వీసు పొడిగింపుపై ఎలాంటి అనుమతులు లభించలేదు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 15 నుంచి మే 10వరకు ప్రాక్టికల్ పరీక్షలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒప్పంద అధ్యాపకుల సేవలు పొడిగించకపోతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల్లో కలిపి 3,720 మంది ఒప్పంద అధ్యాపకులు పని చేస్తున్నారు.

# ఆర్‌సెట్ సీట్ల రిజర్వేషన్లలో మార్పుపై గెజిట్

**ఈనాడు, అమరావతి:** పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌సెట్ రిజర్వేషన్లలో మార్పులు చేస్తూ ప్రభుత్వం సవరణ గెజిట్‌ను విడుదల చేసింది. పోస్టుగ్రాడ్యుయేషన్ అర్హతతో ఆర్‌సెట్ రాసిన వారికి ఇప్పటి వరకు 75% సీట్లు ఉండగా.. వీటిని 50%కి కుదించారు. జాతీయ అర్హత పరీక్ష(నెట్), జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్), గేట్, స్లెట్‌లాంటి అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రస్తుతం 25% సీట్లు ఉండగా.. దీన్ని 50%కి పెంచింది. నెట్, జేఆర్ఎఫ్, గేట్‌లాంటి అర్హతలున్న వారికి 25% సీట్లే కేటాయించడంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ మేరకు సీట్ల రిజర్వేషన్‌ను సవరించారు. ఇందులో ఏ కేటగిరిలోనైనా సీట్లు మిగిలితే మరో కేటగిరికి మార్పు చేస్తారు.

# నెలనెలా విద్యుత్తు ఛార్జీల సవరణ

- ఇంధన భారాన్నీ వినియోగదారుడి నుంచి రాబట్టాలి
- నిబంధనలను సవరించిన కేంద్ర విద్యుత్తు శాఖ



**ఈనాడు, దిల్లీ:** విద్యుదుత్పత్తికి వినియోగించే ఇంధనం ఛార్జీలను, విద్యుత్తు కొనుగోలు ధరలు పెరిగినప్పుడు ఆ మేరకు భారాన్ని ప్రతినెలా ఆటోమేటిక్‌గా వినియోగదారుడిపై వేసేలా విద్యుత్తు కమిషన్ ఒక ఫార్ములా రూపొందించాలని కేంద్ర విద్యుత్తు శాఖ పేర్కొంది. ఈ మేరకు విద్యుత్తు నిబంధనలు-2005ని సవరిస్తూ కొత్త నిబంధనలు జారీచేసింది. భారాన్ని నెలవారీగా ఆటోమేటిగ్గా వినియోగదారుల టారిఫ్‌కి మళ్లించేలా విద్యుత్తు కమిషన్ 90 రోజుల్లోపు ఒక ఫార్ములా రూపొందించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. ఆ నెలవారీ ట్రూప్ ఛార్జీలను వార్షిక ప్రాతిపదికన నిర్ధారించాలని స్పష్టంచేసింది. విద్యుత్తు కమిషన్ ఈ కొత్త ఫార్ములా ఖరారు చేసేంతవరకూ ఈ నిబంధనల్లో చెప్పిన విధానాన్ని అనుసరించాలని స్పష్టంచేసింది.

- ఇంధనం, విద్యుత్తు కొనుగోలు సర్దుబాటు సర్‌ఛార్జి అంటే వినియోగదారులకు విద్యుత్తు సరఫరా చేయడానికి అయ్యే ఖర్చు పెరగడమని అర్థం చేసుకోవాలి.
- ఈ అదనపు భారాన్ని లెక్కించి వినియోగదారుల బిల్లుల్లో కలపాలి. నియంత్రణ సంస్థ అనుమతుల ప్రక్రియ అవసరం లేకుండానే రాష్ట్ర కమిషన్ నిర్దేశించిన ఫార్ములా ప్రకారం ఆటోమేటిక్‌గా నెలవారీగా ఈ పనిచేయాలి.
- ఇంధనం, విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులు, అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ ఛార్జీల్లో నెలవారీగా వచ్చిన వాస్తవ తేడా ఆధారంగా ఈ సర్‌ఛార్జిని లెక్కించాలి. ఉదాహరణకు ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఇంధనం, విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులో తేడా వస్తే ఆ భారాన్ని జూన్ నెల బిల్లులో కలపాలి.
- వినియోగదారులకు టారిఫ్ షాక్‌లు ఇవ్వకుండా డిస్కంలు ఎప్పటికప్పుడు ఇంధన, విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులను లెక్కించి ఆ తర్వాతి నెలలో వాటిని బిల్లుల్లో చేర్చాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండునెలలకు మించి జాప్యం జరగకూడదు.
- విద్యుత్తు నియంత్రణ కమిషన్ ముందుకు ఏదైనా వివాదం వస్తే దాన్ని 120 రోజుల్లోపు పరిష్కరించాలి. ఆ పరిమితిని స్పష్టమైన కారణాలతో మరో 30 రోజులు పొడిగించవచ్చు. ఏదైనా కారణంతో తుది ఉత్తర్వు వెలువరించలేని పరిస్థితి ఉంటే, ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా పేర్కొంటూ కమిషన్.. పైన పేర్కొన్న కాలపరిమితి లోపు మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి. 120/150 రోజుల్లోపు తుది ఉత్తర్వులు వెలువడని పరిస్థితి ఉంటే ఉపశమనం కోసం బాధిత పక్షం అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడానికి ఈ కొత్త నిబంధన వీలు కల్పించింది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
నిట్ నెం.16/టి.ఓ/2022-23　ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన　తేది: 28.12.2022
పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 2 స్లాబ్ కల్వర్టుల పునః నిర్మించుట కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా విలువ: రూ. 100.00 లక్షలు.** టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను 04.01.2023, సా. 3 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలను **http://tender.apeprocurement.gov.in** లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ.), ఏలూరు సర్కిల్, ఏలూరు
DIPR No.7322/ CL/Advt/1/1/2021-22


# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- రాజమహేంద్రవరం సభలో ముఖ్యమంత్రి జగన్



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

**ఈనాడు, రాజమహేంద్రవరం - న్యూస్‌టుడే, టి. నగర్:** 'రాష్ట్రంలో పేదలకు, పెత్తందారీ వ్యవస్థలకు మధ్య యుద్ధం జరుగుతోంది. పొరపాటు జరిగితే.. పేదోడు నాశనమైపోతాడు. పేదల వ్యతిరేక శక్తులతో మీ బిడ్డ పోరాటం చేస్తున్నాడు. ఈ పోరులో మీ అందరి దీవెనలు, ఆశీస్సులు.. ఆ దేవుడి దయ మీబిడ్డకు ఉంటాయని ఆశిస్తున్నా. మంచి చేసే అవకాశం రావాలని.. మీ అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నా' అని సీఎం జగన్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షో, పెంచిన పింఛన్ల పంపిణీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ దిగజారిందని, ఓర్వలేక తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. పేదలకు ఇంగ్లిషు మీడియం చదువులు వద్దనీ.. ఇళ్లు కట్టించొద్దనీ, వారికి మంచిచేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటున్నారని విమర్శించారు. పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రాజమహేంద్రవరంలో పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని, అవ్వాతాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పింఛను సొమ్ము రూ.2,750కి పెంచానని సీఎం చెప్పారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్ల కింద రూ. 2,750 నుంచి రూ.10 వేలు వరకు పేదలకు అందిస్తున్న ఘనత రాష్ట్రానికే దక్కుతుందని సీఎం జగన్ చెప్పారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే జులై, నవంబరులో అర్హులకు కొత్తగా బియ్యం కార్డులు, ఆరోగ్యశ్రీ, ఇళ్ల పట్టాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఇచ్చిన 44,543 బియ్యం కార్డులతో.. వాటి సంఖ్య 1,45,88,539కి చేరిందన్నారు. కొత్తగా ఇచ్చిన 14,401 ఆరోగ్యశ్రీ కార్డులతో మొత్తం సంఖ్య 1,41,48,249కి చేరిందని, 14,531 ఇళ్ల పట్టాల పత్రాలు ఇచ్చామని.. లబ్ధిదారుల సంఖ్య 30,29,170కి పెరిగిందన్నారు. గత ప్రభుత్వం దిగిపోయే ముందు రూ.వెయ్యి మాత్రమే పింఛను ఇచ్చేవారనీ, అప్పట్లో 39 లక్షల మందికే పింఛన్లు అందితే.. మన అందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 64,06,240 మందికి పింఛన్లు ఇస్తున్నట్లు గుర్తుచేశారు. గత ప్రభుత్వం పింఛన్లకు నెలకు రూ. 400 కోట్లు ఖర్చుచేస్తే, తాము రూ.1,565 కోట్లు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.21,180 కోట్లు చొప్పున మూడున్నరేళ్లలో రూ. 62,500 కోట్లకు పైగా ఖర్చుచేసినట్లు వివరించారు. గతంలో ఎవరో ఒకరు చనిపోతే వారి స్థానంలో పింఛన్లు ఇచ్చేవారనీ.. ఇప్పుడు అర్హత ఉంటే చాలన్నారు. కులం, మతం, వర్గం, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులకు పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు.

### అర్హత ఒకటే ప్రామాణికం..

రాష్ట్రంలో ఏ పథకం కావాలన్నా అర్హత ఒక్కటే ప్రామాణికమని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రంలో 2.66 లక్షల మంది వాలంటీర్లు, 1.30 లక్షల మంది సచివాలయ ఉద్యోగులతో అర్హులకు పథకాలు చేరువ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఉన్నప్పుడు మూడు నెలల పింఛను సొమ్ము లంచంగా ఇస్తేనే పింఛను మంజూరయ్యే పరిస్థితి ఉండేదనీ, ఇప్పుడు సచివాలయ వ్యవస్థ ద్వారా లంచాలు, వివక్ష లేని వ్యవస్థ తెచ్చామని అన్నారు.

### ప్రాణాలు తీసేసి డ్రామాలా..?

ప్రాణాలు తీసేసి.. మహోన్నత మానవతావాదిలా చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని జగన్ ధ్వజమెత్తారు. ఫొటో షూట్లు, డ్రామాలతో కన్నీరు కార్చడం బాబు నైజమన్నారు. రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాల్లో 29 మందిని ఇలాగే చంపేశారని ఆరోపించారు. సినిమా డైరెక్టర్‌ను పక్కన పెట్టుకుని షూటింగ్ కోసం అన్ని గేట్లూ మూసేసి తొక్కిసలాటకు కారణమయ్యారని ఆరోపించారు. కందుకూరులో జనం తక్కువ వచ్చారని ఇరుకు సందులోకి మీటింగ్‌ను మార్పించి.. జనాన్ని అక్కడకు నెట్టి ఎనిమిది మందిని చంపేసిన పరిస్థితి చూశామన్నారు. గుంటూరులో చీరల పంపిణీ పేరుతో ముగ్గురిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. డ్రోన్ షాట్లు, ఫొటో షూట్ల కోసం చంపేసే పరిస్థితి తెచ్చి... తప్పును పోలీసుల మీదకు నెడుతున్నారని ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్యలో చంద్రబాబు వంకర బుద్ధి ప్రజలంతా చూశారని జగన్ విమర్శించారు.

### సీఎం కోర్టు కథ...

రాజకీయ వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో చెప్పడానికి ఇదో చిన్న ఉదాహరణ అని జగన్... సభలో కోర్టు కథ చెప్పారు. 'కోర్టులో జడ్జి ముందుకు ఓ వ్యక్తి వచ్చి అయ్యా తల్లీతండ్రీ లేనివాడిని నన్ను శిక్షించవద్దని బోరున ఏడ్చాడట.. జడ్జి చలించిపోయి ప్రాసిక్యూటర్‌ను ఈయన చేసిన తప్పేంటని అడిగాడట. నిజమే సార్.. ఈయనకు తల్లిదండ్రులు లేరు. వాళ్లిద్దర్నీ ఈయనే చంపేశాడని ప్రాసిక్యూటర్ అన్నారట... చంద్రబాబుదీ ఇదే పద్ధతి' అని జగన్ చెప్పారు. సభలో మంత్రులు తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, బూడి ముత్యాలనాయుడు, కారుమూరి నాగేశ్వరరావు, శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు, ఎంపీలు మార్గాని భరత్‌రామ్, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మిథున్‌రెడ్డి, వంగా గీత, చింతా అనురాధ, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు, కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కొండేటి చిట్టిబాబు, జ్యోతుల చంటిబాబు, సత్తి సూర్యనారాయణరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



భారీ భద్రత నడుమ సాగుతున్న రోడ్ షోలో వాహనం నుంచే అభివాదం చేస్తున్న సీఎం జగన్

# సభలపై ఆంక్షల కత్తి

(మొదటి పేజీ తరువాయి)

అనువైన ప్రాంతాల్ని గుర్తించాలని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ట్రాఫిక్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగని ప్రాంతాలను సభల నిర్వహణకు గుర్తించాలని తెలిపారు. గత నెల 28న కందుకూరులో జరిగిన తొక్కిసలాట ఘటనలు లాంటివి పునరావృతమవ్వకుండా పోలీసు చట్టం-1861లోని సెక్షన్ 30ను అనుసరించి ఈ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(బి) ప్రకారం శాంతియుతంగా బహిరంగ సభలు నిర్వహించుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు. అది పోలీసు చట్టం సెక్షన్ 30కి లోబడి ఉంటుంది..." అని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రహదారులపై సభలు, సమావేశాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి అనారోగ్యంతో ఉన్న వారు, వృద్ధులు, గర్భిణీలు, ప్రమాదాల్లో గాయపడినవారు సకాలంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

'మునిసిపల్, పంచాయతీ రహదారులు ఇరుగ్గా ఉంటాయి. అవి ప్రజల రాకపోకల కోసం నిర్దేశించినవి. ఇలాంటి చోట్ల సభలు నిర్వహించడంవల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదం. పౌర జీవనం, అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతుంది. ఇబ్బందులు ఏర్పడతాయి. జాతీయ, రాష్ట్ర రహదారులపై సభల నిర్వహణవల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగి దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్ సరఫరాపై ప్రభావం పడుతుంది. అందుకే ఇలాంటి రోడ్లపై సభల నిర్వహణకు అనుమతించడం లేదు. రోడ్లపై ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదే. రోడ్లపైన సభలు, సమావేశాలు నిర్వహించటంవల్ల ప్రజలు పక్కనే గుమికూడుతున్నారు. ఇరుకు రోడ్ల వల్ల రద్దీ నియంత్రణ సాధ్యపడట్లేదు. ఇవి మరణాలకు దారితీస్తున్నాయి. అందుకే సభలు, సమావేశాల నిర్వహణను నియంత్రిస్తున్నాం' అని ఆ ఉత్తర్వుల్లో వివరించారు.

### ఆదేశాలు బేఖాతరు వేయడం చట్ట విరుద్ధం

'పోలీసు చట్టం సెక్షన్ 30, 30ఏ, 31 ప్రకారం రాష్ట్రంలో ఎవరైనా సరే ర్యాలీలు, సభలు, సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించాలంటే అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాల్సిందే. వాటిని పరిశీలించి కొన్ని షరతులతో పోలీసులు అనుమతులిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ర్యాలీని నిలిపి వేయించే, సమావేశమైన వారిని అక్కడి నుంచి పంపించేసే అధికారం ఉంటుంది. పోలీసుల ఆదేశాల్ని బేఖాతరు చేసి ఎవరైనా సమావేశమైతే దాన్ని చట్ట విరుద్ధమైనదిగా పరిగణించి చర్యలు తీసుకుంటారు. ఉత్సవాలు, కార్యక్రమాల సందర్భంగా... వీధుల్లో నిర్వహించే ప్రదర్శనల్లో ఏ మ్యూజిక్ వినియోగించాలన్నది పోలీసులు నియంత్రించొచ్చు' అని జీఓలో పేర్కొన్నారు.

# వ్యాపారులపై చెత్త పన్ను పిడుగు

- బకాయిలతో సహా వసూళ్లకు తాఖీదులు
- తక్షణం చెల్లించాలని అధికారుల ఒత్తిడి



**ఈనాడు, అమరావతి:** పాత బకాయిలతో సహా చెత్త పన్ను చెల్లించాలని పుర, నగరపాలక సంస్థలు తాఖీదులు జారీ చేయడంతో వ్యాపారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు నెలకు రూ.500 నుంచి రూ.1,000 వరకు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. పెద్ద వ్యాపార సంస్థల నుంచైతే నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు వసూళ్లకు తాఖీదులిస్తున్నారు. పాత బకాయిలతో కలిపి భారీగా లెక్కలు చూపిస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల నుంచి చెత్త సేకరిస్తున్నందుకు రుసుములు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనలను కొన్ని చోట్ల పాలకవర్గాలు యథాతథంగా ఆమోదించాయి. ఇంకొన్ని చోట్ల ప్రతిపాదిత రుసుములపై కొన్ని మార్పులు చేర్పులు చేశారు. ఇళ్ల నుంచి చెత్త పన్ను వసూళ్లపై పలు చోట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

- చెత్త పన్ను వసూళ్లలో ఇప్పటివరకు ఆచితూచి వ్యవహరించిన పట్టణ స్థానిక సంస్థలు ప్రస్తుతం వ్యాపారుల నుంచి పాత బకాయిలతో సహా రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఉదాహరణకు విజయవాడలోని బీసెంట్ రోడ్డులో పండ్ల రసాల షాపు నిర్వాహకుడికి రూ.2,400 చెత్త పన్ను చెల్లించాలని నగరపాలక సంస్థ తాఖీదు పంపింది. నెలకు రూ.300 చొప్పున 8 నెలలకు బకాయిలతో సహా వెంటనే జమ చేయాలని అధికారులు ఆదేశించారు. వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటంతో దుకాణం అద్దె, విద్యుత్తు ఛార్జీలు చెల్లించేందుకే చాలా ఇబ్బందులు పడుతున్నామని దుకాణం నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో ఓ చికెన్ షాపు నిర్వాహకుడికి 10 నెలలకు చెత్త పన్ను కింద రూ.3వేలు చెల్లించాలని నగరపాలక సంస్థ ఉద్యోగులు హుకుం జారీ చేశారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఒక మిఠాయి దుకాణం నిర్వాహకుడి నుంచి చెత్త పన్ను కింద నెలకు రూ.1,050 చొప్పున వసూలు చేశారు.
- విశాఖలో మూడు నెలలుగా మూతపడి ఇటీవల తెరిచిన ఒక చేపల దుకాణానికి చెత్త పన్ను 4 నెలలకు కలిపి రూ.800 చెల్లించాలని తాఖీదులిచ్చారు. దుకాణం మూతపడినా పన్ను కట్టాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నారు. ఇదే ప్రాంతంలో వ్యాపారం సాగక 6 నెలలుగా మూతపడిన మరో గోడౌన్‌కు పాత బకాయిలతో సహా రూ.7,500 చెల్లించాలని తాఖీదు పంపారు.
- విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో కొన్ని స్టార్ హోటళ్లు, సినిమా థియేటర్ల నిర్వాహకులకు చెత్త పన్ను పేరుతో నగరపాలక సంస్థలు చుక్కలు చూపిస్తున్నాయి. 5-7 నక్షత్రాల హోటళ్ల నుంచి నెలకు రూ.15వేలు, త్రీ స్టార్ హోటళ్లల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. సినిమా థియేటర్లలో తెరకు (స్క్రీన్) రూ.2,500 చొప్పున రాబడుతున్నారు. 2021 అక్టోబరు నుంచి చెత్త పన్ను కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చింది. వీటిని చెల్లించని వారి నుంచి బకాయిలతో సహా ప్రస్తుతం వసూలు చేస్తున్నారు. ఇలాంటి వ్యాపార సంస్థలకు రూ.లక్షల్లో తాఖీదులు వెళ్లడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

### అపరాధ రుసుముల పేరుతోనూ బెదిరింపులు

చెత్త పన్ను ప్రతి నెలా చెల్లించకపోతే అపరాధ రుసుములు విధిస్తామని పుర, నగరపాలక సంస్థల అధికారులు వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కొన్ని చోట్ల పాత బకాయిలపై అపరాధ రుసుము విధించకపోయినా... ఇప్పుడు చెల్లించకపోతే తదుపరి ఇచ్చే తాఖీదులు అపరాధ రుసుములతో కలిపి వస్తాయని హడలెత్తిస్తున్నారు.

# అప్పులు తప్ప ఆస్తుల్లేవ్!

- అంచనాల మేరకైనాలేని మూలధన వ్యయం
- మొత్తం ఖర్చులో కేవలం 4.14 శాతమే
- నవంబరు వరకు లెక్కలు వెలుగులోకి..

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో ఒకవైపు అప్పులు లెక్కకు మిక్కిలిగా పెరిగిపోతున్నాయి. అదే సమయంలో ఆస్తుల సృష్టికి ఉపయోగపడే మూలధన వ్యయం కుంటుపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తొలి ఎనిమిది నెలల లెక్కలను పరిశీలిస్తే రూ. 6,188 కోట్లు మాత్రమే ఆస్తులు సృష్టించేందుకు వ్యయం చేసింది ప్రభుత్వం. ఈ ఏడాది 30,679 కోట్లు మూలధన వ్యయం కింద ఖర్చు చేస్తామని ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొంది. ఎనిమిది నెలల తర్వాత చూస్తే అంచనాల్లో 20 శాతం మాత్రమే ఇందుకు వినియోగించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో అప్పులు మాత్రం ఏకంగా అంచనాలకు మించి 11 శాతం అధికంగా తీసుకువచ్చింది. అదీ ఎనిమిది నెలల్లోనే. పైగా ఈ అప్పుల లెక్కల్లో కార్పొరేషన్ల నుంచి తీసుకువచ్చిన రుణాల లెక్కల్ని అసలు బయటకు వెల్లడించడం లేదు. వాటిని కూడా కలిపితే మొత్తం రుణం అంచనాలకు మించి ఎన్నో రెట్లు పెరిగిపోతుంది.




### మూలధన వ్యయం తీసికట్టు

సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, పోర్టులు, ఇతరత్రా ఆస్తులు సృష్టించేందుకు ప్రభుత్వం వెచ్చించే మొత్తాన్ని మూలధన వ్యయంగా పేర్కొంటారు. అంటే ఆ ఖర్చు వల్ల ఏర్పరచుకునే ఆస్తి నుంచి మళ్లీ ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా దీనికి చాలా తక్కువే కేటాయిస్తూ వస్తోంది. మూలధన వ్యయం బాగా తగ్గిపోయిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లెక్కలు కూడా పేర్కొంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబరు నెలాఖరు వరకు చేసిన ఖర్చుల వివరాలను కాగ్ వెల్లడించింది. వాటి ఆధారంగా పరిశీలిస్తే మూలధన వ్యయం మరీ తక్కువగా ఉంది. ఎనిమిది నెలల్లో కేవలం అంచనాల్లో 20 శాతానికే పరిమితమైంది. ఇక రాబోయే నాలుగు నెలల పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. అసలే ఖజానా నిండుకుని జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఇక ఆస్తుల సృష్టికి ప్రభుత్వం నిధులు ఎంతవరకు వెచ్చిస్తుందనేది ప్రశ్నార్థకమే.

### ఇదీ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం

| | |
|---|---|
| పన్నుల రాబడి: | రూ. 71,227.06 కోట్లు |
| వీటికి పన్నేతర ఆదాయం, కేంద్రం సాయం కలిపితే మొత్తం రెవెన్యూ రాబడి: | రూ. 96,457.52 కోట్లు |
| అప్పులు: | రూ. 54,418.33 కోట్లు |
| అప్పుల రికవరీ: | 25.38 కోట్లు |
| అన్నీ కలిపితే మొత్తం: | రూ. 1,50,901.23 కోట్లు |
| మొత్తం ఖర్చు: | రూ. 1,49,364.26 కోట్లు |
| ఇందులో మూలధన వ్యయం: | రూ. 6,188.55 కోట్లు |
| మొత్తం ఖర్చులో మూలధన వ్యయం కోసం వెచ్చించింది: | 4.14 శాతం |

### 2019 నుంచి మూలధన వ్యయం ఇలా..
(నవంబరు వరకు ఉన్న లెక్కలు పోలిస్తే)

| సంవత్సరం | మూలధన వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|
| 2019 నవంబరు | 4,737.50 |
| 2020 నవంబరు | 15,564.94 |
| 2021 నవంబరు | 9,199.57 |
| 2022 నవంబరు | 6,188.55 |

(వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం తర్వాత మూలధన వ్యయం ఇంత తక్కువగా చేయడం ఇదే)

### గ్రహం అనుగ్రహం
4-1-2023 బుధవారం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు; పుష్యమాసం; శుక్లపక్షం
త్రయోదశి: రా. 12-01 తదుపరి చతుర్దశి
రోహిణి: రా. 7-29 తదుపరి మృగశిర
వర్జ్యం: ఉ.10-59 నుంచి 12-41 వరకు తిరిగి రా. 1-31 నుంచి 3-14 వరకు
అమృత ఘడియలు: సా. 4-04 నుంచి 5-46 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-43 నుంచి 12-27 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.35

### చలి పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| కడప | 19.0 | 31.0 |
| తిరుపతి | 19.4 | 30.2 |
| రామగుండం | 19.5 | 30.8 |
| హైదరాబాద్ | 20.0 | 29.3 |
| విశాఖపట్నం | 20.4 | 30.4 |
| విజయవాడ | 20.7 | 30.4 |
| అనంతపురం | 20.7 | 33.5 |
| తాడేపల్లిగూడెం | 21.4 | 32.1 |
| కర్నూలు | 21.4 | 32.3 |
| నరసాపురం | 21.8 | 30.8 |
| శ్రీకాకుళం | 22.0 | 27.0 |
| గుంటూరు | 22.0 | 32.0 |
| రాజమహేంద్రవరం | 22.5 | 34.5 |
| ఒంగోలు | 22.6 | 30.6 |
| నెల్లూరు | 23.2 | 29.5 |
| విజయనగరం | 24.0 | 28.0 |
| ఖమ్మం | 24.0 | 31.0 |

### ఇదీ సంగతి!




కంగారుపడవద్దు.. జాగ్రత్త!
ఇక్కడ అడుక్కో గుంత ఉంటుంది..
చూసి నడుపు..!!

(c) eenadu

# ఆ జీవో లక్ష్యం ప్రతిపక్షాల గొంతు నొక్కడమే

- తీవ్రంగా మండిపడుతున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు

**ఈనాడు, అమరావతి:** ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు సభలు, సమావేశాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించుకునే హక్కు, అసమ్మతిని తెలియజేసే హక్కు... వంటివి దేశ పౌరులందరికీ ఒకలా ఉంటే... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మరోలా ఉంటున్నాయి. ఇక్కడ ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ వంటివి ప్రభుత్వ పెద్దలకు, అధికార పార్టీ నాయకులకు మాత్రమే వర్తిస్తాయి. ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు ఆ స్వేచ్ఛ ఉండదు. ఎందుకంటే ఇక్కడ ఉన్నది వైకాపా ప్రభుత్వం..! దాని కనుసన్నల్లో పని చేస్తూ... అధికార పార్టీకి కొమ్ము కాయడం, ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కడమే ఇక్కడి పోలీసుల ఏకైక ఎజెండా..! కోర్టులు ఎన్ని మొట్టికాయలు వేసినా, ఎవరేమనుకున్నా, ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా బేఫికర్..! అసమ్మతి గొంతు నొక్కేయడం, ప్రభుత్వ వ్యతిరేకత అన్న మాటే వినిపించకుండా చేయడం జగన్ ప్రభుత్వ ఏకైక లక్ష్యం. దాని కోసం రాత్రికి రాత్రే చీకటి జీవోలు, రహస్య ఉత్తర్వులు పుట్టుకొస్తాయి. ఎన్నికలకు మరో 15 నెలలే గడువు ఉండటం... రాజకీయ పార్టీల కార్యకలాపాలు వేగం పుంజుకోవడంతో... ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు, రోడ్డుషోలు, పాదయాత్రలు వంటివి నిర్వహించకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా తాజాగా హోంశాఖ జారీ చేసిన జీవో నం.1 వాటిలో భాగమే..! ఇప్పటి వరకు ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు, నిరసన ప్రదర్శనలు చేస్తుంటే... పోలీసులు ఎప్పటికప్పుడు స్థానికంగా ఆంక్షలు విధిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల్ని వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. గృహ నిర్బంధం చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోని ఏ రహదారులపైనా, వాటి పక్కనా రాబోయే రోజుల్లో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించకుండా గంపగుత్తగా ముందే ఆంక్షలు విధిస్తూ ప్రత్యేకంగా జీవో ఇచ్చేశారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో 1861లో చేసిన పోలీసు చట్టంలోని నిబంధనల్ని ఇప్పుడు వర్తింపజేస్తూ, అలాంటి ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాజ్యాంగంలోని 19(1) అధికరణ కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు ప్రభుత్వ ఉత్తర్వులు గొడ్డలి పెట్టని, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే ప్రభుత్వం ఆ జీవో ఇచ్చిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## ఈ నిబంధనలు ముఖ్యమంత్రికి వర్తించవా?

ప్రభుత్వ తెచ్చిన జీవో... మంగళవారమే వెలుగు చూసింది. ఇదే రోజు ఆ జీవోలోని నిబంధనల్ని బేఖాతరు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ రాజమహేంద్రవరంలో 4 కి.మీ.లకుపైగా ప్రధాన రహదారిపై అట్టహాసంగా ర్యాలీగా వెళ్లారు. ఆయన సభ జరిగిన ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే హెలిప్యాడ్ ఉన్నప్పటికీ దాన్ని వినియోగించకుండా... అక్కడికి 4-5 కి.మీ.ల దూరంలోని మున్సిపల్ స్టేడియంలో దిగి ర్యాలీగా సభాస్థలికి వచ్చారు. 'ప్రత్యేక పరిస్థితులు, అరుదైన సందర్భాలతో పాటు రోడ్లపైనే సభలు, సమావేశాలు నిర్వహించాల్సి వస్తే, దానికి కారణాల్ని లిఖితపూర్వకంగా పేర్కొని, అనుమతి కోరితే ఆ దరఖాస్తుల్ని పరిగణనలోకి తీసుకుంటాం...' అని జీవో నం.1లో హోం శాఖ ముఖ్య కార్యదర్శి పేర్కొన్నారు. సీఎం అంత పెద్ద ర్యాలీ నిర్వహించాల్సిన ప్రత్యేక సందర్భమో, అవసరమో ఇప్పుడేమొచ్చిందని నిలదీస్తున్నాయి

### సీఎం సభలకు అష్టదిగ్బంధం... ఇతరుల సభలకు కనీస బందోబస్తూ కరవు..!

రాష్ట్ర విభజన తర్వాత, అంతకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను కూడా... ఏ ముఖ్యమంత్రికీ ఎన్నడూ లేని విధంగా, ముఖ్యమంత్రి జగన్ పర్యటనలకు పోలీసులు అసాధారణ భద్రత కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎక్కడికి వెళుతున్నా... ఆయన సభ జరిగే ప్రాంతంలోకి అనుమతి లేకుండా చీమ కూడా చొరబడకుండా చూస్తున్నారు. దారులన్నీ దిగ్బంధిస్తున్నారు. ముఖ్యమంత్రికి పటిష్ఠమైన భద్రత కల్పించడాన్ని ఎవరూ తప్పుబట్టరు. ఆయన భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిందే..! మరీ ఇంత అతిగానా? కనీవినీ ఎరుగని రీతిలోనా? ముఖ్యమంత్రి వస్తున్నారంటేనే ప్రజలు బెంబేలెత్తిపోయేంతగానా? పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్న సీఎం సభలకు అంత భారీ సంఖ్యలో పోలీసుల్ని మోహరించి భద్రత కల్పిస్తున్నప్పుడు... అదే స్థాయిలో జనం తరలి వస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకుల సభలకు భద్రత కల్పించడంలో పోలీసులు ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు? అది సీఎం సభ అయినా, ప్రతిపక్ష పార్టీల నాయకుల సభలైనా... వచ్చే జనం సంఖ్యను బట్టి భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన పోలీసులు ఎందుకంత ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు? కందుకూరులో తెదేపా అధినేత చంద్రబాబు సభలో, గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చీరలు, సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట ఘటనలకు పోలీసులు తగినంత బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం కారణం కాదా? పోనీ పోలీసులు అన్ని సభల విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్నారా? కొన్ని నెలల క్రితం వైకాపా ప్లీనరీ జరిగితే... అదేదో ప్రభుత్వ కార్యక్రమం అన్నట్టుగా బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులు రాత్రింబవళ్లు పనిచేసింది వాస్తవం కాదా? తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్ష పార్టీలకు అడ్డంకులు సృష్టించేందుకు జీవో నం.1 జారీ చేయడంలోని ఔచిత్యం ఏంటి?

### గతంలో ఎన్నడూ జరగలేదా?

రాష్ట్రంలో రాజకీయ పార్టీలు రోడ్‌షోలు, రహదారులపైనే చిన్న చిన్న సభలు, సమావేశాలు నిర్వహించడం కొత్తేమీ కాదు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ప్రత్యేకంగా సిద్ధం చేసిన వ్యానులోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం చుట్టేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, జగన్ సుదీర్ఘ పాదయాత్రలు చేశారు. 3,648 కి.మీ.ల మేర జరిగిన జగన్ పాదయాత్రలో ఆయన అనేక సందర్భాల్లో రహదారులపైనే జనాన్ని ఉద్దేశించి మాట్లాడేవారు. ఆయన తరపున ప్రచారం చేసిన తల్లి విజయమ్మ, సోదరి షర్మిల కూడా ప్రధానంగా రోడ్‌షోలలోనే పాల్గొనేవారు. రాజకీయ పార్టీల యాత్రల్లో ప్రమాదాలు జరిగి, దురదృష్టవశాత్తు కొందరు ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు గతంలోనూ అనేకం చోటు చేసుకున్నాయి. తెదేపా నేత వర్ల రామయ్య విడుదల చేసిన లెక్కల ప్రకారం... జగన్, విజయమ్మల యాత్రలు, సభల్లో... ఇడుపులపాయ, మండపేట, సూళ్లూరుపేట, విజయనగరం జిల్లాలో, పిడుగురాళ్ల, పెడన, సత్తుపల్లి, కుప్పం, మండపేటల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 42 మంది గాయపడ్డారు. మరో వైపు ఇప్పుడు కందుకూరు, గుంటూరుల్లో జరిగిన దుర్ఘటనల్ని వైకాపా ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, ప్రతిపక్షాలకు అడ్డంకులు సృష్టించాలని చూడటంపైనే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తెదేపా అధినేత చంద్రబాబు ఇప్పటికే విస్తృతంగా రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ 27 నుంచి పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటనలు, రోడ్డుషోలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో దాదాపుగా ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో... ప్రధాన రాజకీయ పార్టీలన్నీ తరచూ సభలు, సమావేశాలు నిర్వహించబోతున్నాయి. వాటికి అడ్డంకులు సృష్టించేందుకే ప్రభుత్వం జీవో నం. 1 తెచ్చిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, చలసాని శ్రీనివాస్ తదితరులు

## ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకే ఆ జీవో

### అఖిలపక్ష సమావేశంలో వక్తల ధ్వజం

**విజయవాడ, న్యూస్‌టుడే:** బ్రిటిష్ కాలం నాటి చట్టం తెచ్చి, ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారని.. (భాజపా, వైకాపా మినహా) అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 1ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలుపై చేపట్టనున్న బస్సు యాత్రపై మంగళవారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, తెదేపా తదితర రాజకీయ పక్షాల నాయకులు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు జగన్ పాదయాత్రలు చేయవచ్చని, తాను అధికారంలో ఉంటే ఇతరులు ఎవరూ చేయకూడదనటం సరికాదన్నారు. పిచ్చి తుగ్లక్ పరిపాలన అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తక్షణం జీవోను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు విద్యార్థి, యువజన సంఘాలు 20 నుంచి చేపట్టనున్న బస్సు యాత్రకు విపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. తొలుత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకోవాల్సిన ప్రత్యేక హోదాను దిల్లీ పాలకుల ముందు తాకట్టు పెడదామా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. హోదా రాకపోతే ఎక్కువగా నష్టపోయేది విద్యార్థులే అని చెప్పారు.

## రాజకీయ సభలపై ఆంక్షలు ఘోర తప్పిదం

### భాజపా ఎంపీ సీఎం రమేష్



**ఈనాడు, దిల్లీ:** బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించకూడదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని భాజపా ఎంపీ సీఎం రమేష్ తీవ్రంగా ఖండించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా భద్రత కల్పించాల్సిందిపోయి ఇలా నిషేధాజ్ఞలు విధించడం... ప్రభుత్వ వ్యవస్థ చేతకానితనానికి అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. 'మీ పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రజలు తిరగబడుతున్నారు. ప్రతిపక్షాలు పోరాడుతున్నాయి. వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం ఇప్పుడు ఇలాంటి జీవో జారీ చేసింది. ఈ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఎంత అణచివేయాలని చూస్తే ప్రజలు అంత తిరగబడతారు అన్నది గుర్తించాలి. ప్రస్తుత పాలకుల నిర్వాకంవల్ల ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయి వడ్డీ కట్టలేని పరిస్థితి వచ్చింది. ఆ వైఫల్యం నుంచి తప్పించుకోవడానికి ఇప్పుడు ప్రతిపక్ష సమావేశాలపై ఆంక్షలు విధించడం ఘోర తప్పిదం. ఈనెల 8న కర్నూలు, హిందూపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగసభలు ఉన్నాయి. వాటిని అడ్డుకోవడానికి ప్రస్తుత జీవో ఇచ్చినట్లు కనిపిస్తోంది. దానిని ఉపసంహరించుకోవాలి' అని అన్నారు.

## రోడ్డు షోలపై హైకోర్టులో కేఏ పాల్ వ్యాజ్యం

**ఈనాడు, అమరావతి:** బహిరంగ సమావేశాలు, రోడ్డు షోలలో తొక్కిసలాట లాంటి దుర్ఘటనలు జరిగితే ఇక మీదట సంబంధిత రాజకీయ పార్టీలు, సంస్థలను బాధ్యులను చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పోలీసుల అనుమతి లేకుండా నిర్వహించే బహిరంగ సమావేశాలు, రోడ్డు షోలను నిషేధించాలని కోరారు. డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ మానవ హక్కుల సంఘం, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణ ఠాణా ఎస్‌హెచ్‌వోను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. కందుకూరులో 8 మంది అమాయక ప్రజల ప్రాణాలను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారని పేర్కొన్నారు.

## లీటరుకు రూ.29కి తగ్గకుండా చెల్లిస్తున్నాం: మంత్రి పెద్దిరెడ్డి

**ఈనాడు డిజిటల్, చిత్తూరు:** 'మా కుటుంబానికి చెందిన శివశక్తి డెయిరీ 347 కేంద్రాల్లో పాలు సేకరిస్తోంది. పాడి రైతులకు లీటరుకు రూ.29కి తగ్గకుండా చెల్లిస్తోంది' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాలల్లో వెన్న శాతాన్ని బట్టి లీటరుకు రూ.29 నుంచి రూ.33 చెల్లిస్తున్నామని తెలిపారు. 1994 నుంచి శివశక్తి డెయిరీ కార్యకలాపాలు సాగుతున్నాయని, తక్కువ ధరలు చెల్లించి ఉంటే తమ డెయిరీ ఇంతకాలం మనుగడ సాధించలేదని తెలిపారు.

## భావప్రకటన స్వేచ్ఛను కాలరాయడమే

### ప్రతిపక్షాల ఆగ్రహం

**ఈనాడు, అమరావతి:** రహదారులపై రోడ్డుషోలు, సభలు, సమావేశాలు నిర్వహించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో నం.1 జారీ చేయడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటన స్వేచ్ఛను కాలరాయడమేనని ధ్వజమెత్తాయి. ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతను అణచివేసేందుకు, అసమ్మతి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం చీకటి జీవో తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ జీవోపై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా హక్కుల నేతల స్పందనలు ఇలా ఉన్నాయి.

- **జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి**

– అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు

"నిరంకుశపాలన కొనసాగిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. ప్రభుత్వ వైఫల్యాలను పత్రికలు, ప్రసార మాధ్యమాలు బయటపెడుతున్నాయన్న కక్షతో వాటిని నియంత్రించేందుకు ఇది వరకు జీవో నెం.2430 తెచ్చారు. ఇప్పుడు ఏకంగా ప్రతిపక్షాల్ని, ప్రజా సంఘాల్ని నోరెత్తకుండా చేసేందుకు జీవో నం. 1 తెచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌రెడ్డి నిర్వహించిన సభలు, పాదయాత్రకు అనుమతి ఇవ్వకుంటే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టగలిగేవారా?"

- **నిరంకుశ ధోరణి**

– నాదెండ్ల మనోహర్, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్

రాజకీయ పార్టీల్ని నియంత్రించేందుకే వైకాపా ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ఆ జీవో ఇచ్చింది. జగన్‌రెడ్డిపై ప్రజా వ్యతిరేకత రోజు రోజుకీ పెరుగుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న కౌలు రైతు భరోసా సభల్లో, జనవాణి కార్యక్రమాల్లో అది స్పష్టంగా కనిపిస్తోంది."

- **ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం**

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

"పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం. పోరాడి సాధించుకున్న పౌరహక్కుల్ని ఏ పేరుతో అణచివేసినా సీపీఎం వ్యతిరేకిస్తుంది. కందుకూరు, గుంటూరు ఘటనల్ని ఆసరాగా చేసుకుని... రోడ్లపై సభలు, ర్యాలీలు, రోడ్డుషోలు నిషేధించడం అప్రజాస్వామికం.'

- **ప్రజా ఉద్యమాల్ని అణచివేయడమే**

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

"ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతుకలను, ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలో భాగంగా 1861 పోలీసు చట్టం ప్రకారం చీకటి జీవో జారీ చేసింది. గత ఎన్నికలకు ముందు జగన్, షర్మిల ఓదార్పు యాత్రలు, పాదయాత్రలు చేయలేదా?"

- **అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలేంటో చెప్పాలి**

– భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

"రాజకీయ సభల్లో వరుసగా సామాన్యుల ప్రాణాలు పోగొట్టుకున్న దుర్ఘటనలకు కారణాలు అన్వేషించాలి. ఈ తరహా సంఘటనలు జరగకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలేంటో చెప్పాలి. ఏ రాజకీయ పార్టీలైనా ప్రజల ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించకూడదు. పాలక పక్షం జనాల ప్రాణాలు కాపాడాలి. ప్రతిపక్షం బాధ్యతగా ఆలోచించాలి."

- **సమావేశాలు గాల్లో నిర్వహిస్తారా?**



–రఘురామకృష్ణరాజు, వైకాపా ఎంపీ

"ర్యాలీలు, సమావేశాలు రోడ్లపై కాకపోతే గాలిలో నిర్వహిస్తారా? వైకాపా ప్రభుత్వం జారీ చేసిన జీవో పూర్తి అప్రజాస్వామికం. గతంలో సుప్రీంకోర్టు ఈ తరహా జీవోను కొట్టేసింది. రాజకీయ పార్టీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి. లేదంటే ప్రజాప్రతినిధిగా నేనే కోర్టుకు వెళ్తా."

- **ఎమర్జెన్సీ తరహా పాలన**

– నాగోతు రమేష్ నాయుడు, భాజపా రాష్ట్ర కార్యదర్శి

"రాష్ట్రంలో జగన్ ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తున్నారు. ప్రభుత్వ బాధితులు, ప్రతిపక్షాలు రోడ్లపైకి వస్తుండటంతో అధికారపక్షంలో అభద్రతాభావం పెరిగింది. ఎన్నికలు సమీపించే కొద్దీ ప్రజల్లో పెరిగే వ్యతిరేకతను తట్టుకునే శక్తి ప్రభుత్వానికి లేదు. అందుకే ఈ తరహా నిర్బంధాలు."



- **నీతిమాలిన చర్య**

– జడ శ్రావణ్‌కుమార్, జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు

"సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం రాజకీయ పార్టీల హక్కు. బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఏపీలో జగన్ గ్రాఫ్ పడిపోయింది. ఏ రాజకీయ పార్టీ సభల్లోనైనా అనుకోని దుర్ఘటనలు జరిగితే, అవి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలే తప్ప, వాటిని సాకుగా చూపిస్తూ చీకటి జీవోలు తేవడం నీతిమాలిన చర్య."

- **ముఖ్యమంత్రికి ఆ నిబంధనలు వర్తించవా?**

– ముప్పాళ్ల సుబ్బారావు, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

ప్రభుత్వ చర్య మానవ హక్కుల్ని, భావవ్యక్తీకరణ స్వేచ్ఛను తుంగలో తొక్కడమే. సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడి గర్భిణిలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ వైద్యసాయం అందక ఇబ్బందులు పడుతున్నారని, అందుకే ఆ జీవో తెచ్చామని ప్రభుత్వం పేర్కొంది. మరి మంగళవారం రాజమహేంద్రవరంలో సీఎం పర్యటనలో జరిగిందేంటి? మూడు గంటలకుపైగా రోడ్లన్నీ దిగ్బంధిస్తే వృద్ధులు, గర్భిణులు, రోగులు ఇబ్బంది పడతారని తెలీదా? గతంలో జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఆ విషయం గుర్తు లేదా?"

## చంద్రబాబు రోడ్‌షో, సభలకు అనుమతి నిరాకరణ

- పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి వెల్లడి

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** తెదేపా అధినేత చంద్రబాబు కుప్పం పర్యటనలో రోడ్‌షో, సభలకు అనుమతి నిరాకరిస్తున్నట్లు చిత్తూరు జిల్లా పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌కు పర్యటనలో సూచనలు పాటించాలని నోటీసులు ఇచ్చామన్నారు. ఆయన నుంచి మంగళవారం రాత్రి 10.30 గంటలైనా సరైన సమాధానం రాకపోవడంతో రోడ్ షో, సభలకు అనుమతి నిరాకరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలకు అనుమతి లేదని, కొనసాగిస్తే నిర్వాహకులు, పాల్గొనే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంతకు ముందు మధ్యాహ్నం కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో తెదేపా నాయకులతో డీఎస్పీ సమావేశమై.. ఇటీవల ఏపీలో జరిగిన అవాంఛనీయ ఘటనల దృష్ట్యా పలమనేరు డివిజన్ పరిధిలో ఈ నెల 1-30 వరకు 30 పోలీసు యాక్టు విధిస్తామన్నారు. ఇరుకు రోడ్లపై సభలు, సమావేశాలు నిర్వహించేందుకు తప్పక అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం ఆంక్షలతో కూడిన నోటీసులను చంద్రబాబు పీఏ మనోహర్‌కు అందించారు.



తెదేపా నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు శ్రీధర్, మహ్మద్ రియాజ్ అహ్మద్

### షెడ్యూలు ప్రకారమే పర్యటన: తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నం

చంద్రబాబు కుప్పం పర్యటనలో నిబంధనలు అమలు చేయాలన్న నోటీసులకు సమాధానం ఇచ్చినా పోలీసులు స్వీకరించలేదని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం అన్నారు. ఉదయం పర్యటనకు సంబంధించి ఆంక్షలతో కూడిన నోటీసులు ఇచ్చారని, రాత్రి పోలీసుల అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించడం బాధాకరమన్నారు. చంద్రబాబు పర్యటన షెడ్యూలు ప్రకారం కొనసాగుతుందని ఆయన చెప్పారు.




## అలజడి, తోపులాటల్లో వైకాపా కుట్ర: తెదేపా

**ఈనాడు, అమరావతి:** 'ప్రజల్లో చంద్రబాబుకు పెరుగుతున్న ఆదరణ చూసి.. సీఎం జగన్‌రెడ్డి భయపడుతున్నారనేందుకు రోడ్లపై ఎక్కడా సభలు, సమావేశాలు పెట్టకూడదంటూ తెచ్చిన చీకటి జీవోయే ఉదాహరణ' అని తెదేపా నేతలు నక్కా ఆనందబాబు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 'జనవరి నుంచి జగనన్న అసలు రాజకీయం చూడబోతున్నారు. ఒక్కొక్కరూ భయంతో వణకాల్సిందే అని వైకాపా సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సందేశం అంతరార్థం ఏమిటి? కందుకూరు, గుంటూరులో పథకం ప్రకారం అమాయకుల్ని బలి తీసుకోవడమే జగన్ రాజకీయమా? ఎవరు ఎక్కడ సభలు పెట్టాలో, ఎవరి సభలకు ప్రజలు వెళ్లకుండా చేయాలో.. ఎక్కడ తొక్కిసలాటలు జరిగేట్టు చూడాలో అన్నీ ముందస్తు ప్రకారమే జగన్‌రెడ్డి చేయిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ కుట్రలో భాగంగానే గుంటూరు, కందుకూరు ఘటనలు జరిగాయి. ఉద్దేశపూర్వకంగా వైకాపాకు చెందిన వారే అలజడి, తోపులాటలు సృష్టించారనే అనుమానాలున్నాయి' అని దుయ్యబట్టారు. మంగళవారం తెదేపా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. 'కందుకూరులో గతంలో జగన్‌రెడ్డి, ఆయన తల్లి విజయమ్మ సభలు నిర్వహించిన ప్రాంతంలోనే చంద్రబాబు సభ నిర్వహించారు. జగన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో నిబంధనలు విధించామా? రోడ్లపై సభలు, సమావేశాలు పెట్టకూడదంటూ అర్ధరాత్రి చీకటి జీవో ఇచ్చిన జగన్‌రెడ్డి రాజమహేంద్రవరంలో సభ ఎలా పెట్టారు? ఆయన సభల్లో కుర్చీలు వెలవెలబోతుండటంతో సీఎంకు భయం పట్టుకుంది. అందుకే ప్రతిపక్ష నేతను ఇంటి నుంచి కదలనీయకుండా చేయాలని జీవో తెచ్చారు. లోకేశ్ పాదయాత్ర జరగనీయబోమని స్వయంగా ఒక మంత్రి చెప్పారు. జీవోను తక్షణమే ఉపసంహరించకుంటే ప్రజాక్షేత్రంలో జగన్‌రెడ్డికి శిక్ష తప్పదు' అని హెచ్చరించారు.







(c) eenadu

# ఈనాడు

## నల్లధనం ఉరవడి ఆగలేదు...

ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తీరును పరిశీలించడమే తప్ప నోట్లరద్దుతో ఒనగూడిన లాభనష్టాల జోలికి తాను వెళ్ళబోనని సుప్రీంకోర్టు ముందుగానే స్పష్టీకరించింది. ఆ మేరకు నోట్లరద్దుపై దాఖలైన 58 వ్యాజ్యాలను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం- ఆర్బీఐ కేంద్రాల సర్కారీ నిర్ణయ ప్రక్రియలో తప్పేమీ లేదని తాజాగా తేల్చింది. అంతవరకు అది కేంద్ర ప్రభుత్వానికి ఉపశమనం కలిగించేదే. నల్లధన నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా నాడు అయిదు వందలు, వెయ్యి రూపాయల నోట్లను కేంద్రం ఉన్నపళంగా రద్దుచేసింది. ఆ ఆశయం నెరవేరిందా? అవినీతిపరులు, అసాంఘిక శక్తుల చేతుల్లో ఉన్న పెద్దనోట్లు ఇక చిత్తు కాగితాలుగా మిగిలిపోతాయన్న సర్కారీ మాటలు వాస్తవ రూపం దాల్చాయా? 2016 నవంబరులో రూ.17.74 లక్షల కోట్ల విలువైన నగదు దేశంలో చలామణిలో ఉండేది. అందులో 86శాతం వాటా పెద్దనోట్లదే. వాటిపై వేటువేయడంతో దాదాపు మూడు నాలుగు లక్షల కోట్ల మేరకు నల్లధనం భూస్థాపితమైపోతుందని అధికారవర్గాలు అప్పట్లో చిటికెలు వేశాయి. కానీ, రూ.15.40 లక్షల కోట్లకుపైగా విలువైన నోట్లు రద్దయితే- వాటిలో 99శాతానికి పైబడినవి నిక్షేపంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేశాయి. పెద్దనోట్ల రద్దు అమలు విధానంలోని లోపాల సాయంతో అక్రమార్కులు తమ నల్లడబ్బును తెలుపుగా మార్చేసుకున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ కుండ బద్దలుకొట్టారు. గడచిన నాలుగున్నర సంవత్సరాల్లో తమ ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యల మూలంగా లెక్కల్లోకి రాని సొమ్ము రూ.1.30 లక్షల కోట్ల మేరకు వెలుగులోకి వచ్చిందని 2019 మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడించారు. దేశీయంగా పోటెత్తుతున్న నల్లధనం పరవళ్లతో పోలిస్తే- ఆ మొత్తం నామమాత్రం. అందులోనూ నోట్లరద్దుతో ప్రత్యేకంగా సాధించిందెంతో తెలియదు. వెరసి, అవినీతిపరులపై మెరుపుదాడిగా అభివర్ణితమైన సర్కారీ నిర్ణయం గురితప్పిందన్నది వాస్తవం!

అరచేతి పుండుకు అద్దం అవసరం లేదు. దేశవ్యాప్తంగా నల్లధనం ఉద్ధృతికి ఏమాత్రం అడ్డుకట్ట పడకపోవడానికి ప్రత్యేకంగా అధ్యయనాలూ చేయనక్కర్లేదు. జాతీయంగా వ్యవస్థీకృతమైన అవినీతి- భారతీయుల బతుకులను ఎక్కడికక్కడ కుళ్లబొడుస్తోంది. అపరిమితంగా లంచాలు బొక్కుతున్న అధికార యంత్రాంగం- గుప్పెడన్న గుట్టలుగుట్టలుగా కూడబెడుతోంది. సృజనాత్మక మేతలతో జనానికి వాతలు పెడుతున్న నాయకగణం అక్రమాస్తులకూ ఆకాశమే హద్దు అవుతోంది. 1951లో నల్లధన పరిమాణం దేశ జీడీపీలో కేవలం రెండు శాతంగా ఉండేది. పార్లమెంటరీ స్థాయీసంఘం నివేదిక ప్రకారం 2018-19 నాటికి అది 120శాతం వరకు ఎగబాకింది. స్విస్ బ్యాంకుల్లో భారతీయుల జమలు పద్నాలుగేళ్ల గరిష్ఠస్థాయిని అందుకున్నట్లు నిరుడు వెలుగుచూసింది. అవినీతి మోతుబరుల నల్లడబ్బులో దాదాపు పదిశాతమే విదేశాలకు చేరుతోంది. మిగిలినదంతా ఇక్కడే ఎక్కువగా స్థిరాస్తుల రూపేణా పిల్లలను పెడుతోంది. సరిహద్దులను దాటుతున్న సొమ్ములోనూ 30-40శాతం వివిధ మార్గాల్లో మళ్ళీ వెనక్కి వస్తున్నట్లు అంచనా. దేశీయంగా ఒకశాతం నల్లధనమే నగదు రూపంలో ఉందన్న విశ్లేషణలను గమనిస్తే- నోట్లరద్దు వైఫల్యానికి అసలు కారణమేమిటో బోధపడుతుంది. నల్లధనాన్ని నియంత్రించలేని చీకటి దందాలకు పట్టుగొమ్మలైన రంగాలను ప్రక్షాళించాలని, పన్నురేట్లను హేతుబద్ధీకరించాలని కేంద్ర శ్వేతపత్రమే గతంలో సిఫార్సు చేసింది. వాటితో పాటు చట్టాలను చాపచుట్టే వాళ్లపై ఉక్కుపాదం మోపడమూ అత్యావశ్యకం. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఉపసారథి జస్టిస్ అరిజిత్ పసాయత్ మూడేళ్ల క్రితం వెల్లడించిన వివరాల మేరకు, 15-16వేల నల్లధనం కేసులు సుదీర్ఘంగా అపరిష్కృతంగా మూలుగుతున్నాయి. అక్రమ సొమ్ములే ప్రధాన పెట్టుబడులుగా సాగుతున్న దుర్రాజకీయాలే- జగమెరిగిన ఆర్థిక నేరగాళ్లకూ రక్షాకవచాలవుతున్నాయి. ఆ పెడపోకడలకు పార్టీలు చరమగీతం పాడనంత వరకు దేశాభివృద్ధిని అవినీతి రక్కసి దిగమింగుతూనే ఉంటుంది!

## ఇరుకు మనసు

స్వార్థ చింతనే ప్రధాన గుణంగా నడుస్తున్న ఈ రోజుల్లో స్వార్థమే తనకుతాను పెద్దపీట వేసుకుని ఠీవిగా కూర్చుంది. పూర్వం ఏమాత్రం పరిచయం లేని వాళ్లపట్ల కూడా మన పెద్దలు నిజాయతీగా వ్యవహరించేవారు. ఆత్మ వారికి 'ఆత్మసాక్షి'గా ఉండేది. తప్పుచేస్తే నిలదీసేది. అసలు, తప్పువైపు ఆలోచించనిచ్చేది కాదు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. జీవితం ఆత్మరహితం, ఆత్మీయ రహితమూ అయిపోయింది. అద్దం లాంటి ఆత్మ, స్ఫటికం లాంటి ఆత్మ మన అనుమతి లేకుండానే మన అవకతవకల్ని ముద్రించుకుంటుంది. ఆ పంథాలోనే మన ప్రయాణమూ సాగుతుంది. ఈ అవకతవకల ప్రయాణంలోనే నాకెవరున్నారు అనే ఆలోచనలోంచే నాకెవరూ లేరు అనే అసంతృప్తి మొదలవుతుంది. నీవెవరికీ ఏమీ కానప్పుడు, ఎవరికోసమూ ఏమీ చేయలేనప్పుడు నీకు ఎవరు మాత్రం ఎందుకుంటారు!? అందుకే... మనం మన పక్కవారి గురించీ కొంచెం ఆలోచించాలి. ఎంతో కొంత పంచిపెట్టాలి. వారి అవసరాలు చూడాలి.



ఒకే ఒక్క టెంకలో మొలిచి ఫలించిన మామిడి చెట్టు ఎందుకలా వందలాది పళ్లు కాస్తుంది!? విత్తనం నాటినవారి అవసరాలకు సరిపడా కాస్తే సరిపోదా? సరిపోదు. వాటిని అందరూ పంచుకుతినాలి. మనిషి మామిడి పళ్లతోనే జీవించలేడు. అతడికి ఎన్నో కావాలి. అన్నీ కావాలి. ఇదే పని అందరూ చేయాలి. సమాజం కోసం, లోకం కోసం. ఒకే మనిషి అన్ని పనులూ చేయలేడు. అన్నీ ఉత్పత్తి చేయలేడు. కానీ అతడికి ఎన్నో కావాలి. అన్నీ కావాలి. తన అన్ని అవసరాల్నీ ఒంటరిగా తీర్చుకోలేడు. అందుకే ఎవరికి చేతనైనదాన్ని వారు ఉత్పత్తి చేసుకుని దాన్ని అందరూ పంచుకునే అవకాశాన్నిచ్చాడు భగవంతుడు.

అంతర్యామి

ఈ పంచుకోవడమనే ప్రక్రియ, పక్కవాళ్ల కష్టాన్ని పంచుకోవడమనే ప్రవృత్తి- గర్భస్థ శిశువు నుంచే ప్రారంభమవుతుంది. గర్భంలో ఉన్నది కవల పిల్లలైతే రెండోవాడి అవసరాలు గుర్తించి నడుచుకుంటుందట శిశువు. రెండోవాడి కదలికలకు అనుగుణంగా తాను కదులుతుందట. తల్లికి అధిక ప్రయాసకాని పద్ధతిలో ఆ ఇద్దరి కదలికలుంటాయట. పనినైనా ప్రయాసనైనా పంచుకుని జీవించే తత్వం గర్భస్థ శిశువునుంచే ప్రారంభమవుతుంది. మరి పెరిగి పెద్దయ్యాక ఏమిటీ స్వార్థం!? తనదైన విశాలతత్వాన్ని తల్లి గర్భంలోనే వదిలి వస్తున్నాడా మనిషి? ఇరుకైన తల్లి గర్భంలో విశాలంగా ఉన్న ఆ శిశువుకు ఇక్కడ విశాల ప్రపంచమే ఇరుకైపోయిందా? ఈ ప్రకృతి యావత్తు పంచుకోవడాన్నే సూచిస్తుంది, ప్రోత్సహిస్తుంది. ఒక కాకి కూడా ఏదైనా ఆహార పదార్థం దొరికితే కావు కావుమంటూ తన బంధుబలగాన్ని ఆహ్వానిస్తుంది. ఉన్నంతలో విందు చేస్తుంది. ఒక కోయిల గూటిలో గుడ్లు పెట్టిపోతే వాటిని పొదిగి పిల్లల్ని అందించే బాధ్యతను తీసుకుని కాకి తన ఔదార్యాన్ని చాటుకుంటుంది. ఒక పామును మూకుమ్మడిగా కమ్ముకుని కరిచి చంపే సామర్థ్యమున్న చీమలు కూడా పాముకు నివాసాల్ని ఏర్పాటు చేసి ఇస్తాయి.

మనం మనుషులం. మనకేమిటి ఇంత లోభం... ఇంత స్వార్థం! ఆస్తిని విశాలం చేసుకోవడం కాదు. ఆంతర్యాన్ని విశాలం చేసుకోవాలి. మనిషి మృగ దశ నుంచి మానవుడిగా ఎదిగే క్రమంలో మళ్ళీ మృగమే అవుతున్నాడంటే- మానవుడు మహనీయుడు కావడం లేదు!

– చక్కిలం విజయలక్ష్మి

# డిజిటల్ ప్రపంచంలో కొత్త వాణిజ్యం



శ్రీరామ్ చేకూరి

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఆవిర్భవించి ఈ జనవరి ఒకటి నాటికి 27 ఏళ్లయింది. 1948 నుంచి 1994 వరకు ప్రపంచ వాణిజ్యాన్ని గాట్ (సుంకాలు, వాణిజ్యంపై సార్వత్రిక ఒప్పందం) నిబంధనలే నడిపించేవి. గాట్ స్థానంలో 1995 జనవరి 1న డబ్ల్యూటీఓ అవతరించింది. అంతకు ముందు 47 ఏళ్లపాటు గాట్ వివిధ దేశాల నడుమ తాత్కాలిక ఒప్పంద సంస్థగా వ్యవహరించింది. సుంకాల పరంగా, ఇతరత్రా అడ్డంకులు తొలగించి, అంతర్జాతీయ వాణిజ్యం ఇబ్బడిముబ్బడిగా పెరిగేందుకు తోడ్పడింది. గాట్ ప్రధానంగా సరకుల వాణిజ్యానికి తోడ్పడితే, దాని స్థానంలో వచ్చిన డబ్ల్యూటీఓ పరిధిలోకి సరకులతో పాటు సేవలు, మేధా హక్కులనూ తీసుకొచ్చారు. డబ్ల్యూటీఓ వల్ల ప్రధానంగా అమెరికా, చైనా, జర్మనీలే లాభపడ్డాయనే వాదన ఉన్నా- ఆ సంస్థ మూలంగా అంతర్జాతీయ వాణిజ్యం స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగి అనేకానేక దేశాలకు లబ్ధి చేకూరిన మాట వాస్తవం.

### ఉన్నత ఆశయాలతో ఆరంభం

వాణిజ్యం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉద్యోగావకాశాలను విస్తరించడం, మొత్తంగా జన జీవితాలను సౌకర్యవంతంగా మార్చడం డబ్ల్యూటీఓ లక్ష్యాలు. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి, కొత్త ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ సంస్థ వేదికగా ఉపయోగపడుతోంది. 1995 నుంచి డాలర్లలో ప్రపంచ వాణిజ్య విలువ నాలుగు రెట్లు పెరగ్గా, పరిమాణరీత్యా పెరుగుదల 2.7 రెట్లు మాత్రమే. ఇదే కాలంలో ప్రపంచ స్థూల ఉత్పత్తి రెండు రెట్లు పెరిగింది. ప్రపంచ వాణిజ్యం మరింత విస్తరించాలంటే పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం, వాటి ఎగుమతుల

### సమ్మిళిత అభివృద్ధి

ప్రపంచంలో సగటు వాణిజ్య సుంకాలు గత 27 ఏళ్లలో 10.5 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గిపోయాయి. ఇదే కాలంలో ప్రపంచమంతటా పేదరికం స్థాయులూ తగ్గుముఖం పట్టాయి. రోజుకు 1.90 డాలర్లకన్నా తక్కువ సంపాదించేవారిని నిరుపేదలుగా ప్రపంచ బ్యాంకు వర్గీకరించింది. ఆ కొలమానం ప్రకారం 1995లో ప్రపంచ జనాభాలో మూడోవంతు మంది అత్యంత పేదలు కాగా, ఇప్పుడు వారి సంఖ్య 9 శాతానికి తగ్గింది. నేడు ప్రపంచ వాణిజ్యంలో మహిళలు, చిన్న వ్యాపారులు సైతం పాల్గొనేలా ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్య దేశాలు ప్రోత్సహిస్తున్నాయి. సమ్మిళిత అభివృద్ధి సాధనకు తోడ్పడే చర్య ఇది.



ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా భారత్ తన చట్టాలను మార్చుకుంది. ఫలితంగా దేశంలోకి విదేశీ పెట్టుబడులు పెరిగాయి. దేశం నుంచి ఎగుమతులూ ఎగబాకాయి. అయినా, ప్రస్తుతం అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ కేవలం రెండు శాతం వాటాకే పరిమితమైంది! కొత్త వాణిజ్య విధానంతో దీన్ని మరింతగా పెంచుకోవాలి.

పరిమాణంపై ఆంక్షలు తొలగించడం చాలా అవసరం. ఈ మేరకు డబ్ల్యూటీఓ ఛత్రం కింద ఒప్పందం కుదరాలి. అన్ని అడ్డంకులనూ అధిగమించి ప్రపంచ విపణిలో పోటీపడగల సంస్థలు, దేశాలు దీర్ఘకాలంలో బాగా లబ్ధి పొందగలుగుతాయి.

డబ్ల్యూటీఓ వాణిజ్య సంబంధ పెట్టుబడుల (ట్రిమ్స్) ఒప్పందం ప్రకారం ప్రపంచ దేశాలు స్వదేశీ, విదేశీ పెట్టుబడుల మధ్య భేదం పాటించకూడదు. దేశాల మధ్య పెట్టుబడులు స్వేచ్ఛగా ప్రవహించడానికి తోడ్పడే ఒప్పందమిది. వాణిజ్య సంబంధ మేధా హక్కుల పరిరక్షణ ఒప్పందం (ట్రిప్స్) కొత్త వస్తుసేవల సృష్టికర్తల ప్రయోజనాలను సంరక్షిస్తోంది. ఈ కొత్త వస్తుసేవలను ఇతరులు చట్టవిరుద్ధంగా ఉపయోగించుకోకుండా కాపాడుతోంది. పేటెంట్లు, కాపీరైట్లు, పారిశ్రామిక డిజైన్లు, సర్క్యూట్లు, వాణిజ్య రహస్యాల రక్షణకు ట్రిప్స్ కవచంగా పని చేస్తోంది. ట్రిప్స్ నిబంధనలు అన్ని సభ్య దేశాలకూ వర్తిస్తాయి. వీటికి అనుగుణంగా భారత్ తన పేటెంట్, కాపీరైట్స్, వ్యాపారం, వ్యాపార సరకుల చట్టాలన్నింటినీ సవరించింది. సాంకేతికత పరిజ్ఞానాల బదిలీని ట్రిప్స్ ఒప్పందం ప్రకారమే చేపట్టాల్సి ఉంటుంది.

వాణిజ్య సంబంధ వివాదాల పరిష్కారానికి సంబంధించి అప్పిలేట్ సంస్థలో సంస్కరణలు తీసుకురావాలని 2019లో భారత్ ప్రయత్నించినా డబ్ల్యూటీఓ సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డబ్ల్యూటీఓలో చేరినప్పటి నుంచి భారత్‌కు విదేశీ పెట్టుబడులు పెరిగాయి. తానూ విదేశాల్లో పెట్టుబడులు పెట్టి భారతీయ దుస్తులు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ పెంచుకుంది. 2001లో ప్రారంభమైన దోహా చర్చలు వాణిజ్యానికి అడ్డంకులు తగ్గించాయి. డబ్ల్యూటీఓ డంపింగ్ విషయంలో సంస్కరణలు తీసుకొచ్చి, ఉత్పత్తులకు నిర్దిష్ట ప్రమాణాలను నిర్ణయించింది. స్వచ్ఛంద సంస్థలు, సమాచార మాధ్యమాలు, పార్లమెంటేరియన్లు, అంతర్జాతీయ సంస్థలతో పాటు సామాన్యులతోనూ ఆ సంస్థ మాటామంతీ నెరపుతూ- దోహా చర్చల పురోగతి విశేషాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తోంది. సభ్య దేశాల మధ్య పెట్టుబడి ప్రవాహాన్ని పెంచి ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు డబ్ల్యూటీఓ నిరంతరం ప్రయత్నిస్తోంది. ప్రజలతోపాటు వృక్ష జంతుజాలాలు, పర్యావరణం పరిరక్షణకు చర్యలు తీసుకునేలా డబ్ల్యూటీఓ ఒప్పందాల్లో తగు జాగ్రత్తలను పొందుపరుస్తున్నారు. వస్తుసేవల ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులు, దిగుమతిదారులు సులభంగా వ్యాపారం నిర్వహించుకొనేలా చూడటానికి డబ్ల్యూటీఓ ప్రాధాన్యమిస్తోంది. స్వదేశీ, విదేశీ వ్యాపారాభివృద్ధి వల్ల ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం పెరిగి సామాజిక సంక్షేమం, మౌలిక వసతులపై ఎక్కువ నిధులు వెచ్చించగలుగుతాయి. డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడం ద్వారా వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు వాణిజ్యాన్ని విస్తరించుకోగలుగుతాయి. సభ్య దేశాలు ఉన్నపళాన సుంకాలు పెంచడం లేదా ఇతర మార్గాల్లో వాణిజ్యానికి అడ్డంకులు సృష్టించకుండా డబ్ల్యూటీఓ నిబంధనలు జాగ్రత్త తీసుకుంటాయి. దాని వల్ల విదేశీ కంపెనీలు, ప్రభుత్వాలు డబ్ల్యూటీఓ సభ్య దేశాల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా పెట్టుబడులు పెట్టగలుగుతాయి.

### ఎగుమతులకు ప్రోత్సాహం

ప్రపంచంలో డిజిటల్ వాణిజ్యాన్ని పెంచడానికి తీసుకోవలసిన చర్యల గురించి డబ్ల్యూటీఓ సభ్యదేశాలు చర్చించుకొంటున్నాయి. ఈ-కామర్స్ విస్తరణకు సానుకూల వాతావరణం ఏర్పరచడానికి నడుంకట్టాయి. భారతదేశం చివరిసారి 2015లో తన వాణిజ్య విధానాన్ని ప్రకటించింది. ఆ తరవాత వచ్చిన మార్పులను పొందుపరుస్తూ కొత్త వాణిజ్య విధానాన్ని ఇంకా తీసుకురావలసి ఉంది. అమెరికా, ఐరోపా సమాఖ్యలు తమ రైతులకు భారీగా రాయితీలను ఇస్తూ, భారతీయ రైతులకు సబ్సిడీ తగ్గించమంటున్నాయి. తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తులు భారత్‌లో భారీయెత్తున ప్రవహించడానికి వీలు కల్పించాలంటున్నాయి. భారత్ ఇందుకు అంగీకరించడం లేదు. ప్రధానంగా వ్యవసాయ దేశమైన భారత్ తన రైతు ప్రయోజనాల రక్షణకు డబ్ల్యూటీఓ నిబంధనలు అడ్డురాకుండా చూసుకోవాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సైతం ఎగుమతులను పెంచేలా ప్రోత్సహించాలి. ప్రస్తుతం అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వాటా కేవలం రెండు శాతం. దీన్ని మరెంతో పెంచుకోవాలి.

(రచయిత–ఆర్థిక, విదేశీ వాణిజ్య నిపుణులు)

# మధ్యప్రదేశ్ భాజపాకు గుజరాత్ పాఠాలు

ఈ సంవత్సరం శాసనసభ ఎన్నికలు జరిగే అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ ఒకటి. దాదాపు 20 ఏళ్లుగా ఇక్కడ భాజపా అధికారంలో ఉంది. మధ్యలో కాంగ్రెస్ ఒకసారి అధికార పీఠాన్ని దక్కించుకున్నా, రెండేళ్లు తిరక్కముందే జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటుతో మళ్ళీ భాజపా పాలన వచ్చింది. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ శాసనసభలో 2018 ఎన్నికల్లో భాజపాకు 109 స్థానాలు రాగా, కాంగ్రెస్ కూటమికి 114 సీట్లు దక్కాయి. కమల్‌నాథ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. 2020లో అసంతృప్తనేత జ్యోతిరాదిత్య సింధియా, మరో 21 మంది శాసనసభ్యులు తిరుగుబాటు చేసి కాంగ్రెస్ నుంచి బయటికొచ్చారు. ఆ తరవాత కొద్దిరోజులకే మరో ముగ్గురు హస్తం పార్టీని వీడారు. అప్పటికే ముగ్గురు సభ్యుల మృతితో వారి స్థానాలూ ఖాళీ అయ్యాయి. మొత్తం 28 నియోజకవర్గాలకు ఉపఎన్నికలు నిర్వహించగా, 19 స్థానాలను భాజపా కైవసం చేసుకుంది. దాంతో ఆ పార్టీ బలం అసెంబ్లీలో 128కి పెరిగి, అధికారపీఠం దక్కింది. కాంగ్రెస్ తొమ్మిదిచోట్లే గెలిచింది.



ఈ ఏడాది నవంబరులో మధ్యప్రదేశ్ శాసనసభకు జరిగే ఎన్నికలు భాజపా అగ్రనాయకత్వానికి అగ్నిపరీక్షగా మారాయి. గుజరాత్ తరహా ప్రయోగంతో కాషాయపార్టీ రాష్ట్రంలో అధికారం నిలబెట్టుకుంటుందా, లేదంటే కాంగ్రెస్ చేతికి పగ్గాలు అప్పగిస్తుందా అన్నది ఆసక్తి రేపుతోంది.

### అసంతృప్తిని అధిగమించి...

గుజరాత్, మధ్యప్రదేశ్‌ల మధ్య ఎన్నికల విషయంలో పోలికలున్నాయి. 2017, 2018 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో భాజపా బలం రెండు రాష్ట్రాల్లోనూ గణనీయంగా పడిపోయింది. అందుకు ప్రభుత్వంపై వ్యతిరేకత, మంత్రులూఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి కారణాలుగా నిలిచాయి. గుజరాత్ వరకు ఎలాగోలా 99 స్థానాలు దక్కించుకుని అధికారాన్ని నిలబెట్టుకున్నా, మధ్యప్రదేశ్‌లో మాత్రం కొద్దిపాటి తేడాతో ఓడిపోయింది. దాంతో 2022 గుజరాత్ ఎన్నికల్లో కమలనాథులు సరికొత్త వ్యూహాన్ని అమలుచేశారు. 2021 సెప్టెంబరులో ముఖ్యమంత్రి విజయ్ రూపాణీని తప్పించి, భూపేంద్రపటేల్‌ను ఆ పదవిలో కూర్చోబెట్టారు. మంత్రివర్గంలోనూ భారీ ప్రక్షాళన చేపట్టారు. చివరకు ఎన్నికల సమయంలోనూ తమకున్న 99 మంది శాసనసభ్యుల్లో 40 మందికి టికెట్లు నిరాకరించి, కొత్తవారిని రంగంలోకి దించారు. ఫలితంగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతస్థాయిలో భాజపా 156 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లోనూ కాషాయపార్టీ అదే మంత్రం జపిస్తుందా అన్న చర్చ జోరుగా సాగుతోంది. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మార్చాలన్న డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. గత ఏడాది ఆగస్టులో చౌహాన్‌ను పార్టీ పార్లమెంటరీ బోర్డు నుంచి తప్పించడంతో ఇక భాజపా పెద్దలు ఆయన్ను మార్చడం ఖాయమన్న వార్తలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ పథకాల్లో అవినీతి హద్దులు దాటింది. పిల్లలకు పోషకాహారం అందించే పథకంలో అవినీతిని అకౌంటెంట్ జనరల్ కార్యాలయమే బయటపెట్టింది. ఆర్‌ఎస్ఎస్ సైతం శివరాజ్‌ను మార్చాలన్న వాదనవైపే మొగ్గుచూపుతోంది. రాష్ట్రంలో ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని ఆయన ఎదగనివ్వలేదన్న ఆరోపణ సంఘ్ పరివార్ నుంచి వస్తోంది. రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న ఓబీసీ వర్గం నుంచి నాయకులను తయారుచేసుకోకపోవడం పెద్ద లోటు. అయితే, ఇప్పుడు చౌహాన్ స్థానంలో సీఎం పదవికి పోటీ పడుతున్న వారంతా అగ్రకులస్థులు కావడం పార్టీకి మరో తలనొప్పి. హోంమంత్రి నరోత్తమ్ మిశ్ర, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణుదత్ శర్మ ఇద్దరూ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు. జ్యోతిరాదిత్యది రాజకుటుంబం. కైలాష్ విజయ్‌వర్గియా బనియా వర్గానికి చెందినవారు. లోధీ (ఓబీసీ) వర్గానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఉమాభారతి ఉన్నా, ఆమె ఇటీవల వరసగా భాజపా అధినాయకత్వాన్ని సవాలు చేసేలా మాట్లాడుతున్నారు. దాంతో ఆమెకు అవకాశం ఇవ్వడమూ కష్టమే. శివరాజ్‌సింగ్‌కు ఇన్నిరకాలుగా కలిసివచ్చినా, కీలకమైన మధ్యప్రదేశ్‌లో పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఆయన్ను మార్చడం భాజపాకు అనివార్యమని భావిస్తున్నారు.

### ముందున్నది త్రిముఖ పోరు...

సీఎం చౌహాన్‌పై ప్రజల్లో తీవ్రస్థాయి వ్యతిరేకత లేకపోయినా, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గుజరాత్ తరహాలోనే మధ్యప్రదేశ్‌లోనూ మంత్రివర్గాన్ని పూర్తిగా మారుస్తారని, సింధియా వర్గానికీ ప్రాతినిధ్యం తక్కువగానే ఉంటుందని సంఘ్ వర్గీయులు చెబుతున్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన 'భారత్ జోడో యాత్ర'కు మంచి స్పందన వచ్చింది. ఒకసారి అధికారం దక్కినట్లే దక్కి చేజారిపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంపై గట్టిగానే దృష్టిసారిస్తోంది. జాతీయపార్టీ హోదాను దక్కించుకున్న ఉత్సాహంలో ఉన్న ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్- దిల్లీలో తాను అందిస్తున్న పాలనను నమూనాగా చూపించి మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిగా పోరాడవచ్చు. ఈ త్రిముఖపోటీలో విజయం ఎవరిని వరిస్తుందన్నది చివరిక్షణం వరకు చెప్పలేం!

– కామేశ్వరరావు

# పారిశుద్ధ్యం... ఇంకెన్నాళ్లీ అమానవీయత?

మానవ విసర్జితాలను సాటి మనుషులే ఎత్తిపోసే అత్యంత దుర్భరమైన వ్యవస్థను నిర్మూలించేందుకు 2013లో కేంద్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. రెండేళ్ల కిందట దానికి సవరణలూ చేపట్టింది. ఈ నేపథ్యంలో గతంలో పార్లమెంటులో బీఎస్పీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతశాఖ మంత్రి రాందాస్ అఠవాలే సమాధానమిచ్చారు. దేశంలో మానవ వ్యర్థాలను శుభ్రపరచే వృత్తిలో ఎవరూ లేరని ప్రకటించారు. అయితే సెప్టిక్ ట్యాంకులు, మురుగుకాలువలను శుభ్రంచేసే క్రమంలో గత అయిదేళ్లలో దేశవ్యాప్తంగా 330 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆయనే వెల్లడించడం గమనార్హం.



దేశంలో ప్రస్తుతం మానవ విసర్జితాలను ఎత్తిపోసే వృత్తిలో ఎవరూ లేరని కేంద్ర ప్రభుత్వం గతంలో పార్లమెంటు వేదికగా ప్రకటించింది. మరోవైపు, పారిశుద్ధ్య పనుల్లో ఏటా వందల మంది మరణిస్తున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థల ఆధునికీకరణతోనే ఈ అమానవీయతను నిర్మూలించడం సాధ్యమవుతుంది.

మానవ విసర్జితాలను ఎత్తిపోసే దుర్భరమైన వృత్తిలో సమాజంలో అణగారిన వర్గాలు కొన్ని దశాబ్దాలపాటు మగ్గిపోయాయి. తదనంతర కాలంలో సెప్టిక్ ట్యాంకులు, మురుగుకాలువలు, మ్యాన్‌హోళ్లలో దిగి వాటిని శుభ్రంచేసే పనులన్నీ వీరే నెత్తికెత్తుకోవాల్సి వచ్చింది. ఈ పనిలో ఏటా వందల మంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. 2018లో 68 మంది, 2019లో 119 మంది కార్మికులు ఈ పనిలో ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వమే 2020లో రాజ్యసభలో ప్రకటించింది. ఆ రెండేళ్లలోనే దాదాపు 200 మంది ఈ శుద్ధి ప్రక్రియలో ప్రాణాలు కోల్పోతే- 2017 నుంచి 2022 వరకు అయిదేళ్లలో 330 మంది మృత్యువాత పడ్డారని చెప్పడం కాకిలెక్కలేనని స్వచ్ఛంద సంస్థలు, సఫాయీ కర్మచారుల సంక్షేమ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇవన్నీ ఠాణాల్లో నమోదైన కేసుల సంఖ్య మాత్రమేనని, ఇలా ప్రాణాలు కోల్పోయినవారు ఇంతకు ఎన్నోరెట్లు ఉంటారని వీరి జీవన స్థితిగతులను మార్చే లక్ష్యంతో దశాబ్దాలుగా పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సఫాయీ కర్మచారీ ఆందోళన్ (ఎస్‌కేఏ) ఆవేదన వ్యక్తం చేస్తోంది. పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన జాతీయ సఫాయీ కర్మచారీ కమిషన్ (ఎన్‌సీఎస్‌కే) 2017 జనవరి నుంచి ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా సెప్టిక్ ట్యాంకులు, మురుగుకాలువలు, మ్యాన్‌హోళ్లను శుభ్రంచేసే పనిలో 127 మంది చనిపోయినట్లు ప్రకటించింది. అదే సమయంలో ఒక్క జాతీయ రాజధాని ప్రాంతం పరిధిలోనే 429 మంది పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్‌కేఏ లెక్క తేల్చింది. మృతుల సగటు వయసు 37 సంవత్సరాలేనన్న గణాంకాలు- వారిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్న కఠోర సత్యాన్ని కళ్లకు కడుతున్నాయి.

మానవ వ్యర్థాలను శుభ్రపరచే వృత్తిలో 2002-03 నాటికి 6.76 లక్షల మంది ఉన్నారని, ఆ తరవాతి సంవత్సరాల్లో వారి సంఖ్య ఎనిమిది లక్షలకు చేరిందని సామాజిక న్యాయశాఖ గతంలో ప్రకటించింది. 2013లో చట్టం చేసేసరికి వారి సంఖ్య 50 వేలకు తగ్గిందని వెల్లడించింది. పునరావాసానికి నిధులు ఖర్చుపెట్టకుండా తప్పించుకునేందుకే ఈ కార్మికుల సంఖ్యను ప్రభుత్వం తక్కువచేసి చూపిందన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే- దేశంలో ఆ కార్మికులు 58,098 మంది ఉన్నట్లు లెక్కతేలిందని కేంద్రమంత్రి అఠవాలే రాజ్యసభలో ప్రకటించారు. వీరందరికీ ఏకకాల సాయం కింద రూ.40 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేశామని ఆయన ఘనంగా వెల్లడించారు. ఈ మొత్తం వారి పునరావాసానికి ఏమాత్రం పనికొస్తుందో కేంద్రమే చెప్పాలి. ఈ కార్మికుల్లో 16,057 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, మరో 1,387 మందికి మురుగుశుద్ధి ప్రాజెక్టుల వంటి స్వయం ఉపాధి పథకాల నిమిత్తం పెట్టుబడి రాయితీ కింద రూ.5 లక్షల సాయం అందించామని మంత్రివర్యులు వెల్లడించారు.

మానవ వ్యర్థాల శుద్ధి, రవాణా వంటివన్నీ యాంత్రీకరణ చేయడాన్ని ప్రాధాన్యాంశంగా తీసుకోవాలి. మురుగునీటి పారుదల వ్యవస్థలను ఆధునికీకరించాలి. ఈ దిశగా స్థానిక సంస్థలను ప్రోత్సహించాలి. సెప్టిక్ ట్యాంకుల శుద్ధీకరణకు ఐఐటీ మద్రాస్ 2019లోనే రోబోను రూపొందించినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. అక్షరజ్ఞానంలేని పారిశుద్ధ్య కార్మికులు సైతం సులభంగా నడిపించగల ఇటువంటి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా, విధానపరంగా చేయూతనిస్తేనే మానవ వ్యర్థాలను ఎత్తిపోస్తున్నవారి జీవితాల్లో వెలుగురేఖ కనిపిస్తుంది.

– శిశిర

## ఈనాడు లేఖలు

### పట్టణ పేదలకూ ఉపాధి

కొవిడ్ మహాసంక్షోభ వేళ లాక్‌డౌన్లు, కర్ఫ్యూలతో బతుకుతెరువు కోల్పోయిన ఎందరో వలస కూలీలకు, భవన నిర్మాణ కార్మికులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆశాదీపంగా నిలిచింది. ఈ పథకాన్ని పట్టణ పేద ప్రజలకూ వర్తింపజేయాలని పలువురు కోరుతున్నారు. దీనివల్ల నిరుద్యోగం కొంతమేర తగ్గి వారి జీవన ప్రమాణాలు మెరుగయ్యే అవకాశాలు ఉన్నాయి. పట్టణాల్లో నైపుణ్యం అవసరం లేని నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎం. వెంకటేష్, హైదరాబాద్

### పింఛన్లకు దూరం

వృద్ధాప్య పింఛన్లపై కొత్త నిబంధనలతో వృద్ధులకు ఇక్కట్లు తప్పవు. ఇంటి కరెంటు వాడకం నిర్దేశిత పరిమితులు మించితే వృద్ధులకు పింఛన్లలో కోత విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంట్లో కుటుంబ సభ్యులు వాడే కరెంటు విషయంలో వృద్ధులకు శిక్ష వేయడం సబబు కాదు. దీనివల్ల వృద్ధులకు జీవనం భారంగా మారుతుంది.

– ఉప్పలపు శేషునాథ్, పి.నైనవరం, కృష్ణాజిల్లా

### మహిళలకు రక్షణ

మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు ఏపీలోనూ అధికంగా చోటుచేసుకుంటున్నాయి. స్త్రీలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. నేరగాళ్లకు శిక్షలు ఖరారు చేసే విషయంలో న్యాయస్థానాలు వేగంగా స్పందించాలి. మహిళలకు రక్షణ కల్పించడంపై మరింత కట్టుదిట్టమైన చట్టాలను రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– సాంబశివారెడ్డి, కడప

ceblekhalu@eenadu.in

(c) eenadu







## పట్టించుకోకుంటే... ప్రాణాల మీదకే...

ప్రాణవాయువు ట్యాంకులకు రక్షణ లేకుండా పోతోంది. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటు చుట్టూ ఏమాత్రం కనీస రక్షణ లేదు. కరోనా రెండో దశ సమయంలో ప్రాణవాయువు అందక చాలామంది మృతి చెందడంతో దాతలు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి మాతాశిశు సంక్షేమ విభాగం ఆవరణలో రూ.కోట్ల ఖర్చుతో ఆక్సీజన్ ప్లాంటును నిర్మించారు. చంటిబిడ్డలు, గర్భిణులు, మాతృమూర్తులకు అవసరమైన ఆక్సిజన్‌ని ఈ ప్లాంటు నుంచే అందిస్తున్నారు. అంతటి కీలకమైన ఈ ఆక్సిజన్ ప్లాంటు చుట్టూ కనీసం ఫెన్సింగ్ వంటి రక్షణ కూడా లేకపోవడంతో రోగుల సహాయకులు ఉతికిన బట్టలు ఆరేసుకోవడానికి ఆక్సిజన్ సరఫరా జరిగే పైపుల పై నుంచి దూకడం, ప్లాంటు పక్కనే భోజనాలు చేయడం చేస్తున్నారు. ఎవరైనా ఆకతాయిలు ఆక్సిజన్ పైపులు తిప్పితే పెనుప్రమాదం జరిగి వందల మంది చంటిబిడ్డల ప్రాణాలతో ఆటలాడుకున్నట్లే అవుతుంది.

-ఈనాడు, అమరావతి

# ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోండి!

### ఆలయ భూములపై సమగ్ర నివేదిక కోరిన కలెక్టర్

**ఈనాడు, అమరావతి:** దేవాలయ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బట్టీల కార్యకలాపాలను నిలుపుదల చేయాలని జి.కొండూరు మండలం తహసీల్దారును ఆయన ఆదేశించారు. అక్రమంగా ఇటుకల బట్టీలు ఏర్పాటు చేస్తే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన సంతాన వేణుగోపాలస్వామి భూములపై వెంటనే సమగ్ర నివేదిక అందజేయాలని విజయవాడ దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణమ్మను ఆదేశించారు. మూడు రోజుల్లో నివేదిక అందించాలని, ఇంతకాలం మౌనంగా ఉన్న ఈవోపై ఎందుకు చర్య తీసుకోలేదో వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. సంతాన వేణుగోపాలస్వామి భూములు వివాదంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ భూములపై ఒక ప్రజాప్రతినిధి కన్నువేసి కారు చౌకగా కొట్టేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను 'దేవాలయ భూములపై ప్రజాప్రతినిధి కన్ను' అనే శీర్షికన ఈనాడులో ఈనెల 1న వెలుగులోకి తెచ్చింది. సర్వే నెంబరు 300లో దాదాపు 20 ఎకరాలలో 14 మంది వరకు అనుభవదారులు ఉన్నారు. ఇది ఆర్ఎస్ఆర్ ప్రకారం దేవాదాయ శాఖ భూములుగా ఉన్నాయి. నిషేధిత జాబితాలోనూ ఉన్నాయి. ఈ భూముల యాజమాన్య హక్కులు తేల్చాలని రెవెన్యూ కోర్టులో కేసు కూడా ఉంది. కానీ దేవదాయశాఖ ఈ భూములను పట్టించుకోకుండా వదిలేసింది. ఈ వివాదాస్పద భూముల్లో భారీ ఎత్తున ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల కూలీలను తీసుకొచ్చి వారికి అక్కడే ఆవాసాలు ఏర్పాటు చేశారు. అనుభవదారుల నుంచి కొంత మంది వ్యాపారులు లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. వ్యవసాయయోగ్యమైన ఈ భూములు బట్టీల నిర్వహణ వల్ల వ్యవసాయానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. దీనిపై సోమవారం ఈనాడులో 'ఆలయ భూముల్లో అక్రమ బట్టీలు' శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఏసీ అన్నపూర్ణమ్మను, జి.కొండూరు తహసీల్దారును ఆదేశించారు. ఇంతకాలం ఉపేక్షించిన ఈవోపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆలయ భూములను 'ఈనాడు' క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న విషయం తెలిసిన దేవదాయశాఖ సిబ్బంది అప్పటికప్పుడు గతనెల 30న తహసీల్దారుకు ఒక ఫిర్యాదు అందజేశారు. తమ భూముల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. జి.కొండూరు తహసీల్దారు మాత్రం తనకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, కలెక్టర్ మౌకిక ఆదేశాల ప్రకారం బుధవారం దేవదాయశాఖ అధికారులతో కలిసి సంయుక్త తనిఖీ చేసి ఇటుక బట్టీల నిర్వహణను నిలిపివేస్తామని చెప్పారు.

# చిన్నవే కదాని... వదిలేస్తున్నారు..!

- నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఏదీ..?
- చొరవ చూపితే అయ్యేవాటినీ పట్టించుకోరు

ఈనాడు, అమరావతి

పద్మవ్యూహాన్ని తలపించే బెజవాడ ట్రాఫిక్.. నియంత్రణ విషయంలో నిర్లక్ష్య వైఖరి కారణంగా రద్దీ లేని సమయాల్లోనూ వాహనాలు బారులు తీరుతున్నాయి. సుమారు 180 వరకు పోలీసులు విధులు నిర్వహించాల్సిన బీట్లు ఉన్నాయి. చాలాచోట్ల సిబ్బందిని వేయలేని పరిస్థితి. కూడళ్లు కాకపోయినా ప్రధాన మార్గాల్లోని పలుచోట్ల రద్దీ నెలకొంటోంది. ఆ ప్రభావం వాటిని ఆనుకుని ఉన్న అంతర్గత రోడ్లపై పడుతోంది. ముందు రోడ్డు అంతా ఖాళీగా ఉన్నా ఆ ప్రాంతంలో వాహనాలు ఆగిపోవడం వల్ల వెనుక బారులు తీరుతున్నాయి. వీటిని వెంటనే సరి చేయకపోవడంతో చాలా సేపు ట్రాఫిక్ జామ్ అవుతోంది.

✪ విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలోని డొంక రోడ్డు ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. అక్కడ అసలే ఇరుకుగా ఉంటుంది. దీనికి తోడు డివైడర్ కటింగ్ ఇవ్వడం వల్ల ఒకవైపు నుంచి మరో వైపునకు ఇక్కడ వాహనదారులు దాటుతున్నారు. పెద్ద వాహనాలు మలుపు తిరగడం కూడా కష్టంగా ఉండడం వల్ల రహదారికి రెండు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. ఇక్కడ రోడ్డు విస్తరించిన తర్వాత యూ టర్నింగ్ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుంది. పటమటలోని సోనోవిజన్ ఎదురు కూడా ఇలాగా మలుపు తిరిగేందుకు డివైడర్‌ను కొంత మేర తొలగించారు. రోడ్డు ఇరుకుగా ఉన్న కారణంగా ఎక్కువ సమయం ట్రాఫిక్ జామ్ అవుతోంది.



వారధి కూడలిలోని బస్టాప్ వద్ద...

■ చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి వంతెన కింద ఉన్న వారధి కూడలి వద్ద కూడా వాహనాలు ఆగిపోతున్నాయి. బస్టాండు నుంచి గుంటూరు వైపు వెళ్లే వాహనాలు వారధి వంతెన ఎక్కే ముందు బస్టాప్ వద్ద ప్రయాణికుల కోసం ఆగుతున్నాయి. దీని వల్ల బస్టాండులోకి వెళ్లే బస్సులు, బ్యారేజి వైపు, హైదరాబాద్ వైపు వెళ్లాల్సినవి తిరగడానికి ఇబ్బందిగా ఉంటోంది. ఫలితంగా వెనుక రాణిగారి తోట వరకు అన్ని రకాల వాహనాలు ఆగిపోతున్నాయి. అక్కడి బస్టాప్‌ను కొద్దిగా ముందుకు జరిపితే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

■ కామయ్యతోపు సెంటర్ వద్ద ఎక్కువ సందర్భాలలో రోడ్డు ఖాళీగా ఉన్నా ఆంజనేయస్వామి గుడి వద్ద వాహనాలు ఆగిపోతున్నాయి. కానూరు నుంచి బందరు రోడ్డులోకి వచ్చి బెంజిసర్కిల్ వైపు వెళ్లాల్సినవి, గుడివాడ, మచిలీపట్నం, భీమవరం, అవనిగడ్డ, నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, సిటీ బస్సులను ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు అక్కడ ఆపుతున్నారు. దీని వల్ల వెనుక వాహనాలు ఎక్కువ దూరం నిలిచిపోతున్నాయి. రద్దీ సమయాల్లో అయితే సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల వరకు ఆగిపోతున్నాయి. ఆ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది నియంత్రణ విషయంలో చొరవచూపడం లేదు. గుడి వద్ద ఉన్న బస్టాప్‌ను ముందుకు మార్చితే ఈ సమస్య తీరుతుంది.



### దృష్టి పెట్టని వీఎంసీ, పోలీసు శాఖ

మచిలీపట్నం వైపు నుంచి నగరంలోకి నిత్యం 7,500 వాహనాలు ప్రవేశిస్తుంటాయి. బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు రోడ్డు ఇరుకుగా ఉంటుంది. జాతీయ రహదారి అయినా విస్తరణకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని 120 అడుగులకు విస్తరించాలి. వీఎంసీ పరిధిలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు విస్తరణ పనులు ఎంతకూ పూర్తి కావడం లేదు. 2017 నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. గతేడాది నగరపాలక సిబ్బంది కొంత మేర రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను తొలగించారు. పలుచోట్ల న్యాయస్థానాల్లో కేసులు ఉండడంతో ప్రక్రియ ఆగిపోయింది. కోర్టు వ్యాజ్యాలు పరిష్కారం అయ్యేలా వీఎంసీ అధికారులు చొరవ చూపించడం లేదు. ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్న ప్రాంతాలపై వీఎంసీ, పోలీసు శాఖ ఉమ్మడిగా సర్వే నిర్వహించి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.





## చెట్ల వ్యర్థం... ఎరువుతో అర్థం

రహదారుల పక్కనే నరికేసిన, విరిగి పడిన చెట్ల కొమ్మలు రోజుల తరబడి అలాగే వదిలేస్తే అగ్ని ప్రమాదాలకు కారణం అవడంతో పాటు కాలుష్య భూతంగా మారేవి. అలాంటిది చెట్ల వ్యర్థాలతో కూడా వినూత్నంగా విద్యుత్తు ఉత్పత్తి, కంపోస్టు ఎరువుల తయారీ లక్ష్యంగా స్వచ్ఛభారత్ స్ఫూర్తితో విజయవాడ నగరపాలక సంస్థ ట్రీ ఉడ్ ష్రేడర్స్ యంత్రాలను వినియోగంలోకి తెచ్చింది. విజయవాడ నగరంలో నిత్యం పేరుకుపోతున్న టన్నుల కొద్ది చెట్ల వ్యర్థాలను తొలగించేందుకు శ్రీకారం చుట్టిన ట్రీఉడ్ ష్రేడర్స్ వినియోగంతో సత్ఫలితాలు ఇస్తుంది. ట్రీఉడ్ ష్రేడర్స్ యంత్రాల సాయంతో చెట్టు కొమ్మలు విరిగిపడిన చోటనే క్రషింగ్ చేసి సూక్ష్మంగా ముక్కలుగా చేసి సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంటుకు తరలిస్తున్నారు. తర్వాత వీటిని గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలించి విద్యుత్తు ఉత్పత్తికి వినియోగించుకుంటున్నారు. ఎక్సెల్ ప్లాంటులో క్రషింగ్ చేసిన చెట్ల వ్యర్థాలతో కంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారు.



వ్యర్థాలను సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంటులో ఎరువుగా తయారు చేస్తూ..

- ఈనాడు, అమరావతి

## 9న ఐటీఐలో జాతీయ అప్రెంటీస్ మేళా

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** స్కిల్ ఇండియా.. మేకిన్ ఇండియాలో భాగంగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9వ తేదీన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో చదివిన విద్యార్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0866-2475575, 8309442698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## తల్లిదండ్రులు మందలించారని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



హరీష (పాతచిత్రం)

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** కళాశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన కుమార్తె పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సుబ్బాయిగూడెంలో జరిగింది. ఎస్ఐ హరిప్రసాద్ కథనం ప్రకారం.. సుబ్బాయిగూడెంకు చెందిన పసుపులేటి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మీ దంపతుల రెండో కుమార్తె హరీష(20). ఈమె నందిగామలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చివరి ఏడాది చదువుతోంది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సరిగా కళాశాలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 1న ఇంట్లో ఉన్న పురుగుమందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే నందిగామ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. దంపతులకు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తెకు వివాహమైంది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ₹5000/- ఇస్తేనే పింఛన్..!



### తొలగించకుండా ఉండటానికి ఓ అధికారి చేతివాటం

తిరువూరు, న్యూస్‌టుడే

పూట గడవడమే కష్టంగా ఉన్న అభాగ్యులు పింఛన్ సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నారు. ముదిమి వయసులో ఉన్న వృద్ధులకు ఇదే ఆసరాగా నిలుస్తోంది. ఒకరిపై ఆధారపడి జీవించే దివ్యాంగులకు ప్రతి నెలా ఇచ్చే పింఛన్ డబ్బులే ఆధారంగా ఉంటుంది. అలాంటి సామాజిక పింఛన్ల అర్హత నిర్ధారణ నోటీసులను అడ్డం పెట్టుకుని తిరువూరు పురపాలక సంఘంలో పని చేస్తున్న ఒక అధికారి వసూళ్లకు తెరలేపారు. వాటిని తొలగించకుండా ఉండాలంటే ఒక్కో పింఛన్‌కు తనకు రూ.5 వేలు ఇవ్వాలంటూ ముక్కుపిండీ మరీ వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పురపాలక సంఘం అధికారులు పట్టణ పరిధిలో 230 మంది లబ్ధిదారులకు అన్హత నోటీసులు జారీ చేశారు. వీటి ఆధారంగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి విచారణ జరిపి ప్రభుత్వ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి తన లాగిన్ నుంచి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. గతంలో పని చేసిన ప్రతి చోటా ఆరోపణలు ఎదుర్కొంటూ బదిలీపై ఇటీవల వచ్చిన ఆ అధికారి తన చేతివాటం ఇక్కడ కూడా ప్రారంభించారు. ప్రైవేట్ వ్యక్తులతో కలిసి పింఛన్ తొలగించకుండా ఉండటానికి రూ.5 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. పింఛన్ నిలబెట్టుకోవడానికి పలువురు పేదలు తెలిసిన వారి వద్ద అప్పు చేసి వారు అడిగినంత సమర్పించుకుంటున్నారు. విషయాన్ని కాస్తా బాధితులు ఛైర్‌పర్సన్ జి.కస్తూరిబాయి, అధికార పార్టీ కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లారు. రూ.5 వేలు ఇవ్వకపోతే పింఛన్ రద్దు చేస్తున్నారని, తమకు న్యాయం చేయమంటూ వేడుకున్నారు. దీంతో సదరు అధికారిని పిలిచి పద్ధతి మార్చుకోవాలని మందలించినా వసూళ్లను మాత్రం ఆపలేదు.

❖ ఎమ్మెల్యే దృష్టికి వ్యవహారం: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్ము పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే రక్షణనిధి ఎదుట తమ గోడు వెళ్లబోసుకుందామని వచ్చిన బాధితులను సదరు అధికారికి మద్దతుగా ఉన్న వ్యక్తులు అక్కడి నుంచి పంపించారు. అధికారిపై ఫిర్యాదు చేస్తే అసలుకే ఎసరు వస్తుందని హెచ్చరించడంతో బాధితులు వెనుదిరిగి వెళ్లారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్లు, నాయకులు ఈ కార్యక్రమం అనంతరం నియోజకవర్గ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దృష్టికి ఆ అధికారి వసూళ్ల వ్యవహారాన్ని తీసుకెళ్లారు. పింఛన్ల విషయంలో కాకుండా ఇంటి పన్నులు, ఇతరత్రా విషయాల్లో కూడా డబ్బులు వసూలు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిసింది.

### ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

**- గత్తం కస్తూరిబాయి, ఛైర్‌పర్సన్**

కార్యాలయంలో పని చేస్తున్న అధికారి డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాగానే మందలించాం. తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారి తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే రక్షణనిధితో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటాం.

## ప్రజాస్వామ్య పద్ధతిలో సభలు నిర్వహిస్తాం: ఉమా



**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టానికి అనుగుణంగా సభలు పెడతాం, ప్రదర్శనలు చేస్తాం, సమావేశాలను నిర్వహిస్తామని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు చేయకూడదంటూ వచ్చిన జీవోకు వ్యతిరేకంగా ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెదేపా కార్యక్రమాలను జరగనివ్వకూడదని ప్రభుత్వం తెచ్చిన జీవోను లెక్క చేయమన్నారు. రాష్ట్రంలో తెదేపాకు వస్తున్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి జగన్‌కు, వైకాపా పెద్దలకు చెమటలు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జీవోకు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


శ్రీ సాయి పీతాంబరి శారీస్
డిజైనర్ శారీస్ ప్రదర్శన మరియు అమ్మకం.
జనవరి 2 నుండి 6 వరకు మాత్రమే. ఎగ్జిక్యూటివ్ క్లబ్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ. ఫోన్: 9440623599
సేల్

విజయవాడ నగర ప్రజలకు శుభవార్త !
హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వారి మెదడు క్యాన్సర్ లేదా మెదడులో కణితుల నిపుణులు
ఈ శనివారం (07-01-2023) విజయవాడ క్లినిక్‌కు విచ్చేయుచున్నారు.
Dr. K. Venkateswara Rao
MS, M.Ch
Consultant Neuro Oncologist
Timings: 9am to 4pm
BASAVATARAKAM INDO-AMERICAN CANCER HOSPITAL AND RESEARCH INSTITUTE
డోర్ నెం. 29-4-4, 4వ అంతస్తు, కోదండరామిరెడ్డి వీధి, గవర్నర్‌పేట్, విజయవాడ-520002.
అపాయింట్‌మెంట్ కొరకు: 0866/2433818, 9133612863


# ఖాళీ స్థలం కనిపిస్తే... వాలిపోతాడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే



ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాలు కనిపిస్తే చాలు.. వాటికి తప్పుడు రికార్డులు సృష్టించేస్తాడు. స్థల యజమానుల పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు సిద్ధం చేస్తాడు. ప్రభుత్వ స్టాంపులకు నకిలీవి చేయించి.. నకిలీ సంతకాల సాయంతో స్థలాలను తన పేరు మీద మార్చుకుంటున్న తిరుమణి రాజ చైతన్య అనే ఒక ఘరానా మోసగాడిపై గవర్నర్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గాంధీనగర్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 వేగామణి చైతన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోసం, ఫోర్జరీ వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఇటీవల కొన్ని స్థలాలకు తప్పుడు డాక్యుమెంట్లతో తనఖా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 వేగామణి చైతన్యకు కొంత మంది స్థల యజమానులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టగా.. గుణదలకు చెందిన తిరుమణి రాజచైతన్య అనే వ్యక్తి పేరు మీద వరుసగా స్థలాలు రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు బాధ్యతలను రిజిస్ట్రేషన్ శాఖలోని నిఘా విభాగానికి అప్పగించినట్లు సమాచారం. వీరి అంతర్గత విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

### నకిలీ ఆధార్ కార్డులు...

వరుసగా జరిగిన రిజిస్ట్రేషన్లను తనిఖీ చేసిన అధికారులు.. ఒకే వ్యక్తి పేరు మీద తనఖా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించారు. వీటికి వినియోగించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రధానంగా ఆధార్ కార్డులను పరిశీలిస్తే.. అవి నకిలీవని బట్టబయలైంది. ఖాళీ స్థలాల యజమానుల పేరు మీద నకిలీ ఆధార్ కార్డులు సృష్టించినట్లు గుర్తించారు.

### స్థిరాస్తి వ్యాపారిపై కేసు నమోదు

పలు సర్వే నెంబర్లలో ఉన్న ఖాళీస్థలాల డాక్యుమెంట్లకు నకిలీ పత్రాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ఇందులో పలువురు స్థిరాస్తి వ్యాపారుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఖాళీస్థలాలను గుర్తించి, వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలకు నకళ్లను సంపాదించేవారని తెలుసుకున్నారు.

### ఇంటి దొంగల హస్తం ఉందా?

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రమే స్థిరాస్తి పత్రాలకు నకళ్లు ఉంటాయి. వీటిని సంపాదించటం కష్టమని రిజిస్ట్రేషన్ అధికారులు అంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే వారిలో ఎవరైనా.. ఈ ముఠాకు సాయం చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. . ఒకరిద్దరు స్థల యజమానులు జరిగిన మోసాన్ని గుర్తించటంలో.. ఇది వెలుగుచూసింది. విచారణలో మరికొన్ని స్థలాలు ఇలా తిరుమణి రాజ చైతన్య పేరు మీద తనఖా రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. దీనిపై జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ 419, 420 (మోసం), 465 (ఫోర్జరీ), 467, 468 (విలువైన ప్రభుత్వ డాక్యుమెంటుకు ఫోర్జరీ సృష్టించటం) రెడ్ విత్ 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## సెప్టెంబరు నాటికి హార్బర్ పనులు పూర్తి

**కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** గిలకలదిండిలో రూ.422 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ రెండో దశ అభివృద్ధి పనులు ఈ ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రంజిత్‌బాషా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి తెలిపారు. ప్రధాన కార్యదర్శి మంగళవారం కలెక్టర్లతో నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్ జిల్లాలో పరిస్థితులను వివరించారు. బందరు పోర్టు అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తెలియజేస్తూ మొదటి దశ రైల్ కం రోడ్ కనెక్టివిటీ కోసం కరగ్రహారం, పోతేపల్లి, గోపువానిపాలెం గ్రామాల పరిధిలో 146 ఎకరాల భూసేకరణ చేస్తున్నామన్నారు. ఇందులో 50.85 ముడ భూములున్నాయని, ప్రైవేట్ పట్టాభూములు 48.65 ఎకరాలు, 41 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా మిగిలిన భూముల సేకరణకై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు.

## ఒకే రోజు తనువు చాలించిన దంపతులు

**మోపిదేవి:** మూడు ముళ్ల బంధంతో ఏడడుగులు నడిచారు. చివరికి ఇద్దరూ ఒకే రోజు తనువు చాలించారు. పెదప్రోలుకు చెందిన కొక్కిలిగడ్డ రామయ్య, శాంతకుమారి భార్యాభర్తలు. భార్య శాంతకుమారి(75) అనారోగ్యంతో కొంతకాలం నుంచి ఇంటివద్దే చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. రామయ్యకు సోమవారం రాత్రి తీవ్ర ఆయాసం రావడంతో చల్లపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. పరిస్థితి ఆందోళనగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు బందరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ సమయంలోనే భార్య మృతి చెందిన విషయం తెలియడంతో వెంటనే ఇంటికి తీసుకొచ్చారు. భార్య మృతదేహాన్ని ఖననం చేసి ఇంటికి వచ్చారు. భార్య దూరమైందన్న బాధతో ఉన్న రామయ్య (83) కొద్ది సేపటికే తీవ్ర అనారోగ్యానికి గురై తనువు చాలించాడు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
EENADU CLASSIFIEDS
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

# ఆకలితో పాఠాలు వినేదెలా?

**విజయవాడ సిటీ, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే**

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ మూడు నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో పదకొండు పేపర్లు ఉండేవి. కరోనా నేపథ్యంలో వీటిని ఆరుకు కుదించారు. కొవిడ్ తీవ్రత తగ్గినా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆ మేరకు సిలబస్ తగ్గించకపోవడంతో మార్కుల సాధనకు విద్యార్థులు చాలా కష్టపడాల్సిందే. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు కూడా నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగానే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. అదనంగా గంటన్నర సమయం ఉంచుతున్నారు. ఉదయం 9 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 5.30 గంటల వరకు బడిలోనే ఉంటున్నారు. వారికి మధ్యాహ్నం భోజనం తప్ప, సాయంత్రం వేళ అల్పాహారం అందించకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. చదువుపై పూర్తిస్థాయి ఏకాగ్రత చూపలేకపోతున్నారు. ఉదయం నుంచీ తరగతుల్లో ఉండడంతో నీరసిస్తున్నారు.

జిల్లాలో 188 ప్రభుత్వ, జడ్పీ, నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల్లో 12,935 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయి. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సన్నద్ధం చేసే క్రమంలో సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రధానంగా దృష్టి పెట్టారు. వారు ఉత్తీర్ణులయ్యే చేయడంతో పాటు ప్రతిభావంతులకు అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పిల్లలకు మాత్రం మాత్రం కనీసం అల్పాహారం ఏర్పాటు చేయడం లేదు.



మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

## అల్పాహారం లేకుండానే ప్రత్యేక తరగతులు

### గతంలో అమలు..

గతంలో జడ్పీ పాఠశాలల్లో జడ్పీ నిధులు, నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో డీఎంఎ, కార్పొరేషన్ నిధులతో శనగలు, గోధుమరవ్వ ఉప్మా, బిస్కెట్లు, ఇడ్లీ, గారెలు తదితర వాటిని అందించే వారు. ఆయా గ్రామాల్లోని దాతలూ సహకరించే వారు. మూడేళ్ల నుంచి ఇది అమలు కావడం లేదు. గతంలో కరోనాతో పాఠశాలలో తరగతులు సక్రమంగా జరగలేదు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి అల్పాహారానికి నిధులు కేటాయించి, విద్యార్థుల ఆకలి తీర్చాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### దాతల సహకారం తీసుకోవాలని సూచించాం

ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అల్పాహారం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయింపు లేదు. దాతలు ముందుకు వస్తే వారి సహకారాన్ని తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం.

**- సి.వి.రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి**

# చేతివృత్తిదారులకు ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: చేతివృత్తిదారులను అందరూ ప్రోత్సహించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పటమట పంటకాలువ రోడ్డులోని స్టెల్లా ఇండోర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన నాబార్డ్ (క్రాఫ్ట్) మేళా-2023ను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం కళాకారులు చెక్కతో తయారుచేసిన జాతీయ పతాకాన్ని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత కళాకారులతో పాటు గ్రామీణ మహిళలు తమ తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించడానికి రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డ్ చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. నాబార్డ్ ఏపీ రీజనల్ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో 70 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తమ ఉత్పత్తులను మెరుగుపరిచేందుకు సూచనలు తీసుకోవాలని కళాకారులకు సూచించారు. ఆప్కాబ్ పర్సన్ ఇన్‌ఛార్జ్ ఎం.ఝాన్సీరాణి, ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఏపీ హస్తకళల సంస్థ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ రామాంజనేయులు, నాబార్డ్ జీఎం ఎన్.ఎస్.మూర్తి, హైదరాబాద్ డీజీఎం ప్రసాద్, విజయవాడ డీజీఎం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, గోపాల్, ఝాన్సీరాణి, విజయలక్ష్మి తదితరులు

## కలెక్టరేట్‌లో పింఛను వారోత్సవాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ కలెక్టరేట్‌లో మంగళవారం సామాజిక పింఛన్ల వారోత్సవాలు నిర్వహించారు. సీఎం జగన్ తూర్పు గోదావరి జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారోత్సవాల్లో పాల్గొనగా, జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించారు.



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 7,595 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 2.32 లక్షల మందికి రూ.64.06 కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్రమేపీ రూ.250 చొప్పున పింఛను పెంచుతున్నట్లు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జేసీ, ఉప మేయర్లు, కార్పొరేషన్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు, యూసీడీ ప్రాజెక్టు అధికారిణి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు. తొలుత కేక్ కోసి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపికైన సభ్యులు వీరే..

## ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం

సూర్యారావుపేట, ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మంగళవారం సూర్యారావుపేటలోని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్‌గా సయ్యద్ ఖాసిం, సెక్రటరీ జనరల్‌గా షేక్ ఇక్బాల్ బాషా, కో ఛైర్మన్లుగా గంధం రామారావు, ఇంటి రాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జనరల్‌లుగా అలవాల సుందరయ్య, వేముల భిక్షమయ్య, డి. రవిచంద్రప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, సరెండర్ లీవ్‌లను చెల్లించాలని, ఉపాధ్యాయులకు శాశ్వత బదిలీల కోడ్ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.భానుమూర్తి, ఎంఎస్.ఇమామ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## 8న శాప్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 8న స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి శాప్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ నిర్వహిస్తామని డీఎస్ఏ శ్రీనివాసరావు, ముఖ్య శిక్షకుడు ఎస్ఏ అజీజ్ తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన వారు టోర్నీలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

## కృష్ణా నదిలో యువకుడి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: కృష్ణానదిలో గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపుకు చెందిన పంప్‌హౌస్ వద్ద మంగళవారం ఓ యువకుడి మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు మృతుడికి 27 సంవత్సరాల వయస్సు ఉండి, విజయవాడ మధురానగర్‌కు చెందిన చందు రోహిత్ సాయిగా గుర్తించారు. మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీసి శవపరీక్ష కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

టెండరు నోటీసు

Roc.No:PR4/13950/Adv.No:330/PRO/2023, Dt: 03-01-2023

కార్యనిర్వహణాధికారి


# 5 నుంచి విజయవాడలో గులాబీ ప్రదర్శన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, హరిత ప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 6వ రాష్ట్ర స్థాయి అగ్రి హార్టికల్చర్ షో, 5వ వార్షిక గులాబీ ప్రదర్శన - 2023, సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్‌లోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జీవీఎల్ మోహనరావు, కార్యదర్శి నర్రా పద్మప్రియ వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను మంగళవారం ప్రదర్శన జరిగే సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో నగరవాసులను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో కొన్నేళ్ల నుంచి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ చైతన్యం తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాకినాడ, కడియం, పెద్దముత్తేవి తదితర ప్రాంతాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పువ్వులు, పండ్ల మొక్కలు 90 స్టాళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనేక రకాల గులాబీలు ఆకర్షణీయంగా నిలుస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, మిద్దెతోటల పెంపకంపై అవగాహన సదస్సులు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో రోజ్ సొసైటీ సంయుక్త కార్యదర్శులు ఘంటసాల లక్ష్మి, యేర్నేని పద్మజ, ఎస్.శిరీష, అబ్బూరి రత్నలక్ష్మి, విజయ్‌బాబు పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మోహనరావు, పద్మప్రియ, లక్ష్మీ, పద్మజ, రత్నలక్ష్మి తదితరులు

## 'తొక్కిసలాటకు వైకాపా బాధ్యత వహించాలి'

ఆటోనగర్(పటమట), న్యూస్‌టుడే: పోలీసుల నిర్లక్ష్యంతోనే గుంటూరులో తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనకు వైకాపా బాధ్యత వహించాలని తెదేపా తెలుగు మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ వైఫల్యంతో జరిగిన మరణాలను తెదేపాపై నెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. వైకాపా నాయకులు శవ రాజకీయాలు చేసే స్థాయికి దిగజారారని విమర్శించారు. తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి భూక్యా సౌజన్య పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంల జరుగుతున్న ఎస్వీ రామయ్య స్మారక ఐటీఎఫ్ ఎంటీ-100 మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో రెండో రోజు మంగళవారం పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. పురుషుల 75+ సింగిల్స్‌లో లక్ష్మణ్ అంబూల్కర్, ఘన్శ్యంలాల్ షా విజయం సాధించారు. 70+ పురుషుల సింగిల్స్‌లో వీఎల్ఎస్ఎన్ రాజు, ఉతుపరంబిల్ జార్జ్ థామస్, సీఆర్ గంగాధరన్, దోస రామారావులు సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించారు. 60+ పురుషుల విభాగంలో ఆశిష్ సేన్, సునీల్ సూద్, వైతిలింగం శంకర్, కోడూరి మెహర్ ప్రకాష్‌లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 45+ పురుషుల డబుల్స్‌లో శ్రీనివాస్ లగ్గాని/జి.వెంకట సత్యనారాయణ జోడీ, నల్లమోతు బోస్ కిరణ్/వి.చంద్రశేఖర్ జోడీలు ఫైనల్స్‌లో తలపడనున్నాయి. 35+ మహిళల సింగిల్స్‌లో నాగం సౌమ్యనాయుడు విజయం సాధించారు.

## మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి కృషి

ఆటోనగర్(పటమట), న్యూస్‌టుడే: మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహిళా చైతన్య మూర్తి సావిత్రిబాయి పులే అని తెదేపా బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి అన్నారు. ఆటోనగర్‌లోని తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి, ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కాకు మల్లికార్జున్ యాదవ్, నాయకులు వల్లూరి మధుసూదన్‌రావు, బొల్లా వెంకటేశ్వరరావు, పామర్తి కిషోర్ బాబు, శొంఠి శివరామ ప్రసాద్, గోపి చంద్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపులే చిత్ర పటానికి నివాళుర్పిస్తున్న తెదేపా నాయకులు వీరంకి గురుమూర్తి, సింహాద్రి కనకాచారి, కాకు మల్లికార్జున్ యాదవ్

## బిక్కవోలులో కొత్తగా కార్గో టెర్మినల్

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ పరిధిలోని బిక్కవోలులో కొత్తగా కార్గో టెర్మినల్ నిర్మించనున్నారు. ఇందుకోసం ఈ టెండర్లు ఆహ్వానించి తొలి కాంట్రాక్ట్‌ను గతిశక్తి అనే సంస్థకు మంగళవారం ఖరారు చేశారు. బిక్కవోలులో నిరుపయోగంగా ఉన్న రైల్వే స్థలాన్ని గుర్తించి కార్గో టెర్మినల్ కోసం సమీకరించారు. ఈ కార్గో టెర్మినల్‌తో సరకు రవాణా ద్వారా డివిజన్‌కు అదనపు ఆదాయం లభించనుంది. వినియోగదారులకు ఈ టెర్మినల్ ఏర్పాటు ద్వారా రవాణాకు అనుకూలంగా ఉంటుంది. ట్రాక్, సిగ్నల్, టెలికం, ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ వంటి ఆస్తులు, కార్యాకలాపాలను రైల్వే నిర్వహణలో ఉంటుంది. రైల్వే కార్గోను నిర్వహించడానికి అదనపు టెర్మినల్స్ అభివృద్ధిలో భాగంగా పరిశ్రమల నుంచి పెట్టుబడులను పెంచే ఉద్దేశంతో భారతీయ రైల్వేలు గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టింది. కొత్త టెర్మినల్స్‌తో విజయవాడ డివిజన్‌కు అదనపు ఆదాయం లభించనుందని సీనియర్ డీసీఎం వి.రాంబాబు తెలిపారు. రికార్డు సమయంలోనే కాంట్రాక్ట్ ప్రక్రియ పూర్తి చేసిన సీనియర్ డీసీఎంతో పాటు కమర్షియల్ సిబ్బందిని డీఆర్ఎం షివేంద్రమోహన్ అభినందించారు.

# వైకాపా ప్రభుత్వ పతనంతోనే రాష్ట్రాభివృద్ధి : బొండా

పాయకాపురం(అజిత్‌సింగ్‌నగర్), న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ పతనంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. వైకాపా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తెదేపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమం మాటామంతి.. 62వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రకాష్‌నగర్ మోహనరావు హోటల్ సెంటరు నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో బొండా పాల్గొన్నారు ఇంటింటికీ తిరుగుతూ వైకాపా ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. మహిళలు, యువకులు తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతుంటే.. ఆ పని చేయక పోగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలపై పన్నుల భారం, విద్యుత్తు ఛార్జీల భారం మోపుతున్నారని ఆరోపించారు. తెదేపా హయాంలో రూ.500 విద్యుత్తు ఛార్జీ వచ్చే ఇంటికి వైకాపా ప్రభుత్వంలో రూ.1500 వస్తోందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో హడావుడి చేస్తూ ప్రజల నుంచే వైకాపా ప్రభుత్వం దోచుకుంటోందని పేర్కొన్నారు. పసి పిల్లలు తాగే పాలు మొదలుకుని, ఇంట్లో వ్యర్థమైన చెత్తతో సహా అన్నింటిపై పన్నులు వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారని, అడ్డగోలు పాలనతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అరాచక పాలనకు ప్రజలంతా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మహిళా నాయకులు లబ్బా దుర్గ, రమణమ్మ, రమ, వరలక్ష్మి, డివిజన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరరావుకు సమస్యలు వివరిస్తున్న మహిళ

## 6 నుంచి సంక్రాంతి ముగ్గుల పోటీలు

చుట్టుగుంట, న్యూస్‌టుడే : కేశినేని ఫౌండేషన్ అధినేత కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ నుంచి 12 వరకు మధ్య నియోజకవర్గం వ్యాప్తంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం మొగల్రాజపురంలోని నివాసం వద్ద దీనికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన సంక్రాంతి సంబరాలను తెదేపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పెద్ద పండగ సంక్రాంతి రోజున కూడా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. గత తెదేపా ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్రాంతి కానుకలు అందించామని గుర్తు చేశారు. ఇటీవల క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు వివరించారు. సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వయసుల మహిళలు పోటీలో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ముగ్గుల పోటీల కన్వీనర్ దీవి ఉమామహేశ్వరరావు, ఘంటా కృష్ణమోహన్, గరిమెళ్ల చిన్న, దాసరి ఉదయశ్రీ, మురళీకృష్ణంరాజు, లబ్బా దుర్గ, మాచర్ల గోపీనాథ్ పాల్గొన్నారు.

## ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : మాచవరంలోని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకుడు దాసరి యుగంధర్‌ను మంగళవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి. శైలజ, పలువురు అధ్యాపకులు అభినందించారు. దిల్లీలోని డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్‌లో ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ పోటీలకు యుగంధర్ అర్హత సాధించారని శైలజ తెలిపారు. ఇటీవల శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల స్విమ్మింగ్ పోటీల్లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించారని వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో పలువురు అధ్యాపకులు ఆయన్ని అభినందించారు.



యుగంధర్‌ను అభినందిస్తున్న శైలజ తదితరులు

## అంజన్న దేవాలయంలో భక్తుల రద్దీ

మాచవరం, న్యూస్‌టుడే : మాచవరంలో వేంచేసిన స్వయంభు శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో ధనుర్మాసం మంగళవారం భక్తులతో రద్దీ ఎక్కువగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన సింధూరార్చన, తమలపాకు పూజలు విశేషంగా నిర్వహించారు. గోదా రంగనాథులను విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### 5న హుండీల లెక్కింపు

మాచవరం, న్యూస్‌టుడే : మాచవరంలోని స్వయంభు శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో హుండీలను ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఛైర్మన్, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో లెక్కిస్తామని ఈవో ఎన్.భవాని ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి, పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.


91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| మాయాబజార్ | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| మ్యూజికల్ నైట్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297, 6281228806


## ధర వరలు

వంకాయలు-34/40, టమాటా-14, బెండ-36, పచ్చిమిర్చి-26, కాకర-26, బీర-36, క్యాలీఫ్లవర్-10/12/15, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-40, బంగాళదుంప-24, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-38, దోస-28, సొర-16, పొట్ల-20, అరటికాయ-6/5, చామదుంప-46, అల్లం-66, మునగ-14/16, ఆకు కూరలు (కట్ట)-3, కంద-24, బీట్ రూట్-30, కీరదోస-34, బీన్స్-50, క్యాప్సికమ్-50, నిమ్మ (డజను)-18/20, కొత్తిమీర కట్ట-6/12, పుదీనా-4/5/10, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/16. (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

– ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121 రిటైల్ ధర 143, చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 74165 82559.

# రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

**నున్న(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైన ఘటన నున్నలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల ప్రాంతానికి చెందిన గున్నం మహాలక్ష్మయ్య, సుబ్బులు(45) దంపతులు. నున్న వికాస్ కళాశాల రోడ్డులో గల ఓ రైతు మామిడి తోటకు కాపలా పని చేస్తున్నారు. ఏడాదిగా తోటలోనే ఉంటూ నిత్యావసర సరకులు అవసరమైనప్పుడు నున్న సెంటరుకు వచ్చి కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. మంగళవారం సాయంత్రం సరకులు కొనుగోలు చేసుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై మహాలక్ష్మయ్య, సుబ్బులు మామిడి తోటకు వెళుతుండగా చినకంచి ఆర్చి పెద్ద వాగు ప్రాంతానికి చేరుకునే సరికి వికాస్ కళాశాల వైపు నుంచి టిప్పరు లారీ వస్తోంది. లారీ వేగంగా రావడంతో భయంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు అదుపుతప్పి కింద పడిపోయారు. లారీ టైరు సుబ్బులు తల భాగం మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే ఆమె ప్రాణాలు కోల్పోయింది. మహాలక్ష్మయ్యకు గాయాలయ్యాయి. నున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ ✆ 76508 91999.

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299.

EDUCATION

DISTANCE EDUCATION

Prabhas College, VJA: 'Andhra/ ANU' Centre: MBA, MCA, MA, M.Com, M.Sc, BA, B.Com, B.Sc, B/M.Lis, B.Ed (R) L.D.: 31-1-23. ✆ 0866-2532525/ 1306, 94418 02525.

REAL ESTATE

FLAT FOR SALE

1) అశోక్‌నగర్ బందరురోడ్డుకి అతి సమీపమున Floorకి 2 ఫ్లాట్స్ (3BHK) 2) నందిగామ LP ప్రక్కన NH-65 మీద గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్న 2 BHK ఫ్లాట్స్ & షాప్స్ అమ్మకమునకు కలవు. ✆ 76800 70510.

PLOT FOR SALE

కంకిపాడులో బస్టాండ్ దగ్గర బందర్‌రోడ్డు ఆనుకొని ఇళ్ళమధ్య 30అ॥ రోడ్డుతో 3సెంట్ల ప్లాట్లు కలవు. కంకిపాడు బందర్‌రోడ్ మరియు బైపాస్‌రోడ్ మధ్య భాగంలో రెండు రోడ్ల ముక్క St. మేరీస్ స్కూల్ ఎదురుగా గల 1ఎకరం 75సెంట్ల భూమి అమ్మకం ✆ 98484 60546.

COMMERCIAL SPACE FOR SALE

రాజధాని తుళ్లూరులో RTC కాంప్లెక్స్ దగ్గర 80 ఫీట్‌రోడ్ తులసి థియేటర్ ఎదురుగా 169 గజాలు సింగిల్ స్టోర్డ్ బిల్డింగ్ (E/F) కమర్షియల్ యూస్ అమ్మకమునకు కలదు. Cont: 9000511234, 9377311234.

JOBS

Wanted Teachers to teach Hindi, Computer for ICSE Classes with B.Ed. Contact Principal, Seventh Day Adventist High School. ✆ 98495 10969, 80960 67277.

Wanted Clerk cum Computer Operator, Work Supervisor/ Dispatch Clerk to Work at Tempalli near Veerapanenigudem. Interested Candidates may send their Resume to Email ID: dramesh62@gmail.com

విజయవాడలో గల మా కంపెనీ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: 10th to Degree. జీతం: 12,000/-. Age: 32 సం॥లోపు. ✆ 99856 78958.

ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు BSC నర్సింగ్ చదివి,GNM ట్యూటర్ గా చేయుటకు కావలెను @ విజయవాడ. Ph: 76598 22229.

ప్రముఖ ఇంటర్‌నేషనల్ కొరియర్ సంస్థ "Courier Max Logistics" గాంధీనగర్, విజయవాడలో పికప్ & ప్యాకింగ్‌లో అనుభవం గల బాయ్స్ కావలెను. Email: vja@couriermax.in ✆ 99592 95777/ 90002 58561.

విజయవాడలోని ప్రముఖ కామర్స్ విద్యా సంస్థ శ్రీ మేధా కాలేజీ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన Sanskrit & Civics టీచింగ్ ఫ్యాకల్టీ, రిసెప్షనిస్ట్, క్లాస్ ఇన్చార్జ్స్, అకడమిక్ కౌన్సెలర్స్, మార్కెటింగ్ PRO's మరియు టెలీకాలర్స్ కావలెను. 90320 04637.

నేషనలైజ్డ్ బ్యాంక్ అనుబంధ ఆఫీస్‌కు ఇంటర్+ చదివి 20 సం॥లు పైన M/F అర్జంటుగా. జీ: 20,000/- + ఇన్సెంటివ్. 10 AM - 5 PM ✆ 83411 85105, 77025 49105.

EDU 9 ఆఫీస్‌లో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ కావలెను. Qul: Degree/ Diploma/ B.Tech/ MBA for Exp. Cont: ✆ 63664 63456.

రాఘవ ఆటో ఫైనాన్షియర్ నందు పనిచేయుటకు నందిగామ, విజయవాడలలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 2వీలర్ ఉండాలి. Age: 22-32Y. ✆ 91540 36457, 73375 58721.

SV Express ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థలో పనిచేయుటకు కొరియర్ వర్క్‌లో అనుభవం ఉన్న Boys కావలెను. Qul: ఇంటర్/ డిగ్రీ, జీతం: 12000/- to 15000/-. ✆ 99596 46139.

సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ప్రముఖ సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ సంస్థ విజయవాడ బ్రాంచికి. జీతము:- 15,000 to 20,000/- + ఇతర అలవెన్స్‌లు కలవు. ✆ 9966682926 / 7207860573.

క్లాసు ఇంఛార్జ్‌లు, హాస్టల్ ఇంఛార్జ్‌లు, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం: 10,000/- నుండి 14,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యార్హతలు: Inter above. వయస్సు: 23+ పనిచేయు స్థలం: మాస్టర్ మైండ్స్, గుంటూరు. Ph: 89784 80429.

ప్రైవేటు బ్యాంకు సెక్టార్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అనుభవం గలవారికి ప్రిఫరెన్స్ ఇవ్వబడును. జీతం: 10,000/-. Phone: 98850 67016 విజయవాడ.

WANTED
Kusalava Hyundai Requires Sr.Accountant - 1 No's (M/F) (With GST, IT Knowledge, Min 5Yrs Exp.
9954654745
9885462610

విజయవాడలో కాల్ సెంటర్‌లో పనిచేయుటకు స్త్రీలు కావలెను. అర్హత: ఇంటర్ నుండి ఏదైనా డిగ్రీ. జీతం: 12వేలు (8గంటలు పని). ✆ 73824 24268.

పార్ట్‌టైమ్ మరియు ఫుల్‌టైమ్ జాబ్ చేయడం ద్వారా రోజుకు 2000 Rs నుండి 5000 Rs వరకు సంపాదించవచ్చు. ఎవరైనా చేరవచ్చు. No Hidden Charges. Any One can Join. ✆ 93980 90623.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు కావలెను. విజయవాడ MG రోడ్ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము: 13,000/- & ఇతర సదుపాయాలు కలవు. ✆ 8309564664, 8179552684.

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# విజయవాడ పశ్చిమ

✦ ఉదయం 10 గంటలకు సత్యనారాయణపురంలో రోడ్ల ప్రారంభం
✦ ఉదయం 10.30 గంటలకు జక్కంపూడి కాలనీ పాఠశాల మైదానంలో కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ.
✦ సాయంత్రం 4 గంటలకు రైల్వే ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే లబ్ధిదారులకు సెకండరీ ఫ్యామిలీ పింఛను పంపిణీ.
- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట

## జగన్మాతకు బంగారు కాసులపేరు బహూకరణ

**భవానీపురం, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన భక్తుడు మేకల దేవేందర్‌రెడ్డి 90 గ్రాముల బరువైన బంగారపు కాసులపేరును మంగళవారం బహూకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబను కలిసి అందజేశారు. ఆలయ అధికారులు దేవేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు.


కార్యనిర్వాహణాధికారి భ్రమరాంబకు ఆభరణం అందిస్తున్న దాత దేవేందర్‌రెడ్డి, కుటుంబసభ్యులు

## దుర్గగుడికి రూ. 1,01,116 విరాళం

**భవానీపురం, న్యూస్‌టుడే :** ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు విజయవాడ ఆటోనగర్‌కు చెందిన జెట్టి నవీన్ రూ.1,01,116 చెక్కును విరాళంగా మంగళవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం చేయించి, పండితులతో వేదాశీర్వచనం అందించారు.


అధికారులకు చెక్కు ఇస్తున్న నవీన్

## దుర్గమ్మ ఆదాయానికి గండి

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**

నగరంలో చిన్న దేవాలయాలు ఆదాయ వనరులను మెరుగుపరచుకుంటుంటే రాష్ట్రంలో రెండో పెద్ద దేవాలయమైన దుర్గగుడి అధికారుల అలసత్వంతో ఆదాయానికి గండి పడుతోంది. హాకర్లు దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చెందిన దుర్గాఘాట్, కనకదుర్గానగర్ పరిసరాల్లో 150 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. గతంలో వారి నుంచి దేవస్థానానికి ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం వచ్చేది. ఇవికాక ఆలయ పరిధిలోని 14 దుకాణాల ద్వారా రూ.6 కోట్లు అద్దెల రూపంలో వచ్చేది. నాలుగేళ్లుగా హాకర్ల ద్వారా వచ్చే రూ.60 లక్షల ఆదాయాన్ని దేవస్థానం కోల్పోయింది. మల్లికార్జున మహామండపంలో అద్దెలు చెల్లించి వ్యాపారాలు చేసే వారు కొవిడ్ కారణంగా సక్రమంగా అద్దెలు చెల్లించలేదు.


దుర్గాఘాట్ వద్ద ఆక్రమణలతో రోడ్డు మధ్యలో నిలిపిన దేవస్థానం బస్సు

✦ కనకదుర్గానగర్, దుర్గాఘాట్, దుర్గగుడి పరిసరాలను ఆక్రమించి వ్యాపారులు చేసే వారి నుంచి దేవస్థానానికి ఆదాయం రాకపోగా ఇక్కడ చేరిన అసాంఘిక శక్తుల కారణంగా దుర్గమ్మ దర్శనానికి

### ఆక్రమణదారులతో ట్రాఫిక్‌కు అంతరాయం

వచ్చిన భక్తుల జేబులు ఖాళీ అవుతున్నాయి.
✦ దుర్గాఘాట్‌లో జల్లు స్నానాలు చేసిన భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ముఖ్యంగా బ్లేడ్ బ్యాచ్ సభ్యులు కొందరు హాకర్ల ముసుగులో వ్యాపారం చేస్తూ వివాదాలకు కారణమవుతున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషను పరిధిలో దుర్గాఘాట్‌లో వీధి వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదాలపై కేసులు నమోదయ్యాయి.


రిటైనింగ్ గోడ వద్ద రోడ్డును ఆక్రమించిన దుకాణదారులు

### చిన్న దేవాలయాలు, ప్రార్థనాలయాల్లో..

దుర్గగుడి సమీపంలో ఉండే పాత శివాలయం, విజయేశ్వరాలయంతోపాటు దర్గాలకు ముందు ఉన్న ప్రాంతాల్లో దుకాణ సముదాయాల ద్వారా వాటికి ఆదాయం సమకూరుతోంది. ప్రతి దుకాణదారుడు, హాకరు వ్యాపారం చేసుకున్నందుకు వాటిని అద్దె చెల్లిస్తున్నారు. విజయేశ్వరాలయ పునర్నిర్మాణం చేస్తున్నపుడు దుకాణ సముదాయాలను అభివృద్ధి చేయడంతో వాటికి నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అద్దెలను దుకాణదారులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. దుర్గగుడి అధికారులు భక్తుల భద్రత దేవస్థానం ఆదాయ వనరుల గురించి పట్టించుకోక పోవడంతో వీధి వ్యాపారులదే ఇష్టారాజ్యంగా మారింది.

### భక్తుల నరకయాతన

దుర్గగుడి పరిసరాల్లో ఆక్రమణదారుల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దేవస్థానం, కార్పొరేషను, ట్రాఫిక్ పోలీసు అధికారులు వీటిపై దృష్టి కేంద్రీకరించకపోవడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. కనకదుర్గానగర్ నుంచి దుర్గగుడి టోల్ గేటు వరకు వీరి కారణంగా నిత్యం దేవస్థానంలో అద్దె చెల్లించిన దుకాణదారులకు ఆక్రమణదారులకు వివాదాలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు ఆక్రమణదారులను నియంత్రించి, దేవస్థానం ఆదాయానికి గండి పడకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

## 'వైకాపా పాలనలో ప్రజల ఇబ్బందులు'


మహిళలకు ఇస్త్రీ పెట్టెలు అందిస్తున్న కేశినేని శివనాథ్, చిత్రంలో బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, నాయకులు

**భవానీపురం, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెదేపా నాయకుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. కేశినేని ఫౌండేషన్ అధినేత కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం మల్లికార్జునపేటలోని బుద్దా వెంకన్న కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ తెదేపా నాయకులు, కార్యకర్తలు చేసే త్యాగాల ముందు తాను చేసే కార్యక్రమాలు చాలా చిన్నవని పేర్కొన్నారు. తెదేపా అధినేత చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తెదేపా బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పశ్చిమలో తెదేపా కంచుకోట అని, పార్టీ పలుమార్లు పోటీ చేయకపోయినా బలంగా ఉందని వెల్లడించారు. మాజీ శాసనమండలి సభ్యుడు బుద్దా వెంకన్న మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబును వస్తున్న ప్రజాబలం చూసి తట్టుకోలేక రహదారులపై సభలు, ప్రదర్శనలు నిర్వహించకూడదంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. లోకేశ్ పాదయాత్రను అడ్డుకోవటానికి ఉత్తర్వులు ఇచ్చారని వెల్లడించారు. వైకాపా నాయకులు మనుషులను పంపి తొక్కిసలాట సృష్టించారని తెలిపారు. మాజీ మంత్రి కొడాలి నాని ప్రజల బియ్యాన్ని దోచుకుని వందల కోట్లు సంపాదించారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పశ్చిమ శాసనసభ్యుడు వెలంపల్లి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, రూ.25కోట్ల మైనార్టీ ఆస్తిని దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తెదేపా అధికార ప్రతినిధి నాగుల్‌మీరా మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పశ్చిమలో తాను, బుద్దా వెంకన్నలే పార్టీని అంటిపెట్టుకుని ఉన్నట్లు వెల్లడించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వం అండ

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించి జగనన్న అండగా నిలుస్తున్నారని కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి అన్నారు. 48వ డివిజన్‌లో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆంజనేయ వాగులోని పార్టీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైకాపా నాయకులు పెదబాబు, పిల్లా సూరిబాబు, కృష్ణకిశోర్, కోళ్ల రజని, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మంచి నడవడిక అవసరం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** భావిభారత ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థి దశలోనే మంచి నడవడిక, నడత ఉండాలని సీతానగరం రామకృష్ణ మఠం కార్యదర్శి స్వామి హృదయానందజీ మహరాజ్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జరుగుతున్న యువజన వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పెద్దలు, గురువుల పట్ల బాధ్యతతో మెలగాలని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి. నాగరాణి మాట్లాడుతూ వివేకానంద బోధనలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి కె. విజయ భాస్కర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.ఎ.వి.రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఎమ్., పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, పలు ట్రేడుల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు వక్తృత్వ, వ్యాసరచన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు.


యువజన వారోత్సవాలను ప్రారంభిస్తున్న నాగరాణి, స్వామి హృదయానంద మహరాజ్ తదితరులు

## మహిళా విద్యకు సావిత్రిబాయి కృషి

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** మహిళలు, దళిత, గిరిజనుల చదువుకోసం, అభ్యున్నతి కోసం సావిత్రి బాయి పులే ఎంతో కృషి చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. సావిత్రిబాయి జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కృష్ణలంక జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రూపకుమారి, సంఘం నగర నాయకులు రాజ్‌కుమార్, సభ్యులు రిషిత, అశ్వని, తనుశ్రీ, నాగలక్ష్మి, గాయత్రి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి దయనీయం'


ఇదేం ఖర్మ కార్యక్రమంలో తెదేపా నాయకులు కిరణ్‌కుమార్, బేగ్, సరిత, తదితరులు

**చిట్టినగర్, న్యూస్‌టుడే :** జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో కుదేలైందని, ఈ రాష్ట్రానికి ఈ ఖర్మ ఎప్పుడు పోతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెదేపా నాయకులు సుకాశి కిరణ్‌కుమార్, ఎంఎస్ బేగ్ అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటరు నుంచి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి నిర్మాణ రంగం పూర్తిగా నాశనమైందన్నారు. కార్మికుల కుటుంబాలు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పింఛన్లు తొలగిస్తూ, సంక్షేమ పథకాలు నిపేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు మహిళ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షురాలు సుకాశి సరిత, నాయకులు యాది నాగేశ్వరరావు, యర్రారెడ్డి, ధనేకుల వెంకట సుబ్బారావు, కుప్పల గంగాధర్, సారేపల్లి దుర్గారావు, రవికుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 6న చండీ హోమం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** బెంజిసర్కిల్ సమీపంలోని శ్రీ విద్యా దత్త సాయి పీఠంలో ఈనెల 6న పుష్య పౌర్ణమి పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి సహిత చండీహోమం నిర్వహిస్తున్నట్లు పండితులు రామకృష్ణ, మురళీకృష్ణ తెలిపారు. ఉదయం పూజల అనంతరం మధ్యాహ్నం పూర్ణాహుతి ఉంటుందని, భక్తులు తమ గోత్రనామాలతో పూజలు చేయించుకోవచ్చని చెప్పారు.

## గణపతిరావు రోడ్డుకు మోక్షం



పాతబస్తీలో ప్రధాన రహదారి గణపతిరావు మార్గానికి మోక్షం కలిగింది. నెహ్రూబొమ్మ కూడలిలోని గాంధీ బొమ్మ నుంచి పంజా సెంటర్ కృష్ణవేణి హోల్ సెల్ క్లాత్ మార్కెట్ వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. మొత్తం రూ.1.50 కోట్ల వ్యయంతో పనులు చేయనున్నారు. చిట్టినగర్ నుంచి నెహ్రూబొమ్మ కూడలి వరకు రెండో దశ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. రానున్న ఐదు నెలల్లో గణపతిరావు రోడ్డు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

## మురుగు పొంగుతున్నా పట్టించుకోరే?



పైజర్‌పేట, కొండ్రువారివీధి కొండ ప్రాంతంలో మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లి మురుగు నీరంతా మెట్లపై ప్రవహిస్తోంది. పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. కొంతమంది జారి పడిపోతున్నారు. ముక్కుపుటాలు అదిరేలా తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడిక తీసి మరమ్మతులు చేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, చిట్టినగర్

## అపరిశుభ్రంగా పరిసరాలు

**భవానీపురం, న్యూస్‌టుడే**

విజయవాడ నగరానికి సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. నివాసాల్లోని మురుగు నీరు రహదారిపైకి చేరుతోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. గొల్లపూడి, జక్కంపూడి గ్రామాల పరిధిలో జీ+3గా గృహాల నిర్మాణం చేపట్టారు. విజయవాడ నగర పరిధిలోని అనేక మందికి ఆ కాలనీలో గృహాలను కేటాయించారు. దాదాపుగా 20 వేల మందికి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. అయితే.. వారికి సరైన సౌకర్యాలు సమకూరని పరిస్థితి ఉంది. పారిశుద్ధ్య బాధ్యతలను విజయవాడ నగరపాలక సంస్థ వారే చేపడుతున్నారు. 40 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పారిశుద్ధ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి సక్రమంగా జీతాలు చెల్లించని పరిస్థితి ఉంది. ఫలితంగా వారు పనులు సక్రమంగా చేపట్టడం లేదు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయి ఉంటోంది. నివాసాల్లోని మురుగునీరంతా గృహాల మధ్యకు, రహదారి పైకి చేరుతోంది. కాలనీలోని మైదానంలోకి కూడా మురుగునీరు చేరుతోంది. దోమలు పెరిగి కాలనీ వాసులు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో రహదారిపై మురుగు


నీటితో నిండిన మైదానం

## వివాహిత బలవన్మరణం

**భవానీపురం, న్యూస్‌టుడే:** మనస్తాపంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. భవానీపురం పోలీసుల వివరాల ప్రకారం.. భవానీపురం ఊర్మిళానగర్‌లో శ్రీలక్ష్మి(24) భర్త రవీంద్రతో కలిసి నివాసం ఉంటోంది. వారికి 2020 సెప్టెంబరులో వివాహమైంది. శ్రీలక్ష్మి టైలరింగ్ చేస్తుండగా, రవీంద్ర డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కొన్నాళ్లుగా రవీంద్ర పనికి సరిగా వెళ్లటం లేదు. ద్విచక్ర వాహనం కిస్తీ, ఇంటి అద్దె చెల్లించే విషయంలో దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నెల 2వ తేదీ రాత్రి భర్త హైదరాబాద్ వెళ్తున్నాడు. ఆ సమయంలో రవీంద్రకు భార్య శ్రీలక్ష్మి ఫోన్ చేసి ఉరి వేసుకుంటున్నట్లు చెప్పింది. ఆపై అతడు ఆమెకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఇంటి సమీపంలో ఉండే వారికి ఫోన్ చేసి చెప్పగా వారు వెళ్లి చూడగా ఆమె ఉరి వేసుకుని కనిపించింది. ఆమెను కిందకు దింపి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి ఎం.నాగేష్ ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ మృతి కేసులో నిందితుడి అరెస్టు

**చిట్టినగర్, న్యూస్‌టుడే :** మహిళ బలవన్మరణానికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. చిట్టినగర్, శ్రీరాములువీధికి చెందిన జెట్టా భాస్కర్‌బాబు అలియాస్ భాస్కర్(34) టైలర్‌పేట, పెనమాక దేవదాసు వీధికి చెందిన మానేపల్లి చైతన్య(35) వెంటపడి వేధిస్తుండేవాడు. ఈ నెల 1వ తేదీన రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లి కేకలు వేస్తూ నానా హంగామా చేశాడు. వేధింపులు భరించలేని చైతన్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుమార్తె చావుకు భాస్కరే కారణమని తండ్రి ఫిర్యాదులో పేర్కొనగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

## పలువురికి అపరాధ రుసుం విధింపు

**విజయవాడనగరపాలక సంస్థ,న్యూస్‌టుడే:** నగరంలోని పలు ప్రాంతాల్లో రహదార్ల వెంట పందులు, ఆవులు, ఇతర జీవాలను యథేచ్ఛగా వదిలిపెడుతున్న వారు, లైసెన్సులు లేకుండా వ్యాపారాల నిర్వహణ, డ్రెయిన్లలో వ్యర్థాలు వేస్తున్న వారిపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు కేసులు నమోదు చేశారు. సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మొబైల్ న్యాయస్థానం ముందు వారిని హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి రామ్మోహనరావు.. వారికి రూ.17,450 అపరాధ రుసుం విధించారు. అనంతరం న్యాయమూర్తి నగరవాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, అధికారులతో కలిసి కేకు కోశారు. కార్యక్రమంలో అధికారులు కె.టి.సుధాకర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి రామ్మోహనరావు

## 5 నుంచి సిడ్బీ స్వావలంబన్ మేళా


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రాధిక, అపర్ణ, విజయలక్ష్మి, మోహిని శ్రావణి, సత్యవతి

**విజయవాడ సిటీ, న్యూస్‌టుడే:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కోవె(కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌పెన్యూర్స్ ఆఫ్ ఇండియా) ఏపీ ఛాప్టర్, సిడ్బీ(స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నగరంలో బెంజిసర్కిల్ సమీపంలోని వేదిక కల్యాణ మండపంలో 'సిడ్బీ స్వావలంబన్ మేళా' నిర్వహించనున్నట్లు కోవె ఏపీ ఛాప్టర్ అధ్యక్షురాలు రాధిక, జాతీయ సంయుక్త కార్యదర్శి అపర్ణ తెలిపారు. నగరంలోని ఛాప్టర్ కార్యాలయంలో మేళాకు సంబంధించిన గోడప్రతులను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయంగా వారు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. హస్తకళాకారులు, చేనేత ఉత్పత్తులు, చిరు ధాన్యాలు, వివిధ రకాలైన వంటకాలు, గ్రామీణ, గిరిజన ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. 5న మహిళల కోసం 'బిజినెస్ ఐడియా కాంటెస్ట్', 6న వంటల పోటీలు, తంబోలా ప్రత్యేక కార్యక్రమం, డ్యాన్స్ పోటీలు, 7వ తేదీ ఉదయం చిన్నారుల ఫ్యాన్సీ డ్రస్ షో, మధ్యాహ్నం తంబోలా కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మూడు రోజుల పాటు కళాశాల విద్యార్థినుల కోసం బిజినెస్ ఐడియా కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కోవె ఏపీ ఛాప్టర్ కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, కోశాధికారి శ్రావణి, సత్యవతి పాల్గొన్నారు.

## 'చంద్రబాబుకు పెరుగుతున్న ప్రజాదరణతో వైకాపాలో వణుకు'

**పటమట, న్యూస్‌టుడే:** తెదేపా అధినేత చంద్రబాబుకు సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి వైకాపా ప్రభుత్వానికి వణుకు పట్టుకుందని, అందుకే తెదేపా కార్యక్రమాలను అడ్డుకోవడానికి చీకటి జీవోలు జారీచేసిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మండిపడ్డారు. మంగళవారం 13వ డివిజన్‌లోని జెడి నగర్ ప్రాంతంలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు షోలు, రోడ్లపై సభలు నిర్వహించకూడదని ప్రభుత్వం ఇచ్చిన జీవోలు చూసిన తర్వాత సీఎం జగన్ కుట్రలు బయటపడుతున్నాయన్నారు. ఈ నెల 27 నుంచి యువగళం పేరుతో లోకేష్ చేపట్టే పాదయాత్రను అడ్డుకోవాలని వైకాపా నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే గుంటూరులో తొక్కిసలాట జరిగిందన్నారు. అనంతరం స్వయం ఉపాధి నిమిత్తం రాముకు రిక్షా, ప్రశాంతికి తోపుడు బండి, ఎంబీఏ విద్యార్థికి కళాశాల ఫీజు నిమిత్తం రూ.20 వేలు, ఆటో డ్రైవర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, చిట్టా నిర్మల, శొంఠి సాయి లక్ష్మి, వేములపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** విజయవాడ హోంగార్డు విభాగంలో పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన మధురై సౌందరరాజు కుటుంబ సభ్యులకు.. పోలీస్ కమిషనర్ కాంతిరాణ టాటా రూ.5లక్షల ఆర్థిక సాయం అందించారు. హోంగార్డులు స్వచ్ఛందంగా తమ వేతనం నుంచి కొంత మొత్తాన్ని ఉద్యోగ విరమణ లేదా చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు అందిస్తున్నారు. గత ఏడాది అక్టోబరు 26న సౌందరరాజు మృతి చెందగా.. ఆయన సతీమణి మహాలక్ష్మికి రూ.5లక్షల చెక్కును సీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డ్సు ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80080 01732




(c) eenadu

విజయవాడలో ఏలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు కాలేయ సంబంధిత సమస్యతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యుడి సలహా మేరకు పరీక్ష చేయించుకోవడానికి సీ బ్లాక్‌లోని విభాగానికి వెళ్లగా, తర్వాత రోజు రమ్మని సిబ్బంది చెప్పారు. రెండో రోజు వెళితే 'ఇక్కడ ముడిపదార్థాలు లేవు. కొన్ని పరీక్షలు చేయడం లేదు. ప్రైవేటు ల్యాబ్‌లో చేయించుకోండి' అని చెప్పారు. దీంతో చేసేది లేక ఆ యువకుడు బయట పరీక్షలు చేయించుకోవడానికి వెళ్లాడు.

రామవరప్పాడుకు చెందిన ఓ మహిళ తలలో గడ్డ ఉంది. ఆస్పత్రికొచ్చి వైద్యుడి చీటీతో ఎంఆర్ఐ స్కాన్ విభాగానికి వెళ్తే నాలుగు రోజులు తరవాత రావాలంటూ సమయం, తేదీలను చీటీపై రాసిచ్చారు. ఆ రోజు వెళితే స్కాన్ తీశారు. రిపోర్టు కోసం మరో రెండు రోజులు ఆగాల్సి వచ్చింది. తర్వాత వైద్యుడిని కలిసి రిపోర్టు చూపిస్తే ఇది సరిపోదని, నెగిటివ్ తీసుకుని రావాలని సూచించారు. దీని కోసం సిబ్బందిని అడిగితే తర్వాత రమ్మన్నారు. విసుగు చెందిన ఆ మహిళ వెళ్లిపోయింది.

# పరీక్షల కోసం పడిగాపులు



వారం రోజులు ఆగి రావాలని సిబ్బంది రాసిచ్చిన చీటీని చూపుతున్న వృద్ధురాలు

| ప్రస్తుతం నిలిపివేసిన పరీక్షలు |
|---|
| రాండమ్ బ్లడ్ |
| పోస్ట్ ప్రాండియల్ |
| గ్లూకోజ్ టెస్ట్ |
| కాలేయ పనితీరు |
| మూత్రపిండం పనితీరు |
| సీరం ఎలక్ట్రోలైట్స్ |
| థైరాయిడ్ |
| ప్రొటీన్ పరీక్ష |
| లిపిడ్ ప్రొఫైల్ |
| అమైలేస్ |
| బ్లడ్ యూరియా |

విజయవాడ వైద్యం, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ పరీక్షలు చేయించుకోవడానికి రోగులకు ప్రయాస తప్పడం లేదు. వీటిని నిర్వహించడానికి అవసరమైన ముడిపదార్థాల కొరత వేధిస్తోంది. దీంతో పాటు సరిపడా సిబ్బంది లేక, అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పలు పరీక్షలకు ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో రోగులు వస్తున్నా.. ఈ రోజు ఖాళీ లేదు. రేపు రా... ఎల్లుండి రా..? అంటూ సిబ్బంది కాలయాపన చేస్తున్నారు.

### ఎంఆర్ఐ, ఎక్స్‌రేలకు తప్పని నిరీక్షణ

జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రేలు తీయించుకునే రోగులకూ నిరీక్షణ తప్పడం లేదు. పరీక్షలు చేయించుకోవడానికే రోజుల పడుతుంది. మళ్లీ ఆ రిపోర్టు రావడానికి కనీసం రెండు రోజులు అవుతుంది. వాటిని సంబంధిత విభాగాల సిబ్బంది ఆయా వైద్యులకు వాట్సాప్‌లో పెడుతున్నా చెబుతున్నా.. వైద్యులు మాత్రం రాలేదంటున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. తీరా రిపోర్టు తీసుకుని గంటల తరబడి క్యూలో నిలుచుని వైద్యుడిని కలిస్తే నెగిటివ్‌తో రావాలంటున్నారని, సిబ్బందిని అడిగితే ఇవ్వడం లేదని పలువురు పేర్కొన్నారు.



విభాగాల వద్ద రోగులు

### అదనపు పరికరాలు అవసరం

రోగుల వెతలు తీరాలంటే అదనంగా ఎమ్ఆర్ఐ స్కాన్ వైద్య పరికరం, సీటీ స్కాన్ కూడా అదనంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ముడిపదార్థాల సరఫరాను మెరుగుపరిచి, నిలిపివేసిన వివిధ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలను పునరుద్ధరించాలి.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. బీబీఏ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్, విజయవాడలో నూతన భవన నిర్మాణ పెండింగ్ పనులు, న్యాయవాదుల సమస్యల గురించి న్యాయమూర్తికి వివరించారు. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారని, త్వరలో పెండింగ్ నిర్మాణాలు పూర్తవుతాయని విష్ణువర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీబీఏ ప్రధాన కార్యదర్శి గండం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పరాగని రవీంద్ర, కండెల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, విజయవాడ న్యాయవిభాగం

## చిన్నారుల సృజన వెలికితీతకు బాలోత్సవం

ఈ నెల 29, 30, 31న పోటీల నిర్వహణ



ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న రామరాజు, కొండలరావు, వెంకట్రావు, ప్రిన్సిపల్ నారాయణరావు, లక్ష్మీనారాయణ తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువే కాకుండా ఆట, పాటలు, భావవ్యక్తీకరణ వంటి అంశాల్లో కూడా పట్టు సాధించాల్సిన అవసరం ఉందని అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీసేందుకు బాలోత్సవం వేదికగా మారిందని చెప్పారు. చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో అమరావతి బాలోత్సవం 5వ పిల్లల పండగ ప్రచార ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాటిక, కోలాట నృత్యాలు, వ్యాసరచన, డిబేట్, క్విజ్, మ్యాప్, స్పెల్‌బీ, చిత్రలేఖనం, కార్టూన్, మట్టితో బొమ్మలు వంటి 57 రకాల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. సుమారు 12 వేల మంది పిల్లలు పాల్గొంటారని అంచనా వేసినట్లు తెలిపారు. 100 మంది న్యాయ నిర్ణేతలు, 50 మంది నిర్వాహకులు, 150 మంది వాలంటీర్లు, 50 మంది బాలోత్సవం కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది 100 మంది భాగస్వాములవుతున్నారని తెలిపారు. అనంతరం ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలోత్సవ కార్యదర్శులు మురళీకృష్ణ, జ్యోతి, బాయన వెంకట్రావు, కమిటీ సభ్యులు సాంబశివరావు, వల్లభరావు, యు.వి.రామరాజు, కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనిగుంట్ల శ్రీనివాస్, ప్రిన్సిపల్ వీ నారాయణరావు పాల్గొన్నారు.

## 'ఆ భూములు మా పూర్వీకుల నుంచి వచ్చినవే'!

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరులో సర్వే నెంబరు 300లో భూములు తమకు పూర్వీకుల ద్వారా సంక్రమించినవేనని భూయజమానులో ఒకరు గోగినేని రామకృష్ణ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. తాము ఎక్కడా ఆక్రమించలేదని, రికార్డులు సృష్టించలేదన్నారు. 1932 నుంచి బ్రిటిష్ ఇనాం కమిషనర్ వద్ద నుంచి అమ్మేందుకు హక్కులు పట్టా పొందిన వారి వద్ద తమ పూర్వీకులు కొనుగోలు చేశారని వివరణ ఇచ్చారు. అన్ని రెవెన్యూ దస్త్రాల్లో తమకు హక్కులు కలిగి ఉన్నామని, ఒక్క ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో మాత్రమే సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం భూములుగా ఉన్నాయని తెలిపారు. అనుభవదారులు, హక్కుదారులుగా ఉన్న 14 మంది నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పోరాడుతున్నామని, ఏ ప్రజాప్రతినిధికి విక్రయించేందుకు అనధికార ఒప్పందం కుదరలేదన్నారు. తాము రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాతే 22 ఏ కింద చేర్చారని తెలిపారు. ఎందుకు చేర్చారో తెలియదని వివరణ ఇచ్చారు. హక్కుదారులుగా ఉన్న 14 మంది సన్న చిన్న కారు రైతులు తమ హక్కు పత్రాలను జిల్లా కలెక్టర్‌కు, దేవదాయశాఖ కమిషనర్‌కు అందజేశామని న్యాయస్థానంలోనూ ఇచ్చామని వెల్లడించారు.

## ఖోఖో విజేత ఏఎన్నార్ కళాశాల జట్టు



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో ఉత్తమ క్రమశిక్షణ అలవడుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అనామిక మనీష్ పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర కళాశాలల ఖోఖో పోటీలు ఉత్కంఠభరితంగా మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారు మంచి ఆత్మ విశ్వాసం కలిగి ఉంటారన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీల్లో అక్కినేని నాగేశ్వరరావు, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ, విజయవాడ ఆంధ్రా లయోలా , పీబీ సిద్ధార్థ కళాశాలలు వరుసగా నాలుగు స్థానాలు కైవసం చేసుకున్నాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్.శివనాథ్, ఆంధ్రప్రదేశ్ ఖోఖో సాంకేతిక కమిటీ కన్వీనర్ మడకా ప్రసాద్, కృష్ణా విశ్వవిద్యాలయ ఖోఖో ఎంపిక కమిటీ సభ్యుడు ఏ.చినబాబు, వివిధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు వి.గోపి, డాక్టర్ యుగంధర్, పి.చంద్రబాబు,వాసిరెడ్డి నాగేశ్వరరావు, మేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూకే పురుషుల బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్ఆర్‌జీఈసీలో మంగళవారం జేఎన్‌టీయూకే పురుషుల బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించగా, వివిధ కళాశాలల నుంచి 35 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారి నుంచి విశ్వవిద్యాలయ జట్టును ఎంపిక చేశారు. జె.బాలాజీ(ప్రకాశం), జి.అఖిల్, ఎం.శశాంక్, టి.కిశోర్(విశాఖ), ఎ.సాయిరాం(విజయవాడ), కె.రాజేశ్, ఎం.జావీదు(గుడ్లవల్లేరు), ఎ.చైతన్య(విజయనగరం), ఎస్‌కే.షమీం(గుంటూరు), టి.సంతోష్(ఒంగోలు), స్టాండ్‌బైగా ఎ.హేమంత్, షేక్ ఖాజామొహియుద్దీన్(మైలవరం), ఎ.లోకేశ్(టెక్కలి) ఎంపికయ్యారు. వారు ఈ నెల 13 నుంచి 17 వరకు మంగుళూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించే అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

### బాస్కెట్‌బాల్ పోటీలకు వైఎస్సార్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలో ఈ నెల 4 నుంచి అయిదు రోజుల పాటు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి మంగళవారం వెల్లడించారు. క్రీడాకారిణులకు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం క్రీడా దుస్తులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి, యోగా సహాయ ఆచార్యుడు ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ జట్టుకు మేనేజరుగా జె.సిల్వీబాబు (పీడీ, నారాయణ వైద్య కళాశాల, నెల్లూరు), కోచ్‌గా టి.గురునాథం (పీడీ, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చిన్నకాకాని) నియమితులయ్యారు.

జట్టు సభ్యులు: డి.శ్రీమౌనిక, ఎం.దివ్యశ్రీ, కె.ప్రణవి చంద్ర (సెయింట్ జోసెఫ్ దంత కళాశాల, ఏలూరు), ఎన్.నాగజ్యోత్స్న దేవి, బి.జ్యోతిక, ఎ.తేజస్వి చౌదరి, ఎస్.హేమ మేఘన (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, చిన్నఅవుటపల్లి), జి.బాంధవ్య (ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చిన్నకాకాని), ఆర్.దనుష (నారాయణ వైద్య కళాశాల, నెల్లూరు), కె.వరాహ్నకురి, జి.కార్తిక (జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమండ్రి), ఎస్.తేజస్వి (మహారాజ వైద్య కళాశాల, విజయనగరం).

## బిషప్ జాన్ విక్టర్ కన్నుమూత



అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఇవాంజెలికల్ చర్చ్ ఆఫ్ ఇండియా నార్త్ ఆంధ్రా-తెలంగాణ బిషప్ రెవ.డాక్టర్ జాన్ విక్టర్(74) మంగళవారం ఉదయం ఎల్‌బీఎస్ కాలనీలోని స్వగృహంలో కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతూ ఆయన మృతి చెందినట్లు సన్నిహితులు తెలిపారు. 1949, మార్చి 6వ తేదీన జన్మించిన జాన్ విక్టర్.. చిన్న నాటి నుంచే క్రీస్తు మార్గంలో నడుస్తున్నారు. దైవజనుడిగా సుమారు 50 సంవత్సరాలుగా ప్రభువు సేవలో తరించారు. 750 సంఘాలను స్వయంగా స్థాపించారు. దాదాపు 1000 సంఘాలకు బాధ్యత వహిస్తున్నారు. అనేక మంది బైబిల్ గ్రంథంపై తర్ఫీదు నిచ్చి, పాస్టర్లకు ఆదర్శంగా నిలిచారు. ఎల్‌బీఎస్ కాలనీ నుంచి ఆయన పార్థివదేహాన్ని పాయకాపురం శాంతినగర్‌లో గల పెద్దల నాటి స్వగృహం, చర్చి వద్దకు కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అనేక మంది సందర్శించి నివాళులర్పించారు.

## మేదరమెట్లలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, భ్రమర గ్రోత్ సిటీ సిబ్బంది

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలో అంతరాష్ట్రీయ పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు తెలిపారు. మేదరమెట్లలోని భ్రమర గ్రోత్ సిటీ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'శ్రీ భ్రమర కబడ్డీ టోర్నమెంట్'ను ఈ నెల 6,7,8 తేదీల్లో మేదరమెట్లలోని శ్రీ భ్రమర గ్రోత్ సిటీ వెంచర్‌లో నిర్వహిస్తామని వివరించారు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, ఆంధ్రప్రదేశ్ నుంచి వైజాగ్, తూర్పు గోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ రూ.75వేలు, తృతీయ రూ.50 వేలు, నాలుగా బహుమతిగా రూ.25 వేల నగదు, ట్రోఫీ అందించనున్నట్లు చెప్పారు. శ్రీ భ్రమర గ్రోత్ సిటీ సిబ్బంది సాయి శంకర్, ఉమ్మడి ప్రకాశం కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నర్రా గోపాల్‌రావు, కోశాధికారి దాసరి రమేష్, సమన్వయకర్త పతంగి ఆంజనేయులు, ఎస్ఎస్ మీడియా సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణ యాప్ నిర్వాహకుల వేధింపులతో

## ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి అదృశ్యం

ఆటోనగర్(పటమట), న్యూస్‌టుడే: రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక వ్యక్తి అదృశ్యమైన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మచిలీపట్నానికి చెందిన నడికుదిటి మారేంద్రకుమార్ పటమట పంటకాలువ రోడ్డులో ఒక ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తారు. ప్రతిరోజు బందరు నుంచి విజయవాడ వచ్చి వెళుతుంటారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో కొన్ని రుణ యాప్‌ల నుంచి రుణం తీసుకున్నాడు. తిరిగి చెల్లించలేకపోవడంతో వారి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో డిసెంబర్ 31వ తేదీన మధ్యాహ్నం 1.30కు మారేంద్రతో పాటు అతని కుటుంబ సభ్యుల ఫోన్లకు మార్ఫింగ్ చేసిన నగ్న ఫొటోలను యాప్ నిర్వాహకులు పంపారు. అనంతరం ఆయన ఆఫీస్ నుంచి బయటకు వెళ్లారు. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం 1.50 నిమిషాలకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో పాటు, మారేంద్ర స్నేహితులను విచారించగా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు వెంకటేష్ చేసిన తప్పిదంతో అగ్నిప్రమాదం జరిగి, మూడు కుటుంబాలు నిరాశ్రయులైన ఘటన మంగళవారం దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులో చోటుచేసుకుంది. వెంకటేష్ మంచురియా తయారు చేస్తున్న సమయంలో.. వంట పాత్రలోని నూనెకు మంటలు అంటుకున్నాయి. వాటిని ఆర్పేందుకు నూనెలో నీరు పోశాడు. దీంతో మంటలు మరింతపైకి ఎగసి రేకుల షెడ్డుకు అంటుకున్నాయి. ఇంట్లోని సామాగ్రితో పాటు పక్కనే ఉన్న మరో రెండు పోర్షన్లకు మంటలు వ్యాపించి, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేయగా.. వారు వచ్చి మంటలను అదుపుచేశారు. వెంకటేష్‌తోపాటు పక్క పోర్షన్లలో ఉండే చిరు వ్యాపారి రాజేష్, కార్లు విక్రయించే రాజు కుటుంబాలు వీధినపడ్డాయి. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొండాయిగుంట మల్లేశ్వరి బలరామ్ సందర్శించారు. ప్రభుత్వం నుంచి బాధితులకు తగిన నష్ట పరిహారం వచ్చేలా చూస్తానని విష్ణు హామీ ఇచ్చారు.

## కందుకూరు ఘటనపై సీబీఐ విచారణ జరపాలి

చీకటి జీవోపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం ★ జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు



మాట్లాడుతున్న జడ శ్రావణ్‌కుమార్. చిత్రంలో సురేష్, కొండలరావు

గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే : ఇటీవల కందుకూరులో జరిగిన తొక్కిసలాట ఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పాదయాత్రలను నిషేధిస్తూ అర్ధరాత్రి జీవోలు విడుదల చేయడం జగన్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కేలా, ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఒక క్రిమినల్‌ని ముఖ్యమంత్రిని చేస్తే ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు. జైలు జీవితం గడిపిన జగన్.. పాలనా విషయంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంలో తప్పులేదని ఎద్దేవా చేశారు. సబ్ కలెక్టర్లతో సినిమా టికెట్లు అమ్మించిన వ్యక్తి జగన్.. అంటూ మండిపడ్డారు. గతంలో చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాంలో సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి సలహాదారులు లేకపోవడం వల్లే.. వారు ఇలాంటి చీకటి జీవోలు ఇవ్వలేకపోయారేమోనని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, గతంలో జగన్ ఎవరి అనుమతి తీసుకొని పాదయాత్ర చేశారని ప్రశ్నించారు. రాజకీయ సభలు, సమావేశాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. కందుకూరు సభలో జరిగిన తొక్కిసలాట పోలీసుల వైఫల్యమేనని స్పష్టం చేశారు. గతంలో కల్తీ మద్యం తాగిన వారు మరణిస్తే.. మద్యాన్ని ఎందుకు బంద్ చేయలేదని ప్రశ్నించారు. దశలవారీగా మద్య నియంత్రణ చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి తుంగలో తొక్కారన్నారు. అధికార పార్టీ కనుసన్నల్లోనే తొక్కిసలాట జరిగిందని ఆయన ఆరోపించారు. తొక్కిసలాటను సాకుగా చూపించి.. అర్ధరాత్రి ఇచ్చిన చీకటి జీవోను ఉపసంహరించుకోవాలని శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీల సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తుంటే.. ముఖ్యమంత్రి జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. అధికార మదంతో విర్రవీగుతున్నారని, రానున్న రోజుల్లో ఆ అధికారాన్ని దూరం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. చీకటి జీవోపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు. దీనిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో త్వరలో విశాఖ లేదా తిరుపతిలో సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మగా మారిన పోలీసులకు.. రానున్న రోజుల్లో తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నిందితుడైన ఎమ్మెల్సీ అనంతబాబు ఫొటోతో.. స్థానిక ఎమ్మెల్యే పింఛన్లు పంచుతున్నారని... ఒక దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఆయన ఫొటో పెట్టడానికి ప్రభుత్వానికి సిగ్గులేదన్నారు. ఇదేనా దళితులపై చిత్తశుద్ధి? అని ప్రశ్నించారు. అనంతబాబు బెయిల్ రద్దయ్యే వరకు పోరాటం చేస్తానని శ్రావణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కొండలరావు, పరసా సురేష్ పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: పేదవారికి నాణ్యమైన ఆధునిక వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా అనేక చర్యలు తీసుకుంటుందని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. స్థానిక కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో విభాగాధిపతులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరికరాల కొరత, ఇతర సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని, దీనికి అవసరమైన బడ్జెట్ త్వరలోనే కేటాయిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొంత మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను తొలగించవద్దని ముఖ్య కార్యదర్శికి వినతి పత్రాలు అందజేశారు. డీఎంఈ వినోద్ కుమార్, సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంఓ శోభ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

## చోరీ కేసులో ఏడాది జైలు

విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే : గుడిలో చోరీ చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం న్యాయమూర్తి సత్యవతి మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్ శేషయ్య వీధిలోని శ్రీకుసుమ హరనాథ్ సేవా సమితి మందిరంలో 2021, నవంబరు 26వ తేదీ రాత్రి తలుపులకు పూజారి తాళం వేశారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉంది. గుడిలోని 8 కేజీల వెండి, మకర తోరణం కనిపించలేదు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు హైదరాబాద్‌కు చెందిన అంగోతు రాములు నాయక్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో పదిహేను మంది సాక్షుల సాక్ష్యాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణకిషోర్ న్యాయస్థానంలో నమోదు చేయించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## 'బీసీలకు రాజ్యాధికార సాధనే ధ్యేయం'



సంఘీభావం తెలుపుతున్న నారగోని, ఎన్వీ రావు, సుబ్రహ్మణ్యం, తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : బీసీలు రాజ్యాధికారం సాధించుకోవడమే అంతిమ లక్ష్యమని ప్రముఖ బీసీ ఉద్యమకారుడు వీజేఆర్ నారగోని అన్నారు. చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సావిత్రిబాయి పులె జయంతి కార్యక్రమంతో పాటు 'బీసీల దిశ దశ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఇప్పటికీ చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించలేదన్నారు. చట్టపరంగా రావాల్సిన వాటా ప్రకారం తమకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీసీలు అత్యధికంగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాధాన్యానికి నోచుకోలేకపోతున్నామని అన్నారు. ఇంతవరకు బీసీల జనగణన ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోతున్నాయో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమావేశంలో బీసీ నాయకులు వినుకొండ సుబ్రహ్మణ్యం, లాకా వెంగళరావు యాదవ్, నమ్మి అప్పారావు, అవ్వారు బుల్లబ్బాయి, జవ్వాది కూర్మాచారి, బుద్ధా నాగేశ్వరరావు, బాయన శేఖర్‌బాబు, కనిశెట్టి లక్ష్మణరావు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

వివాహిత హత్య కేసులో

## నిందితుడి అరెస్టు

పోస్ట్‌మార్టమ్ నివేదిక రావడంతో వీడిన మిస్టరీ

పెనమలూరు, న్యూస్‌టుడే: కానూరులో గత నెల 30వ తేదీన వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన వెనుక మిస్టరీని పోస్ట్‌మార్టం నివేదికతో బయటపడింది. అది హత్యేనని వైద్యుల నివేదికలో తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. ముమ్మడివరపు గౌరమ్మ(50) విజయవాడలోని గుణదల ప్రాంతంలో నివసిస్తూ రెస్టారెంట్లు, హోటళ్లలో పని చేస్తుంటుంది. గత నెల 31వ తేదీ ఉదయం కానూరులోని నిర్మానుష్య ప్రాంతంలో విగతజీవిగా పడి ఉండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టమ్‌కు తరలించారు. ఈ నివేదిక సోమవారం పోలీసులకు చేరింది. గొంతు నులిమి ఊపిరాడకుండా చేసినందువల్లే ఆమె ప్రాణాలు పోయినట్లు వైద్యులు నివేదికలో స్పష్టం చేశారు. దీంతో పోలీసులు ఆమెతో సన్నిహితంగా మెలిగిన యనమలకుదురు సంజీవయ్యనగర్‌లో నివసించే మెరికో జయరావును సోమవారం వేకువజామున అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించినట్లు సీఐ గోవిందరాజు తెలిపారు. కొంతకాలం క్రితం వీరిద్దరి నడుమ పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధం ఏర్పడగా గౌరమ్మ నిత్యం ఫోన్లు చేస్తూ విసిగిస్తుండటంతో జయరావు ఆమెపై ఆగ్రహం పెంచుకున్నట్లు ఆయన తెలిపారు. గత నెల 30వ తేదీన వీరిద్దరూ కానూరు శ్మశానాల వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకోగా అక్కడ వారి మధ్య వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో అప్పటికే మద్యం తాగి ఉన్న జయరావు ఆగ్రహంతో ఆమెపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేసి పరారయినట్లు ఆయన వెల్లడించారు. నిందితుడు జయరావును సోమవారం వేకువజామున అదుపులోకి తీసుకొని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. నిందితుడు ఎనికేపాడులోని ఓ ప్రైవేటు బ్యాంకులో కాపలాదారుగా పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## అధికారం ఇస్తే రూ.లక్ష కోట్లతో అభివృద్ధి చేస్తా: కేఏ పాల్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : జగన్‌మోహన్‌రెడ్డితో సహా ఎవరూ ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేరని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్ పేర్కొన్నారు. తనకు అధికారం ఇస్తే రూ.లక్ష కోట్లు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని, ఈ మాట నిలబెట్టుకోకుంటే ఏ శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. కందుకూరు, గుంటూరుల్లో జరిగిన సంఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోవటం తనను కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడికి మెదడు పనిచేయటం లేదని, ప్రమాద ఘటనలు జరిగిన తర్వాత కూడా సభలు పెడతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ఏపీలో అడుగు పెట్టే నైతిక హక్కు లేదన్నారు. తోట చంద్రశేఖర్, రావెల కిషోర్‌బాబులు అమ్ముడు పోయారని, ఈ విషయాన్ని తోట చంద్రశేఖర్ కుమారుడే తనకు చెప్పారన్నారు. ఎన్ఆర్ఐలు నల్లధనాన్ని తెలుపుగా మార్చుకునేందుకే సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, వారు రూ.వందల కోట్లు ఖర్చు పెట్టినా చంద్రబాబును గెలిపించలేరని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఈవీఎంలు వద్దని, బ్యాలెట్ పత్రాలు కావాలని డిమాండ్ చేశారు. హరిరామజోగయ్య దీక్షలపై మాట్లాడుతూ.. ఈ వయసులో మీకెందుకని ప్రశ్నించారు. అందరూ తనతో వస్తే.. కలిసి పోరాడుదామని, అధికారంలోకి వద్దామని కేఏ పాల్ పేర్కొన్నారు.

### మిమ్మల్ని ప్రేమించుకోండి



నేను ప్రతి మహిళకీ చెప్పేది ఒకటే! ఇతరులెవరినీ ప్రేమించనంతగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. అప్పుడే ఉన్నతంగా, సంతృప్తిగా ఎదగగలరు. మిమ్మల్ని ఎవరూ బాధించలేరు కూడా. - ఆలియాభట్, నటి




## బంగారం వెండి



3న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 55,580 | 55,040 | 57,320 | 56,850 |
| ఆర్నమెంట్ | 50,950 | 50,450 | 52,240 | 52,300 |
| వెండి (కిలో) | 75,500 | 74,500 | 71,600 | 70,400 |

| | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 54,900 | 54,400 | 56,230 | 55,770 |
| ఆర్నమెంట్ | 50,840 | 50,470 | 51,860 | 51,450 |
| వెండి (కిలో) | 68,000 | 66,700 | 68,500 | 67,500 |

| | విశాఖపట్నం | | తమిళనాడు | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 55,920 | 55,330 | ------ | ------ |
| ఆర్నమెంట్ | 51,450 | 50,900 | 5191 | 5150 గ్రా |
| వెండి (కిలో) | 73,000 | 70,000 | 75.50 | 74.50 గ్రా |

### నజరానా

నూనె మరకలు పడిన స్టౌవ్ మీద వెనిగర్ చల్లి రెండు గంటల తర్వాత దూదితో రుద్దితే శుభ్రపడుతుంది.

# వసుంధర

vasundhara@eenadu.net

**పెట్రోల్ వంటి సహజ ఇంధన వనరులు అయిపోతే మన భవిష్యత్తేంటి? అందుకే ప్రత్యామ్నాయ వనరుల కోసం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు సాగుతున్నాయి. ఆ కోవలోనే తక్కువ ఖర్చుతో తయారయ్యే బ్యాటరీని తయారు చేసి రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నారు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సుజాత. వసుంధర ఆమెని పలకరించినప్పుడు ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకున్నారామె..**

## భవిష్యత్ కోసం.. మా బ్యాటరీలు!



నేను పుట్టింది తిరువనంతపురంలోనే అయినా.. పెరిగింది కన్యాకుమారి జిల్లాలోని తిరునంతికర అనే గ్రామంలో. నాన్న కేజీ చంద్రశేఖరన్ నాయర్ ప్రముఖ రచయిత, అనువాదకులు. అమ్మ సరోజిని, ఇస్రో మాజీ ఛైర్మన్ మాధవన్ నాయర్‌కు స్వయానా చెల్లెలు. డిగ్రీవరకూ ప్రభుత్వ పాఠశాల,



కాలేజీల్లోనే చదివా. పుణె విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ కెమిస్ట్రీ, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి పీహెచ్‌డీ చేశా. ఆ తర్వాతే ఇస్రోలో నా కెరియర్ మొదలయ్యింది. మావారు వీవీ గోపినాథ్ రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి. మా అమ్మాయి మీరా అమెరికాలో యూనివర్సిటీ ప్రొఫెసర్. అబ్బాయి గోకుల్ యూకేలో పరిశోధకుడు.

### ఆవిష్కరణతో.. అద్భుతం

1986లో తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఉద్యోగినిగా చేరా. లోహాలకు తుప్పు రాకుండా.. వాటిపై వేసే రక్షణ పూతల తయారీ నా మొదటి పరిశోధనాంశం. దాని తర్వాతే ఐఆర్ఎస్- పీ3 ఉపగ్రహం కోసం బ్యాటరీ తయారీ బృందంలోకి వెళ్లాను. ఈ బ్యాటరీని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాం. ఆ ప్రాజెక్ట్ బాధ్యత తీసుకున్న డాక్టర్ ఇళంగోవన్ గురువుగా నన్ను ముందుండి నడిపించారు. నా ఆసక్తిని గమనించి ఆయన కీలక బృందంలో

#### వాటిని పట్టించుకోవద్దు..

శాస్త్రవేత్తలుగా ఎదగాలనే మహిళలకు లక్ష్యాలు స్పష్టంగా ఉండాలి. ఎవరేమన్నా పట్టించుకోవద్దు. విషయ పరిజ్ఞానం పెంచుకోవడంపైనే దృష్టి పెట్టండి. ఆ జ్ఞానమే మనల్ని క్లిష్ట పరిస్థితుల్లోనూ ముందుకు నడిపిస్తుంది. ఇక సవాళ్లు, కష్టాలు అంటారా.. అవి ఉన్నప్పుడే కదా మన సామర్థ్యం బయట ప్రపంచానికి తెలిసేది. అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవద్దు.

బాధ్యతలు అప్పగించారు. ఇన్శాట్-4సీఆర్ ఉపగ్రహంలోనూ మా బ్యాటరీ పరిశోధనలు ఉపయోగపడ్డాయి. తర్వాత వాణిజ్య అవసరాలకీ బ్యాటరీల వినియోగం పెరుగుతూ రావడంతో మా పరిశోధనలు కీలకంగా మారాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు బ్యాటరీల ధర, పరిమాణాన్ని తగ్గించేందుకు.. సూపర్ బ్యాటరీ కెపాసిటర్ సాంకేతికతను అభివృద్ధి చేశాం. దీనికి పేటెంట్‌నీ సాధించాం. ఈ సాంకేతికత అమలైతే ఈ-వాహనాల బ్యాటరీల ధరలు రూ.2.5లక్షల నుంచి రూ.27వేలకు తగ్గించవచ్చు. ఈ ఆవిష్కరణకే డాక్టర్ ఇళంగోవన్‌తో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ ఏడాది నేషనల్ ఎనర్జీ ఇన్నోవేషన్ పురస్కారం అందుకున్నా. ప్రస్తుతం ఎనర్జీ సిస్టమ్ సైన్సు విభాగానికి అధిపతిగా ఉన్న నాకు మా బృంద సహకారం ఉండబట్టే ఈ ఆవిష్కరణలో సవాళ్లని తేలిగ్గా పరిష్కరించుకోగలిగాం. ఇక రాష్ట్రపతి పురస్కారం అందుకున్న క్షణాల గురించి మాటల్లో చెప్పలేను. ఇన్నేళ్ల బాధను, కష్టాలను మరిపించిందీ అవార్డు.

### భవిష్యత్ లక్ష్యాలు..

భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న లిథియం అయాన్ బ్యాటరీల కన్నా రెట్టింపు సామర్థ్యంతో పనిచేసే లిథియం- సల్ఫర్ బ్యాటరీలపై పరిశోధిస్తున్నాం. అంతకంటే ఎక్కువగా వ్యర్థాలు, ఖర్చు తగ్గించేందుకు బ్యాటరీల రీసైక్లింగ్‌పైనా మా పరిశోధనలు సాగుతున్నాయి.

**- కల్లిపూడి దేవేంద్రరెడ్డి, శ్రీహరికోట**

## సంస్థను అలా అడగొచ్చా?

**మా సంస్థ ఏడాదిగా అన్ని బ్రాంచీలతో కలిసి ఓ కాన్ఫరెన్స్ ప్లాన్ చేస్తోంది. దానిలో ప్రదర్శించే ఓ ప్రాజెక్టును చేస్తానని నేనే ముందుకొచ్చి మరీ తీసుకున్నా. దాని పూర్తి బాధ్యత నాదే. అయితే కొన్నాళ్లుగా వేరే ఉద్యోగ అవకాశాల కోసం చూస్తున్నా. దాదాపు ఖాయమయ్యేలా ఉంది. కాన్ఫరెన్స్‌కు ముందే వెళ్లిపోతే ప్రాజెక్టు వృథా అవుతుంది. ఇప్పుడు నేనేం చేయాలి? కొత్త సంస్థ యాజమాన్యాన్ని కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే అనుమతి ఇవ్వమని అడగనా? అలా అడగడం సబబేనా? - శిల్ప**

**డియర్... వసుంధర**



కవితా గూడపాటి, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

అంత ముఖ్యమైన ప్రాజెక్టుకు మీరొక్కరే బాధ్యులుగా ఉండటం ఆశ్చర్యకరమే! వృత్తిలో మెరుగైన అవకాశాల కోసం వెదకడంలో తప్పు లేదు. అయితే సంస్థ నుంచి బయటకు వెళ్లాలనుకున్నప్పుడు అది గౌరవప్రదంగా జరిగేలా చూసుకోవాలి. మీ ప్రాజెక్టులను ఇతరులకు అప్పగించడం, మీ స్థానాన్ని భర్తీ చేయబోయే వారికి సరైన శిక్షణ, బాధ్యతలను అప్పగించడంలో చిత్తశుద్ధి మీ వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి, వచ్చిన అవకాశాన్ని అందుకోవాలన్న తపనలో సరైన ప్రణాళిక లేకుండా తొందరపడి ఉద్యోగాన్ని మానేయొద్దు. ముందు మీ బాస్‌ను కలవండి. మీ ప్రాజెక్టులో కలిసి పనిచేయడానికి ఇంకొకరు తోడు కావాలని అడగండి. అప్పుడు సంస్థను వీడాల్సిన రోజు వస్తే మరొకరు మీ బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. ఆ వ్యక్తికి దగ్గరుండి అన్ని విషయాలూ నేర్పించండి. సమస్యలు ఎదురయ్యే అవకాశాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలన్న వాటికీ సిద్ధం చేయండి. ఆత్మవిశ్వాసంతో ప్రాజెక్టు పూర్తి చేసేలా తర్ఫీదు ఇవ్వండి. అప్పుడు మీరున్నా.. లేకపోయినా ప్రాజెక్టు ఆగదు. మీకూ అపరాధ భావన ఉండదు.

## పాల సీసాల శుభ్రతకోసం...



పిల్లలకు పాలూ, నీళ్లూ పట్టే సీసాలు... ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలి. వాటిని శుభ్రంగా కడగకపోయినా, ఆరబెట్టకపోయినా బుజ్జాయిలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఈ ఇబ్బందికి ఇప్పుడు చెక్ పెడుతోంది బేబీ బాటిల్ డ్రైయింగ్ ర్యాక్. కడిగిన సీసాల్నీ, వాటి మూతల్నీ ఆరబెట్టుకోవడానికి చేసిన ఏర్పాటుతో పాటు సిలికాన్‌తో చేసిన స్క్రాచ్‌ఫ్రీ బ్రష్‌లు కూడా జతచేసి ఉంటాయి.

## ఐలైనర్.. తిన్నగా!

కనురెప్ప మీదుగా ఐలైనర్‌ను తీరుగా తీర్చిదిద్దడమూ ఓ కళే! అది సరిగా రావడం లేదా.. రెప్ప మీదుగా కావాల్సిన షేప్‌లో చుక్కలు పెట్టుకొంటూ వెళ్లండి. అప్పై జోడిస్తూ వెళితే సరి. తీరైన ఆకృతి మీ సొంతం.



## తేగలే కదా అని తీసి పారేయకండి!

**ఈ కాలంలో విరివిగా దొరికే తేగలను ఇష్టపడని వారుండరు. ఎలాంటి రసాయనాలూ, ఎరువులూ వాడకుండానే మొలకెత్తే ఇవి రుచిలో అమోఘం. ఇందులో పోషకాలూ పుష్కలం.**

- తేగల్లో పొటాషియం, విటమిన్ బి1, బి2, బి3, విటమిన్ సి ఉంటాయి. పీచు, క్యాల్షియం, ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలూ లభిస్తాయి. పోషకాహార లేమితో బాధ పడేవారు రోజూ కనీసం ఒక తేగ అయినా తింటే సరి. అలానే వీటిల్లో ఉండే పీచు.. జీర్ణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చేస్తుంది. పెద్దపేగుల్లో మలినాలు చేరకుండా, టాక్సిన్లను తొలగిస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికీ మంచి ఆహారం.



- ఎదిగే పిల్లలు తేగల్ని తింటే... ఇందులోని క్యాల్షియం ఎముక దృఢత్వాన్ని పెంచుతుంది. మహిళల్లో ఆస్టియో పోరోసిస్ సమస్య రాకుండా అడ్డుకుంటుంది.
- తేగలోని యాంటీ ఆక్సిడెంట్లు... తెల్ల రక్తకణాలను పెంచుతాయి. వ్యాధి నిరోధశక్తిని మెరుగుపరుస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులను దూరం చేస్తాయి.

## రంగవల్లిక










మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

## ఎత్తైన యుద్ధక్షేత్రంలో తొలి వీరనారి!





**సాయుధ దళాల్లో మహిళలకు సమానావకాశాలు మొదలయ్యాక.. ఆ ప్రయాణంలో మరో ముందడుగు పడింది. అత్యంత అననుకూల ప్రదేశంగా పేర్కొనే సియాచిన్‌లో విధులు నిర్వర్తించే అవకాశం అందుకున్న తొలి సైన్యాధికారిణిగా కెప్టెన్ శివ చౌహాన్ చరిత్ర సృష్టించారు...**

సియాచిన్.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రమిది. సైనికులకు శత్రు రూపంలోనే కాదు.. వాతావరణపరంగానూ ఏ క్షణమైనా ఆపద ఎదురవొచ్చు. సముద్ర మట్టానికి 15 వేల అడుగుల ఎత్తులో ఉంటుందా ప్రదేశం. అనుక్షణం మారే వాతావరణ పరిస్థితులు, ఏడాది పొడవునా గడ్డ కట్టించే చలి.. అక్కడ సర్వసాధారణం. శిక్షణలో ముందంజలో నిలిచిన వారికే అక్కడ పోస్టింగ్ ఇస్తారు. అలాంటి చోట మహిళా సైన్యాధికారి శివ చౌహాన్‌కి అవకాశమొచ్చింది. ఆ ప్రతికూల పరిస్థితుల్లో దేశరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారీ వీరనారి. ఈవిడది రాజస్థాన్. చిన్న తనంలోనే నాన్న చనిపోయారు. అమ్మే పెంచి పెద్ద చేసింది. సివిల్ ఇంజినీరింగ్ చేసిన చౌహాన్.. 2021లో భారత సైన్యంలోని ఇంజినీర్ రెజిమెంట్‌లో నియమితులయ్యారు.

హిమాలయాల్లోని తూర్పు కారకోరం పర్వతశ్రేణిలో సియాచిన్ హిమనీ నదం ఉంది. భారత్ - పాకిస్థాన్ మధ్య నియంత్రణ రేఖ దీని వద్దే ముగుస్తుంది. ఆర్మీ ప్రత్యేక దళం 'ఫైర్ అండ్ ఫ్యూరీ'కి చెందిన చౌహాన్.. సియాచిన్ హిమనీ నదంలోని కుమర్ పోస్ట్‌లో విధులు నిర్వర్తించనున్నారు. సియాచిన్‌లో 15,632 అడుగుల ఎత్తులో ఈ ప్రదేశం ఉంది. అడుగు వేస్తే మంచులో కూరుకుపోయే ప్రమాదం.. వేగంగా వీచే చల్లగాలులు.. ఊపిరి తీసుకోవడమే ఇబ్బందయ్యే చోట పురుషులతో సమానంగా పని చేసేందుకు సిద్ధం అయ్యారామె. దీనికోసం ఎన్నో పరీక్షలు, కఠినమైన శిక్షణను పూర్తిచేసుకున్నారు. 'గాజు తెరను బద్దలు కొట్టడం' అనే క్యాప్షన్‌తో 'ఫైర్ అండ్ ఫ్యూరీ' బృందం ఆవిడ నియామకాన్ని అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు చేసింది. దేశరక్షణ అవకాశం ఎన్నో ఏళ్లు ఎదురు చూసిన మహిళా సైనికులకే కాదు.. ఏ రంగంలోనైనా సత్తా చూపగలమనే అమ్మాయిలకూ ఇదీ గర్వించదగ్గ క్షణమే కదూ!

## వాదనతో బంధం బలహీనం..

**రమా, రిషిల అనుబంధాన్ని వారి మధ్య అప్పుడప్పుడు వచ్చే వాదన భంగపరుస్తూ ఉంటుంది. తిరిగి వారిద్దరూ ఒకటవడానికి రోజులు పడుతుంది. అభిప్రాయాన్ని చెప్పేటప్పుడు వాదనగా కాకుండా సంభాషణగా, చర్చగా మార్చుకోగలిగితే ఆ దంపతులమధ్య దూరం తరగదంటున్నారు మానసిక నిపుణులు.**

భార్యాభర్తల్లో ఒకరికొకరు తమ సర్వస్వం అన్నట్లుగా ఉన్న వారు కూడా వాదనలోకి అడుగుపెడితే అన్నీ మర్చిపోతుంటారు. తమకే అన్నీ తెలిసినట్లు, తమదే పైచేయి అంటూ భావిస్తుంటారు. ఇటువంటప్పుడే ఎదుటివారిని తక్కువగా అంచనా వేస్తూ మాటలతో తమ వాదనను మరింత కఠినంగా వినిపిస్తారు. ఈ రకమైన పద్ధతి పరిష్కారాన్ని కాదుకదా.. ఇద్దరికీ మానసిక వేదనను మాత్రమే మిగులుస్తుంది. అలాకాకుండా ఉండాలంటే అటువంటి సందర్భం రాకుండా ఉండేలా ముందుగానే జాగ్రత్తపడాలి. ఏయే అంశాల్లో ఇరువురి మధ్య వాదనలు వస్తున్నాయో ప్రశాంతంగా చర్చించుకోవాలి. మరొకసారి అలా రాకుండా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించాలి. వాదన వచ్చినప్పుడు ఇరువురిలో ఒకరైనా మౌనాన్ని పాటించగలిగితే,



కాసేపటికి వాతావరణం మారుతుంది. అవతలివారిలో కోపం లేదా వాదించాలనే వేడి తగ్గుతుంది. ఆ తర్వాత సున్నితంగా ఏం చెప్పాలనుకుంటున్నారో చెబితే చాలు. వాదన వల్ల కలిగే నష్టాన్ని ముందుగానే నివారించొచ్చు.

### స్నేహంలా..

ప్రేమించినప్పుడు లేదా వైవాహికబంధంలోకి అడుగుపెట్టినప్పుడు భాగస్వామిని ఎంత గొప్పగా భావించి ప్రేమించారో ఆ ప్రేమ, గౌరవాన్ని మరవకూడదు. కోపం లేదా భేదాభిప్రాయం వచ్చినప్పుడు అప్పటి సంఘటనలు, ప్రేమించిన క్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. అవన్నీ మనసును తిరిగి అవతలి వ్యక్తిపై ప్రేమతో నింపుతాయి. జీవిత భాగస్వామిలోని లోపాలను ముందుగా గుర్తించలేదు అనుకోకుండా, మనలోనూ ఉన్న లోపాలను తెలుసుకోగలగాలి. అప్పుడు మనల్ని భరిస్తున్న భాగస్వామిపై మరింత ప్రేమ పెరుగుతుంది తప్ప.. వాదనలకు తావుండదు. లోపాలకు ప్రాముఖ్యతనివ్వకుండా ఇరువురూ వాటిని మార్చుకోవడానికి ప్రయత్నిస్తూ ముందడుగు వేస్తే ఆ బంధం కలకాలం నిలుస్తుంది. స్నేహితుల పొరపాట్లనెలా పట్టించుకోకుండా స్నేహాన్నెలా కొనసాగిస్తారో.. అలాగే.. భాగస్వామి విషయంలోనూ ఆలోచించాలి. పరస్పరం గౌరవించుకుంటూ ఎదుటివారిలోని మంచి గుణాలను గుర్తించి ప్రశంసించగలిగితే చాలు. ఆ దాంపత్యంలో ప్రేమతోపాటు స్నేహబంధం పెనవేసుకుంటుంది.

## ఫోన్ శుభ్రం చేద్దాం...

**మనకు నిత్యం హస్తాభరణంలా మారిన ఫోన్‌లో చేరే వైరస్‌లు దాని పనితీరును ఎలా ప్రభావితం చేస్తాయో, అలాగే ఫోన్‌పై పేరుకొనే బ్యాక్టీరియాలు మనకి పలు అనారోగ్యాలనూ.. తెచ్చి పెడతాయంటున్నారు నిపుణులు. పిల్లల చేతికీ అందే ఫోన్‌ను రెండు రోజులకొకసారి శుభ్రపరిచి అనారోగ్యాలను దరిచేరకుండా చేయాలని సూచిస్తున్నారు. హ్యాండ్‌బ్యాగుకు ఆకర్షణీయంగా, అలాగే ఫోన్‌ను శుభ్రపరచడంలో ఉపయోగపడే పలు టూల్స్ గురించి తెలుసుకుందాం.**



**కీచెయిన్..** క్లీనింగ్ వైప్స్ ఉండే స్క్రీన్ క్లీనర్ కీచెయిన్‌ను హ్యాండ్‌బ్యాగుకు లేదా ఫోన్‌కు తగిలించుకొనే సౌకర్యం ఉంటుంది. వీలైనప్పుడల్లా ఈ వైప్స్‌తో ఫోన్‌ను శుభ్రపరుచుకోవచ్చు. ఈ కీచెయిన్ బ్యాగుకు అదనపు అలంకరణగానూ మారుతుంది.

స్క్రీన్ క్లీనర్ కిట్ ఐగ్లాస్ వాష్ కీచెయిన్ హ్యాండుబ్యాగు లేదా వాహనతాళానికి తేలికగా అటాచ్ చేసుకోవచ్చు. ఇందులో మృదువుగా పఫ్‌లా ఉండే టూల్‌తో సమయం ఉన్నప్పుడు ఫోన్‌పై మురికిని తొలగించుకోవచ్చు. అలాగే మొబైల్ స్టాండు, స్క్రీన్ క్లీనర్ కలిసి ఉండే ప్రత్యేక కీచెయిన్ హ్యాండుబ్యాగుకు తగిలించుకోవచ్చు. దీంతో ఎప్పటికప్పుడు ఫోన్‌ను శుభ్రం చేసుకోవచ్చు.

**క్లీనింగ్ కిట్..** చిప్, ఛార్జింగ్ వైర్‌ను ఇన్సెర్ట్ చేసే ప్రాంతాలను శుభ్రపరచడానికి ఇయిర్‌బడ్స్‌లాంటి మినీ ఫోం టిప్డ్ క్లీనింగ్ స్వాబ్స్, స్టిక్స్ ఈ క్లీనింగ్ కిట్‌లో ఉంటాయి. వీటితోపాటు ఫోన్ స్క్రీన్‌ను శుభ్రపరచడానికి డస్ట్ క్లీనింగ్ క్లాత్ కూడా ఉంటుంది. వారానికి రెండు లేదా మూడుసార్లు ఈ కిట్‌ను వినియోగించి బ్యాక్టీరియాను దూరం చేయడం మంచిది.

**గ్బీ బటన్..** మైక్రోఫైబర్ సెల్‌ఫోన్ స్క్రీన్ క్లీనర్‌లో ఉండే మృదువైన గ్బీ బటన్‌తో ఫోన్‌ను సునాయసంగా శుభ్రం చేయొచ్చు. కంటికి కనిపించని మురికిని ఇది పూర్తిగా పీల్చడమే కాకుండా ఫోన్‌ను మెరిసేలా మారుస్తుంది. అలాగే ఐ రోలర్‌తో ఫోన్ స్క్రీన్‌పై మృదువుగా రోల్ చేస్తే చాలు. ఇందులోని ద్రావణం ఫోన్‌పై మురికిని క్షణాల్లో మటుమాయం చేస్తుంది. దీంతో ఫోన్‌పై పేరుకున్న బాక్టీరియా తొలగిపోతుంది.

## నలుపుని తొలగించే ప్యాక్‌లు...

**నిత్యం ఎండలో తిరగాల్సి రావొచ్చు. లేదా రాత్రీ పగలూ తేడా తెలియకుండా లైట్ల కాంతిలో పనిచేయాల్సి రావొచ్చు. ఎక్కువకాలం ఇలా చేస్తే.. టాన్ పడుతుంది. అలాంటప్పుడు ఈ చిట్కాలు పాటించండి.**



- పెద్దచెంచా బార్లీ గింజలని మిక్సీలో వేసి మెత్తని పొడిగా చేసుకోవాలి. దీనికి అరచెక్క నిమ్మరసంతోపాటూ తగినంత రోజ్‌వాటర్ కూడా కలిపి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ ప్యాక్‌ని ఎండ కారణంగా నల్లబడిన చర్మంపై రాసి అరగంట తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే టాన్ పోతుంది.
- నాలుగు ఎండుద్రాక్షలు, ఒక ఎండు ఖర్జూరం నానబెట్టుకుని వాటిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా పండిన బొప్పాయి గుజ్జు, కాసిన్ని పాలు, చిటికెడు కలపాలి. ఈ ప్యాక్‌ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే ముఖం కాంతిని సంతరించుకుంటుంది.
- కాలంతో పనిలేకుండా కొందరి చర్మం నిర్జీవంగా నల్లగా మారుతుంది. ఇలాంటివారు చందనం, పెరుగు, ముల్తానీ మట్టి కలిపి ప్యాక్ వేసుకోవాలి. అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే ముఖం కాంతులీనుతుంది.

(c) eenadu

# చాంపియన్




శ్రీలంకే కదా.. ఆడుతోంది మన సొంతగడ్డ మీదే కదా అనుకుంటే.. ప్రత్యర్థి జట్టు టీమ్‌ఇండియాకు చుక్కలు చూపించింది. బంతితో భారత్‌ను గట్టి దెబ్బ తీసిన లంక.. తర్వాత బ్యాటుతోనూ కంగారెత్తించింది. మొదట మ్యాచ్‌పై ఆశలు పోతున్న దశలో దీపక్ హుడా, అక్షర్ పటేల్‌ల పట్టుదల భారత్‌కు పోరాడే స్కోరునందిస్తే.. ఆపై ఇక కష్టమే అనుకుంటున్న దశలో బౌలర్లు పుంజుకుని భారత్‌ను గెలిపించారు. చివరి బంతికి 4 పరుగులు చేయాల్సిన స్థితిలో.. జోరుమీదున్న చమికకు షాట్ ఆడే అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టమైన బంతిని వేసిన అక్షర్ పటేల్.. జట్టును గట్టెక్కించాడు. అరంగేట్రంలోనే 4 వికెట్లతో అదరగొట్టిన శివమ్ మావి తొలి టీ20లో భారత బౌలింగ్ హీరో.

# చివరి బంతికి చిక్కింది

- భయపెట్టిన శానక, చమిక
- లంకపై గట్టెక్కిన భారత్
- దీపక్, అక్షర్ పోరాటం
- అరంగేట్రంలో మావి మెరుపులు




ముంబయి

శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో టీమ్‌ఇండియా శుభారంభం చేసింది. హార్దిక్ పాండ్య నేతృత్వంలో యువ ఆటగాళ్లతో సరికొత్తగా మారిన టీ20 జట్టు.. మంగళవారం తొలి టీ20లో 2 పరుగుల తేడాతో లంకను ఓడించింది. మొదట దీపక్ హుడా (41 నాటౌట్; 23 బంతుల్లో 1×4, 4×6), ఇషాన్ కిషన్ (37; 29 బంతుల్లో 3×4, 2×6), అక్షర్ పటేల్ (31 నాటౌట్; 20 బంతుల్లో 3×4, 1×6) రాణించడంతో భారత్ 5 వికెట్లకు 162 పరుగులు చేసింది. లంక బౌలర్లలో హసరంగ (1/22), తీక్షణ (1/29), చమిక కరుణరత్నె (1/22) రాణించారు. అనంతరం లంక నిర్ణీత ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్ర పేసర్ శివమ్ మావి (4/22) అదరగొట్టాడు. ఉమ్రాన్ మాలిక్ (2/27), హర్షల్ పటేల్ (2/41) కూడా రాణించారు. కెప్టెన్ శనక (45; 27 బంతుల్లో 3×4, 3×6), చమిక (23 నాటౌట్; 16 బంతుల్లో 2×6) లంకను గెలిపించడానికి గట్టి ప్రయత్నమే చేశారు. రెండో టీ20 గురువారం పుణెలో జరుగుతుంది.

**కంగారెత్తించిన ఆ ఇద్దరు..:** లంక ఇన్నింగ్స్ ఒక దశ వరకు సాగిన తీరు చూస్తే.. మ్యాచ్ ఇంత ఉత్కంఠభరితంగా మారుతుందని ఎవరూ ఊహించి ఉండరు. మావి సహా భారత బౌలర్లందరూ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 68 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది లంక. ఓపెనర్ కుశాల్ మెండిస్ (28) మినహా ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. నిశాంక (1), ధనంజయ (8), అసలంక (12), రాజపక్స (10) పెవిలియన్‌కు వరుస కట్టేశారు. కుశాల్ కూడా వెనుదిరగడంతో లంకకు ఆశలు సన్నగిల్లాయి. కానీ శనక, హసరంగ (21) అనూహ్యంగా భారత బౌలర్లపై ఎదురు దాడి చేసి.. లంకను పోటీలోకి తెచ్చారు. హసరంగ ఔటయ్యాక కూడా శనక పోరాటం కొనసాగించాడు. ఒక దశలో సమీకరణం 21 బంతుల్లో 34 పరుగులుగా తేలిగ్గా మారింది. కానీ శనకను ఔట్ చేసిన ఉమ్రాన్.. భారత్‌కు ఉపశమనాన్ని అందించాడు. ఆ తర్వాత చమిక తన దాటైన ఆటను చూపించాడు. 9 బంతుల్లో 21 పరుగులు చేయాల్సిన స్థితిలో హర్షల్ బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా.. మూడో బంతికి అతను సిక్సర్ బాదడంతో 3 బంతుల్లో 5 పరుగులే చేయాల్సి వచ్చింది. అయితే ఒత్తిడిలో చివరి మూడు బంతులను అక్షర్ ఎంతో కట్టుదిట్టంగా వేశాడు. చమికకు షాట్ ఆడే అవకాశమే ఇవ్వలేదు. ఆఖరి బంతికి 4 పరుగులు అవసరం కాగా.. చమిక గట్టిగా ప్రయత్నించినా బౌండరీ రాలేదు.

**తడబడి.. నిలబడి..:** వాంఖడె పిచ్ బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలమన్న అంచనాల మధ్య టాస్ ఓడి బ్యాటింగ్ ఎంచుకున్న తొలి ఓవర్లో చూపించిన దూకుడు చూస్తే.. లంక ముందు 200 పైచిలుకు లక్ష్యం నిలుపుతుందేమో అనిపించింది. బంగ్లాదేశ్‌పై వన్డే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించిన ఊపును కొనసాగిస్తూ.. ఇషాన్ తొలి ఓవర్లో చెలరేగాడు. ఒక సిక్సర్, రెండు ఫోర్లతో తన దాటిని చూపించాడు. రెండో ఓవర్లో శుభ్‌మన్ కూడా చక్కటి ఫోర్ కొట్టి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ఇలా ఆశావహంగా ఆరంభమైన భారత ఇన్నింగ్స్.. తర్వాత కుదుపులకు లోనైంది. స్పిన్నర్ తీక్షణ తన తొలి ఓవర్లో మూడో బంతికే శుభ్‌మన్ (7)ను వికెట్ల ముందు బలిగొన్నాడు. సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. తర్వాత స్థానిక ఆటగాడు సూర్యకుమార్ 360 డిగ్రీ మెరుపుల కోసం చూసిన ముంబయి అభిమానులకు నిరాశ తప్పలేదు. అతను వికెట్ వెనక్కి తనదైన శైలిలో షాట్ ఆడే ప్రయత్నంలో షార్ట్ ఫైన్ లెగ్‌లో ఫీల్డర్‌కు దొరికిపోయాడు. సంజు శాంసన్ (5) ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న ఇషాన్‌తో కెప్టెన్ హార్దిక్ (29) తోడవ్వడంతో ఇన్నింగ్స్ కొంచెం కుదుటపడింది. 7 ఓవర్లలో 47/3తో ఉన్న భారత్.. 10 ఓవర్లకు 75/3తో కాస్త మెరుగుపడింది. కానీ కొన్ని ఓవర్ల వ్యవధిలో ఇషాన్, హార్దిక్ వెనుదిరగడంతో భారత్‌కు మళ్లీ కష్టాలు తప్పలేదు. 15 ఓవర్లకు స్కోరు 101/5. ఈ దశలో 140 దాటితే గొప్ప అనిపించింది. కానీ కాస్త ఆలస్యంగా బ్యాటింగ్ చేసిన దీపక్ హుడా, అక్షర్.. చివరి ఓవర్లలో చెలరేగి ఆడి జట్టుకు ఊహించని స్కోరు సాధించిపెట్టారు. తీక్షణ వేసిన 16వ ఓవర్లో రెండు సిక్సర్లతో ఇన్నింగ్స్‌కు హుడా మళ్లీ ఊపు తెచ్చాడు. అక్షర్ సైతం సమయోచితంగా షాట్లు ఆడాడు. చివరి 5 ఓవర్లలో భారత్ 61 పరుగులు రాబట్టింది. ఈ మ్యాచ్‌తో మావితో పాటు గిల్ టీ20 అరంగేట్రం చేశాడు.

**భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ (సి) ధనంజయ (బి) హసరంగ 37; శుభ్‌మన్ ఎల్బీ (బి) తీక్షణ 7; సూర్యకుమార్ (సి) రాజపక్స (బి) కరుణరత్నె 7; సంజు శాంసన్ (సి) మదుశంక (బి) ధనంజయ 5; హార్దిక్ (సి) కుశాల్ (బి) మదుశంక 29; దీపక్ హుడా నాటౌట్ 41; అక్షర్ నాటౌట్ 31; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **162; వికెట్ల పతనం:** 1-27, 2-38, 3-46, 4-77, 5-94; **బౌలింగ్:** రజిత 4-0-47-0; మదుశంక 4-0-35-1; తీక్షణ 4-0-29-1; చమిక కరుణరత్నె 3-0-22-1; ధనంజయ డిసిల్వా 1-0-6-1; హసరంగ 4-0-22-1

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిశాంక (బి) మావి 1; కుశాల్ (సి) శాంసన్ (బి) హర్షల్ 28; ధనంజయ (సి) శాంసన్ (బి) మావి 8; అసలంక (సి) ఇషాన్ (బి) ఉమ్రాన్ 12; భానుక రాజపక్స (సి) హార్దిక్ (బి) హర్షల్ 10; శనక (సి) చాహల్ (బి) ఉమ్రాన్ 45; హసరంగ (సి) హార్దిక్ (బి) మావి 21; చమిక కరుణరత్నె నాటౌట్ 23; తీక్షణ (సి) సూర్య (బి) మావి 1; రజిత రనౌట్ 5; మదుశంక రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో ఆలౌట్) **160; వికెట్ల పతనం:** 1-12, 2-24, 3-47, 4-51, 5-68, 6-108, 7-129, 8-132, 9-159; **బౌలింగ్:** హార్దిక్ పాండ్య 3-0-12-0; శివమ్ మావి 4-0-22-4; ఉమ్రాన్ మాలిక్ 4-0-27-2; చాహల్ 2-0-26-0; హర్షల్ పటేల్ 4-0-41-2; అక్షర్ పటేల్ 3-0-31-0

## శ్రీలంకతో వన్డేలకు బుమ్రా



**ముంబయి:** టీమ్‌ఇండియా స్టార్ ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎట్టకేలకు తిరిగి ఫిట్‌నెస్ సాధించాడు. గత ఏడాది గాయాల కారణంగా టీ20 ప్రపంచకప్‌కే కాక పలు సిరీస్‌లకు దూరంగా ఉన్న బుమ్రా.. శ్రీలంకతో వన్డేలకు భారత జట్టులోకి ఎంపికయ్యాడు. ఇప్పటికే ప్రకటించిన జట్టులో అతను లేడు. బుమ్రా ఫిట్‌నెస్ మీద సందేహాలతో సెలక్టర్లు అతణ్ని లంకతో టీ20లకే కాక వన్డేలకూ దూరం పెట్టారు. అయితే బుమ్రా పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధరిస్తూ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) పచ్చజెండా ఊపడంతో ఈ నెల 10న ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు అతణ్ని జట్టులోకి ఎంపిక చేశారు. గత ఏడాది గాయం కారణంగా కొన్ని నెలల పాటు ఆటకు దూరంగా ఉన్న బుమ్రా.. సెప్టెంబరులో పునరాగమనం చేశాడు. కానీ కొన్ని రోజుల్లోనే మళ్లీ గాయపడి టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. ఈ ఏడాది ఆఖర్లో వన్డే ప్రపంచ కప్ జరగనున్న నేపథ్యంలో బుమ్రాను టీ20లకు దూరం పెట్టి ఎక్కువగా వన్డేలే ఆడించే అవకాశముంది. ఐపీఎల్‌లో బుమ్రాపై ఎక్కువ భారం పడకుండా అతడిపై ఎన్‌సీఏ ప్రతినిధులు ఓ కన్నేసి ఉంచబోతున్నారు.

## విజృంభించిన రవితేజ, కార్తికేయ

- ఆంధ్ర 135 ఆలౌట్
- హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్


రవితేజ

**విజయనగరం, ఈనాడు:** ఈ సీజన్లో తొలి విజయం కోసం ఎదురు చూస్తున్న హైదరాబాద్‌కు ఆంధ్రతో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి పోరులో శుభారంభం లభించింది. రవితేజ (5/34), కార్తికేయ (3/31) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 135 పరుగులకే కుప్పకూలింది. మంగళవారం, తొలిరోజు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర ఒక దశలో 35/0తో మెరుగ్గానే కనిపించింది. కానీ రవితేజ, కార్తికేయ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. అభిషేక్ (81) ఒంటరి పోరాటం చేశాడు. బదులుగా ఆట చివరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 79/3తో నిలిచింది. తన్మయ్ అగర్వాల్ (35), ప్రజ్ఞయ్ (17), రోహిత్ రాయుడు (6) ఔట్ కాగా.. అలంకృత్ (10), భవేశ్ (4) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర లాగే హైదరాబాద్ కూడా మెరుగ్గానే ఆరంభించింది. ఒక దశలో 53/0తో నిలిచింది. కానీ 21 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. మరోవైపు తమిళనాడు-ముంబయి మధ్య మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మొదలైంది. తుషార్ దేశ్‌పాండే (5/37) విజృంభణతో మొదట తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే ఆలౌట్ కాగా.. ముంబయి ఆట చివరికి 183/6తో నిలిచింది. పృథ్వీషా (35), రహానె (42) ఔటయ్యారు. సర్ఫరాజ్ ఖాన్ (46) క్రీజులో ఉన్నాడు.

## ఉనద్కత్ 8/39

- తొలి ఓవర్లోనే హ్యాట్రిక్‌తో రికార్డు
- దిల్లీ 133 ఆలౌట్


ఉనద్కత్

**రాజ్‌కోట్:** సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవలే టెస్టుల్లో పునరాగమనం చేసిన పేసర్ జైదేవ్ ఉనద్కత్ (8/39) ఆ ఉత్సాహాన్ని రంజీల్లో చూపిస్తున్నాడు. అతడు రికార్డు హ్యాట్రిక్ నమోదు చేయడంతో సౌరాష్ట్రతో రంజీ ఎలైట్ గ్రూప్-బి పోరులో దిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలింది. దిల్లీ ఇన్నింగ్స్ ఆరంభమే సంచలనం! మూడో బంతికి ధ్రువ్ (0)ను బౌల్డ్ చేసిన జైదేవ్.. ఆపై నాలుగు, అయిదు బంతులకు ఆయూష్ బదోని, యశ్ ధూల్‌లను పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ సాధించాడు. 88 ఏళ్ల రంజీ చరిత్రలో తొలి ఓవర్లోనే హ్యాట్రిక్ చేసిన బౌలర్‌గా ఉనద్కత్ రికార్డు సృష్టించాడు. మొత్తం మీద దిల్లీ ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసి ఆ జట్టు పతనాన్ని శాసించాడు. ఆట చివరికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 184/1తో బలమైన స్థితిలో నిలిచింది.

## మహిళల ఐపీఎల్ జట్ల కోసం బిడ్ల ఆహ్వానం

**దిల్లీ:** మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఐపీఎల్) జట్లను సొంతం చేసుకోవాలనుకుంటున్న సంస్థల నుంచి బీసీసీఐ మంగళవారం బిడ్లను ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న సంస్థలు టెండరు పత్రాలు కొనడానికి చివరి తేదీ ఈ నెల 21. ఆరంభ మహిళల ఐపీఎల్ మార్చి 3 నుంచి 26 వరకు జరగనుంది. "నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పుడే బిడ్లు వేయడానికి అర్హత ఉంటుంది. టెండరు డాక్యుమెంట్ కొన్నంత మాత్రానే ఏ వ్యక్తికీ బిడ్ వేసే హక్కు రాదు" అని బీసీసీఐ తెలిపింది. ఏ దశలోనైనా, ఏవిధంగానైనా బిడ్డింగ్ ప్రక్రియను రద్దు చేసే లేదా మార్చే విచక్షణాధికారం బోర్డుకు ఉందని చెప్పింది.

## దిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్‌గా గంగూలీ



**దిల్లీ:** బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ.. క్రికెట్ డైరెక్టర్‌గా ఐపీఎల్ ఫ్రాంఛైజీ దిల్లీ క్యాపిటల్స్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ క్యాపిటల్స్‌కే చెందిన దుబాయ్ క్యాపిటల్స్ (ఐఎల్‌టీ20 లీగ్), ప్రిటోరియా క్యాపిటల్స్ (దక్షిణాఫ్రికా టీ20 లీగ్) బాధ్యతలు కూడా అతడు చూసుకుంటాడు. "అవును, సౌరభ్ దిల్లీ క్యాపిటల్స్‌తో చేరతాడు. చర్చలు ముగిశాయి. ఇంతకుముందు అతడు ఈ ఫ్రాంఛైజీతో పని చేశాడు. ఫ్రాంఛైజీ యజమానులతో అతడికి మంచి సంబంధాలు ఉన్నాయి" అని ఈ విషయాలు తెలిసిన ఓ వ్యక్తి చెప్పాడు. గంగూలీ 2019లో దిల్లీ మెంటార్‌గా పనిచేశాడు.

## క్వార్టర్స్‌లో హుసాముద్దీన్



**హిసార్:** జాతీయ ఎలైట్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ కుర్రాడు మహ్మద్ హుసాముద్దీన్ క్వార్టర్‌ఫైనల్ చేరాడు. సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హుసాముద్దీన్ మంగళవారం 57 కేజీల ప్రిక్వార్టర్స్‌లో లల్లామామా (మిజోరాం)ను ఓడించాడు. సెమీస్‌లో స్థానం కోసం మనీష్ రాథోడ్ (ఉత్తర్‌ప్రదేశ్)తో హుసాముద్దీన్ తలపడనున్నాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మనీష్ కౌశిక్ (63.5 కేజీ) కూడా క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. సందీప్ (ఆంధ్రప్రదేశ్)పై అతడు విజయం సాధించాడు. గోవింద్ సహాని (48 కేజీ), వరీందర్ సింగ్ (60 కేజీ), బిశ్వమిత్ర (51 కేజీ) క్వార్టర్‌ఫైనల్ చేరారు.



## అయ్యయ్యో జంపా..

**మెల్‌బోర్న్:** భారత ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ లాగే మన్కడింగ్ చేయబోయి బోల్తా కొట్టాడు ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా. బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ స్టార్స్, మెల్‌బోర్న్ రెనెగ్రేడ్స్ మధ్య మ్యాచ్‌లో జరిగిందిది. జంపా.. మెల్‌బోర్న్ స్టార్స్ కెప్టెన్. ఫాలోత్రూను పూర్తి చేసిన అతడు.. ఇక బంతిని వదిలినట్లే అనిపించిన దశలో హఠాత్తుగా వెనక్కి తిరిగి బెయిల్స్‌ను పడేశాడు. అప్పటికే నాన్‌స్ట్రైకర్ రోజర్స్ క్రీజును వదిలేశాడు. జంపా రనౌట్ కోసం అడగగా.. మైదానం అంపైర్ అది ఎందుకు ఔట్ కాదో చెప్పడానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత మూడో అంపైర్‌కు నివేదించాడు. మూడో అంపైర్ కూడా మైదానం అంపైర్ లాగే స్పందించాడు. జంపా భుజం నిట్ట నిలువు దశ నుంచి ముందుకెళ్లినందున నిబంధనల ప్రకారం బంతి వేసినట్లే భావించాలని చెబుతూ రోజర్స్‌ను నాటౌట్‌గా ప్రకటించాడు.

## న్యూజిలాండ్ పైచేయి

పాకిస్థాన్‌తో రెండో టెస్టు




**కరాచి:** పాకిస్థాన్‌తో రెండో టెస్టులో న్యూజిలాండ్ పట్టుబిగిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 309/6తో రెండో రోజు, మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 449 పరుగులకు ఆలౌటైంది. ఒక్క పరుగు జోడించకుండానే ఇష్ సోధి వికెట్ కోల్పోయిన ఆ జట్టుకు ఇంత స్కోరు ఊహించనిదే. ఏడో వికెట్‌గా సోధి నిష్క్రమించాక.. బ్లండెల్ (51), సౌథీ (10)లను అబ్రార్ ఔట్ చేయడంతో కివీస్ 345/9తో నిలిచింది. కానీ అద్భుతంగా బ్యాటింగ్ చేసిన మ్యాట్ హెన్రీ (68 నాటౌట్), అజాజ్ పటేల్ (35).. పాక్‌కు షాకిచ్చారు. స్పిన్, పేస్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును నడిపించారు. ఆఖరి వికెట్‌కు 104 పరుగులు జోడించిన హెన్రీ, అజాజ్ జంట న్యూజిలాండ్‌ను బలమైన స్థితిలో నిలిపింది. అబ్రార్ అహ్మద్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. నసీమ్ షా, అఘా సల్మాన్ చెరో మూడు వికెట్లు చేజిక్కించుకున్నారు. ఆట ముగిసే సమయానికి పాక్ తొలి ఇన్నింగ్స్ 3 వికెట్ల నష్టానికి 154 పరుగులు సాధించింది. ఓపెనర్ ఇమాముల్ హక్ (74 బ్యాటింగ్) నిలకడగా ఆడుతున్నాడు. పాక్ ఓ దశలో 99 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. షకీల్ (13 బ్యాటింగ్)తో అభేద్యమైన నాలుగో వికెట్‌కు ఇమాముల్ 51 పరుగులు జోడించాడు.

**ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా**
నేటి నుంచే మూడో టెస్టు
(ఉదయం 5 నుంచి)



## సాంకేతికత పెరిగితే.. ఆట అంచనాలకందదు

**మెల్‌బోర్న్:** భవిష్యత్తులో క్రికెట్లో సాంకేతికత పెరిగి.. ఆట అంచనాలకు అందని విధంగా మారుతుందని ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం గ్రెగ్ చాపెల్ అభిప్రాయపడ్డాడు. డ్రోన్ కెమెరాలు, రోబోలు, కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతికత వినియోగం క్రికెట్లో సర్వ సాధారణంగా మారబోతోందని, కానీ వీటి వల్ల ఆటలో చాలా మార్పు వస్తుందని చాపెల్ అన్నాడు. "సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించుకోవడం వల్ల ఆట అంచనాలకు అందని విధంగా మారుతుంది. ఇప్పటికే సాంకేతికత ప్రభావం ఆట మీద చాలా ఉంది. అంపైరింగ్ నిర్ణయాలను మెరుగుపరిచేందుకు హాక్ ఐ, హాట్ స్పాట్, స్నికో మీటర్ లాంటివి వాడుతున్నాం. 4కే, 5కే కెమెరాలు కూడా అంపైరింగ్‌కు తోడ్పడుతున్నాయి. వివిధ కోణాల్లో ఆటను చూసేందుకు డ్రోన్ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. భవిష్యత్తులో రోబోల వినియోగం పెరుగుతుంది. ఆటగాళ్లు మైదానంలో లేకుండానే సాధన సాగించేందుకు వర్చువల్ రియాలిటీ ఉపయోగపడొచ్చు. సాంకేతికత వల్ల క్రికెట్ వీక్షకులకు కూడా కొత్త అనుభూతి కలుగుతుంది" అని చాపెల్ పేర్కొన్నాడు.

## మనిక @ 35



**దిల్లీ:** భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్రా కెరీర్ ఉత్తమ ర్యాంకు సాధించింది. గత కొంత కాలంగా స్థిరంగా రాణిస్తున్న 27 ఏళ్ల మనిక తాజా ఐటీటీఎఫ్ మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో మూడు ర్యాంకులు మెరుగుపరుచుకుని 35వ స్థానంలో నిలిచింది.

## సింగిల్స్‌లో జకో గెలుపు



**అడిలైడ్:** అడిలైడ్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీలో డబుల్స్ తొలి రౌండ్లోనే ఓడిన సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ సింగిల్స్‌లో శుభారంభం చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సన్నాహకంగా జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జకో 6-3, 6-2తో కాన్‌స్టాంట్ లీస్టిన్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. 2018 ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో ఓడిన తర్వాత కంగారూ గడ్డపై సింగిల్స్‌లో నొవాక్ ఓడలేదు. 2021లో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన అతడు గతేడాది టైటిల్ నిలబెట్టుకునేందుకు వచ్చినా.. కరోనా టీకా తీసుకోని కారణంగా అధికారులు అతడి వీసాను రద్దు చేశారు. ప్రస్తుతం కరోనా నిబంధనలు తొలగిపోవడంతో అధికారులు జకో వీసాను పునరుద్ధరించడంతో మళ్లీ ఆస్ట్రేలియా రావడానికి అతడికి అవకాశం వచ్చింది.

## తుది పోరుకు ఇటలీ, గ్రీస్

**సిడ్నీ:** మాటో బెరిటిని సత్తా చాటడంతో బ్రిస్బేన్‌లో జరుగుతున్న యునైటెడ్ మిక్స్‌డ్ టీమ్ టెన్నిస్ టోర్నీలో ఇటలీ ఫైనల్లో ప్రవేశించింది. గ్రూప్-ఇలో ఆ జట్టు 5-0తో నార్వేను చిత్తు చేసింది. సోమవారమే 2-0 ఆధిక్యంలో నిలిచిన ఇటలీకి.. మంగళవారం బెరిటిని తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు 6-4, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్ కాస్పర్ రూడ్‌కు షాకిచ్చాడు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో ట్రెవిసన్ ఊసియా 6-2, 7-5తో ఇకెరిపై నెగ్గగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో రొస్సెలో-మునెటి 7-6 (6-4), 6-2తో ఇకెరి-దురాసోవిచ్‌పై నెగ్గడంతో ఇటలీ విజయం సంపూర్ణమైంది. మరోవైపు మరియా సకారి రాణించడంతో పెర్త్‌లో జరుగుతున్న టోర్నీలో గ్రీస్ 4-1తో బెల్జియంపై నెగ్గి ఫైనల్ చేరింది. సోమవారం గ్రూప్-ఎలో గ్రీస్-బెల్జియం చెరో మ్యాచ్ నెగ్గగా.. రెండోరోజు పురుషుల సింగిల్స్‌లో సకాల్‌రిడిస్ 5-7, 6-1, 6-3తో బెర్గ్స్‌ను ఓడించి గ్రీస్‌కు 2-1తో ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో 6-1, 7-5తో మెర్టెన్స్‌పై నెగ్గిన సకారి.. సిట్సిపాస్ జతగా మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ విజయాన్ని అందుకుంది. ఈ పోరులో సకారి-సిట్సిపాస్ 6-3, 6-2తో ఫ్లిప్కెన్స్-గ్రీట్స్‌ను ఓడించడంతో గ్రీస్ ఘన విజయాన్ని అందుకుంది.




## పీలేకు కన్నీటి వీడ్కోలు

**శాంటోస్:** బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం పీలేను కడసారి చూసేందుకు శాంటోస్‌లో అభిమానులు భారీగా తరలి వచ్చారు. ప్రజలు సందర్శనార్థం పీలే పార్థివ దేహాన్ని విలా బెల్మిరో స్టేడియంలో ఒక రోజు ఉంచిన అనంతరం మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా సహా వేల మంది స్మశాన వాటిక వరకు అంతిమ యాత్రలో పాల్గొని ఫుట్‌బాల్ మేటికి కన్నీటి వీడ్కోలు పలికారు.

## అల్ నాసర్ క్లబ్‌కు రొనాల్డో



**రియాద్:** పోర్చుగల్ సాకర్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఐరోపా క్లబ్‌ల తరఫున ఇక ఆడకపోవచ్చు. అతడు సౌదీ అరేబియా క్లబ్ అల్ నాసర్‌కు ఆడబోతున్నాడు. శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించిన ఆ క్లబ్.. మంగళవారం రియాద్‌లో జరిగిన వేడుకలో రొనాల్డో పరిచయ కార్యక్రమం నిర్వహించింది. మాంచెస్టర్ యునైటెడ్ యాజమాన్యంతో విభేదాల నేపథ్యంలో ఈ ఐరోపా క్లబ్‌తో రొనాల్డో బంధాన్ని తెంచుకున్న సంగతి తెలిసిందే. ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధికంగా 211 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.1747 కోట్లు) అతను అల్ నాసర్‌తో ఒప్పందం చేసుకున్నాడు.

(c) eenadu

# మెదడులోకీ వాయు గరళం!

## కలుషిత గాలితో మానసిక ఆరోగ్యానికి విఘాతం!

అదృశ్య గరళంలా వాయు కాలుష్యం నానాటికీ సమస్యలను పెంచుతోంది. దీనివల్ల శారీరక రుగ్మతలకు తోడు మానసిక ఇబ్బందులూ అధికమవుతున్నట్లు వెల్లడి కావడం కలవరపెడుతోంది. బాధితుల జీవితాల్లో ఆనందం ఆవిరవుతోందని, కుంగుబాటు పెరుగుతోందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీనిపై దృష్టిపెట్టి, సురక్షిత జీవన మార్గాలను అనుసరించాలంటున్నారు.



వాయు కాలుష్యంతో శ్వాస - గుండె - ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్లు.. అంతిమంగా అకాల మరణాలు సంభవిస్తున్నాయని దశాబ్దాలుగా అనేక పరిశోధనలు ఘోషించాయి. కలుషిత గాలితో కలిగే నష్టాల్లో ఇది ఒక పార్శ్వం మాత్రమే. ఇది శరీరమంతటా తన కోరలను చాస్తూ చివరికి మెదడులోకీ పాకుతున్నట్లు ఇటీవల అనేక పరిశోధనలు వెల్లడించాయి.

- వాయు కాలుష్యం తాకిడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళన, కుంగుబాటు, ఆత్మహత్య భావనలు పెరిగిపోతున్నాయి. వీటి వల్ల బాధితుల రోజువారీ జీవితాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. భావోద్వేగ, సామాజిక అంశాలపరంగా ఇబ్బందులు పెరుగుతున్నాయి.
- బాధితుల ఆలోచన, ఏకాగ్రత, అప్రమత్తత, జ్ఞాపకశక్తి, మేధస్సుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. వారిలో అలసట, చికాకు పెరుగుతోంది.
- బాధితుల్లో సంతృప్తి స్థాయి తగ్గిపోతోంది. నలతకు గురయ్యామనే భావన పెరుగుతోంది.
- మెదడు ఎదుగుదల దశలో ఉన్న చిన్నారులపై ఈ ప్రభావం ఎక్కువ.
- వాయు కాలుష్యం అధికంగా ఉన్న రోజుల్లో మానసిక ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య ఎక్కువని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధనలో తేలింది.

### ఇలా జరుగుతోంది..

కలుషిత గాలి పీల్చేవారి మెదడులో మార్పులు జరుగుతాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా భావోద్వేగాలను నియంత్రించే భాగాల్లో ఈ వైరుధ్యాలు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. మెదడులో సంకేతాలను చేరవేసే న్యూరోట్రాన్స్‌మిటర్ల తీరుతెన్నుల్లో తేడాలొస్తున్నాయని వెల్లడించారు.

**ప్రత్యక్షంగా..**

వాహనాల నుంచి వచ్చే పొగలోని అత్యంత సూక్ష్మ రేణువులు, గాల్లోని ఇతర కాలుష్యకారకాలు.. ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించి, నేరుగా మెదడులోకి చొరబడుతుంటాయి.

**పరోక్షంగా..**

గాల్లోని కాలుష్య రేణువుల వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ కలగొచ్చు. శరీరంలో రోగ నిరోధక స్పందనల తీరును మార్చేయవచ్చు. ఆ ప్రభావం అంతిమంగా మెదడుకూ పాకవచ్చు.

### ఇలా చేయాలి..

వాయు కాలుష్యం ప్రభావాన్ని తప్పించుకోవడానికి ఇప్పటికిప్పుడు ఉన్న ప్రాంతాల నుంచి వేరే చోటుకు తరలిపోవడం కుదరకపోవచ్చు. అలాంటివారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. కలుషిత గాలితో కలిగే మానసిక సమస్యలను తప్పించుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**కంగారొద్దు**

వాయు కాలుష్యంతో కలిగే నష్టాల గురించిన సమాచారాన్ని నిత్యం చదువుతూ అదేపనిగా హైరానా పడొద్దు. దీనివల్ల ఆదుర్దా, కుంగుబాటు మరింత పెరగొచ్చు. కలుషిత గాలి తీవ్ర సమస్య అని, దాన్ని అధిగమించాలని మనకు తెలిసుంటే చాలు.

**కాలుష్యం తాకిడికి గురికావొద్దు**

ఎక్కువ సమయం పాటు వాయు కాలుష్యానికి గురికాకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. దీనివల్ల శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడి, ఇన్‌ఫ్లమేషన్ ప్రభావాలు తగ్గుతాయి.

**మొక్కలు.. మాస్కులు..**

ఇళ్లలో మొక్కలు పెంచాలి. బయటకు వెళ్లినప్పుడు మాస్కు ధరించాలి. ఇవి మన ఆలోచనతీరులో పెద్ద మార్పును కలిగిస్తాయి.

**స్వీయ రక్షణ**

వ్యాయామాల తరహా స్వీయ సంరక్షణ చర్యల్లో నిమగ్నం కావాలి. ఆరుబయట రన్నింగ్‌కు వెళ్లలేకపోతే ఇంట్లోనే దాన్ని చేయాలి.

**అన్నింటికీ చోటుండాలి..**

ఏరోబిక్స్, యోగా, ధ్యానంతో కూడిన మిశ్రమ వ్యాయామ ప్రణాళికను రూపొందించుకోవాలి. ఇవి శరీరంతోపాటు మనసును తేలికపరుస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమవుతుంది.

**అభిరుచులకు సమయమివ్వాలి..**

మనసును నిమగ్నం చేసే పనులు చేయాలి. ఇష్టమైన హాబీలకు సమయం కేటాయించాలి. దీనివల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**విశ్రాంతి**

సరిపడా విశ్రాంతి, నిద్ర అవసరం. దీనివల్ల.. ప్రతికూల ప్రభావాలను అధిగమించడానికి శరీరానికి వీలుకలుగుతుంది. మరుసటి రోజు లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన శక్తి సమకూరుతుంది.

**ఆత్మీయబంధాలు**

స్నేహితులు, కుటుంబ సభ్యులతో సాగించే మంచి బంధాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. మన వ్యవహారశైలిలో మార్పును గుర్తిస్తే మానసిక నిపుణులను సంప్రదించడానికి సంకోచించకూడదు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

# బడ్జెట్ సమావేశాలు 31 నుంచి!

- ఫిబ్రవరి 1న పార్లమెంటులో 2023-24 పద్దు

**దిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభమవుతాయని అధికారిక వర్గాల సమాచారం. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్ ప్రవేశపెడతారు. బడ్జెట్ భేటీలు రెండు విడతలుగా ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి. తొలి విడతలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 10 వరకు, రెండో విడతలో మార్చి 6న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 6న ముగియనున్నట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల తొలి రోజునే ఆర్థిక సర్వే నివేదికను ఉభయ సభల్లో ప్రవేశపెడతారని అధికారులు తెలిపారు. తొలి విడతలో... రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ చేసే తీర్మానంపై చర్చించనున్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి సమాధానం ఇస్తారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో వివిధ మంత్రిత్వ శాఖలకు నిధుల కేటాయింపులపై చర్చించడం, బడ్జెట్‌కు ఆమోదం తెలపడం వంటివి చేపడతారు.

# వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

- పశ్చిమబెంగాల్‌లో ఘటన

**మాల్దా:** పశ్చిమబెంగాల్‌లోని హావ్‌డా-న్యూజల్పాయిగుడీ మధ్య ఇటీవల ప్రారంభమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి జరిగింది. మాల్దా జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. కుమార్‌గంజ్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో సీ13 కోచ్ అద్దాలు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. ఘటనపై ఆర్‌పీఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబరు 30న హావ్‌డా నుంచి ప్రధాని మోదీ ఈ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా భాజపా శ్రేణులు హావ్‌డా రైల్వేస్టేషన్ వద్ద జై శ్రీరామ్ నినాదాలు చేసినందుకు ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందని భాజపా నేత సువేందు అధికారి ఆరోపించారు.

# రెండో బూస్టర్ డోసుపై ఎలాంటి ఆలోచన లేదు: కేంద్రం

**దిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా కరోనా విజృంభిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం రెండో బూస్టర్ డోసుపై మంగళవారం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతానికి రెండో బూస్టర్‌పై ఎలాంటి ఆలోచన లేదని తెలిపింది. "ఇప్పటి వరకు మొదటి బూస్టర్ డోసుకు అర్హులైన వారిలో కేవలం 28శాతం మందే దానిని పొందారు. ముందుగా ఈ డ్రైవ్‌ను పూర్తి చేయాలి" అని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు దేశంలో పంపిణీ చేసిన డోసుల సంఖ్య 220 కోట్లు దాటింది.

# ప్రజా ప్రతినిధులపై అదనపు ఆంక్షలు విధించలేం

- భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**దిల్లీ:** ప్రాథమిక హక్కు అయిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంలో ప్రజా ప్రతినిధులకు కూడా మిగిలిన వారితో సమానంగా.. రాజ్యాంగంలోని 19(2) అధికరణ ప్రకారం ఉన్న నిబంధనలే వర్తిస్తాయని, వారికోసం ప్రత్యేక ఆంక్షలు విధించలేమని స్పష్టంచేసింది. ఉమ్మడి బాధ్యత అనే సిద్ధాంతాన్ని వర్తింపజేసినప్పుడు కూడా ఒక మంత్రి ప్రకటనను ప్రభుత్వానికి ఆపాదించలేమని తెలిపింది. 2016లో బులంద్‌షహర్ సమీపంలో జాతీయ రహదారిపై సామూహిక అత్యాచారానికి గురైన తల్లీ-కుమార్తెల ఉదంతాన్ని రాజకీయ కుట్రగా అప్పటి మంత్రి ఆజంఖాన్ అభివర్ణించడానికి సంబంధించిన కేసులో ఈ మేరకు జస్టిస్ ఎస్.ఎ.నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం 4:1 మెజార్టీతో తీర్పు వెలువరించింది. తన తరఫున, మరో ముగ్గురు న్యాయమూర్తుల తరఫున జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ఈ తీర్పును రాశారు. ఉమ్మడి బాధ్యత అనేది రాజకీయ భావన అని, చట్టపరమైన వెసులుబాటు మంత్రులెవరైనా మౌఖికంగా చేసే ప్రతి ప్రకటనకూ దీనిని వర్తింపజేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధుల వాక్ స్వాతంత్ర్యంపై ఆంక్షలు విధించవచ్చా అనే ప్రశ్నపై వాదోపవాదనలు నడిచాయి. ఈ హక్కుకు కళ్లెం వేయడానికి విస్తృత ప్రాతిపదికలు రాజ్యాంగంలో ఉన్నాయని ధర్మాసనం తెలిపింది. వాక్ స్వాతంత్ర్యంపై అదనపు ఆంక్షల విషయంలో దాదాపు ధర్మాసనమంతా ఒకే అభిప్రాయం వెలిబుచ్చింది. వ్యక్తులు, సమూహాలు, సమాజం, న్యాయవ్యవస్థ, దేశం, రాజ్యం.. ఇలా దేనిపై జరిగే దాడులనైనా అడ్డుకునేందుకు రాజ్యాంగంలోని 19(2) అధికరణలోని ఆంక్షలు సరిపోతాయని పేర్కొంది. ఒక మంత్రికి తగిలిన దెబ్బలు మానిపోతాయి గానీ మనసును బాధపెట్టే మాటల గాయాలు మాత్రం అలాగే ఉండిపోతాయంటూ పలువురు కవుల్ని ఉటంకించింది. ఎదుటివారికి ప్రియమైన మాటలే చెప్పాల్సిన అవసరాన్ని సుతిమెత్తగా గుర్తుచేసింది. గత నవంబరు 15న ఈ కేసులో తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. ప్రభుత్వ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు స్వీయ నియంత్రణ పాటించాలని, ఇతరులను అవమానించేలా మాట్లాడడం తగదని పేర్కొంది. ఇది మన రాజ్యాంగ సంస్కృతిలోనే ఉందని, ప్రత్యేకంగా ప్రజాప్రతినిధులకు ప్రవర్తన నియమావళి రూపొందించాల్సిన అవసరం లేదని ఆరోజు స్పష్టంచేసింది.

**అధికారిక హోదాలో చేస్తే ప్రభుత్వానికి ఆపాదించవచ్చు: జస్టిస్ నాగరత్న**

ధర్మాసనంలో ఒకరైన జస్టిస్ బి.వి.నాగరత్న మంగళవారం 121 పేజీల్లో భిన్నమైన తీర్పు ఇచ్చారు. 19వ అధికరణ నిబంధల మేరకు వాక్ స్వాతంత్ర్యంపై అధిక పరిమితి విధించలేమని మాత్రం అంగీకరించారు. ఒక మంత్రి తన అధికారిక హోదాలో అవమానకరమైన ప్రకటనలు చేసినట్టయితే, అలాంటి వాటికి ప్రభుత్వాన్ని పరోక్షంగా జవాబుదారీగా చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. మనలాంటి దేశంలో.. సమాజాన్ని విభజించే విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం విభిన్న నేపథ్యాలు కలిగిన పౌరులపై దాడేనని ఆమె అభిప్రాయపడ్డారు. పౌరులకు భావప్రకటనా స్వేచ్ఛ చాలా అవసరమని, తద్వారా పాలనపై వారికి మంచి అవగాహన ఏర్పడుతుందని ఆమె తెలిపారు. ప్రజా ప్రతినిధులకు స్వీయ నియంత్రణ అవసరమని తీర్పులో ప్రస్తావించారు. విద్వేషపూరిత ప్రసంగం.. రాజ్యాంగ పునాదులపై దాడి చేస్తుందని అన్నారు.

**అనాలోచిత ప్రసంగాలు ఆందోళనకరం**

అనాలోచిత ప్రసంగాలు ఇటీవలి కాలంలో ఆందోళనకరంగా మారుతూ నొప్పించేలా ఉంటున్నాయని జస్టిస్ నాగరత్న చెప్పారు. ఇవి సమాజంలో అసమానతల్ని పెంచుతున్నాయన్నారు. వివిధ రంగాల్లోని ప్రముఖులు తమ మాటల విషయంలో మరింత బాధ్యతాయుతంగా మెలగి, సంయమనం పాటించాలని అభిప్రాయపడ్డారు. తమ మాటలు ప్రజలపై చూపించే ప్రభావాన్ని వారు అంచనా వేయగలగాలని, మంత్రుల ప్రసంగాల విషయంలో పార్టీలు నియంత్రణ చర్యల్ని చేపట్టాలని అన్నారు. సాటివారికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయకుండా ప్రజాప్రతినిధుల్ని నిలువరించేలా చట్టాన్ని చేయాల్సింది పార్లమెంటేనని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అవసరమని చెప్పారు.

కుటుంబ పెద్ద స్వీయ ధ్రువీకరణతో..

# ఆధార్‌లో చిరునామా మార్పు!



**ఈనాడు, దిల్లీ:** ఆధార్ కార్డులో చిరునామా మార్చుకునేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) మరో వెసులుబాటును తీసుకొచ్చింది. ఆధార్‌లో భార్య, పిల్లల చిరునామా(అడ్రస్) మార్చాలంటే ఇదివరకు వారి పేరున ఉండే గుర్తింపు కార్డును చూపించాల్సి వచ్చేది. అలా కాకుండా కుటుంబ పెద్ద స్వీయ ధ్రువీకరణ(సెల్ఫ్‌డిక్లరేషన్) పత్రంతో పిల్లలు, జీవితభాగస్వామి చిరునామాను మార్చే కొత్త విధానాన్ని ఇప్పుడు తీసుకొచ్చినట్లు ఆ సంస్థ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ''చిరునామా మార్పు కోసం ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలకు అదనంగా ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాం. 18 ఏళ్లు పైబడిన ఎవరైనా చిరునామా మార్పు కోసం కుటుంబ పెద్దగా వ్యవహరించొచ్చు'' అని యూఐడీఏఐ పేర్కొంది.

# దిల్లీలో 16, 17 తేదీల్లో భాజపా జాతీయ కార్యవర్గ భేటీ

**దిల్లీ:** భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 16, 17 తేదీల్లో దిల్లీలో జరగనున్నాయి. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహాల ఖరారు, 2024 లోక్‌సభ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం, సంస్థాగత విషయాలు ప్రధాన ఎజెండాగా ఈ సమావేశాలు సాగనున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

# నాయకులుగా మాకు విలువ లేదు

- వాలంటీర్లు ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదు
- వైకాపా ముఖ్యనేతల సమావేశంలో అసంతృప్తి జ్వాలలు

**పెడన, న్యూస్‌టుడే:** పెడన నియోజకవర్గ వైకాపా ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతల సమావేశంలో ప్రభుత్వంపై అసంతృప్తి బహిర్గతమైంది. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్ స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం హాలులో ముఖ్య నేతలతో మంగళవారం సమావేశమయ్యారు. మంత్రి జోగి రమేష్ కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. మండలాల వారీగా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో కో-ఆర్డినేటర్లు వివిధ అంశాలపై చర్చించారు. కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గూడూరు మండలాలు, పెడన అర్బన్ నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉదయం 11 నుంచి రాత్రి 8గంటల వరకు ఈ సమావేశం అంతర్గతంగా జరిగింది. వాలంటీర్ల వ్యవస్థ కారణంగా పంచాయతీల్లో నాయకులకు విలువ లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, అన్నీ తామై వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీలు ఆర్థికంగా దివాళా తీశాయని, ఫలితంగా తాము ఉత్సవ విగ్రహాలుగా మారామని సర్పంచులు వాపోయారు. ప్రభుత్వ పథకాల అమల్లో నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొంత మంది చెప్పారు. ఇతర ప్రాంతాల నాయకుల పెత్తనాలు నియోజకవర్గంలో పెరిగిపోయాయని కృత్తివెన్ను మండల నాయకులు ఇద్దరు ఫిర్యాదు చేశారు. పక్క జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ చెరువులు తవ్వుతున్నారని, గ్రామ స్థాయిలో వ్యతిరేకించినా ఖాతరు చేయడం లేదని చెప్పారు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ఎస్సీ జనాభా అధికంగా ఉన్నా మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీని ఈ వర్గాలకు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టులు పొంది ఆర్థికంగా దివాళా తీశామని పలువురు నాయకులు వాపోయారు. పనులు పూర్తయినా బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నామినేషన్, టెండర్ పనులను చేపట్టిన నాయకుల ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని, ఫలితంగా కొన్ని పనులను ఎక్కడికక్కడ నిలిపివేశామని కో-ఆర్డినేటర్ల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే ప్రగతి ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు.

# అమిత్ షా కర్నూలు పర్యటన వాయిదా

**కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే:** కర్నూలులో ఈనెల 8న జరగాల్సిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన తాత్కాలికంగా వాయిదా పడిందని భాజపా మీడియా వర్గం మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది.

# ఎవరీ ఉయ్యూరు శ్రీనివాసరావు?

- ఫౌండేషన్ ద్వారా విదేశీ విద్యకు వడ్డీలేని రుణం
- మూడు చోట్ల సొంత ఖర్చుతో అన్న క్యాంటీన్లు



**ఈనాడు, అమరావతి:** విదేశాలకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు.. జన్మభూమికి సేవలందించేందుకు ముందుకొస్తున్నాయి. తమ సంపాదన నుంచి సేవా కార్యక్రమాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. అలాంటి వారిలో ఒకరే వర్జీనియాలో స్థిరపడిన ఉయ్యూరు శ్రీనివాసరావు. ఎన్టీఆర్‌కు వీరాభిమాని. గుంటూరు జిల్లా వేజెండ్లకు చెందిన ఆయన.. పేదలు, విద్యార్థులను ఆదుకునేందుకు ఎన్టీఆర్ ఫ్యాన్స్ యూఎస్‌ఏ ఇన్ కార్పొరేషన్ అనే సంస్థ ద్వారా ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నారు.

**అమెరికా చదువుకు వడ్డీలేని రుణాలు**

గ్రామీణ విద్యార్థులకు వ్యవసాయ భూములపై విద్యారుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. పలువురు విదేశీ విద్యకు దూరమవుతున్నారు. కొవిడ్ సమయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాంటి వారికి ఉయ్యూరు ఫౌండేషన్ తరఫున సాయం చేయాలని నిర్ణయించారు. ఒక్కో విద్యార్థికి రెండేళ్ల చదువుకు అవసరమయ్యే 50వేల డాలర్లను ఇలా అందిస్తారు. చదువు పూర్తయి.. ఉద్యోగంలో చేరాక వారు అసలును తిరిగి చెల్లించవచ్చు. 2022 మే 28న ప్రారంభించిన కార్యక్రమం ద్వారా తొలి ఏడాది 20 మందికి రుణాలు ఇచ్చామని, వచ్చే ఏడాది మరింత మందికి ఇస్తామని శ్రీనివాసరావు వివరించారు.

**సొంత ఖర్చుతో అన్న క్యాంటీన్లు**

గతంలో అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు ఆహారం అందేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక వాటిని మూసివేసింది. పేదలకు తన వంతుగా అన్నదానం చేయాలనే లక్ష్యంతో గుంటూరు నగరంలో 2, హిందూపురంలో 1 చొప్పున అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రోజూ 500 మందికి ఆహారం అందిస్తున్నారు. అన్నంతో పాటు పప్పు కూర, రోటి పచ్చడి, సాంబారు, ఒక మిఠాయి, పెరుగును వడ్డిస్తున్నామని చెప్పారు.

**జన్మభూమిలో మరిన్ని సేవా కార్యక్రమాలు**

తమ సొంత నియోజకవర్గంలోని పేదలను ఆదుకునేందుకు పలు కార్యక్రమాలను శ్రీనివాసరావు చేపట్టారు. దసరా సమయంలో వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అన్నగారి జనతా వస్త్రాలు, సంక్రాంతి కానుకల ద్వారా పేదలకు చేయూత ఇవ్వాలనే ఆలోచనతో.. సుమారు 18వేల మందికి అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 'ఈ నెలలోనే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొబైల్ అంబులెన్స్ ద్వారా మురికి వాడల్లో వైద్య సేవలు అందించబోతున్నాం. ఒక వైద్యుడితోపాటు ల్యాబ్ ఏర్పాటు చేస్తాం. అవసరమైన మందులను ఉచితంగా ఇస్తాం. 18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 35వేల మందికి అన్నదానం చేయాలని నిర్ణయించాం. పేద విద్యార్థులకు సాయంత్రం ట్యూషన్లు చెప్పించే ఆలోచన ఉంది. అవసరమైన చోట శుద్ధ జల ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధం' అని చెప్పారు. తెలుగు భాష అభివృద్ధికి గ్రంథాలయాల ఏర్పాటు, వేసవిలో క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

# రోజువారీ జీవితాన్ని సైన్స్ మార్చాలి

- పరిశోధనలపై మరింతగా దృష్టి సారించండి
- యువశాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు
- నాగ్‌పుర్‌లో 108వ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం



**నాగ్‌పుర్:** శాస్త్రవేత్తలు దేశాన్ని స్వయం సమృద్ధం చేయాలని, ప్రజల రోజువారీ జీవితంలో మార్పులు తేవడంపై దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. 108వ భారత సైన్స్ కాంగ్రెస్‌ను మంగళవారం ఆయన దిల్లీ నుంచి వీడియో సమావేశం విధానంలో ప్రారంభించారు. శాస్త్రీయ పద్ధతులను బలోపేతం చేయాలని, క్వాంటమ్ టెక్నాలజీలు, డేటా సైన్స్, కొత్త టీకాల అభివృద్ధి, కొత్త వ్యాధులను గుర్తించడం లాంటి వాటిపై దృష్టి పెట్టడంతో పాటు యువతరాన్ని పరిశోధనల దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. అయిదు రోజుల పాటు కొనసాగే భారత సైన్స్ కాంగ్రెస్‌ను రాష్ట్రసంత్ తుక్‌డోజీ మహారాజ్ నాగ్‌పుర్ విశ్వవిద్యాలయంలో ప్రధాని ప్రారంభించారు. పరిశోధనలు ప్రయోగశాల నుంచి బయటికొచ్చి నేలమీద కనపడాలని, వాటి ప్రభావం అంతర్జాతీయ స్థాయి నుంచి క్షేత్రస్థాయికి వచ్చినప్పుడే ఆ ప్రయత్నాలు గొప్ప లక్ష్యాలు సాధించినట్లు అవుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

భారతదేశం ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్లు, రసాయన శాస్త్రం, కమ్యూనికేషన్లు, సెన్సర్లు, క్రిప్టోగ్రఫీ వైపు వేగంగా వెళ్తోందని, యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ రంగంలో నైపుణ్యం సాధించి ఎదగాలని మోదీ ఆకాంక్షించారు.

**ఖురాన్‌ను ప్రదర్శించిన ఆర్ఎస్ఎస్ అనుకూల సంస్థ**

**నాగ్‌పుర్:** భారత సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుకూల సంస్థ రీసెర్చ్ ఫర్ రిసర్జెన్స్ ఫౌండేషన్ (ఆర్ఎఫ్ఆర్ఎఫ్) బంగారు సిరాతో రాసిన ఖురాన్ ప్రతిని ప్రదర్శనకు ఉంచింది. ఇలాంటి పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా నాలుగు మాత్రమే ఉన్నాయని సంస్థ ప్రతినిధి తెలిపారు. దీనిని హైదరాబాద్ నిజాం కుటుంబం దగ్గర పనిచేసిన దివాన్ ఒకరు తమ సంస్థకు ఇచ్చారన్నారు. 16వ శతాబ్దానికి చెందినదిగా చెప్పే ఈ పుస్తకంలో 385 పేజీలు ఉంటాయని వాటిలో ఒక్క అచ్చు తప్పూ ఉండదన్నారు.



నెతన్యాహు కుటుంబ స్నేహితురాలికి

# ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారం

**జెరూసలెం:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కుటుంబానికి స్నేహితురాలైన ప్రవాస భారతీయురాలు, ప్రముఖ పాకశాస్త్ర నిపుణురాలు రీనా వినోద్ పుష్కర్ణను భారత ప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారానికి ఎంపికచేసింది. ప్రవాసీయులకు ఇచ్చే ఈ అవార్డుకు ఈ ఏడాది 21 మందిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించారు. ఆర్మీ కుటుంబంలో జన్మించిన రీనా తన భర్త వినోద్‌తో కలిసి 1983లోనే ఇజ్రాయెల్‌కు వచ్చేశారు. అప్పట్లోనే 'తందూరి' అనే రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి, ఇక్కడి వారికి భారతీయ రుచులను పరిచయం చేశారు. నెతన్యాహు తన కాబోయే భార్య సారాను మొదటిసారి ఈ రెస్టారెంట్‌లోనే కలిశారు. అప్పటి నుంచి రీనాకు, నెతన్యాహు కుటుంబానికి మంచి స్నేహం ఏర్పడింది. 2017లో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చినపుడు ఆయనకు ఆహారాన్ని తయారుచేసే ఉన్నత స్థాయి బృందంలో ఒకరిగా రీనాను ఎంపికచేశారు.

# యాజమాన్యం ఇష్టప్రకారమే

## సినిమా హాళ్లలోకి బయటి తినుబండారాల అనుమతిపై సుప్రీం తీర్పు

**దిల్లీ:** సినిమా హాళ్లలోకి బయట నుంచి ఆహారం, పానీయాల అనుమతిపై సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు యజమానుల ప్రైవేట్ ఆస్తులని, ఆ ప్రాంగణాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను నిర్ణయించే హక్కు వారికి ఉంటుందని తెలిపింది. ప్రేక్షకులు తినుబండారాలను లోపలకు తీసుకెళ్లకుండా నియంత్రించే అధికారం యాజమాన్యాలకు ఉంటుందని స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ నరసింహాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. అయితే, హాళ్ల యాజమాన్యం ప్రేక్షకుడికి స్వచ్ఛమైన తాగునీటిని ఉచితంగా అందించాలని తెలిపింది. తల్లిదండ్రుల వెంట వచ్చే పసిపిల్లలకు అవసరమయ్యే పోషకాహారాన్ని అనుమతించాలని పేర్కొంది. 'సినిమా చూడాలా వద్దా అనేది ప్రేక్షకుడి ఇష్టం. థియేటర్ ప్రాంగణంలోకి ప్రవేశార్హతను పొందాలంటే అక్కడి నిబంధనలకు బద్ధుడై ఉండాలి. వారి వెంట బయటి తినుబండారాలను అనుమతించడం, అనుమతించకపోవడం అనేది యజమాని వ్యాపారపరమైన నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ చట్టాలు, ప్రజాప్రయోజనాలు, భద్రత ప్రమాణాలకు భంగంకలగనంత వరకు థియేటర్ యాజమాన్యానికి ఆ హక్కు ఉంటుందని తెలిపింది. ప్రేక్షకులు సినిమా హాళ్లలోకి ఆహారం, పానీయాలు తీసుకెళ్లడాన్ని నిరోధించ వద్దని మల్టీప్లెక్స్‌లు, సినిమా హాళ్ల నిర్వాహకులను జమ్మూకశ్మీర్ హైకోర్టు 2018లో ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది.

మల్టీప్లెక్స్‌లు, థియేటర్ల ప్రాంగణాల్లో విక్రయించే ఆహార పదార్థాలు, పానీయాల ధరలు చాలా అధికంగా ఉండడంపై విమర్శలు వస్తున్న పరిస్థితుల్లో సుప్రీం తీర్పు వెలువడడం గమనార్హం.



'ప్రేక్షకులు వినోదం కోసమే థియేటర్లకు వస్తారు. వాళ్లు బయట నుంచి తీసుకొచ్చే ఆహారం, పానీయాలను లోపలికి అనుమతించాలో వద్దో నిర్ణయించే హక్కు సినిమా హాల్ యాజమాన్యాలకు ఉంటుంది. ప్రాంగణం లోపల అందుబాటులో ఉన్న స్నాక్స్, కూల్ డ్రింక్స్ కొనుగోలు చేయాలా? వద్దా అనేది ప్రేక్షకుడి ఇష్టం. అక్కడి తినుబండారాలను కొనుగోలు చేయాలన్న నిర్బంధమేమీ ఉండదు'

-సుప్రీంకోర్టు

# యూపీలో ప్రవేశించిన జోడో యాత్ర

- అంబానీ, అదానీ..రాహుల్‌ను కొనలేరు
- ప్రియాంక గాంధీ వ్యాఖ్య



**దిల్లీ:** తొమ్మిది రోజుల విరామం అనంతరం కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర' మంగళవారం దిల్లీ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రవేశించింది. గజియాబాద్‌లో గల లోని సరిహద్దు వద్ద ఏఐసీసీ ప్రధానకార్యదర్శి, ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌ఛార్జి ప్రియాంక గాంధీ వాద్రా.. సోదరుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి స్వాగతం పలికి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ చౌదరి, సీఎల్పీ నేత ఆరాధనా మిశ్ర తదితరులు ఆమెవెంట ఉన్నారు. యాత్ర రెండురోజుల పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లో జరగనుంది. అనంతరం గురువారం సాయంత్రానికి హరియాణాలోని పానీపత్‌లోకి ప్రవేశించనుంది.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అదానీ, అంబానీ కొనుగోలు చేయలేరని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. రాహుల్ ప్రతిష్ఠను దెబ్బతిసేందుకు కేంద్రం ప్రయత్నించినా ఆయన భయపడరని స్పష్టం చేశారు. రాహుల్‌ను యోధుడుగా ఆమె అభివర్ణించారు. ''అదానీ, అంబానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తలు.. చాలా మంది రాజకీయ నాయకులను, మీడియాను, ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోలు చేసి ఉండవచ్చు. కానీ వారు నా సోదరుడు రాహుల్ గాంధీని కొనలేరు. ఆయనకు శీతాకాలంలో కూడా చలి వేయట్లేదని ప్రజలు అంటున్నారు.. అందుకు కారణం ఆయన సత్య కవచాన్ని ధరించడమే. కన్యాకుమారి నుంచి 3,000 కిలోమీటర్లు యాత్ర చేసిన నా సోదరుడికి ఉత్తర్‌ప్రదేశ్‌లోకి స్వాగతం పలకడం గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు.

(c) eenadu

# ట్రాఫిక్ మళ్లించి.. దుకాణాలు మూయించి

● రాజమహేంద్రవరంలో ఆంక్షలు.. అడ్డంకులు



రాజమహేంద్రవరంలో రోడ్ షో మార్గంలో మూతపడ్డ దుకాణాలు ★ సభలో సీఎం మాట్లాడుతుండగా బయటకెళ్లిపోతున్న జనం ★ సభాస్థలి దగ్గర ఆహార పొట్లాల కోసం ఎగబడుతున్న జనం ★ సీఎం సభకు వచ్చినట్లు గుర్తుగా వృద్ధుడితో వేలిముద్ర వేయిస్తున్న ఓ వాలంటీర్

ఈనాడు, రాజమహేంద్రవరం - న్యూస్‌టుడే, టి.నగర్, కంబాలచెరువు, వి.ఎల్.పురం: రాజమహేంద్రవరంలో సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షో వల్ల స్థానికులకు ఇబ్బందులెదురయ్యాయి. మంగళవారం సీఎం వాహనశ్రేణి సాగే మార్గంలో మున్సిపల్ స్టేడియం, డీలక్స్ సెంటర్, అప్సర థియేటర్ రోడ్డు, జాంపేట, ఆజాద్ చౌక్, నందం గనిరాజ కూడలి, వై.జంక్షన్ ప్రాంతాల్లో దుకాణాలను మూయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా.. ముందు రోజు వరకూ దుకాణాలు తెరుచుకోవడానికి ఎలాంటి ఇబ్బందీ లేదని నమ్మబలికారు. మంగళవారం సీఎం వెళ్లే మార్గంవైపు ఎవరినీ అనుమతించకుండా.. పోలీసులు భారీగా మోహరించారు. ఆర్టీసీ బస్సులతో జనాన్ని తరలించిన డ్రైవర్లు భోజనాలందక అసహనం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను నిలదీశారు. కంబాలచెరువు, దేవీచౌక్, వై.జంక్షన్, గోదావరి గట్టు రోడ్డు, మోరంపూడి, కోరుకొండ రోడ్లలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లేందుకు ప్రయత్నించిన వాహన చోదకులను పోలీసులు నిలువరించడంతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఉదయం 8 గంటల నుంచే జిల్లా నలుమూలల నుంచి పింఛనుదారులను ప్రత్యేక బస్సుల్లో రాజమహేంద్రవరం తరలించారు. మధ్యాహ్నందాకా వారు ఆపసోపాలు పడ్డారు. కొందరు నీరసించి సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరిగారు. సీఎం సభకు వస్తేనే పింఛను ఇస్తామన్న షరతుతో లబ్ధిదారులను రప్పించిన వాలంటీర్లు.. సభ ముగిశాక అక్కడే వేలి ముద్రలు వేయించి సొమ్ము అందించడం గమనార్హం.

✦ అర్హత ఉన్నా పింఛను తీసేశారంటూ... తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తెదేపా కార్యకర్తలు సోమాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిరసనకు దిగారు. వాసు, ఇతర కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రకాశ్‌నగర్ స్టేషన్‌కు తరలించారు.

### రాకపోతే పథకాలు రద్దే..

'ముఖ్యమంత్రి సభకు వచ్చి తీరాలి.. లేదంటే మీ పింఛన్లు, ఇతర పథకాలను రద్దు చేస్తాం' అంటూ వాలంటీర్లు హెచ్చరించడం చర్చనీయాంశమైంది. సామాజిక మాధ్యమాల్లో ఈ ఆడియో హల్‌చల్ చేసింది. 'మళ్లీ గుర్తు చేస్తున్నా. పింఛనుదారులు, ఇళ్ల పట్టాలవారు, చేదోడు, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, కాపు నేస్తం, ఆటోనేస్తం.. ఇలా వివిధ పథకాలకు అర్హులైనవారంతా ఉదయం 9 గంటలకు సచివాలయం దగ్గరకు వచ్చేయండి. అక్కడ వాహనాలున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చి తీరాలి.. లేని పక్షంలో మీ పింఛన్లు, స్కీములను రద్దు చేస్తాం. తర్వాత మీ ఇష్టం' అనే హెచ్చరిక ఆ ఆడియోలో ఉన్నాయి.

# సీఎం సభకొచ్చి కాలు కోల్పోయిన వృద్ధురాలు

- రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని ప్రమాదం
- ఎడమకాలు తొలగించిన వైద్యులు
- జన సమీకరణ పిచ్చితోనే ప్రమాదం: తెదేపా నేతలు
- వ్యక్తిగత పనిపై వచ్చే క్రమంలోనే ఘటన అన్న పోలీసులు





చికిత్స పొందుతున్న ఆర్జి పార్వతి ★ పార్వతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యే వర్మ, కొండబాబు తదితరులు

కంబాల చెరువు, మసీదు సెంటర్- న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి వస్తున్నారు.. ఆ సభకు రాకపోతే పింఛను పోతాయని వాలంటీర్ల హెచ్చరికలు లబ్ధిదారులకు గుబులు రేపాయి. ఈ ఆందోళనే 70 ఏళ్ల వృద్ధురాలికి ప్రాణసంకటంగా మారింది. తన స్వగ్రామం నుంచి రాజమహేంద్రవరం వచ్చిన వృద్ధురాలు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. వైద్యులు ఆమె ఎడమ కాలిని తొలగించారు. ముఖ్యమంత్రి జగన్ రోడ్‌షో, బహిరంగ సభ రోజైన మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకోవడం రాజకీయ దుమారం రేపింది. వృద్ధురాలు సీఎం సభకు వస్తుండగా ప్రమాదం జరిగిందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కాకినాడలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి సంఘీభావం తెలుపుతూ ప్రభుత్వ తీరును తెదేపా నాయకులు దుయ్యబట్టారు.

ఏం జరిగిందంటే... రాజానగరం మండలం నామవరం గ్రామస్థురాలు ఆర్జి పార్వతి(70) మంగళవారం ఉదయం రాజమహేంద్రవరంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆమె రెండు కాళ్లపై నుంచి వాహనం వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అత్యవసర వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. సీఎం సభకు రాకపోతే పింఛను నిలిపివేస్తామని వాలంటీర్లు చెప్పడంతో నడవలేని స్థితిలో ఉండి పింఛను పొందుతున్న తన భర్తకు బదులుగా (?) ఆర్టీసీ బస్సులో పార్వతి సభాప్రాంగణానికి బయలుదేరినట్లు తెలుస్తోంది. లాలాచెరువు వద్ద ఆర్టీసీ బస్సు దిగి నడిచి వెళ్తుండగా దొంతమూరు నుంచి సీఎం సభకు జనాన్ని తీసుకొస్తున్న కాకినాడ డిపో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఎడమకాలు పూర్తిగా నుజ్జునుజ్జయి.. కుడికాలు ఎముక విరిగిపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. అపస్మారక స్థితికి చేరిన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి కాకినాడ తరలించారు. దీనిపై రాజానగరం సర్వజన ఆసుపత్రి, కాకినాడ జీజీహెచ్ ఔట్ పోస్టు పోలీసుస్టేషన్లలో కేసు నమోదు కాలేదు. కాకినాడ జీజీహెచ్ ఔట్‌పోస్టు నుంచి వివరాలను రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్ పోలీసుస్టేషన్‌కు పంపామని చెబుతుంటే.. తమకు సమాచారం రాలేదని ప్రకాశ్‌నగర్ పోలీసులు స్పష్టంచేశారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలిని తెదేపా నేతలు నిమ్మకాయల చినరాజప్ప, వర్మ, వనమాడి కొండబాబు, సుంకర పావని పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఇది లాఉండగా... జీజీహెచ్‌కు వచ్చినప్పుడు పార్వతికి బీపీ, పల్స్ పడిపోయాయని, ఆమె షాక్‌లో ఉన్నారని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి చెప్పారు. ఆమె రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రక్తం ఎక్కించడంతో ఆమెకు బీపీ మెరుగైందన్నారు. ఆర్థోపెడిక్ వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉన్న పార్వతి ఎడమ కాలిని మోకాలి పైభాగం వరకు తొలగించినట్లు చెప్పారు.

బెదిరించి తీసుకెళ్లారు... సీఎం సభకు రావాలని, లేకపోతే పింఛను రద్దయిపోతుందని వాలంటీర్లు బలవంతం చేయడంతోనే పార్వతి నామవరంలోని (?) వాసులతో కలిసి ఆర్టీసీ బస్సులో సభ వద్దకు వెళ్లినట్లు ఇరుగుపొరుగు వారు చెబుతున్నారు. తన భర్త మంచానికే పరిమితం కావడంతో అన్నీ తానై చూసుకుంటోందని, ఇప్పుడు ప్రమాదంలో కాలు కోల్పోవడంతో వారి బతుకెలా సాగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అంతా అసత్య ప్రచారం: పోలీసు కార్యాలయం

సీఎం సభకు తరలించిన వృద్ధ మహిళ బస్సు దిగుతూ జారిపోతే.. పక్క నుంచి వస్తున్న మరో వాహనం కాళ్లపై నుంచి ఎక్కడంతో తీవ్ర గాయాలైనట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అంశాన్ని మీడియా గ్రూపులో అధికారికంగా పోస్టు చేశారు. మహిళ తన సొంత పనిమీద రాజమహేంద్రవరం వచ్చినప్పుడు ప్రమాదం జరిగిందని... సీఎం సభకు ఈ ప్రమాదానికి ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. సీఎం సభకు వచ్చిన వారంతా సీటీఆర్ఐ, వై జంక్షన్ వద్ద బస్సు దిగారని.. లాలాచెరువు వద్ద బస్సులు దిగలేదని పేర్కొన్నారు. సాయంత్రం పోస్టు చేసిన ప్రకటనను రాత్రికి వాట్సప్ పోలీసు- మీడియా అధికారిక గ్రూపు నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. పార్వతి వ్యక్తిగత పనిపై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు.

## దళితులపై వైకాపా దాష్టీకం

- చిత్తూరు జిల్లాలో పట్టపగలే దారుణం
- మహిళలను జుట్టుపట్టుకు లాగి.. కాళ్లతో తన్ని కర్రలతో దాడి



రెడ్డప్ప కుటుంబీకులను కాలితో తన్నుతున్న కృష్ణమూర్తి మద్దతుదారులు ★ పోలీసులకు గాయాలను చూపుతున్న రెడ్డప్ప, ఆయన తండ్రి శ్రీనివాసులు

ఈనాడు డిజిటల్, చిత్తూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం బోయకొండ క్రాస్‌లో అధికార వైకాపా కార్యకర్త, ఆయన కుటుంబసభ్యులు, అనుచరులు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వృద్ధులపై దాష్టీకానికి పాల్పడ్డారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని కాళ్లతో తన్ని, కర్రలతో వారిపై దాడికి దిగడంతోపాటు కులం పేరుతో దూషించారు. బాధిత కుటుంబానికి చెందిన సమీర అనే బాలిక దృశ్యాల్ని ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఫోన్ లాక్కుని పగలగొట్టారు. దివ్యాంగుడైన నాగేంద్ర అనే వ్యక్తి వేళ్లు విరిచేశారు. బాధితుడైన రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. (?) పంచాయతీకి చెందిన శ్రీనివాసులుకు బోయకొండ క్రాస్‌లో 2.82 ఎకరాలు, ఆయన తండ్రి శ్రీ పాలెం నారాయణ పేరిట మరో 1.60 ఎకరాల ఎసైన్డ్ భూమి ఉంది. ఆ పక్కనే వైకాపా కార్యకర్త అయిన ఆవుల కృష్ణమూర్తికి కొంత భూమి ఉంది. ఇటీవల కృష్ణమూర్తి కుటుంబీకులతో పాటు మరికొందరు శ్రీనివాసులు, నారాయణ భూమిలో కొంత భాగానికి బోగస్ పట్టాలు సృష్టించారు. మంగళవారం ఉదయం కృష్ణమూర్తి, ఆయన భార్య నరసమ్మ, కుమారుడు గణపతి, మహేష్, ప్రసాద్, కోడలు శిల్పతోపాటు సుమారు 40 మంది మద్దతుదారులు అక్కడ రాతి స్తంభాలు నాటడానికి వచ్చారు. ఈ భూమి తమదంటూ శ్రీనివాసులు, ఆయన కుటుంబసభ్యులతో వివాదానికి దిగి దాడి చేశారు. తొలుత శ్రీనివాసులు కుమారుడు రెడ్డెప్పను కృష్ణమూర్తి కుమారుడు గణపతి దాష్టీకానికి దిగాడు. ఆయన భార్య జయశ్రీ అడ్డుకోగా కృష్ణమూర్తి కాలితో తన్నాడు. అతడి కుటుంబసభ్యులు నరసమ్మ, శిల్ప జుట్టు పట్టుకున్నారు. రెడ్డెప్ప తల్లి రమణమ్మను నడుంపై కర్రతో కొట్టారు. ఆపడానికి వచ్చిన మమత, పావని చిత్రీకరిస్తున్న 16 ఏళ్ల బాలిక సమీరను కృష్ణమూర్తి మద్దతుదారులు కాళ్లతో తన్నారు. దగ్గరలో ఉన్న కొందరు వచ్చి దాడిని ఆపారు. ప్రస్తుతం రమణమ్మ నడవలేని స్థితిలో ఉన్నారు. ఆమెతోపాటు శ్రీనివాసులు, నాగేంద్ర మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైకాపా దౌర్జన్యంపై పోలీసులు కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

## ఆన్‌లైన్ అప్పులకు యువకుడి ఆత్మహత్య

'అమ్మా.. నన్ను క్షమించు..' అంటూ లేఖ



జానకిరాం

పెనుమూరు, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ అప్పులకు మరో యువకుడు బలైపోయాడు. చిత్తూరు జిల్లా మండల కేంద్రమైన పెనుమూరు అంబేడ్కర్ కాలనీలో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ప్రైవేటు ఉద్యోగి జానకిరాం(30) ఆన్‌లైన్‌లో రూ.80,000 అప్పు తీసుకున్నాడు. దీంతో పాటు.. ఇతరుల వద్ద అవసరాల కోసం మొత్తం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని సకాలంలో తీర్చలేకపోయాడు. ఆన్‌లైన్‌లో రుణం ఇచ్చిన వారి నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయాడు. చివరకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన మరణానికి ఎవరూ కారణం కాదని, 'అమ్మా.. వదినా.. నన్ను క్షమించండి' అని లేఖ రాసి పెట్టాడు. అతడి ఆత్మహత్యపై రాత్రి 10.30 గంటల వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

## పదవీకాలం అయిపోతున్నా.. సచివాలయాలు పూర్తి కావట్లేదు: ఆనం

ఈనాడు డిజిటల్-నెల్లూరు, న్యూస్‌టుడే- నెల్లూరు (నగరపాలక సంస్థ), సైదాపురం: 'ఎమ్మెల్యేలకు ప్రజలిచ్చిన అయిదేళ్లలో నాలుగేళ్లు పూర్తయింది. ముందుగానే ఎన్నికలొస్తాయని అంటున్నారు. అలా వస్తే ఇంకా ముందే ఇంటికి పోతాం. కానీ ఏడాది సమయంలో పూర్తి చేయాల్సిన సచివాలయ భవనాలు ముందుకు కదలట్లేదు' అని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురంలో మంగళవారం కొత్త పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'వెంకటగిరి నియోజకవర్గానికి 107 సచివాలయాలు మంజూరైతే.. 40 మాత్రమే పూర్తయ్యాయి. గుత్తేదారులు ముందుకు రావట్లేదా? పనులు చేశాక బిల్లులు రావని భయపడుతున్నారా? అధికారులే చెప్పాలి' అని ఆనం తెలిపారు. 'రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. వాటిని వెంటనే బాగుచేయాలి' అని పేర్కొన్నారు. ఆ తర్వాత నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ.. వెంకటగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా రామ్‌కుమార్‌రెడ్డిని నియమిస్తున్నట్లు పార్టీ నాయకత్వం నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని ఆనం తెలిపారు. సైదాపురం సమావేశంలో పార్టీని ఉద్దేశించి మాట్లాడలేదని, సచివాలయాల పనులు వేగవంతం చేయాలని మాత్రమే చెప్పానన్నారు. పార్టీనేతలు, ఇన్‌ఛార్జి ముందే మాట్లాడానని అన్వయించుకొనే దాన్ని బట్టి ఉంటుందని తెలిపారు.

### ఆనం వ్యాఖ్యలు దురదృష్టకరం: మంత్రి కాకాణి



నెల్లూరు (నగర పాలక సంస్థ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పనితీరుపై ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులో ఆయన మాట్లాడుతూ రోడ్లపై గుంతలు ఇప్పుడే పడలేదని.. గత ప్రభుత్వంలో గుంతలు ఉన్నాయని తెలిపారు.

### వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: ధర్మాన



కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా ఒప్పంగి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేను ఎన్నికల్లో పోటీ చేయనని గతంలోనే ముఖ్యమంత్రికి చెప్పాను. ఆయన ఒప్పుకోలేదు. నాకు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం వచ్చిందనిపిస్తోంది. ఆగిపోతానని అన్నాను. ఈ ఒక్క ఎన్నికల్లో పోటీ చేయమన్నారు. అయినా అదీ ఆలోచిద్దాం. మా తర్వాత తరాన్ని తయారు చేసి అందించడం మా బాధ్యత. నా కోసం పని చేస్తున్నవారంతా ఎదగాలి. అది నెరవేర్చేందుకు కచ్చితంగా కృషి చేస్తా' అని మంత్రి ధర్మాన పేర్కొన్నారు.

### భారాసకు బుద్ధి చెప్పాలి: మంత్రి రోజా



తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజనకు కారణమైన తెరాస ఇప్పుడు భారాస పేరుతో రాష్ట్రంలోకి వస్తున్న నేపథ్యంలో ప్రజలే బుద్ధి చెప్పాలని మంత్రి రోజా వ్యాఖ్యానించారు. మంత్రి మంగళవారం వైకుంఠ ద్వారం నుంచి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రాన్ని విభజించడంలో కాంగ్రెస్‌తో కలిసిన తెరాస ఏపీకి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. సెంటిమెంట్‌తో రాష్ట్రాన్ని ముక్కలు చేసి... మళ్లీ ఇక్కడ అడుగు పెట్టాలని అనుకోవడం ఎంత వరకు సమంజసమో ప్రజలు ఆలోచించాలని వ్యాఖ్యానించారు.

### భారాసకు ఏపీలో ఉజ్వల భవిష్యత్తు: కేశవరావు



కేకేను కలిసిన ఏపీ భారాస నేతలు చంద్రశేఖర్ తదితర నేతలు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో భారత్ రాష్ట్ర సమితికి ఉజ్వల భవిష్యత్తు ఉందని భారాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు తెలిపారు. కేసీఆర్ దిశానిర్దేశం మేరకు ఏపీలో విస్తృత కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. భారాస ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, ఇతర నేతలు పార్థసారథి, ప్రసాద్ తదితరులు మంగళవారం కేకేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి అభినందనలు తెలిపారు. ఏపీలో కొత్త చరిత్ర సృష్టించాలని సూచించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఏపీకి భారాస అవసరం ఉందని, ప్రజలు దాని కోసమే ఎదురు చూస్తున్నారని తెలిపారు.

## శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ కానుకలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి సోమవారం రికార్డు స్థాయిలో రూ.7.68 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ఆలయ చరిత్రలోనే మొదటి సారిగా పెద్ద మొత్తంలో కానుకలు వచ్చినట్లు తితిదే తెలిపింది. ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారిని 69,414 మంది దర్శించుకున్నారు. 18,612 మంది తలనీలాలు సమర్పించారు. సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు, శ్రీవాణి ఆన్‌లైన్, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు అదనపు దర్శన టికెట్ల జారీపై తితిదే నిర్ణయం తీసుకుంటోంది.

## 'జీతం అందలేదు.. అప్పు దొరికింది'

సామాజిక మాధ్యమాల్లో ఉపాధ్యాయుడి పోస్టు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: జీతాలు సకాలంలో అందకపోవడంపై ఓ ఉపాధ్యాయుడు వినూత్నంగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ పోస్టు స్థానికంగా వైరల్ అవుతోంది. 'మేం బ్యాంకుల్లో గృహ, వాహన రుణాలు తీసుకున్నాం. ప్రతి నెలా 1 లేదా 2 తేదీల్లో జీతం జమ అయ్యేది. ప్రతి నెలా 5న ఈఎంఐ రుణఖాతాకు బదిలీ అయ్యేలా బ్యాంకులతో ఒప్పందం చేసుకున్నాం. అయితే ఇప్పుడు సకాలంలో జీతం అందడం లేదు. దీంతో ఈఎంఐ సకాలంలో కట్టలేక జరిమానాలు పడుతున్నాయి. ఈ నెల 4వ తేదీ వచ్చినా జీతం అందలేదు.. ఈఎంఐ కట్టడానికి బయట అప్పు మాత్రం దొరికింది' అంటూ అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల్లో ఈ పోస్టు పెట్టారు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఖాళీ పుర్రెలను జత చేశారు.

## రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు అయిదు: కేంద్ర హోంశాఖ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలను మావోయిస్టు ప్రభావిత జిల్లాలుగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ మేరకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాను ఈ జాబితాలో చేర్చింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల జాబితాలో ఉండేవి. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో సరిహద్దులు మారటంతో వాటి స్థానంలోకి కొత్త వాటిని చేర్చారు.

## మూడేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తే సొంత యూనిట్లకు

డీజీపీ కార్యాలయం ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో డిప్యుటేషన్లు, అటాచ్‌మెంట్లపై మూడేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న సిబ్బందిని వారి సొంత యూనిట్లకు పంపించాలని డీజీపీ కార్యాలయం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాల ఎస్పీలకు మంగళవారం ఆదేశాలిచ్చింది.

# జీవో-1 వైకాపాకూ వర్తిస్తుంది

- చంద్రబాబు కందుకూరు సభ ఘటన నేపథ్యంలోనే ఈ జీవో
- ఉల్లంఘిస్తే తర్వాతి పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



ఈనాడు, అమరావతి: 'ప్రతిపక్షాలకే కాదు వైకాపాకూ జీవో-1 వర్తిస్తుంది. ఈ జీవోలో తప్పుపట్టడానికి ఏమీ లేదు' అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. 'చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో కాకుండా ఇక్కడ ప్రజల్లోకి రావాలని, ధర్మ యుద్ధం చేయాలని మేమూ కోరుకుంటున్నాం. చంద్రబాబు, పవన్‌లా ముసుగు యుద్ధమో... చీకటి యుద్ధమో చేయాలని మేం కోరుకోవడం లేదు' అని పేర్కొన్నారు. రహదారులపై సభలు, రోడ్ షోలు, ప్రదర్శనలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో.. మంగళవారం ఆయన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'కందుకూరు చంద్రబాబు సభ తొక్కిసలాటలో 8 మంది మృతి చెందారు. ఆ తర్వాత గుంటూరులో మరో ఘటన చోటు చేసుకుంది. వీటి కారణంగానే జీవో-1 తేవాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులోని నిబంధనలు ప్రతిపక్షాలకే కాదు... అధికారంలో ఉన్న వైకాపాకు వర్తిస్తాయి. ఈ నిబంధనలకు లోబడే వైకాపా సభలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. జీవోలోని మినహాయింపులను ప్రభుత్వం వాడుకుంటే అప్పుడు ప్రతిపక్షాలు అడగొచ్చు. లోకేశ్ పాదయాత్ర, పవన్ కల్యాణ్ బస్సు యాత్రల నేపథ్యంలోనే ఈ జీవో తెచ్చారని వారు ఊహించుకుంటే మేము ఏమీ చేయలేం. సభలు పెట్టుకోవద్దని మేమనడం లేదే. విచ్చలవిడిగా కార్యక్రమాలు చేసుకుంటూ పోలీసు భద్రత ఇవ్వండని తెదేపా వాళ్లు మాట్లాడుతున్నారు' అని సజ్జల వ్యాఖ్యానించారు. 'సభలు, సమావేశాల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే తర్వాత పరిణామాలను వారే ఎదుర్కోవాల్సి ఉంటుంది. బరితెగింపు మాటలు మాట్లాడితే తగిన పరిణామాలను ఎదుర్కొంటారు. గుంటూరు ఘటనలో తనకే బాధ్యత లేదన్నట్లుగా చంద్రబాబు మాట్లాడుతున్నారు. పైగా పోలీసులపై నింద మోపుతున్నారు' అని ఆయన విమర్శించారు.

### పాల్ పార్టీలానే భారాస

ఏపీలో నాయకత్వలోపంవల్లే అభివృద్ధి జరగడం లేదు. ప్రజలు భారాసను కోరుకుంటున్నారని ఆ పార్టీ నేత పైలట్ రోహిత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. సజ్జల స్పందిస్తూ.. 'కేఏ పాల్ పార్టీ ఉంది. ఇప్పుడు భారాస వస్తుంది. మంచిదే కదా. పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటే ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉంటుంది. ఎన్ని పార్టీలు వచ్చినా మేం ఆహ్వానిస్తాం' అని వ్యాఖ్యానించారు.

# ప్రశ్నిస్తే పక్కన పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గ పార్టీ బాధ్యతలను వేరొకరికి ఇవ్వడం ద్వారా రామనారాయణను ఏకాకిని చేసింది.

### వద్దనుకునే వారికి పొగ..

రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వరాదనుకునే ఎమ్మెల్యేలున్న చోట పార్టీ అదనపు సమన్వయకర్తలను నియమిస్తోందన్న వాదన ఉంది. గతంలో తాడికొండలో పార్టీ అదనపు సమన్వయకర్తగా డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను తొలుత నియమించారు. ఆయన్ను ఎమ్మెల్యే వర్గీయులతోపాటు, స్థానిక పార్టీ నేతలూ వ్యతిరేకించారు. దీంతో ఆయన్ను తప్పించి కత్తెర సురేష్‌ను సమన్వయకర్తగా నియమించారు. ఇప్పుడు వెంకటగిరి విషయంలోనూ అదే వ్యూహాన్ని వైకాపా అధిష్ఠానం అమలు చేసిందంటున్నారు. నెల్లూరు జిల్లాకే చెందిన మరో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమస్యలపై గట్టిగా మాట్లాడటంతో ఆయన్ను ముఖ్యమంత్రి పిలిపించుకుని మాట్లాడారు. అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. మరి ఆనం విషయంలో అలా ఎందుకు చేయలేదన్నది చర్చనీయాంశంగా మారింది. 'ఆనం వెంకటగిరిలో కాకుండా ఆత్మకూరు, నెల్లూరు నగర నియోజకవర్గాలపై దృష్టి సారించారు. అందుకే ప్రభుత్వంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు' అని ఆయన వైరివర్గం విమర్శిస్తోంది.

### పర్చూరులో మళ్లీ మార్పు

పర్చూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించారు. ఈ నియోజకవర్గంపై పార్టీ అనేక ప్రయోగాలు చేస్తోంది. 2019 ఎన్నికల ముందువరకూ పార్టీ సమన్వయకర్తగా ఉన్న రావి రామనాథంబాబును చివరి నిమిషంలో పక్కన పెట్టి దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు టికెట్ ఇచ్చారు. దాంతో రామనాథం బాబు తెదేపాలో చేరారు. ఎన్నికల య్యాక ఆయన్ను మళ్లీ పార్టీలోకి తీసుకొచ్చి, నియోజకవర్గ బాధ్యతలను కట్టబెట్టారు. 2020 మార్చిలో చీరాల తెదేపా ఎమ్మెల్యే కరణం బలరాం వైకాపాకు మద్దతు ప్రకటించారు. అప్పటివరకూ అక్కడున్న పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు పర్చూరు వెళ్లాలని చెప్పింది. ఆయన ససేమిరా అనడంతో మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డిని పర్చూరు సమన్వయకర్తగా నియమించడానికి సిద్ధమై చివరి నిమిషంలో ఆపేశారు. ఆమంచిని అక్కడకు పంపడానికి ఇష్టంలేని మాజీమంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి.. కంది రవిశంకర్‌కు పర్చూరును అప్పగించాలని సీఎంను కోరారు. రావి రామనాథంబాబు సీఎంను కలిసి మళ్లీ తనకు కొంత సమయమిస్తే పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ఇంతలో హఠాత్తుగా ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరు సమన్వయకర్తగా నియమిస్తున్నట్లు వైకాపా కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ప్రకటించింది.

### జ్యోతిష్యాలు చెప్పించుకున్నారేమో: ఎమ్మెల్యే అనిల్

ముందస్తు ఎన్నికలు వస్తే వైకాపా ఇంటికెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఘాటుగా స్పందించారు. మంగళవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామనారాయణరెడ్డి జోతిష్యం చూపించుకున్నారేమోనని, ఏడాది ముందుగా ఎన్నికలు వస్తాయని కలగన్నారేమోనని వ్యాఖ్యానించారు. రోజుకో పార్టీ మారేవారి గురించి తాను మాట్లాడనని గతంలో చేసిన వ్యాఖ్యను గుర్తుచేశారు. 2024లో మళ్లీ జగన్‌నే సీఎంగా ప్రజలు చూస్తారన్నారు.

## పెళ్లికి అంగీకరించడంలేదని.. ప్రేయసి గొంతు కోశాడు

● గాయపడిన యువతి

వరంగల్, న్యూస్‌టుడే: పెళ్లికి అంగీకరించడం లేదని ఓ యువకుడు ప్రేయసి గొంతు కోసి తీవ్రంగా గాయపరిచాడు. తెలంగాణలోని హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండలో మంగళవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గుజ్జేటి వేణు కథనం ప్రకారం.. కడిపికొండకు చెందిన సివ్వి శ్రీనివాస్ (35) అదే గ్రామానికి చెందిన యువతి (26) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి మతాలు వేరు కావడంతో అతడు ఆమె మతాన్ని స్వీకరించినట్లు తెలిసింది. పెళ్లికి యువతి కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో ఇద్దరూ కొద్దిరోజులుగా గొడవలు పడుతున్నారు. ఇదే విషయంపై శ్రీనివాస్ మంగళవారం రాత్రి యువతి ఇంటికి వెళ్లి నిలదీశాడు. అంగీకరించకపోవడంతో యువతి గొంతు, చేయి కోసి గాయపరిచాడు. ఆగ్రహించిన ఆమె కుటుంబసభ్యులు అతడిని చితకబాదారు. సమాచారం అందుకున్న మడికొండ పోలీసులు గ్రామానికి చేరుకుని యువతిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ప్రాణాపాయం లేదని, విచారణ చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## ముద్దచర్మ వ్యాధి నివారణకు జిల్లాకు రూ.12 లక్షలు

ఈనాడు, అమరావతి: పశువుల్లో ముద్దచర్మ (లంపీస్కిన్) వ్యాధి నివారణకు జిల్లాకు రూ.12 లక్షల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రూ.3.12 కోట్లు విడుదల చేసి వైద్యం అందిస్తున్నామని పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. వ్యాధి చికిత్సకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 'ఈనాడు' ప్రధాన పత్రికలో సోమవారం 'ముద్దచర్మ వ్యాధితో మూగజీవాల నరకయాతన' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. కర్నూలు జిల్లా సోగనూరులో ఈ వ్యాధితో 8 పశువులు మృతి చెందినట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

(c) eenadu

# ఖాతాలో రూ.1 మాత్రమే జమ

- హౌసింగ్ పథకం పేరు మార్పుతో లబ్ధిదారులకు ఒరిగింది ఏమీ లేదు
- అప్పులపై వడ్డీలు కట్టలేకపోతున్నారు
- రూ.358 కోట్ల విడుదలపై ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వండి
- గృహనిర్మాణశాఖ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శులకు హైకోర్టు ఆదేశం
- విచారణ జనవరి 18కి వాయిదా

**ఈనాడు, అమరావతి:** ఇళ్ల నిర్మాణ పథకం పేరు మార్చడం వల్ల పేద లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనం ఏమి లేదని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. గత ప్రభుత్వ హయాంలోని 'ఎన్టీఆర్ హౌసింగ్ పథకం' పేరును తర్వాత 'వైఎస్ఆర్ గ్రామీణ హౌసింగ్ పథకం'గా పేరు మార్చడం వల్ల లబ్ధిదారుల ఎలాంటి ఉపయోగం లేదంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో 2019 నుంచి రూ.1 జమ చేయడం తప్ప.. వారికి సొమ్ము చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. లబ్ధిదారులు అప్పు చేసి సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నారని, ప్రభుత్వం సొమ్ము విడుదల చేయకపోవడంతో తెచ్చిన అప్పులకు భారీగా వడ్డీలు చెల్లించలేక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. నిధుల విడుదలకు హౌసింగ్ కార్పొరేషన్ పలుమార్లు లేఖలు రాసినా ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని ఆర్థిక శాఖ పేర్కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయకుండా, సకాలంలో నిధులు విడుదల చేయకుండా ఓ ప్రముఖ వ్యక్తి పేరును మార్చి.. రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రముఖ వ్యక్తి పేరు పెట్టడం వల్ల పేద లబ్ధిదారులకు ఒరిగింది ఏమీ లేదంది. సకాలంలో పథకాలకు సొమ్ము సమకూర్చకపోతే ప్రభుత్వ హామీలను నమ్మి పిటిషనర్ల మాదిరి పేద లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారంది. రూ.358 కోట్ల నిధుల విడుదలకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాసిన లేఖలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని గృహ నిర్మాణ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వైఎస్ఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద 2019-2020 సంవత్సరాలకు సంబంధించి తమకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడాన్ని సవాలు చేస్తూ లబ్ధిదారులు హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు. విచారణలో పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్లందరూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవాళ్లు. వడ్డీకి అప్పులు తెచ్చి ఇళ్లు నిర్మించుకున్నారు. డీఈఈ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్లినా సొమ్ము విడుదల చేయలేదు. తెచ్చిన అప్పుకు వడ్డీ కట్టలేక పిటిషనర్లు ఇబ్బందులు పడుతున్నారు...' అని పేర్కొన్నారు. ఆర్థికశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది(జీపీ) వాదనలు వినిపిస్తూ.. తమ వద్ద ఏ ప్రతిపాదనలు లేవని, హౌసింగ్ కార్పొరేషన్ బిల్లులు సమర్పిస్తే.. ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తామని చెప్పారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2019 ఏప్రిల్ 1 నుంచి లబ్ధిదారులకు సొమ్ములు చెల్లించడం లేదన్నారు. రూ.358 కోట్ల బడ్జెట్ విడుదల చేయాలని ప్రతిపాదనల చేస్తూ హౌసింగ్ శాఖ ముఖ్యకార్యదర్శికి పలు లేఖలు రాశామని చెప్పారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ...నిధుల విడుదలకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## వాట్సప్ అడ్మిన్ నాలుక కోసేశారు

### గ్రూప్ నుంచి తీసేశారని దారుణం

**ఈటీవీ భారత్:** వాట్సప్ గ్రూప్ నుంచి తొలగించాడనే కోపంతో అడ్మిన్‌ను చితకబాది, నాలుకను కోసేశారు అయిదుగురు వ్యక్తులు. మహారాష్ట్రలోని పుణెలో డిసెంబరు 28న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుణె నగరం పుర్సుంగిలోని ఓ హౌసింగ్ సొసైటీలో బాధితుడు(గ్రూప్ అడ్మిన్), నిందితులు నివసిస్తుంటారు. బాధితుడు హౌసింగ్ సొసైటీ సమాచారం కోసం 'ఓం హైట్స్ ఆపరేషన్' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశాడు. అందులో ఆ సొసైటీ సభ్యులందరూ ఉన్నారు. అయితే గ్రూప్ నుంచి ఇటీవల ఓ వ్యక్తిని తొలగించాడు. దీనిపై అతడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్మిన్‌కు మెసేజ్ చేశాడు. అడ్మిన్ స్పందించకపోవడంతో నిందితుడు ఫోన్ చేసి కలవాలనుకుంటున్నానని చెప్పాడు. మరో నలుగురితో కలిసి అడ్మిన్ దగ్గరకు వెళ్లి వాగ్వాదానికి దిగాడు. అందరూ కలిసి అతడిపై దాడి చేయడంతో పాటు నాలుక కోసేశారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు నాలుకకు కుట్లు వేశారు. అడ్మిన్ భార్య ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## సామాజిక మాధ్యమాల్లో దుర్గమ్మ మూలవిరాట్టు దృశ్యాలు

- డిసెంబరు 22న సెల్‌ఫోన్‌లో తీసినట్లు గుర్తింపు
- శాంతకుమారి అనే భక్తురాలిపై పోలీసులకు ఫిర్యాదు

**విజయవాడ (భవానీపురం), న్యూస్‌టుడే:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మూలవిరాట్టును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేయడం వివాదస్పదమైంది. శాంతకుమారి అనే భక్తురాలు అంతరాలయంలోని అమ్మవారిని వీడియో తీసి, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. ఈ విషయాన్ని పలువురు భక్తులు దుర్గగుడి ఆలయ ఈవో భ్రమరాంబ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె విచారణకు ఆదేశించారు. దేవస్థానం అధికారులు ఆలయంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను పరిశీలించారు. గత ఏడాది డిసెంబరు 22వ తేదీ ఉదయం 9.52 నిమిషాలకు శాంతకుమారి అనే భక్తురాలు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై దుర్గగుడి భద్రతాసిబ్బందికి ఈవో నోటీసులు జారీచేశారు. శాంతకుమారిపై విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో మంగళవారం తెలిపారు. ఈ ఘటనపై అమ్మవారి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలోకి ఫోన్లను అనుమతించడం, వీడియో తీస్తున్నా భద్రతాసిబ్బంది గుర్తించకపోవడంపై మండిపడుతున్నారు.

## జగన్ వెంటే మహిళలు

### ముగ్గురు మంత్రుల వెల్లడి

**ఈనాడు, అమరావతి:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి ప్రాధాన్యమిస్తున్నందునే ఆయన సభలకు మహిళలు అధికంగా వస్తున్నారని, వారిని తనవైపు తిప్పుకొనేందుకే తెదేపా అధినేత చంద్రబాబు గుంటూరులో చంద్రన్న కానుక పేరుతో చీరలు ఎరవేశారని మంత్రులు విడదల రజిని, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు ఆరోపించారు. ఆ కార్యక్రమానికి హాజరైన అమాయక మహిళలు ముగ్గురు ప్రాణాలు కోల్పోవటం బాధాకరమని పేర్కొన్నారు చనిపోయినవారు, గాయపడిన వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలేనని చెప్పారు. గుంటూరులో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన మహిళల కుటుంబీకులకు మంగళవారం రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వైకాపా ప్రభుత్వంవైపు ఉన్నారనే అక్కసుతోనే చంద్రబాబు చీరలు, ధోవతులు, నిత్యావసరాలు పంపిణీ చేసి వారి మద్దతు కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ కార్యక్రమానికి అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చింది పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ కాదా అని నిలదీశారు.

## భాజపా రాష్ట్ర మహిళా విభాగం మీడియా కన్వీనర్‌గా సాధినేని యామిని

**ఈనాడు, అమరావతి:** భారతీయ జనతా పార్టీలో వివిధ మహిళా విభాగాలకు కన్వీనర్, కో-కన్వీనర్లను మంగళవారం నియమించారు. ఈ మేరకు ఏపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.నిర్మలా కిశోరి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా సాధినేని యామినీ శర్మ, మన్‌కీ బాత్ రాష్ట్ర కన్వీనర్, కో-కన్వీనర్లుగా సీహెచ్.రాజేశ్వరి, వేదవతి రాయల్, సుకన్య సమృద్ధి యోజన కన్వీనర్‌గా కె.మల్లీశ్వరి, జేమ్ పోర్టల్ కన్వీనర్, కో-కన్వీనర్లుగా తుమ్మల పద్మజా లక్ష్మి, పి.మాధవి, ఉమామహేశ్వరి, ఆదర్శ అంగన్వాడీ కన్వీనర్, కో-కన్వీనర్లుగా జి.భాగ్యలక్ష్మి, గీతామాధురి సురవరం, చాగం శైలజ నియమితులయ్యారు.

## రూ.4 వేల కోట్ల భూమిని రూ.130 కోట్లకే ఇస్తారా?

- 'అదానీ'కి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలా!
- సీఎంకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇ.ఎ.ఎస్.శర్మ లేఖ

**ఈనాడు, విశాఖపట్నం:** మధురవాడలో రూ.4వేల కోట్ల విలువైన భూమిని రూ.130 కోట్లకే ఎలా కేటాయిస్తారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇ.ఎ.ఎస్.శర్మ మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ లేఖను సీఎం జగన్‌కు ఈ-మెయిల్‌లో పంపారు. 2012 నాటి జీవో 571 ప్రకారం ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తే ఆయా సంస్థల నుంచి ఏటా వసూలు చేసే లీజు విలువ ఆ భూమి మార్కెట్ విలువలో 10% కన్నా తక్కువగా ఉండకూడదన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం చూస్తే అదానీకి కేటాయించిన భూమికి ఏటా వసూలు చేసే లీజు మొత్తమే కనీసం రూ.400 కోట్లు ఉండాలని, కానీ రూ.130 కోట్లకే ఆ 130 ఎకరాలను కట్టబెట్టారని, ఇది తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా భూముల్ని కట్టబెట్టడం అవినీతి నిరోధకచట్టం పరిధిలోకి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల్ని పణంగా పెట్టి అదానీ గ్రూపునకు మేలు చేకూర్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయాలపై న్యాయవిచారణ జరగాలని కోరారు.

## ఫ్యాన్లు ఆపేసి... దీపాలు ఆర్పాలా?

- విద్యుత్తు బిల్లులు ఎక్కువ వస్తున్నాయని వితంతు పింఛను తొలగిస్తారా?
- ఎమ్మెల్యే వెలంపల్లిని నిలదీసిన మహిళ



ఎమ్మెల్యే వెలంపల్లిని ప్రశ్నిస్తున్న మహిళ

**విజయవాడ (చిట్టినగర్), న్యూస్‌టుడే:** 'విద్యుత్తు బిల్లులు ఎక్కువ వచ్చాయని, మీటర్లు ఒకటికి మించి ఉన్నాయని... పదేళ్లుగా వస్తున్న వితంతు పింఛను తొలగించారు. ఫ్యాన్లు, విద్యుత్తు దీపాలు, రిఫ్రిజిరేటర్లు వాడటం మానేయాలా? ఇప్పటికే వీధి దీపాలు లేక పాముల భయంతో బతుకుతున్నాం. మిమ్మల్ని ఓట్లేసి గెలిపించాం... మా సమస్యల్ని తీర్చరా?' అంటూ ఓ మహిళ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును నిలదీశారు. 'ఓట్లు వేసినందుకే మీ దగ్గరికి వచ్చి సమస్యలను తెలుసుకుంటున్నా. నువ్వు అడిగే తీరు అవమానకరంగా ఉంది' అంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. విజయవాడ 51వ డివిజన్, 164వ సచివాలయం పరిధిలోని ఆంజనేయవాగు ప్రాంతంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తాగునీరు సక్రమంగా అందడం లేదని, పింఛన్లు రావడం లేదని, కాలువలు, మెట్లు పాడయ్యాయని, విద్యుత్తు స్తంభాలు తుప్పు పట్టాయని స్థానికులు... ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

## ఆస్తి పన్ను భారం మోయలేక పోతున్నామయ్యా

### అంబటి ఎదుట వాపోయిన మహిళ

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** ఏడాదికోసారి 15 శాతం ఆస్తి పన్ను భారం మోయడమే సమస్య అనుకుంటే ఆరు నెలలకోసారి పెంచుతుండటంతో మరింత ఇబ్బంది పడుతున్నామని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన కొల్లా సుధారాణి.. . మంత్రి అంబటి రాంబాబు ఎదుట వాపోయారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని పట్టణంలోని 20వ వార్డులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి తన ఇబ్బందిని మంత్రికి తెలపగా... పరిశీలించి, సమస్య ఉంటే పరిష్కరించాలని కమిషనర్ షమ్మీకి సూచించారు. తన కుమారుడు పొరుగు సేవల ఉద్యోగి కావడంతో పింఛను తొలగించారని, దాన్ని పునరుద్ధరించాలని ఓ మహిళ కోరగా.. అది కుదరదని మంత్రి స్పష్టం చేశారు. అనర్హత జాబితాలో ఉన్నప్పటికీ అర్హత నిరూపించుకుంటే పింఛన్లను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.

## ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను మరో పదేళ్లు పొడిగించాలి: గిడుగు రుద్రరాజు

**విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను వైకాపా, తెదేపాలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే శాసనసభ ప్రత్యేక సమావేశాలు పెట్టి ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను మరో పదేళ్ల పొడిగించాలని డిమాండు చేశారు. మంగళవారం విజయవాడలో ఏపీసీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైకాపా అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను పలు పథకాల నుంచి తొలగించి, తీరని అన్యాయం చేశారు. ఉప ప్రణాళిక నిధులను నవరత్నాలకు మళ్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలనూ తొలగించారు. జగన్ బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారికి కుర్చీలే కేటాయించలేదు. గిరిజన చట్టాలను కాలరాసి, మన్యంలో సంపదను దోచుకుంటున్నారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని.. వీరి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనవరి 26 నుంచి మార్చి 26 వరకు పాదయాత్ర చేస్తాం' అని వెల్లడించారు. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రోడ్లపై సభల నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలపై మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో సభలు, సమావేశాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలే తప్ప నియంత్రించడం సరికాదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు కొరివి వినయ్ కుమార్, శాంతకుమారి, దాదా గాంధీ, వెంకట్రావ్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశాలకు కొత్త ని'బంధనాలు'

- వయో పరిమితి కుదింపు
- ఆధార్ 'చిరునామా' ప్రాతిపదికపై ఆందోళన




వేలేరు నవోదయ విద్యాలయ

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియలో తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 29న నిర్వహించాలని నిర్ణయించి, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ఈ ఏడాది ప్రవేశాల ప్రక్రియలో కొన్ని మార్పులు చేశారు. ఏ జిల్లాలోని నవోదయలో విద్యార్థులు ప్రవేశం కోరుకుంటున్నారో, ప్రస్తుత విద్యా సంవత్సరంలో వారు అయిదో తరగతి అదే జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివితే ఇంతకు ముందు వరకు సరిపోయేది. తాజా నిబంధనల ప్రకారం చదువుతున్న పాఠశాలతో పాటు, విద్యార్థి, విద్యార్థి తల్లిదండ్రుల చిరునామా కూడా అదే జిల్లాలో ఉండాలి. లేకుంటే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఉదాహరణకు కృష్ణా జిల్లా బాపులపాడులో నివసిస్తూ, సరిహద్దునే ఉన్న ఏలూరు జిల్లా ఏపూరు గ్రామంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థి, తన ఆధార్ చిరునామా ప్రకారం ఏలూరు జిల్లా నవోదయకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుండదు. అదే సమయంలో కృష్ణా జిల్లా నవోదయకు దరఖాస్తు చేసుకుందామంటే చదివే పాఠశాల ఏలూరు జిల్లా పరిధిలోది కావడంతో ఇక్కడా అర్హత లభించదు. 2022-23 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు 2009, మే ఒకటి నుంచి 2013, ఏప్రిల్ 30 మధ్య జన్మించిన వారు అర్హులుగా నోటిఫికేషన్ జారీ చేశారు. 2023-24 సంవత్సరానికి వచ్చేసరికి 2011, మే ఒకటి నుంచి 2013, ఏప్రిల్ 30 మధ్యన జన్మించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. గతేడాది నాలుగు సంవత్సరాల వీలు(గ్యాప్) కల్పించగా, ఈసారి దానిని రెండేళ్లకు కుదించేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## దిల్లీ మద్యం కేసులో నిందితులకు ముందస్తు బెయిల్

**ఈనాడు, దిల్లీ:** దిల్లీ మద్యం కేసులో ఇద్దరు మాజీ ప్రభుత్వ ఉద్యోగులు సహా అయిదుగురు నిందితులకు దిల్లీ రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇటీవల సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో నిందితులు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. వీటిపై ప్రత్యేక జడ్జి ఎంకే నాగ్‌పాల్ మంగళవారం విచారణ చేపట్టారు. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ప్రభుత్వ ఉద్యోగులైన కుల్‌దీప్‌సింగ్, నరేందర్‌సింగ్, ఇండియాఏహెడ్ డైరెక్టర్ ముత్తా గౌతమ్, రాబిన్ డిస్ట్రిబ్యూషన్ ఎల్‌ఎల్‌పీ డైరెక్టర్ అరుణ్‌పిళ్లై, మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రులను అరెస్టు చేయలేదని సీబీఐ తరఫు న్యాయవాదులు న్యాయస్థానానికి తెలిపారు. అనంతరం సొంత పూచీకత్తుతో పాటు రూ.50 వేల విలువైన బాండ్ సమర్పించాలనే షరతుతో అయిదుగురు నిందితులకు ప్రత్యేక జడ్జి ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. నిందితులు పూర్తిస్థాయి బెయిల్‌కు దాఖలు చేసుకున్న పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు.

సీబీఐ ఛార్జిషీట్‌లో ఉన్న మరో ఇద్దరు నిందితులు. . ఆప్ నేత విజయ్‌నాయర్, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి బోయినపల్లి అభిషేక్‌లకు గతంలోనే సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ముందస్తు బెయిల్ లభించిన అయిదుగురు నిందితులతో పాటు విజయ్‌నాయర్, బోయినపల్లి అభిషేక్‌లు మంగళవారం ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. అయితే ఈడీ నమోదు చేసిన కేసుల్లో విజయ్‌నాయర్, బోయినపల్లి అభిషేక్‌లు జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉండడంతో వారిని తిరిగి తిహాడ్ జైలుకు తరలించారు.

## తెదేపా నేతలకు హైకోర్టులో ఊరట

**ఈనాడు, అమరావతి:** మాచర్లలో చోటుచేసుకున్న ఘటనలపై పోలీసులు నమోదు చేసిన కేసులో తెదేపా నేతలకు హైకోర్టులో ఊరట లభించింది. మాచర్ల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డితోపాటు మరో 22 మందికి ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చారు. ఏడో నిందితుడు కల్లం రమణారెడ్డికి బెయిలు ఇచ్చేందుకు నిరాకరించారు. మాచర్ల గొడవల ఘటనలో పోలీసులు తమపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని మొత్తం 24 మంది హైకోర్టును ఆశ్రయించారు.

## ఉద్యోగాల కోసం యువత చూస్తోంది

- ఏపీపీఎస్సీ వేగంగా పని చేయాలి
- గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సూచన



ఏపీపీఎస్సీ వార్షిక నివేదిక విడుదల చేస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, గౌతమ్ సవాంగ్, ఏపీపీఎస్సీ సభ్యులు తదితరులు

**ఈనాడు, అమరావతి:** 'ఉద్యోగ ప్రకటనల కోసం యువత వేచి చూస్తోంది. వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఏపీపీఎస్సీ వేగంగా పని చేయాలి' అని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ పారదర్శకతతో, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం రాజ్‌భవన్‌లో ఏపీపీఎస్సీ 2021-22 వార్షిక నివేదికను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీపీఎస్సీ కార్యకలాపాల గురించి కమిషన్ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ గవర్నర్‌కు వివరించారు. న్యాయపరమైన చిక్కులతో సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. త్వరలో మరికొన్ని ఉద్యోగ ప్రకటనలు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోందని నివేదించారు. 2022 సెప్టెంబరు 30న ప్రకటించిన గ్రూప్-1 పోస్టులకు ప్రాథమిక పరీక్ష ఈనెల 8న నిర్వహించనున్నట్లు గవర్నర్ దృష్టికి తెచ్చారు. 2021-22లో 24 నోటిఫికేషన్లు రాగా నియామక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఏపీపీఎస్సీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏ ముఖం పెట్టుకుని ఏపీలో అడుగుపెడతారు

### కేసీఆర్‌పై ఎంపీ జీవీఎల్ ధ్వజం

**విశాఖపట్నం (పెదవాల్తేరు), న్యూస్‌టుడే:** 'ఆంధ్రప్రదేశ్‌కు నీరు రాకుండా అడ్డుకున్నారు... విభజన సమస్యలు పరిష్కారం కాకుండా చేశారు... ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని భారాస నాయకులు ఏపీలోకి అడుగుపెట్టాలని చూస్తున్నారు' అని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి... ఆ తర్వాత ఆంధ్రాలో అడుగుపెట్టాలని కేసీఆర్‌కు సవాలు విసిరారు. విశాఖలో మంగళవారం విలేకరుల సమావేశంలో జీవీఎల్ మాట్లాడారు. విభజన చట్టం ద్వారా ఏపీకి రావాల్సిన నిధుల్ని కేసీఆర్ దక్కకుండా చేశారన్నారు.

### రాముల వారిని అప్పజెప్పాలి: సోము వీర్రాజు

భద్రాచలం రాముల వారిని ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పిన తర్వాతే... తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి రాజకీయాల గురించి మాట్లాడాలని భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. 'తెరాసకు వీఆర్ఎస్ ఇచ్చి భారాస అంటూ కేసీఆర్ పగటికలలు కంటున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డుపడి ఇప్పుడు ఆంధ్రా అంటూ రాజకీయ కూనిరాగాలు తీయడం ఏంటి?' అని ఆయన ట్వీట్ చేశారు.



దుబాయ్ తెలుగు అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన వెంకయ్య నాయుడికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు

## దేశ ప్రతిష్ఠను నిలపాలి

### దుబాయ్‌లోని తెలుగు ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడి పిలుపు

**ఈనాడు, దిల్లీ:** ప్రవాస భారతీయులు మన భాష, సంస్కృతులకు సారథులుగా, వాణిజ్యానికి వారధులుగా దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం అక్కడి తెలుగు అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'తెలుగు వారి కష్టపడే తత్వమే వారికి గుర్తింపును ఇస్తోంది. శాంతి, సౌభ్రాతృత్వం వారసత్వంగా వచ్చిన మన సంస్కృతిలోని కట్టుబాట్లే భారతీయుల బలం. వేప పుల్ల మొదలుకుని, అణుశాస్త్రం వరకూ ఎన్నో మెలకువలు ప్రపంచానికి నేర్పింది భారతీయులే. పురోభివృద్ధిని కోరేవారు పూర్వ వృత్తాన్ని మరువకూడదు. మన కట్టు, బొట్టు, భాష, ప్రాస, యాసలను కాపాడుకోవాలి. వ్యక్తి ఎంత స్థాయికి ఎదిగినా మాతృమూర్తి, మాతృభాష, జన్మభూమి, గురువును మరవకూడదు. ప్రతి ఒక్కరూ జన్మనిచ్చిన గడ్డ రుణాన్ని తీర్చుకునే ప్రయత్నం చేయాలి. కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న తరుణంలో ప్రవాస భారతీయులు ప్రశంసనీయమైన సేవలందించారు' అని పేర్కొన్నారు.

## గ్రామ అవసరాల స్థలాన్ని వైకాపాకు ఎలా కేటాయిస్తారు?

### కార్యాలయ నిర్మాణ పనుల్ని అడ్డుకున్న స్థానికులు



పనులు చేపట్టేందుకు వచ్చిన పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న మహిళలు

**అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** గ్రామ అవసరాలకు కేటాయించిన స్థలంలో వైకాపా జిల్లా కార్యాలయ నిర్మాణం తగదంటూ అనకాపల్లి జిల్లాలోని కొత్తూరు నరసింగరావుపేట గ్రామస్థులు పనుల్ని అడ్డుకున్నారు. స్థలం చదును చేయడానికి వచ్చిన పొక్లెయిన్‌కు ఎదురుగా మహిళలు బైఠాయించి వైకాపా నాయకుల తీరుపై మండిపడ్డారు. అనకాపల్లి మండలం కొత్తూరు నరసింగరావుపేటలో రెండెకరాల స్థలాన్ని ఏడాదికి రూ.1,000 రుసుము చొప్పున 33 ఏళ్లకు వైకాపాకు లీజుకిస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ స్థలంలో పనులు చేయడానికి తీసుకొచ్చిన పొక్లెయిన్‌ను మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి వచ్చి... ప్రభుత్వ ఆదేశాలను అడ్డుకోవడం సరికాదని సూచించారు. కొంతసేపు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

## నాపై నమోదు చేసిన కేసుల వివరాలన్నీ ఇచ్చేలా డీజీపీని ఆదేశించండి

### హైకోర్టును ఆశ్రయించిన ఎంపీ రఘురామకృష్ణరాజు

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పరిధిలో వివిధ ఠాణాల్లో తనపై నమోదు చేసిన కేసుల వివరాలు, ఎఫ్ఐఆర్ దస్త్రాలు, కేసులు నమోదు చేయకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల వివరాలను ఇచ్చేలా డీజీపీని ఆదేశించాలని కోరుతూ నరసాపురం వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. వివరాలు అందజేస్తే చట్ట నిబంధనల మేరకు తనకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించడానికి వీలుంటుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు వద్దకు మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చింది. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. మరో బెంచ్ ముందుకు విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## 'కోడి కత్తి కేసు'లో బెయిలుపై ముగిసిన వాదనలు

### తుది ఉత్తర్వుల కోసం 13వ తేదీకి వాయిదా

**విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** 'కోడి కత్తి కేసు'లో నిందితుడికి బెయిలు మంజూరుపై మంగళవారం విజయవాడలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టులో వాదనలు ముగిశాయి. తుది ఉత్తర్వుల నిమిత్తం న్యాయమూర్తి ఆంజనేయమూర్తి కేసును 13వ తేదీకి వాయిదా వేశారు. 2018, అక్టోబరు 25న విశాఖపట్నం విమానాశ్రయ క్యాంటీన్‌లో పనిచేసే జనిపల్లి శ్రీనివాసరావు అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిపై చిన్న కత్తితో (కోడి కత్తి) దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు నిందితుడు శ్రీనివాసరావు అప్పటి నుంచి రాజమహేంద్రవరం జైలులో ఉంటున్నాడు. న్యాయవాది ఎ.సలీం ద్వారా ఎన్ఐఏ న్యాయస్థానంలో బెయిలు పిటిషన్ దాఖలు చేశాడు.

### అన్యాయంగా ఇరికించారు: నిందితుడి తల్లి, సోదరుడు

నిందితుడు శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజులు న్యాయస్థానం బయట మీడియాతో మాట్లాడారు. తమ కుమారుడిని ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. దళిత అబ్బాయి కాబట్టి కేసులో ఇరికించి నాలుగేళ్లు రిమాండులో ఉంచారని సుబ్బరాజు పేర్కొన్నారు.

## పిండి బస్తాల మాటున విదేశీ సిగరెట్ల రవాణా

### రూ.3 కోట్ల సరకు స్వాధీనం

**ఆటోనగర్ (పటమట), న్యూస్‌టుడే:** విదేశీ సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్న లారీని విజయవాడ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్ కమిషనర్ కె.ఇంజినీర్ కథనం ప్రకారం.. బిహార్‌లోని ముజఫర్‌పూర్ నుంచి లారీలో విదేశీ సిగరెట్లను తరలిస్తున్నారన్న సమాచారంతో కస్టమ్స్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో ట్రక్కును ఆపి తనిఖీ చేశారు. గోధుమ పిండి బస్తాల కింద 30 లక్షల పారిస్ బ్రాండ్ సిగరెట్లు దాచిపెట్టినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.3 కోట్లుగా అధికారులు నిర్ధారించారు.




అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ, విదేశీ సిగరెట్ల బాక్సులు

(c) eenadu

# తెదేపా ఓట్ల తొలగింపుపై ఈసీ ఆగ్రహం

**● నేడు అనంతపురం జిల్లా ఉరవకొండలో విచారించనున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి**

ఈనాడు డిజిటల్, అనంతపురం: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో తెదేపా సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఇచ్చిన ఫిర్యాదును భారత ఎన్నికల సంఘం (ఈసీ) సీరియస్‌గా తీసుకుంది. క్షేత్రస్థాయి విచారణకు ఈసీ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉరవకొండ వస్తున్నట్లు సమాచారం. అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా జిల్లా కలెక్టరు నాగలక్ష్మికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. తెదేపా ఓట్ల తొలగింపుపై ఇప్పటివరకు మౌనంగా ఉన్న జిల్లా ఉన్నతాధికారులు దీంతో అప్రమత్తమయ్యారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన ఇద్దరు బీఎల్వోలను సస్పెండు చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఓట్ల అక్రమ తొలగింపుపై పలుమార్లు ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు పట్టించుకోలేదని.. విచారణ పేరుతో జాప్యం చేస్తూ వచ్చారని తెదేపా నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇదీ జరిగింది..: ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని విడపనకల్లు మండలం చీకలగురికిలో 13 మంది తెదేపా సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగించారని, విచారణ జరపాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గతేడాది అక్టోబరులో ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నవంబరు 3న రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈసీ ఆదేశాలిచ్చింది. అదే నెల 12వ తేదీన విడపనకల్లు తహసీల్దారు విచారణ జరిపి ఆ నివేదికను కలెక్టరుకు పంపించారు. నవంబరు 21న తహసీల్దారు ఇచ్చిన నివేదికను కలెక్టరు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించారు. తహసీల్దారు నివేదికలో తప్పులున్నాయని ఎమ్మెల్యే కేశవ్ మళ్లీ ఈసీకి లేఖ రాశారు. దీంతో గుంతకల్లు ఆర్డీవోతో డిసెంబరు 29న విచారణ చేపట్టి నివేదిక రూపొందించారు.

సంతకాల ఫోర్జరీ: చీకలగురికిలో ఓట్ల తొలగింపులో జరిగిన అక్రమాలపై ఆధారాలతో సహా పయ్యావుల అక్టోబరులోనే కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో తూతూమంత్రంగా విచారణ జరిపి బాధ్యుల్ని వదిలేశారు. క్షేత్రస్థాయిలో ఓట్లను తొలగించేటప్పుడు కచ్చితంగా నోటీసులు ఇవ్వాలనేది నిబంధన. బీఎల్వోలు దీన్ని పాటించకుండానే తెదేపా సానుభూతిపరుల ఓట్లు తొలగించారు. పయ్యావుల కేశవ్ ఈసీకి ఫిర్యాదు చేయడంతో నకిలీ నోటీసులు సృష్టించారు. ఆర్డీవో విచారణలో ఆ సంతకాలు తమవి కాదని బాధితులు వాపోయారు. క్షేత్ర స్థాయిలో వాలంటీర్లు చెప్పిన వారి ఓట్లను అప్పటి తహసీల్దారు తొలగించినట్లు తెదేపా నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా ఈసీ నుంచి ఉన్నతాధికారులు నేరుగా విచారణకు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరు హడావుడిగా బీఎల్వోలు మధు, గోపిలను సస్పెండు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## గోదావరిలో నీటి లభ్యతపై వాడీవేడీ!

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదిలో నీటి లభ్యతపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో గోదావరి బోర్డు ఛైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన 14వ గోదావరి నదీ యాజమాన్య బోర్డు 14 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశమయింది. తెలంగాణ తరఫున సభ్యులు.. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, ఏపీ తరఫున సభ్యుడు జల వనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

*గోదావరిలో రాష్ట్రాల వాటా తేల్చాలి*

తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీకి అభ్యంతరాలు ఉన్నాయని పదేపదే చెబుతున్నా సాధారణ న్యాయాన్ని కూడా పాటించడం లేదు. నీటిలభ్యత ఉండగా గూడెం ఎత్తిపోతల పథకంలో అదనపు ఎత్తిపోతల అవసరం ఏమిటని ప్రశ్నించాం. గోదావరిలో ఎంత నీరు ఉంది, ఏ రాష్ట్రానికి ఎంత వాటా ఉందో తేల్చాలని అడిగాం. అందుబాటులో ఉన్న నీటిని సీడబ్ల్యూసీ ద్వారా శాస్త్రీయ అధ్యయనం చేయాలని బోర్డు నిర్ణయించింది. నీటి లెక్కింపునకు టెలిమెట్రీలు ఎక్కువచోట్ల ఏర్పాటుచేయాలని ఏపీ కోరింది. తెలంగాణ 5 చోట్లే పెట్టాలంది. పోలవరం ప్రాజెక్టుపై తెలంగాణ చర్చకు పెట్టగా ఈవేదిక సరైందికాదని చెప్పాం.

– నారాయణరెడ్డి, ఏపీ ఈఎన్‌సీ

(మరిన్ని వివరాలు ఈనాడు.నెట్‌లో)















EENADU Vol: 49, Iss: 145 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. D/VJ/013/2021-23. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu



# అమెరికాలో ఆట మొదలు!

రెండేళ్లగా ఏకపక్షంగా సాగుతున్న అమెరికా రాజకీయాల్లో కొత్త ఆట మొదలైంది. ఆ దేశ పార్లమెంటు (కాంగ్రెస్)లోని కీలకమైన ప్రతినిధుల సభ మంగళవారం నుంచి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీలోని రిపబ్లికన్ల చేతుల్లోకి వచ్చింది. రిపబ్లికన్ మెజార్టీతో కొత్త సభ కొలువుదీరింది. దీంతో రెండేళ్లుగా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పినట్లు సాగుతున్న అమెరికా రాజకీయాల్లో వేడి రాజుకున్నట్లైంది. డెమొక్రాట్ ప్రభుత్వ బిల్లులు, పట్టాలను అడ్డుకోవటంతో పాటు.. అధ్యక్షుడు బైడెన్ నిర్ణయాలు, ఆయన కుటుంబ సభ్యుల కార్యకలాపాలపై విచారణకు సైతం రిపబ్లికన్‌లు సిద్ధమవుతుండటమే రాజకీయ వేడికి కారణం!

డొనాల్డ్ ట్రంప్ ఓటమి తర్వాత... రెండేళ్లుగా రిపబ్లికన్ పార్టీ నిస్తేజంగా మారింది. ట్రంప్‌తో పాటు మరికొందరు నేతలపై ఆరోపణలు, విచారణలతో ఆ పార్టీలో స్తబ్ధత నెలకొంది. అమెరికా పార్లమెంటులో రెండు సభలుంటాయి. సెనెట్, ప్రతినిధుల సభ. కొద్దిరోజుల కిందట జరిగిన మధ్యంతర ఎన్నికల్లో సెనెట్‌లో డెమొక్రాట్లకు ఆధిక్యం లభించింది. ప్రతినిధుల సభను రిపబ్లికన్లు చేజిక్కించుకోవటంతో ట్రంప్ పార్టీలో మళ్లీ చురుకుదనం మొదలైంది. మరో రెండేళ్లలో (2024) అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయటానికి దీన్ని అవకాశంగా రిపబ్లికన్లు భావిస్తున్నారు. దీంతో రాబోయే ఈ రెండేళ్లలో అనేక చట్టాలపై పీటముడి పడటంతో పాటు బైడెన్ యంత్రాంగం వ్యవహారాలపై, ముఖ్యంగా ఆయన కుమారుడు హంటర్ బైడెన్ వ్యాపార కార్యకలాపాలు, ఉక్రెయిన్‌తో సంబంధాలపై ప్రతినిధుల సభ విచారణకు ఆదేశించే అవకాశాలున్నాయి. బైడెన్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెడతామని కొందరు రిపబ్లికన్ ఎంపీలు ఇప్పటికే ప్రకటించారు.

## ఉక్రెయిన్‌కు మద్దతులో కోత?

ఉక్రెయిన్‌కు అమెరికా చేస్తున్న ఆర్థిక సాయానికి కూడా బ్రేకులు వేయాలని రిపబ్లికన్లు ఆలోచిస్తున్నారు. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు అమెరికా విచ్చలవిడిగా సాయం చేస్తోందన్నది రిపబ్లికన్ల భావన. స్వదేశంలో అమెరికన్లను మాంద్యంలోకి నెట్టి.. అధికధరలు, పెరిగిన ఖర్చుల్లో ముంచుతూ, ఉక్రెయిన్‌కు ఖాళీ చెక్కుపై సంతకం చేసి ఇవ్వటం మూర్ఖత్వమన్నది వారి వాదన. మధ్యంతర ఎన్నికల ముందు దీన్నే ప్రధాన ప్రచారాంశంగా కూడా చేసుకున్నారు. ఉక్రెయిన్‌తో పాటు... విదేశాలకు అమెరికా చేస్తున్న ఆర్థిక సాయంపై విచారణ జరుపుతామంటూ రిపబ్లికన్ పార్టీ కీలక నేత మెకార్థీ ఇప్పటికే ప్రకటించారు. మొత్తానికి... ఈ రెండేళ్లలో అమెరికా రాజకీయాలు మళ్లీ రంజుగా మారబోతున్నాయి. రెండేళ్లుగా తమపై విచారణలు, దర్యాప్తులతో విరుచుకుపడుతున్న బైడెన్‌కు ముకుతాడు వేయాలని రిపబ్లికన్లు తహతహలాడుతున్నారు. అయితే రిపబ్లికన్ పార్టీలో ట్రంప్‌ను సమర్థించే, వ్యతిరేకించే గ్రూపులు ఎలా వ్యవహరిస్తాయన్నదానిపైనే ఈ రాజకీయం ఆధారపడి ఉంటుంది. తాజాగా ప్రతినిధుల సభ కొత్త స్పీకర్‌ను ఎన్నుకోవటంలోనే ఆ పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తంకాలేదు. అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఈ విభేదాలెలా సాగుతాయన్నది కీలకం కాబోతోంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

# అంజలిపై అత్యాచారం జరగలేదు

- తేల్చిచెప్పిన శవపరీక్ష నివేదిక
- యువతి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం
- దిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటన
- హతురాలి అంత్యక్రియలు పూర్తి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో స్కూటీపై వెళ్తున్న యువతిని కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లిన ఘటనలో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. సుల్తాన్‌పురికి చెందిన మృతురాలు అంజలి సింగ్(20) భౌతికకాయానికి పరీక్ష నిర్వహించిన వైద్య బృందం.. ఆమె జననాంగాలపై ఎటువంటి గాయాలు లేవని తేల్చింది. వారి నివేదికను బట్టి.. ఆమెపై అత్యాచారం జరగలేదని పోలీసులు స్పష్టంచేశారు. యువతిపై అత్యాచారం జరిగి ఉంటుందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించిన విషయం తెలిసిందే. సోమవారం దిల్లీలోని మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీలో మెడికల్ బోర్డు శవపరీక్ష నిర్వహించింది. ఆదివారం ప్రమాదం జరిగిన సమయంలో అంజలి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంపై మరో యువతి ఉన్నట్లు సీసీటీవీల పరిశీలన ద్వారా పోలీసులు గుర్తించారు. ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు మంగళవారం నమోదు చేశారు. ఆ ప్రకారం ప్రమాదం జరిగిన రాత్రి కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా అంజలి, తాను కలిసి కొంతమంది స్నేహితులను కలిసేందుకు ఓ హోటల్‌కు వెళ్లినట్లు ఆమె తెలిపింది. పార్టీ అనంతరం మద్యం సేవించి ఉన్నప్పటికీ స్కూటర్ నడపాలని అంజలి కోరుకున్నట్లు చెప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే భయంతో అక్కడి నుంచి పారిపోయినట్లు వెల్లడించింది. మరోపక్క పటిష్ఠ బందోబస్తు మధ్య అంజలి భౌతికకాయానికి కుటుంబసభ్యులు మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.



అంజలి సింగ్ మృతదేహం మంగళవారం దిల్లీ సుల్తాన్‌పురిలోని తమ నివాసానికి చేరుకున్న సమయంలో విచార వదనంతో ఆమె తల్లి

### కారు టైరులో కాలు ఇరుక్కోవడంతో..

కారు ఢీకొట్టిన ఘటనలో కారు టైరులో యువతి కాలు ఇరుక్కుపోవడం వల్ల ఆమెను లాక్కెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ సమయంలో మద్యం సేవించి ఉన్నట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. కారు టైరులో ఏదో ఇరుక్కుపోయినట్లు నిందితుల్లో ఒకరు మిగతావారికి చెప్పగా.. వారు దాన్ని పట్టించుకోలేదని విచారణలో వెల్లడైంది. కాంఝవాలా ప్రాంతంలో కారు మలుపు తీసుకుంటుండగా.. యువతి చేయి కనిపించి కారును ఆపినట్లు నిందితులు తెలిపారు. తర్వాత కారు నుంచి యువతి మృతదేహం వేరు కాగానే అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులకు వివరించారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం ఐదుగురు నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిపై నిర్లక్ష్యం, ర్యాష్ డ్రైవింగ్ కింద కేసులు నమోదు చేశారు.

### న్యాయవాది నియామకం

బాధితురాలు అంజలి కుటుంబానికి దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. అనంతరం వారి తరపున కోర్టులో పోరాడడానికి న్యాయవాదిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు.

### కారుకు అంజలి చిక్కుకున్నట్లు తెలిసినా..

అంజలి సింగ్ ప్రమాదానికి గురైన సందర్భంలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఆమె స్నేహితురాలు నిధి ఆ రోజు ఏం జరిగిందన్న విషయాన్ని మంగళవారం వివరించారు. "ఆదివారం మేం ఇద్దరం కొంతమంది స్నేహితులను కలుసుకునేందుకు ఓ హోటల్‌కు వెళ్లాం. అక్కడ పార్టీలో అంజలి మద్యం సేవించింది. పార్టీ అయ్యాక తెల్లవారుజామున 1.45 గంటలకు స్కూటీని తానే నడుపుతానంటూ హోటల్ బయట అంజలి నాతో గొడవ పడింది. దానికి నేను ఒప్పుకోలేదు. కొంత దూరం వెళ్లాక నా స్కూటీని నేనే నడుపుతాను. లేదంటే దీని మీద నుంచి దూకేస్తా అంటూ బెదిరించింది. దీంతో చేసేది లేక అంజలికి బండి అప్పగించాను. ఆమె నడుపుతున్న క్రమంలో ఓసారి మేం ఓ ట్రక్కును ఢీకొట్టబోయాం. నేను ఏదోలా బ్రేకులు వేయడంతో ఆ ప్రమాదాన్ని త్రుటిలో తప్పించుకున్నాం. ఆ తరువాత కొంత సమయానికే ఓ కారు మా స్కూటీని ఢీ కొట్టింది. దీంతో కిందపడిపోయిన నాకు కళ్ల వద్ద స్వల్ప గాయాలయ్యాయి. అంజలి కారుకు చిక్కుకుపోయింది. అయినా కారు ఆగలేదు. కొంత దూరం ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కు వచ్చింది. ఆపై అత్యంత వేగంతో ముందుకు వెళ్లిపోయింది. కారులో ఎటువంటి సంగీతం వినిపించలేదు. తమ కారుకు ఓ మహిళ చిక్కుకుపోయిందని అందులోని నిందితులకు తెలుసు. అయినా ఆమెను రక్షించేందుకు కారును ఒక్కసారి కూడా ఆపకుండా నా స్నేహితురాలిని లాక్కుని వెళ్లిపోయారు. ఈ సంఘటనకు నన్ను నిందిస్తారనే భయంతో ప్రమాదంపై ఎవరికీ చెప్పలేదు. ఆ రోజు రాత్రి జరిగిన ఈ దారుణాన్ని మరిచిపోలేకపోతున్నాను" అని నిధి వెల్లడించారు.

## మత మార్పిళ్లన్నీ చట్టవిరుద్ధమని చెప్పలేం: సుప్రీంకోర్టు



దిల్లీ: మత మార్పిళ్లన్నింటినీ చట్ట విరుద్ధమని చెప్పలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. జిల్లా మేజిస్ట్రేట్‌కు తెలియపరచకుండా మతాంతర వివాహం చేసుకున్న జంటను ప్రాసిక్యూట్ చేయకుండా తమను నిలువరిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు మీద ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవాల్‌పై విచారణ చేపట్టడానికి అంగీకరించింది. జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ సి.టి.రవికుమార్‌ల ధర్మాసనం దీనిపై నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను ఫిబ్రవరి 7కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన అభ్యర్థనను మాత్రం ధర్మాసనం తిరస్కరించింది.

## భారత రాజ్యాంగం సజీవ పత్రం

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

జైపుర్: భారత రాజ్యాంగం సజీవ పత్రమని.. ప్రజల ఆశలు, ఆశయాలను ప్రతిబింబించే శక్తి దానికి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. రాజ్యాంగానికి ఇంతవరకు చేసిన 105 సవరణలే అందుకు సాక్ష్యమన్నారు. రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో స్మార్ట్ నగరాల పథకం కింద నిర్మించిన రాజ్యాంగ పార్కు (సంవిధాన్ ఉద్యాన్)ను రాష్ట్రపతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భావి తరాల అవసరాలకు అనుగుణంగా తగు సవరణలు చేసుకోవడానికి రాజ్యాంగంలోనే వెసులుబాటు కల్పించారని గుర్తు చేశారు. రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పార్కులో రాజ్యాంగ రచన మొదలుకొని అమలు వరకు వివిధ ఘట్టాలను శిల్పాలు, చిత్రాల రూపంలో ఇక్కడ ఏర్పాటుచేశారు.

## డబ్బులిస్తాం.. నగరాన్ని వీడండి

### టోక్యో వాసులకు జపాన్ అభ్యర్థన

టోక్యో: జపాన్ రాజధాని టోక్యో.. ఇప్పటికే 3.80 కోట్లకుపైగా జనాభాతో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా రికార్డులకెక్కింది. మరోవైపు దేశంలోని మిగిలిన పట్టణాలు జనాభా తగ్గిపోయి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. టోక్యో నుంచి ఇతర ప్రాంతాలకు వలసలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఓ వార్తాసంస్థ వివరాల ప్రకారం.. టోక్యోను వీడే కుటుంబంలోని ఒక్కో బిడ్డకు గతంలో 3 లక్షల యెన్‌ల చొప్పున ఇవ్వగా ఇప్పుడు దీన్ని 10 లక్షల యెన్‌ల(రూ.6.35 లక్షలు)కు పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి రానుంది. జపాన్‌లోని ఇతర నగరాల్లో జనాభా లేక వ్యాపారాలు దెబ్బతినడంతో ఆస్తుల విలువ పడిపోతోంది. టోక్యోను వీడాలంటూ.. జపాన్ 2019 నుంచి ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రారంభించింది. జననాల రేటు తగ్గుతున్న, వృద్ధులు అధికంగా ఉన్న ప్రాంతాలకు కుటుంబాలు తరలివెళ్లేలా ప్రోత్సహిస్తోంది. ఇదివరకు.. ఒకరికంటే ఎక్కువ పిల్లలున్న కుటుంబానికి 30 లక్షల యెన్‌ల వరకు ఆర్థిక సాయంతోపాటు, ఒక్కో బిడ్డకు 3 లక్షల యెన్‌ల చొప్పున చెల్లించింది. సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభిస్తే.. దానికీ ఆర్థిక సాయం అందించేది.. అయినా వలసల్లో మార్పు కనబడలేదు. 2021లో కేవలం 2,400 కుటుంబాలు మాత్రమే వలస వెళ్లాయి.

## ఈ నెల 27న 'పరీక్షా పే చర్చా'



దిల్లీ: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు, వారి సందేహాలను తీర్చడానికి ప్రధాని మోదీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "పరీక్షా పే చర్చా" కార్యక్రమంపై కేంద్ర విద్యాశాఖ మంగళవారం ప్రకటన చేసింది. "నిరీక్షణ సమయం ముగిసింది. పరీక్షా పే చర్చ కార్యక్రమం ఈ నెల 27న దిల్లీలోని తాల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరగబోతోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంభాషిస్తారు" అని విద్యాశాఖ ట్వీట్ చేసింది. ఈ కార్యక్రమానికి 150కి పైగా దేశాల నుంచి విద్యార్థులు, 51 దేశాల నుంచి ఉపాధ్యాయులు, 50 దేశాల నుంచి తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. మొత్తం 2,050 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది.




# పాక్‌కు అప్పుల తిప్పలు

- మార్కెట్లు త్వరగా మూసేయాలి
- సూర్యుని వెలుగులోనే సమావేశాలు
- ఇంధన పొదుపు కోసం సర్కారు నిర్ణయాలు

ఇస్లామాబాద్: అప్పుల ఊబిలో చిక్కుకుపోయిన పాకిస్థాన్ తన ఖర్చులను తగ్గించుకునే పనిలో పడింది. పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం నుంచి బయటపడటానికి పొదుపు బాట పట్టింది. 'ఇంధన పొదుపు ప్రణాళిక' అంశంపై మంగళవారం కేబినెట్ సమావేశం జరిగింది. అందులో తీసుకున్న నిర్ణయాలను రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ విలేకర్లకు తెలిపారు. ఇప్పటినుంచి మార్కెట్‌లను రాత్రి 8:30 వరకు, కల్యాణమండపాలను రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. దీనివల్ల ఖజానాకు రూ.6 వేల కోట్లు ఆదా అవుతాయని తెలిపారు. ఫిలమెంట్ బల్బుల తయారీని ఫిబ్రవరి 1 నుంచి నిలిపివేయడం రూ.2,200 కోట్లు, గ్యాస్‌ను తక్కువగా వాడుకునే శంకువు ఆకారపు గీజర్ల వాడకాన్ని మాత్రమే అనుమతించడం ద్వారా రూ.9,200 కోట్లను ఆదా చేయనున్నామని చెప్పారు. పక్కపక్కనే ఉండే వీధి దీపాలను వెలగించకపోతే రూ.400 కోట్లు మిగులుతాయని చెప్పారు.



ఖైబర్ పఖ్తూంఖ్వాలో ప్లాస్టిక్ బ్యాగుల్లో వంట గ్యాస్‌ను తీసుకెళ్తున్న స్థానికులు

### ఇంటి నుంచి పని, విద్యుత్తు బైక్‌లు

ప్రభుత్వ కార్యాలయాలూ పొదుపు నిబంధనలను పాటించాలన్నారు. ఇందులో భాగంగా 'ఇంటి నుంచి పని' విధి విధానాలను 10 రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. సమావేశాలను సూర్యకాంతి అందుబాటులో ఉన్నప్పుడే నిర్వహించుకోవాలని, ఈరోజు కేబినెట్ సమావేశం అలానే జరిగిందని వెల్లడించారు. ఇంధన దిగుమతులను తగ్గించేందుకు ఈ సంవత్సరాంతానికి విద్యుత్ బైక్‌లను ప్రవేశపెడతామని ఆసిఫ్ ప్రకటించారు. ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కడానికి ఇంధన పొదుపు చర్యలు అత్యవసరమని జాతీయ భద్రతా సంఘం తేల్చిచెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయాలు వెలువడ్డాయి.

### ప్లాస్టిక్ సంచుల్లో వంట గ్యాస్

పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించుకునేందుకు పాక్ ప్రజలు వంటగ్యాస్‌ను ప్లాస్టిక్ కవర్లలో నిల్వ చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అనేక ప్రాంతాలను వంటగ్యాస్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తూంఖ్వాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. భారీ సైజులో ఉన్న ప్లాస్టిక్ బ్యాగుల్లో వంట గ్యాస్‌ను నింపి.. తీసుకువెళ్తున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇది ప్రమాదకరం కావడంతో అధికారులు వాటి వినియోగాన్ని నిషేధించారు. ఇక్కడి హంగూ నగర ప్రజలు గత రెండేళ్లుగా గ్యాస్ కనెక్షన్ లేకుండానే జీవనం సాగిస్తున్నట్లు సమాచారం.

# సమరానికీ, సంక్షేమానికీ తోడ్పడే ప్రాజెక్టులు

- అరుణాచల్‌ప్రదేశ్‌లో వినియోగంలోకి వచ్చిన 100 మీటర్ల ఉక్కు వంతెన
- మరో 27 బీఆర్‌వో నిర్మాణాలనూ ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

బోలెంగ్: భారతదేశం ఎన్నడూ యుద్ధాన్ని ప్రేరేపించలేదనీ, పొరుగు దేశాలతో సత్సంబంధాలనే కోరుకుంటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. సరిహద్దుల్లో ఎలాంటి సవాళ్లు ఎదురైనా తిప్పికొట్టే సత్తా మన సైనిక దళాలకు ఉందని స్పష్టం చేశారు. సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) అరుణాచల్‌ప్రదేశ్‌లోని బోలెంగ్‌కు సమీపంలో నిర్మించిన ఒక వంతెనను మంగళవారం ఆయన ప్రారంభించారు. సరిహద్దుల్లో, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. దీనివల్ల దేశ భద్రత అభేద్యంగా తయారవుతుందన్నారు. వాస్తవాధీన రేఖపై తవాంగ్ సెక్టార్‌లో గత నెల 9న చైనా సైనికుల అతిక్రమణను మన జవాన్లు సాహసోపేతంగా అడ్డుకున్న మూడున్నర వారాలకు రక్షణ మంత్రి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. అరుణాచల్‌లో పశ్చిమ సియాంగ్, ఎగువ సియాంగ్ జిల్లాలను కలిపే ఆలో-యింగ్ కియాంగ్ రహదారిపై ఆర్చి ఆకారంలో నిర్మించిన 100 మీటర్ల పొడవైన ప్రత్యేక ఉక్కు వంతెనను రాజ్‌నాథ్ ప్రారంభించారు. కొత్త వంతెన స్థానికుల రాకపోకలకే కాకుండా శత్రు దురాక్రమణ సందర్భంలో సేనలు, ట్యాంకులు, ఫిరంగులు, ఇతర యుద్ధ సామగ్రి వేగంగా సరిహద్దుకు చేరుకోవడానికీ తోడ్పడుతుందని తెలిపారు. ఉక్కు వంతెనతో పాటు మరో 27 బీఆర్‌వో ప్రాజెక్టులను కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ 28 ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం రూ.724.30 కోట్లు. వీటిలో అయిదింటిని అరుణాచల్‌ప్రదేశ్‌లో, ఎనిమిదింటిని లద్దాఖ్‌లో, నాలుగు జమ్మూకశ్మీర్‌లో; సిక్కిం, పంజాబ్, ఉత్తరాఖండ్‌లలో మూడేసి చొప్పున, రాజస్థాన్‌లో రెండు నిర్మించారు.

## ఐరోపా, అమెరికాకు నచ్చకున్నా రష్యా నుంచి చమురు కొంటాం

- ఒప్పందాలను చైనా ఉల్లంఘించినందునే ఉద్రిక్తతలు: జైశంకర్



వియన్నా: ఐరోపా, అమెరికాలకు నచ్చకపోయినా సరే రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటూనే ఉంటామని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సోమవారం ఆస్ట్రియా జాతీయ ప్రసార సంస్థ ఓఆర్ఎఫ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. రష్యా నిరుడు ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండెత్తినప్పుడే ఐరోపా దేశాలు ఎందుకు చమురు దిగుమతులను బంద్ చేయలేదని ప్రశ్నించారు. అప్పటి నుంచి అవి భారత్ కన్నా ఆరు రెట్లు ఎక్కువగా రష్యన్ చమురును దిగుమతి చేసుకున్నాయని ఆయన గుర్తు చేశారు. ఐరోపా దేశాలు తమ ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో రష్యన్ చమురు దిగుమతులను క్రమక్రమంగా తగ్గించుకొంటూ వచ్చాయన్నారు. 60,000 యూరోల తలసరి ఆదాయం గల ఐరోపా దేశాలు తమ ప్రజల ప్రయోజనాల కోసం అంతగా శ్రద్ధ తీసుకొంటున్నప్పుడు, కేవలం 2,000 డాలర్ల తలసరి ఆదాయం గల భారతీయుల ప్రయోజనాల గురించి తామెంత శ్రద్ధ వహించాలని జైశంకర్ ప్రశ్నించారు. చమురుకు ఎక్కువ ధర పోసే స్థితిలో భారత్ లేదని చెప్పారు. ఐరోపా దేశాలు రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించి పశ్చిమాసియా నుంచి కొంటున్నందున మార్కెట్‌లో వాటి ధరలు పెరిగిపోతున్నాయన్నారు. ఒకప్పుడు భారత్‌కు కేవలం 0.2 శాతం చమురు దిగుమతులు రష్యా నుంచి వస్తే ఇప్పుడవి 20 శాతానికి చేరుకున్నాయి. సరిహద్దుపై భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలను చైనా ఉల్లంఘించినందునే ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. భారతదేశంపై పాక్ రెచ్చగొడుతున్న సీమాంతర ఉగ్రవాదాన్ని చూసి ప్రపంచం ఆందోళన చెందాలని హెచ్చరించారు. పాకిస్థాన్ నగరాల్లో బాహాటంగానే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నడుస్తున్నా ఆ సంగతి అక్కడి ప్రభుత్వానికి తెలియదనుకోవాలా? అని ప్రశ్నించారు.

ఈటీవీ భారత్

## శతఘ్ని గుండును తొలగించిన నిపుణులు

చండీగఢ్: పంజాబ్, హరియాణా ముఖ్యమంత్రులు ఉమ్మడిగా వినియోగించే హెలిప్యాడ్‌కు సమీపంలో గుర్తించిన శతఘ్ని గుండును మంగళవారం తొలగించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల నివాసాలకు రెండు కిలోమీటర్ల దూరంలోని ఓ మామిడి తోటలో సోమవారం లభ్యమైన ఈ పేలుడు పదార్థం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం భారత సైన్యానికి చెందిన నిపుణులు అక్కడకు చేరుకుని పేలుడు పదార్థాన్ని పరిశీలించారు. అనంతరం దాన్ని ఓ రోబోటిక్ పరికరం సహాయంతో డ్రమ్ములోంచి తీసి తమ వెంట పట్టుకెళ్లారు. ఆ శతఘ్ని గుండును విశ్లేషించి ఇక్కడికి ఎవరు తీసుకొచ్చారు తదితర వివరాలను నిపుణులు వెల్లడిస్తారని చండీగఢ్ విపత్తుల నిర్వహణ నోడల్ అధికారి సంజీవ్ కోహ్లీ మీడియాకు తెలిపారు.

## సరిహద్దులో పాక్ చొరబాటుదారుడి కాల్చివేత

పంజాబ్‌లోని భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు గుండా.. భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన పాకిస్థాన్ సాయుధుడిని భద్రతా దళాలు హతమార్చాయి. మంగళవారం ఉదయం 8.30 సమయంలో గురుదాస్‌పుర్ సెక్టార్‌లోని చన్నా సరిహద్దు పోస్ట్ వద్ద ఈ ఘటన జరిగింది. అతడి దగ్గర అధునాతన 'పంప్ యాక్షన్' షాట్‌గన్ వంటి ఆయుధాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. 2023లో సరిహద్దు వద్ద పాకిస్థాన్ చొరబాటుదారుడిని కాల్చివేసిన మొదటి సంఘటన ఇది. 2022లో పంజాబ్‌లోని 553 కిలోమీటర్ల పొడవైన భారత్-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు చొరబాటుదారులను బీఎస్ఎఫ్ హతమార్చింది. 23 మంది పాకిస్థానీలను పట్టుకుంది.

## గిడ్డంగుల నిర్వహణకు ప్రత్యేక డ్రోన్

### గువాహటి ఐఐటీ పరిశోధకుల ఘనత

దిల్లీ: గిడ్డంగుల నిర్వహణ, సైనిక అవసరాలు, శాంతి భద్రతల పరిరక్షణకు గువాహటి ఐఐటీ పరిశోధకులు విభిన్నరకాల డ్రోన్లను అభివృద్ధి చేశారు. గాల్లోకి నిట్టనిలువున పైకి లేచే మానవరహిత విమానం 'రావెన్'నూ రూపొందించారు. ఇరుకైన ప్రాంతాల్లో నిఘా కోసం ప్రత్యేక లోహవిహంగాన్ని తయారుచేశారు. ఆర్నిథోకాప్టర్ అనే ఈ డ్రోన్ రూపకల్పనకు పక్షుల డిజైన్‌ను స్ఫూర్తిగా తీసుకున్నారు. లక్ష్యంపైకి గురితప్పకుండా కాల్పులు జరిపే డ్రోన్‌నూ సిద్ధం చేశారు. గోదాముల్లో వస్తువులను భిన్నప్రదేశాలకు తరలించడం వంటి సంక్లిష్ట విధులు ఉంటాయని గువాహటి ఐఐటీ ప్రొఫెసర్ చివుకుల వాసుదేవ శాస్త్రి పేర్కొన్నారు. ఈ కసరత్తులో ఏదైనా వైఫల్యం జరిగితే భారీ ఆర్థిక నష్టాలు తప్పవని చెప్పారు. దీన్ని అధిగమించడానికి తాము రూపొందించిన 'వేర్‌హౌస్ డ్రోన్' ఉపయోగపడుతుందని వివరించారు. దీనికి స్వల్ప మార్పులు చేసి పొలాల్లో నీటి ప్రవాహం గురించి అర్థం చేసుకోవడానికి, నగరాల్లో సరకు రవాణాకు ఉపయోగించొచ్చన్నారు. భద్రతా దళాల కోసం రూపొందించిన గస్తీ డ్రోన్ 'రీపర్'.. వరదలు, భూకంపాల సమయంలో విపత్తు నిర్వహణ బృందాలకు తోడ్పాటు అందించగలదని చెప్పారు.

## బ్రిటన్ రాజుతో మోదీ మంతనాలు

దిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం బ్రిటన్ రాజు ఛార్లెస్-3తో పలు అంశాలపై టెలిఫోన్‌లో చర్చలు జరిపారు. వాతావరణ చర్య, జీవవైవిధ్య పరిరక్షణ, ఇంధన పరివర్తనకు సంబంధించిన పరిష్కారాల ఆవిష్కరణకు ఆర్థిక సహకారం వంటి విషయాలపై ఈ మంతనాలు సాగినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఛార్లెస్ రాజయ్యాక ఆయనతో ప్రధానమంత్రి మంతనాలు జరపడం ఇదే తొలిసారని తెలిపింది. ఈ సందర్భంగా ఆయన పాలనాకాలం దిగ్విజయంగా సాగాలని మోదీ అభిలషించారని వివరించింది. "పరస్పర ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, కామన్వెల్త్, భారత్ నేతృత్వంలో జి-20 ప్రాధాన్యతలు, మిషన్ ఎల్ఐఎఫ్ఈ వంటి అంశాలపై కింగ్ ఛార్లెస్‌తో సంభాషించడం సంతోషకరం" అని మోదీ ట్విటర్‌లో పేర్కొన్నారు.

## మాపై కొవిడ్ ఆంక్షలు ఆక్షేపణీయం: చైనా

బీజింగ్: తమపై పలు దేశాలు విధిస్తున్న కరోనా ఆంక్షలు ఏమాత్రం ఆమోదయోగ్యమైనవి కావని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావోనింగ్ వ్యాఖ్యానించారు. "చైనాను లక్ష్యం చేసుకొని కొన్ని దేశాలు మితిమీరిన ఆంక్షలు విధించడం ఆమోదయోగ్యం కాదు. ఆయా దేశాలు అనుసరిస్తున్న ప్రవేశ పరిమితులకు శాస్త్రీయ ఆధారాలు ఏమీ లేవు. కొవిడ్ చర్యలను రాజకీయ లక్ష్యానికి ఉపయోగిస్తే.. మేం దానికి దీటుగా ప్రతిస్పందిస్తాం" అని మంగళవారం ఆయన ఘాటుగా హెచ్చరించారు. చైనాలో కొవిడ్ విజృంభణతో ఇప్పటికే అమెరికా, బ్రిటన్, భారత్, జపాన్ లాంటి దేశాలు ఆ దేశ ప్రయాణికులపై ఆంక్షలు విధిస్తుండగా.. తాజాగా ఈ జాబితాలో ఆస్ట్రేలియా, కెనడా చేరాయి.

## భారతీయతను రాహుల్ అర్థం చేసుకోవాలి: భాజపా

దిల్లీ: దేశమంతటా పర్యటించినంత మాత్రాన భారత్‌ను తెలుసుకోలేరనీ, భారతీయత అంటే ఏమిటో రాహుల్ అర్థం చేసుకోవాలని భాజపా అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది పేర్కొన్నారు. చైనాతో సరిహద్దు వివాదాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యల్ని ఆయన తప్పుబట్టారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన తరహాలో చైనాకు మన దేశం లొంగిపోవాలన్నట్లుగా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయనీ, పాదయాత్రలో తీవ్ర గందరగోళానికి గురై అలా మాట్లాడినట్లున్నారని మంగళవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. భారతదేశ ఆవిష్కరణకు (డిస్కవరీ ఆఫ్ ఇండియా) గాంధీల కుటుంబం గత నాలుగు తరాలుగా ప్రయత్నిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు.

### రాహుల్‌కు రామజన్మ భూమి పూజారి శుభాకాంక్షలు

అయోధ్య: భారత్ జోడో యాత్ర చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అయోధ్య రామజన్మభూమి ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ లేఖ రాశారు. రాముడి ఆశీస్సులు రాహుల్‌కు లభించాలన్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు రాహుల్ చేపట్టిన యాత్ర ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. రాహుల్ యాత్రకు ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మద్దతు పలికారు.

## రేషన్‌లో కోతలే మోదీ కొత్త ఏడాది కానుక

- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శ

దిల్లీ: కొత్త సంవత్సర కానుకగా రేషన్‌లో కోతలు విధిస్తూ ప్రజలను మోదీ దగా చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ మంగళవారం విమర్శించారు. "81 కోట్ల మంది లబ్ధిదారులకు ఇచ్చే రేషన్‌లో 50 శాతం కోత విధించారు. ప్రస్తుతం 10 కిలోల ఆహార ధాన్యాలు ఇస్తున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన నిలిపివేయడంతో ఇందులో 5 కిలోల ఆహార ధాన్యాలకు కోత విధించినట్లయింది. రాష్ట్రాల అంగీకారం తీసుకోకుండానే మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఒక్కో కుటుంబంపై నెలకు రూ.750, సంవత్సరానికి రూ.9000 అదనంగా భారం పడుతోంది. మోదీ ఓ యూటర్నుల మాస్టర్. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107వ స్థానంలో ఉంది. ఆహార భద్రత ప్రజలకు కానుక కాదు. అది వారి హక్కు' ' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. రేషన్‌లో కోతల ద్వారా ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఆదా చేయనుందని, దీన్ని మూడు మార్గాల్లో సద్వినియోగం చేయొచ్చని జైరాం సలహా ఇచ్చారు.

- 2021 జనగణన ఆలస్యం కారణంగా 10 కోట్ల మంది రేషన్ పొందలేకపోతున్నారు. వారందరిని రేషన్ లబ్ధిదారులుగా గుర్తించాలి.
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వలస కార్మికులందరికీ వెంటనే రేషన్ కార్డులు కల్పించి.. ఆహార ధాన్యాలు సరఫరా చేయాలి.
- జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి బిడ్డ తల్లికి ప్రసూతి హక్కుల కింద రూ.6000 ఇవ్వాలి. కానీ ప్రభుత్వం తొలి బిడ్డకు మాత్రమే కేవలం రూ.5000 అందజేస్తోంది. మోదీ ప్రభుత్వం వెంటనే చట్టాన్ని ఉల్లంఘించడం ఆపాలి.



సిమెంట్ రహదారిని భారీ యంత్రంతో తవ్వేసినట్లుగా ఉన్న ఈ దృశ్యం కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రావిన్సులో కనిపించింది. అక్కడి ఆగసీ-చిలవాక్ పట్టణాల మధ్యనున్న ఫ్రేజర్ నదిలోని నీరు అతి శీతల వాతావరణం కారణంగా గతంలో గడ్డకట్టేసింది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరగడంతో ఇప్పుడు బద్ధలై ఇలా భారీ మంచు ఫలకాలు ఏర్పడ్డాయి.

# వర్సిటీలకు ఉపకులపతులు కావలెను!

- విశ్వవిద్యాలయాల వీసీ పోస్టులకు కనిపించని స్పందన
- సగానికిపైగా తగ్గిన దరఖాస్తులు
- అభ్యర్థుల కోసం దేశవ్యాప్తంగా ప్రకటనలు ఇవ్వాలని నిర్ణయం



ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో కీలకమైన ఉపకులపతి(వీసీ) పోస్టుకు దరఖాస్తు చేసేందుకు అభ్యర్థుల కొరత ఏర్పడింది. విశ్వవిద్యాలయం నిర్వహణలో ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ పోస్టుకు వచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. ఇది ఇప్పుడు ఉన్నత విద్యలో ఆందోళనకరంగా మారింది. వీసీ పోస్టుల ఎంపికలో మెరిట్‌ను పట్టించుకోకుండా పార్టీ అనుకూలురికే పదవులు కట్టబెడుతుండటంతోనే ఈ పరిస్థితి దాపురించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ అండదండలు లేని వారికి వీసీ పదవి దక్కదనే ఉద్దేశంతో కొందరు మెరిట్ ఉన్నా దరఖాస్తు చేయడం లేదు. ఇటీవల ఆంధ్రకేసరి, గురజాడ జేఎన్‌టీయూ, వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాల వీసీ పోస్టులకు ప్రకటన ఇవ్వగా స్పందన సరిగా రాలేదు. కొత్తగా ఇవ్వబోయే వర్సిటీలకు జాతీయ స్థాయిలో రెండు పత్రికలకు ప్రకటనలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో ఒక పత్రికకు ఇస్తుండగా స్పందన లేదనే కారణంతో రెండింటికి ఇచ్చేలా ప్రభుత్వం అనుమతి తెలిపింది.

**కనిపించని స్పందన?**

గురజాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం వీసీ పోస్టు కోసం ప్రకటన ఇస్తే 30, వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్‌కు 15, ఆంధ్రకేసరికి 20 వరకు దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోలిస్తే దరఖాస్తులు సగానికి పైగా తగ్గిపోయాయి. వీటిని చూసిన ఉన్నత విద్యాశాఖ కొత్తగా వీసీ పోస్టులకు ఇచ్చే ప్రకటనలు దేశవ్యాప్తంగా రెండు పత్రికలకు ఇవ్వాలని నిర్ణయించింది. పద్మావతి మహిళ, యోగి వేమన, కృష్ణా, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల వీసీల పదవీకాలం జనవరి ఏడో తేదీతో ముగియనుంది. గతంలో వీసీ పోస్టులకు దరఖాస్తులు తక్కువగా వచ్చినందున ప్రస్తుతం కృష్ణా వర్సిటీ వీసీ కోసం మొదట జాతీయ స్థాయి ప్రకటన విడుదల చేశారు. దీని స్పందన ఆధారంగా మిగతా మూడు వర్సిటీలకు ప్రకటన ఇవ్వాలని నిర్ణయించారు.

◆ రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) వీసీ పోస్టు భర్తీకి ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పట్లో మంచి అభ్యర్థులు రాలేదని దాన్ని రద్దు చేశారు. వీసీకి ఎలాంటి అధికారాలూ లేకపోవడంతోనే మంచి వారు దరఖాస్తు చేయడం లేదని ప్రస్తుత ఇన్‌ఛార్జి వీసీ హేమచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల మరోసారి ప్రకటన ఇవ్వగా 60 దరఖాస్తులు వచ్చాయి. వీసీ పోస్టుకు విధించిన నిబంధనలు యూజీసీ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉండడంతో ఓ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. భర్తీ నిలిచిపోయింది.

**కారణాలపై మల్లగుల్లాలు..**

◆ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 15ఏళ్లుగా పోస్టులను భర్తీ చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీల్లో కలిపి 590 ఆచార్య పోస్టులు ఉండగా.. 308మంది మాత్రమే రెగ్యులర్‌వాళ్లు ఉన్నారు. వీసీ పోస్టుకు దరఖాస్తు చేయాలంటే ఆచార్యుడిగా 10ఏళ్ల అనుభవం అవసరం. కొంతమందికి ఇది లేదు. దీంతో అభ్యర్థుల సంఖ్యే తక్కువగా ఉంది.

◆ మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనే నిబంధన ఉన్నా దీన్ని పట్టించుకోవడం లేదు. రాజకీయ అండదండలు ఉన్నవారికే వీసీ పోస్టులు ఇస్తున్నందున ప్రతిభగల వారు రావడం లేదు.

◆ వీసీ పోస్టు ఖాళీ కాకుండానే వేరే వారికి రిజర్వు అయిపోయిందని, పలానా ప్రజాప్రతినిధి హామీ ఇచ్చారని జరుగుతున్న ప్రచారంతోనూ అభ్యర్థులు రావడం లేదు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ నియామకంలో రాయలసీమకు చెందిన సీనియర్ నేత గతంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

**ఇలా ఉంటే ఎలా వస్తారు?**

ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియమించిన వీసీల పనితీరు, ప్రవర్తనను పరిశీలిస్తే ఎలాంటి వారు వీసీలుగా వస్తున్నారో ఇట్టే తెలిసిపోతుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి వర్సిటీని రాజకీయాలకు కేంద్రంగా మార్చేశారనే విమర్శలున్నాయి. ఆయన ఇటీవల ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన సమయంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారని ట్వీట్ చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్సిటీలో ఆయన్ని కలిసేందుకు నిత్యం రాజకీయ నాయకులు వస్తుంటారనే విమర్శలున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో తన ఛాంబర్‌లో సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించడంపై ఆరోపణలు వచ్చాయి.

◆ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ రాజశేఖర్ గతంలో మాజీ సీఎం వైఎస్సార్ భారీ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు వైకాపా ప్లీనరీ వాహనాల పార్కింగ్‌కు వర్సిటీ స్థలాన్ని కేటాయించారు. బాధ్యతలు చేపట్టిన సమయంలో సీఎం జగన్ ఫొటోకు పాలాభిషేకం చేయడం, జై జగన్ అంటూ నినాదాలు చేయడంపైనా విమర్శలు వచ్చాయి.

◆ రాయలసీమ వర్సిటీలో బోధనేతర సిబ్బంది నియామకాలపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణను మంత్రి సురేష్ అడ్డుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆదికవి నన్నయ వర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, కాంట్రాక్టు పనుల అప్పగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా ఓ ప్రజాప్రతినిధి అడ్డుపడుతున్నారు.

◆ ద్రవిడ విశ్వవిద్యాలయంలో బోధనేతర పోస్టులను బోధన పోస్టులుగా మార్చేశారు. ఇందులో ఓ కీలక ఐఏఎస్ అధికారి బంధువు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గతంలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన సహాయ ఆచార్యులను రెగ్యులర్ చేయడం, కొందరికి స్కేల్స్ పెంచడంపైనా విమర్శలున్నాయి. మరోపక్క విశ్వవిద్యాలయాల్లో 70శాతం అధ్యాపక పోస్టులు ఖాళీలున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉంటే దేశంలో మంచి ప్రతిభ కలిగిన వారు ఎలా దరఖాస్తు చేస్తారు? ఐఐటీ, ఎన్ఐటీ, జాతీయ స్థాయి ప్రీమియర్ విద్యాసంస్థల్లో పని చేసిన వారు రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు వచ్చేందుకు ఎందుకు ఆసక్తి చూపుతారు అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్నవారు, రాజకీయ అండదండలున్న వారే దరఖాస్తు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

## చంద్రబాబు సభలను అడ్డుకునే కుతంత్రంలో భాగమే జీవో

### తెదేపా నాయకులు లోకేశ్, సోమిరెడ్డి





ఈనాడు-అమరావతి: రహదారులపై రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో నెం.1 జారీ చేయడంపై తెదేపా నేతలు తీవ్రంగా మండిపడ్డారు. తెదేపా ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాట్లాడుతూ 'అర్ధరాత్రి గుడ్డిగా చీకటి జీవో ఇచ్చి...తెల్లారేసరికి నిబంధనలు ఉల్లంఘించి ఒక అవ్వ తీవ్రంగా గాయపడటానికి కారకులైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి. సభకు అనుమతిచ్చిన వారిని కూడా విచారించాలి. ఇది నీ ఫ్యాక్షన్ సామ్రాజ్యం కాదు.. ప్రజాస్వామ్యం. నీ ప్రచార పిచ్చి ఒక అవ్వ ప్రాణాల మీదకొచ్చింది. నడవలేని అవ్వాతాతలను సభలకు తరలించడం నేరం కాదా. చంద్రబాబు సభలను అడ్డుకోవాలన్న కుతంత్రంలో భాగమే ప్రభుత్వం చీకటి జీవో తెచ్చింది. జన సునామీని చూసి తట్టుకోలేక... నీ రాక్షస పాలనకి చరమ గీతం పాడేందుకు రాయలసీమ సమర శంఖం పూరించింది... ఉత్తరాంధ్ర ఉప్పెనలా వైకాపాను ముంచెత్తుతుంది. కోస్తా నీ సర్కారుకి కొరివి పెట్టనుంది. మీ పార్టీకి తీవ్రమైన ప్రజా వ్యతిరేకత, మా పార్టీకి వెల్లువెత్తుతున్న ప్రజాదరణను చూసి ఒణికిపోయావు. తెదేపా సభలకు వస్తోన్న ప్రజలను సభలు రద్దు చేస్తూ బెదిరిస్తే...మూలనున్న ముసలి అమ్మ కూడా బెదరడం లేదు' అని అన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 'ర్యాలీలు, సభలపై వైకాపా ప్రభుత్వం నిషేధం విధించడం కుట్రలో భాగం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీ ప్రభుత్వం కొత్త నిబంధన తెచ్చింది. గుంటూరు ఘటన జరిగిన 10 నిమిషాల్లోనే మంత్రి అక్కడకు వచ్చారు. అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీటన్నింటిని చూస్తే ఈ ఘటనల వెనుక కుట్ర ఉందని అనుమానం కలుగుతుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా ప్రజల్లోకి వచ్చే దమ్ము లేకుండా పోయింది. జగన్‌రెడ్డి రోడ్లపైకి రావాలంటే దుకాణాలన్నీ మూసేయాలి. పరదాలు, బ్యారికేడ్లు, రోప్ పార్టీలతో పాటు బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఉండాలి. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు, లోకేశ్‌తో పాటు తెదేపా నాయకులు ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఇది జీర్ణించుకోలేక ఇప్పుడు ఈ ఉత్తర్వులు తెచ్చారు" అని విమర్శించారు.

## పుంగనూరులో దెబ్బకు దెబ్బ తీస్తాం

ఈనాడు-అమరావతి: 'పుంగనూరు డాన్ అండ చూసుకొని రెచ్చిపోతున్న వారందరినీ గుర్తించుకున్నాం...దెబ్బకు దెబ్బ తీస్తాం. తెదేపా సానుభూతిపరులైన శ్రీనివాసులు కుటుంబంపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. శ్రీనివాసులు కుటుంబానికి చెందిన ఎకరన్నర పొలం కబ్జా చేసేందుకు ప్రయత్నించడమే కాకుండా...అడ్డుకున్న కుటుంబ సభ్యులపై దాడి చేయడం దారుణం. మహిళలపై చూడకుండా వైకాపా రౌడీలు దాడికి పాల్పడ్డాయి. ఈ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నా..' అని తెదేపా ప్రధాన కార్యదర్శి లోకేశ్ పేర్కొన్నారు. 'పెట్రోల్ బంకులో సర్వర్ పని చేయని కారణంగా పెట్రోల్ కొట్టడం కుదరదన్నందుకు కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం ఉలవపాళ్లలో దళిత యువకుడు తేజపై అత్యంత దారుణంగా అనుచరులతో కలిసి దాడి చేసిన బొడిగుడిపాడు వైకాపా ఎంపీటీసీ మహేశ్ నాయుడుపైనా, ఆయన అనుచరులపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలి. గాయపడిన తేజకు మెరుగైన వైద్యం అందించాలి...' అని లోకేశ్ డిమాండ్ చేశారు.

**పది రోజులైనా జీతాలివ్వని మీకు ఏం కోత వేయాలి?**

'ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు పది నిమిషాలు ఆలస్యమైతే జీతం కోత వేస్తానని హెచ్చరికలు జారీ చేసిన ముఖ్యమంత్రి గారూ! పది రోజులు ఆలస్యమైనా కూడా జీతాలివ్వలేని మీకు ఏం కోత వేయాలో సెలవివ్వండి?...' అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని లోకేశ్ నిలదీశారు.

## 6న గ్రూపు-1 ప్రిలిమినరీ ఉచిత మోడల్ పరీక్ష

ఈనాడు-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గుంటూరులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీతో కలిసి జాయింట్ ఫర్ డెవలప్‌మెంట్ (జేడీ) ఫౌండేషన్ ఈనెల 6న ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వీవీ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రిలిమినరీ జనరల్ స్టడీస్ పేపర్-1, మధ్యాహ్నం 2 గంటలకు జనరల్ స్టడీస్ పేపర్-2 పరీక్షలను తెలుగు, ఆంగ్ల మీడియంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆసక్తిగల వారు గ్రూపు-1 హాల్ టిక్కెట్, మొబైల్ నంబరుతో వివరాలు నమోదు చేసుకోవాలని లక్ష్మీనారాయణ సూచించారు. అభ్యర్థులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి టార్గెట్ ఐఏఎస్ ఆకాడమీ ఆంధ్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9030562728, 9440989629 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ప్రశ్నపత్రాల తరలింపే పెద్ద పరీక్ష!

- మండల కేంద్రానికి వెళ్లి తీసుకురావడం ఎలా?
- అర్ధగంటలో పరీక్ష కేంద్రానికి తేవడం సాధ్యమేనా?

ఈనాడు, అమరావతి: సమ్మెటివ్-1 పరీక్షల ప్రశ్నపత్రాలను తీసుకువెళ్లడంపై అధికారులు ఇచ్చిన ఆదేశాలు ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారాయి. 6-10 తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏ రోజుకారోజు ఉదయం మండల విద్యా కార్యాలయానికి వచ్చి తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది పాఠశాల ఆవరణలో వేస్తే హాజరు నమోదవుతుంది. లేదంటే సెలవు పెట్టాల్సి వస్తుంది. ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి 9 గంటలకు హాజరు వేసి, మండల కార్యాలయానికి వెళ్లి ఎప్పుడు ప్రశ్నపత్రాలు తీసుకురాగలుగుతారు? కొన్ని పాఠశాలలు మండల కేంద్రానికి 25 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. ఇంత దూరం వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకురావాల్సి ఉంటుంది. ఉదయం 9.30 గంటల నుంచే 6, 8, 10 విద్యార్థులకు పరీక్ష ప్రారంభమవుతుంది. అర్ధ గంటలో బడికి వచ్చి, మండల కేంద్రానికి వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకురావడం ఎలా సాధ్యమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఏరోజుకారోజు ప్రశ్నపత్రాలను మండల కార్యాలయం నుంచి తీసుకువెళ్లాలని జిల్లావిద్యాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ప్రశ్నపత్రాలు తీసుకొని వచ్చి, పరీక్ష నిర్వహించేందుకే సమయం సరిపోని పరిస్థితి ఏర్పడుతుంది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 6, 8, 10 తరగతులకు.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు 7, 9 తరగతులకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. 3, 4, 5 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. మండల కార్యాలయాల్లో రిసోర్సు పర్సన్లు ఉంటారు. వీరికి ప్రశ్నపత్రాల పంపిణీ బాధ్యతలు అప్పగిస్తే తమకు శ్రమ తప్పుతుందని టీచర్లు వెల్లడిస్తున్నారు. అలాగే విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో ఉదయం, మధ్యాహ్నం నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులు రెండు విడతలుగా రావడంతో మధ్యాహ్న భోజనం పెట్టడంలో ఇబ్బందులు రానున్నాయి. ఉదయం వచ్చిన వారికి పరీక్ష అనంతరం మధ్యాహ్న భోజనం పెట్టేందుకు అవకాశం ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చేవారి కోసం ఆహార పదార్థాలను నిల్వ చేయడం కష్టమవుతుందని, విద్యార్థులు తక్కువమంది భోజనం చేస్తే ఆహారం వృథా అవుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

## చెన్నుపాటి జగదీశ్‌కు ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారం

### మరో 27 మంది ప్రవాస భారతీయులకు కేంద్రం ప్రకటన

ఈనాడు, దిల్లీ: ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీశ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారాన్ని ప్రకటించింది. విదేశాల్లో విభిన్న రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రవాస భారతీయులకు ఇచ్చే ఈ అత్యున్నతమైన ఈ పురస్కారాలను 2023 సంవత్సరానికి గానూ 27 మందికి కేంద్రం ప్రకటించింది. అందులో కృష్ణా జిల్లా వల్లూరుపాలేనికి చెందిన ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీశ్ ఒకరు. ఆస్ట్రేలియాలో అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షునిగా ఉన్న జగదీశ్‌కు సైన్స్ అండ్ టెక్నాలజీ/విద్యా విభాగంలో ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించారు. ఈ నెల 8 నుంచి మూడు రోజుల పాటు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ప్రవాసీ భారతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఆ సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు.

## పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రం

ఈనాడు-అమరావతి: బియ్యం పంపిణీ, ధాన్యం సేకరణకు సంబంధించి వివిధ సేవల పర్యవేక్షణకు పౌరసరఫరాలశాఖ విజయవాడలోని తమ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనికి పర్యవేక్షక అధికారులుగా డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్ శేషగిరిరావు, కమిషనర్ పీఎస్ షేక్ నాగూర్‌వలిని నియమిస్తూ పౌరసరఫరాలశాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మిల్లులు, గోదాముల నుంచి బియ్యం రవాణా వాహనాల ట్రాకింగ్, ఎండీయూ వాహనాల ద్వారా తరలింపు, పంపిణీ, ధాన్యం సేకరణ, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా కార్డుల జారీ, మండలస్థాయి గోదాముల్లో సీసీ కెమెరాల పరిశీలన తదితరాలను పరిశీలించేందుకు ఏడు విభాగాలను ఏర్పాటు చేసి సాంకేతిక సిబ్బందిని కేటాయించారు.

## ఎవరు ఏమన్నారు

### క్షమాపణలు చెప్పాల్సిందెవరు?



నల్లధనాన్ని అరికట్టడం, పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేయడం, నకిలీ నోట్ల చలామణిని నిరోధించడం, ఉగ్రవాదానికి ముకుతాడు వేయడం, అవినీతి చెదను నాశనం చేయడం.. ఇవన్నీ పెద్ద నోట్ల రద్దు ఉద్దేశాలు. కానీ వాటన్నింటా వైఫల్యమే ఎదురైంది. సుప్రీం కోర్టు సమర్థించింది నోట్ల రద్దు ప్రక్రియను మాత్రమే. కాబట్టి ఇప్పుడు క్షమాపణలు చెప్పాల్సిందెవరు?

– కపిల్ సిబల్

### మద్యం వద్దు!

ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 సెకన్లకు ఒక ప్రాణాన్ని మద్యం బలి తీసుకుంటోంది. ఆల్కహాల్‌ను అతిగా/తరచూ తీసుకుంటే కాలేయం దెబ్బతింటుంది. క్యాన్సర్లు, గుండెవ్యాధులు, మానసిక రుగ్మతల ముప్పు పెరుగుతుంది. మద్యాన్ని అతిగా తాగకండి. దాన్ని ఏమాత్రం తీసుకోకపోవడం మంచిదే.

– ప్రపంచ ఆరోగ్య సంస్థ

### ముప్పు తగ్గుతుంది.. పూర్తిగా తొలగిపోదు!



ఒమిక్రాన్ సహా పలు వేరియంట్ల నుంచి వ్యాక్సిన్లు మెరుగైన రక్షణ కల్పిస్తుండటం శుభపరిణామం. అయితే టీకాల వల్ల కొవిడ్ ఇన్‌ఫెక్షన్ ముప్పు తగ్గుతుంది... అంతేతప్ప పూర్తిగా తొలగిపోదు. ఈ ముఖ్యమైన విషయాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలి. – సౌమ్య స్వామినాథన్

### బెంగాల్‌కు మౌలిక వసతులు అత్యావశ్యకం



పశ్చిమ బెంగాల్‌కు ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అత్యావశ్యకం. ఉత్తర, దక్షిణ బెంగాల్‌ల మధ్య మెరుగైన అనుసంధానత కావాలి. కానీ రహదారులు, విమానాశ్రయాల వంటి కీలక ప్రాజెక్టులకు భూమిని సమకూర్చడంలో మమతా బెనర్జీ ఘోరంగా విఫలమవుతున్నారు. ఇప్పుడు ఆమె వందే భారత్ రైళ్లకు రక్షణ కూడా కల్పించలేకపోతున్నారు.

– అమిత్ మాలవీయ

# డ్రగ్స్ గుప్పిట్లో సినీ తారలు!

- మత్తు మాఫియా ఫోన్లలో ప్రముఖుల చిట్టా
- స్మగ్లింగ్ డాన్ ఎడ్విన్ ముఠా వరుస అరెస్టులతో వెలుగులోకి

ఈనాడు, హైదరాబాద్: మత్తు మాఫియా ప్రధాన సూత్రధారులను హైదరాబాద్ పోలీసులు వరుసగా అరెస్ట్ చేస్తున్నారు. స్మగ్లర్లు, పెడ్లర్ల నుంచి కీలక సమాచారం రాబడుతున్నారు. డ్రగ్స్ వినియోగిస్తున్న, విక్రయిస్తున్న వారిలో నగర వ్యాపారులతోపాటు బాలీవుడ్, టాలీవుడ్ సినీతారలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. మరిన్ని వివరాలు సేకరించాక నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్ నార్కోటిక్స్ (హెచ్‌న్యూ) ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఏర్పాటయ్యాక నగరానికి చేరుతున్న మాదకద్రవ్యాల మార్గాలపై నిఘా ఉంచారు. గోవా కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలున్న కీలక సూత్రధారులు 18 మందిని గుర్తించారు. వీరిలో ప్రీతీష్ నారాయణ్ బోర్కర్, జాన్ స్టీఫెన్ డిసౌజా, తుకారాం, ఎడ్విన్‌న్యూన్స్, బాలమురుగన్, హేమంత్ అగర్వాల్, వికాస్‌నాయక్, సంజ గోవెకర్, రమేష్‌చౌహాన్ వంటి డ్రగ్ కింగ్‌పిన్‌లను అరెస్ట్ చేశారు. మిగిలినవారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సెల్‌ఫోన్లలో సుమారు 7,000-8,000 మంది డ్రగ్స్ వినియోగిస్తున్న వారి వివరాలున్నట్టు గుర్తించారు. వీరిలో 400 మందికి 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీచేశారు.



ఇటీవల హెచ్‌న్యూ పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

**ఎడ్విన్ అనుచరులే అధికం**

గోవా డ్రగ్ కింగ్‌పిన్ ఎడ్విన్‌న్యూన్స్ నుంచి తాజాగా అరెస్టయిన హైదరాబాద్ డీజే మోహిత్ అగర్వాల్ అలియాస్ మైరాన్ మోహిత్ వరకూ ఎక్కువమంది పబ్‌లు, హోటళ్లలో సర్వర్లుగానే కెరీర్ ప్రారంభించటం గమనార్హం. జీరో నుంచి హీరోగా ఎదగాలనే ఉద్దేశంతో వీరంతా క్రమంగా మత్తుపదార్థాల దందా వైపు అడుగులు వేశారు. మొదట ఏజెంట్లుగా మారారు. క్రమంగా డ్రగ్ మాఫియాతో సంబంధాలు పెంచుకొని మత్తు సామ్రాజ్యాన్ని స్థాపించి.. జాతీయ, అంతర్జాతీయంగా మాదకద్రవ్యాలు సరఫరా చేసే స్థాయికి ఎదిగారు. ఖరీదైన భవనాల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారంటే డ్రగ్స్ దందాతో ఎంతగా దోచుకున్నారనేది అర్థం చేసుకోవచ్చని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఎడ్విన్‌న్యూన్స్ ఒకప్పుడు గోవాలో హోటల్ సర్వర్. ఇప్పుడు అతడికి గోవా, ముంబయి నగరాల్లో కోట్లాది రూపాయల ఆస్తిపాస్తులున్నాయి. సినీ నిర్మాతలకు ఫైనాన్స్ చేసే స్థాయికి ఎదిగాడు. ఇతడి ప్రధాన అనుచరుల్లో తమిళనాడుకు చెందిన బాలమురుగన్ కీలకమైన వ్యక్తి. హిమాచల్‌ప్రదేశ్‌ను అడ్డాగా మార్చుకొని రాజస్థాన్, మహారాష్ట్ర, హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లకు డ్రగ్స్ సరఫరా చేసేవాడు. తమిళనాడులో మత్తుకు అలవాటుపడిన ప్రముఖులకు నమ్మకమైన వ్యక్తి. ఇతడి ద్వారానే పలువురు ఖరీదైన చరస్‌ను కొనుగోలు చేసేవారని పోలీసులు గుర్తించారు. మోహిత్ అగర్వాల్ మొదట్లో కవాడిగూడలో ఉండేవాడు. పబ్‌లో సర్వర్‌గా చేరి డ్రగ్స్ కోసం గోవా వెళ్లినప్పుడు ఎడ్విన్‌తో ఏర్పడిన పరిచయంతో డ్రగ్ డాన్‌గా ఎదిగాడు. బాలీవుడ్ నటి నేహా దేశ్‌పాండేను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. డీజేగా గుర్తింపు వచ్చాక ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను స్థాపించాడు. అంతర్జాతీయంగా 100 మంది డీజేలను దేశానికి రప్పించి ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరాడు.

## ఆటలాడుతూ.. అనంతలోకాలకు

- నిల్వ చేసిన పత్తిలో దాక్కుని ఊపిరాడక బాలుడి మృతి..

కౌటాల గ్రామీణం, న్యూస్‌టుడే: దాగుడుమూతల ఆటలో భాగంగా పత్తిలో దాక్కున్న బాలుడు ఊపిరాడక మృతిచెందాడు. కుమురం భీం జిల్లా కౌటాల మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన మంగళవారం వెలుగుచూసింది. బాలుడి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపెల్లి గ్రామానికి చెందిన చెన్నూరి కైలాస్- రూమ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అభిషేక్(12) కౌటాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదుకుంటున్నాడు. సోమవారం తల్లిదండ్రులు కూరగాయలు విక్రయించేందుకు బజారుకు వెళ్లగా.. అభిషేక్ పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక.. తమ్ముడు, చెల్లితో ఆటల్లో మునిగిపోయాడు. దాగుడు మూతలాడుతూ.. ఇంట్లో నిల్వ ఉంచిన పత్తిలో దాక్కున్నాడు. తమ్ముడు, చెల్లికి చిక్కకూడదని మధ్యలో కొంత పత్తి తీసి అందులో దాక్కుని పైన కప్పుకొన్నాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు అభిషేక్ కనిపించలేదు. కంగారు పడిన తల్లిదండ్రులు పత్తి చెదిరినట్లు ఉండటం చూసి అందులో చూసేసరికి అభిషేక్ స్పృహతప్పి పడి ఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని కౌటాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పత్తి పంటే కడుపుకోత మిగిల్చిందని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



అభిషేక్

## కారుణ్య నియామకాలు పూర్తిచేయిస్తామని ఆర్టీసీ ఎండీ హామీ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కాకముందు, విలీనం అయ్యాక చనిపోయిన ఉద్యోగులకు సంబంధించి వారి వారసులకు కారుణ్య నియామకాలను త్వరలో పూర్తిచేస్తామంటూ ఎండీ హామీ ఇచ్చినట్లు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఇప్పటివరకు 280 మందికి వివిధ జిల్లాల్లోని పలుశాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని, మిగిలినవారికి త్వరగా ఉద్యోగాలు దక్కేలా చూస్తామని, కొందరిని ఆర్టీసీలోని వివిధ పోస్టుల్లో 2 నెలల్లో నియమిస్తామన్నారని తెలిపారు.

## ఈడీ కార్యాలయానికి నౌహీరా షేక్

ఈనాడు, హైదరాబాద్: అధిక వడ్డీ ఆశ చూపి పెట్టుబడిదారులను మోసం చేశారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న హీరాగోల్డ్ గ్రూపు సీఈఓ నౌహీరా షేక్ మంగళవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. మాయమాటలతో 1.72 లక్షల మంది నుంచి రూ.5,600 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారంటూ గతేడాది ఫిబ్రవరిలో హీరాగోల్డ్ సంస్థ నిర్వాహకులపై ఈడీ అభియోగపత్రం దాఖలు చేసింది. గ్రూపునకు చెందిన పలు ఆస్తులను జప్తు చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ హీరాగోల్డ్ కార్యకలాపాలపై విచారణ చేసింది. దర్యాప్తు సంస్థల అధీనంలోని గ్రూపు ఆస్తులపై ఉన్న అటాచ్‌మెంట్లను ఎత్తివేసేందుకు గత నెలలో సుప్రీంకోర్టులో ఊరట పొందిన నేపథ్యంలో ఆ ఉత్తర్వు ప్రతుల్ని ఇచ్చేందుకు ఈడీ కార్యాలయానికి వచ్చినట్లు నౌహీరా షేక్ తెలిపారు.

## సచివాలయాల ఉద్యోగులకు ఏకరూప దుస్తులు తొలగించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉద్యోగుల ఫెడరేషన్ విజ్ఞప్తి

ఈనాడు-అమరావతి: ఏకరూప దుస్తులు (యూనిఫాం) ధరించే సచివాలయాల ఉద్యోగులను క్షేత్రస్థాయిలో అధికారులు కొందరు చిన్నచూపు చూస్తున్నందున, ఏకరూప దుస్తులు పూర్తిగా తొలగించాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. వీరు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కలిసి సచివాలయాల ఉద్యోగులకు సంబంధించిన 31 కీలక సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. 2019 నుంచి ఇప్పటివరకు 128 ఆర్జిత సెలవులు ఉద్యోగుల లాగిన్‌లో జమ చేయాలని కోరారు. 45 సెలవులే జమ చేయడంతో వారు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అంతర్ జిల్లాలతోపాటు సాధారణ బదిలీలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రొబేషన్ ఖరారులో జాప్యంతో ఉద్యోగులు నష్టపోయిన వేతనాలను చెల్లించాలని కోరారు. ఉద్యోగినిల కోసం ప్రత్యేకంగా వినతుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని సీఎస్‌కి విజ్ఞప్తి చేశారు.

## పురపాలక ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు కృషి: ఎమ్మెల్సీ

ఈనాడు, అమరావతి: పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తెలిపారు. పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య (ఎంటీఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా 58 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. పురపాలక బడుల పర్యవేక్షణను పాఠశాల విద్యాశాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు-84ను రద్దు చేయాలని పురపాలక ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

## భద్రతా చర్యల్లో భాగంగానే ప్రైవేటుకు పనులు: సీపీడీసీఎల్ సీజీఎం

ఈనాడు-అమరావతి: విద్యుత్ ప్రమాదాలు నియంత్రణ కోసం భద్రతా చర్యల్లో భాగంగానే సబ్ స్టేషన్లలోని బ్రేకర్లు, రిలే, బ్యాటరీలను పరీక్షించే పనులను ప్రైవేటు సంస్థలకు ఇచ్చినట్లు కేంద్ర విద్యుత్ పంపిణీ సంస్థ (సీపీడీసీఎల్) సీజీఎం (ప్లానింగ్) సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద 35 ఏళ్లు దాటిన 97 సబ్ స్టేషన్ల నిర్వహణకు ఇచ్చామన్నారు. "అకస్మాత్తుగా నిలిచిన సరఫరాను పునరుద్ధరించడానికి జిల్లాలవారీగా ఉన్న ఎంఆర్‌టీ (మీటర్ రిలేస్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్ టెస్టింగ్ డివిజన్) విభాగాలు పని చేస్తాయి. దశలవారీగా మరమ్మతులు నిర్వహిస్తాయి. ప్రమాదాల నియంత్రణ కోసం ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తగిన సిబ్బంది లేని కారణంగా ప్రైవేటు సంస్థకు పనులు ఇచ్చాం" అని పేర్కొన్నారు.

## గంగిరెడ్డి బెయిలు రద్దు పిటిషన్ రేపటికి వాయిదా

ఈనాడు, దిల్లీ: మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ విచారణను సర్వోన్నత న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుటకు మంగళవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఆ సమయంలో సీబీఐ తరఫు సీనియర్ న్యాయవాది నటరాజన్ మరో కేసు విచారణలో ఉండడంతో పాస్ ఓవర్ చేశారు. సాయంత్రం కోర్టు సమయం ముగిసే సమయంలో ఇరుపక్షాల న్యాయవాదులు విచారణ తేదీని తెలియజేయాలని విజ్ఞప్తి చేయగా.. గురువారం విచారణ చేపడతామంటూ జస్టిస్ ఎం.ఆర్.షా వెల్లడించారు.

(c) eenadu


చిరంజీవి


వెంకటేష్


నాగార్జున

# ఈనాడు సినిమా

## మంజునాథ్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్


కల్యాణ్ రామ్

'బింబిసార'లో ద్విపాత్రాభినయంతో అలరించారు కథానాయకుడు కల్యాణ్ రామ్. ఇప్పుడు 'అమిగోస్'లో త్రిపాత్రాభినయంతో మురిపించేందుకు సిద్ధమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంతో రాజేంద్రరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. ఈ సినిమా ఫిబ్రవరి 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది చిత్ర బృందం. ఇందులో భాగంగా ఇప్పటికే కల్యాణ్‌రామ్‌కు సంబంధించిన ఓ పాత్ర లుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మంగళవారం ఆయన రెండో పాత్ర లుక్‌ను విడుదల చేశారు. తొలి పాత్రలో ఆయన్ని సిద్ధార్థ్ అనే బిజినెస్ మ్యాన్‌గా చూపించగా.. ఈ రెండో పాత్రను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మంజునాథ్‌గా పరిచయం చేశారు. ప్రచార చిత్రంలో ఆయన కళ్ల జోడు పెట్టుకొని క్లాస్ లుక్‌లో కనిపించారు. ఒకే పోలికలతో ఉన్న ముగ్గురు వ్యక్తుల కథగా ఈ చిత్రం సాగనున్నట్లు తెలుస్తోంది.

**తెరపై ఒక కథానాయకుడు కనిపిస్తేనే.. థియేటర్లలో ప్రేక్షకుల హంగామా ఓ స్థాయిలో ఉంటుంది. అదే ఒకే టికెట్టుపై ఒకేసారి తెరపై ఇద్దరు హీరోల్ని చూసుకునే అవకాశం దొరికితే.. ఆ ఊపు, ఉత్సాహం మరో స్థాయిలో ఉంటాయి. సినీప్రియుల తాకిడికి థియేటర్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులు వేలాడాల్సిందే. భారీ వసూళ్లతో బాక్సాఫీస్ ముందు రికార్డుల మోత మోగాల్సిందే. మల్టీస్టారర్ చిత్రాలు చేసే మ్యాజిక్ ఇది. గతేడాది తెలుగులో అరడజనుకు పైగా బహునాయకా చిత్రాలు విడుదలయ్యాయి. వాటిలో చాలా వరకు బాక్సాఫీస్ ముందు హిట్టు మాట వినిపించుకున్నాయి. ఇక ఈ ఏడాది కూడా ఈ తరహా చిత్రాల సందడి గట్టిగానే కనిపించనుంది. వాటిలో చాలా వరకు అగ్రతారల సినిమాలే ఉన్నాయి. మరి ఆ చిత్రాలేవి? వాటి విశేషాలేంటి? తెలుసుకుందాం పదండి..**

# మరోమారు... మల్టీస్టారర్ జోరు

❑ కొత్త ఏడాదిలో భారీ అంచనాల మధ్య విడుదల


పవన్ కల్యాణ్


ప్రభాస్


రాజశేఖర్

గతేడాది తెలుగులో మల్టీస్టారర్ చిత్రాల సందడి బాగా కనిపించింది. 'ఆర్ఆర్ఆర్', 'ఎఫ్3', 'బంగార్రాజు', 'గాడ్‌ఫాదర్' లాంటి చిత్రాలన్నీ హిట్టు మాట వినిపించి సత్తా చాటాయి. భారీ వసూళ్లు దక్కించుకొని బాక్సాఫీస్‌కు కొత్త కళ తీసుకొచ్చాయి. దీంతో ఈ ఏడాది రానున్న బహునాయకా చిత్రాలపైనా అంచనాలు పెరిగాయి. సంక్రాంతి బరిలో 'వాల్తేరు వీరయ్య'తో వినోదాలు పంచనున్నారు చిరంజీవి, రవితేజ. ఈ ఇద్దరూ కలిసి నటించిన ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని బాబీ (కె.ఎస్.రవీంద్ర) తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ చిత్రంలో చిరు - రవితేజ సవతి సోదరులుగా కనిపించనున్నట్లు సమాచారం. సినిమాలో వీళ్లిద్దరూ కలిసి చేసే సందడి ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం ఖాయమని చెబుతోంది చిత్ర బృందం. అందుకే జనవరి 13న విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తెలుగులో మల్టీస్టారర్ చిత్రాలకు చిరునామాగా నిలుస్తుంటారు కథానాయకుడు వెంకటేష్. గతేడాది వరుణ్‌తేజ్‌తో కలిసి 'ఎఫ్3' రూపంలో వినోదాలు పంచిన ఆయన.. ఈసారి సల్మాన్ ఖాన్‌తో కలిసి అలరించనున్నారు. ఇప్పుడీ అగ్రతారలిద్దరూ కలిసి నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్'. ఫర్హాద్ సామ్జీ తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. ఓ సరికొత్త యాక్షన్ కామెడీ కథతో రూపొందుతోన్న ఈ చిత్రంలో వెంకీ, పూజాకు సోదరుడిగా కనిపించనున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో సల్మాన్, వెంకీలతో కలిసి రామ్‌చరణ్ కూడా సందడి చేసినట్లు సమాచారం. మరి వీళ్లందరి హంగామా తెరపై ఎలా కనువిందు చేయనుందో తెలియాలంటే ఏప్రిల్ 21వరకు వేచి చూడక తప్పదు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నారు కథానాయకుడు ప్రభాస్. ఈ ఏడాది ఆయన 'సలార్' రూపంలో ఓ సరికొత్త బహునాయకా చిత్రాన్ని ప్రేక్షకులకు చూపించనున్నారు. ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో ప్రభాస్‌ను ఢీకొట్టే ప్రతినాయకుడు వరదరాజ్ మన్నార్ పాత్రలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. మరి ఈ ఇద్దరి స్టార్ల మధ్య సాగే పోరు ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతి పంచనుందో తెలియాలంటే సెప్టెంబరు 28వరకు ఎదురుచూడాల్సిందే. వినూత్నమైన యాక్షన్ థ్రిల్లర్ కథతో రూపొందుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉంది.

### ముస్తాబవుతున్నాయి..

గతేడాది సంక్రాంతికి తన పెద్ద కుమారుడు నాగచైతన్యతో కలిసి 'బంగార్రాజు'తో సందడి చేశారు కథానాయకుడు నాగార్జున. ఇప్పుడాయన తన చిన్న తనయుడు అఖిల్‌తో కలిసి ఓ సినిమా చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం దర్శకుడు మోహన్‌రాజా ఓ చక్కటి కథను సిద్ధం చేసినట్లు తెలిసింది. దీన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పట్టాలెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తమిళంలో విజయవంతమైన 'వినోదాయ సిద్ధం'ను తెలుగులో రీమేక్ చేయనున్నట్లు ఏడాది కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ కలిసి నటించనున్నట్లు సమాచారం. సముద్రఖని దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. గతేడాది 'శేఖర్'గా ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రాజశేఖర్. ఇప్పుడాయన 'మాన్‌స్టర్'గా థ్రిల్ పంచేందుకు సిద్ధమవుతున్నారు. పవన్ సాధినేని తెరకెక్కిస్తున్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్స్‌కు పోలీసులకు మధ్య సాగే ఓ ఆసక్తికర కథతో రూపొందుతోంది. ఇందులో రాజశేఖర్‌తో కలిసి అలరించనున్నారు యువ కథానాయకుడు రాజ్‌తరుణ్. సెట్స్‌పై శరవేగంగా ముస్తాబవుతున్న ఈ చిత్రం.. ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిసింది. సంక్రాంతికి చిరంజీవితో కలిసి 'వాల్తేరు వీరయ్య'తో సందడి చేయనున్న రవితేజ త్వరలో మరో మల్టీస్టారర్ కథతో మురిపించనున్నట్లు తెలుస్తోంది. 'మానాడు' తెలుగు రీమేక్‌లో ఆయన ఓ హీరోగా కనిపించనున్నట్లు సమాచారం. మరో హీరో పాత్ర కోసం యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డను రంగంలోకి దించనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ సినిమా కోసం దశరథ్‌తో పాటు పలువురు దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం త్వరలో లాంఛనంగా మొదలయ్యే అవకాశాలున్నాయి.

## 'మైఖేల్' సందడి

సందీప్‌కిషన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'మైఖేల్'. దివ్యాంశ కౌశిక్ కథానాయిక. రంజిత్ జయకోడి దర్శకత్వం వహిస్తున్నారు. భరత్ చౌదరి, పూస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మాతలు. విజయ్ సేతుపతి, గౌతమ్ మేనన్, వరలక్ష్మి శరత్‌కుమార్, అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దక్షిణాది భాషలతో పాటు, హిందీలో ఫిబ్రవరి 3న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు సినీ వర్గాలు మంగళవారం ప్రకటించాయి. 'సందీప్ కిషన్ నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రమిది. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రాలు, 'నువ్వుంటే చాలు...' గీతం సినిమాపైన ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయ''ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కిరణ్ కౌశిక్, సంగీతం: సామ్ సీఎస్, సంభాషణలు: త్రిపురనేని కళ్యాణ్ చక్రవర్తి, రాజన్ రాధామణలన్, రంజిత్ జయకోడి.


దివ్యాంశ కౌశిక్, సందీప్‌కిషన్

## 67వ చిత్రం హంగామా


విజయ్

తమిళ అగ్ర కథానాయకుడు విజయ్, 'విక్రమ్' దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'మాస్టర్' తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికితోడు త్రిష, సూర్య, సంజయ్‌దత్, అర్జున్ లాంటి భారీ తారాగణంతో రూపొందనుందనే సమాచారంతో అంతటా ఆసక్తి నెలకొంది. ఈ చిత్ర షూటింగ్ చెన్నైలోని ఫిల్మ్‌సిటీలో శరవేగంగా సాగుతున్నట్టు నటుడు మనోబాల మంగళవారం సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. గ్యాంగ్‌స్టర్ డ్రామా కథాంశంతో పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాలో భాగమయ్యామంటూ గౌతమ్‌మేనన్, మన్సూర్ అలీఖాన్ ఇదివరకే తెలిపారు.

### అట్లీతో 68వ సినిమా?

విజయ్, అట్లీ కలయికలో ఓ కొత్త సినిమా ప్రారంభం కానున్నట్టు సమాచారం. దీనికనుగుణంగా అట్లీ మంగళవారం వికీపీడియా పేజీలో విజయ్ 68వ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్టు మార్పులు చేశారు. ఈ చిత్రం షూటింగ్ జూన్‌లో మొదలు కానున్నట్టు తెలుస్తోంది. విజయ్, అట్లీల కలయికలో గతంలో 'థేరి', 'మెర్సల్', 'బిజిల్' సినిమాలు వచ్చాయి.

## నా కెరీర్‌లో ఇదే తొలిసారి

**"విభిన్నమైన పాత్రలపైనే నా దృష్టి. 'అఖండ' తర్వాత మరో కొత్త రకమైన పాత్ర చేయాలనుకున్నా. ఆ సమయంలోనే 'వారసుడు' అవకాశం వచ్చింది. ఇందులో విజయ్‌కి సోదరుడిగా కనిపిస్తా'' అన్నారు ప్రముఖ నటుడు శ్రీకాంత్. కథానాయకుడిగా అలరించిన ఆయన, ఈమధ్య ప్రతినాయకుడిగా, సహ నటుడిగా కీలకమైన పాత్రల్లో సందడి చేస్తున్నారు. ఇటీవల 'వారసుడు'లో నటించారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకొస్తున్న ఆ సినిమా గురించి శ్రీకాంత్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...**


శ్రీకాంత్

"కుటుంబ వినోదంతో రూపొందిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో రూపొందినప్పటికీ ఇది పక్కా తెలుగు నేటివిటీ చిత్రంలా ఉంటుంది. భావోద్వేగాలు, విజువల్స్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సోదరుల మధ్య ఎలాంటి భావోద్వేగాలుంటాయో వాటిని చాలా బాగా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు వంశీ పైడిపల్లి. విజయ్ ఈమధ్య కాలంలో కుటుంబ వినోదాత్మక చిత్రాలు చేయలేదు. పండగకి ఓ పండగ లాంటి సినిమా వస్తోంది. తమిళ చిత్రం చేయడం నా కెరీర్‌లో ఇదే తొలిసారి. విజయ్‌లాంటి ఓ స్టార్ హీరోతో ఓ మంచి చిత్రంతో తమిళంలో పరిచయం అవుతుండడం ఆనందంగా ఉంది. ఆరంభం నుంచి చివరి వరకూ నా పాత్ర కనిపిస్తుంది. విజయ్ ఎక్కువగా మాట్లాడరు. సెల్‌ఫోన్ దగ్గర ఉండదు. కార్‌వ్యాన్ వాడరు. ఒక్కసారి సెట్లో అడుగు పెట్టారంటే ప్యాకప్ చెప్పేవరకు కదలడు. అంత అంకిత భావంతో పనిచేస్తారు".

● "కథ, పాత్ర నచ్చితే విభిన్నమైన పాత్రలు చేయడానికి నేను సిద్ధమే. 'అఖండ' తర్వాత అందులోని పాత్రకి భిన్నమైన సినిమాలు చేయాలనుకున్నా. అప్పుడే రామ్‌చరణ్ - శంకర్ సినిమా అవకాశం వచ్చింది. ఆ వెంటనే 'వారసుడు' వచ్చింది. ఇన్నేళ్లుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నా దిల్‌రాజు నిర్మాణ సంస్థలో సినిమాలు చేయలేదు. ఒకేసారి ఆయన నిర్మాణంలో రెండు సినిమాలు చేయడం తృప్తినిచ్చింది".

## వేసవికి 'ఉగ్రం'


అల్లరి నరేష్

కొత్త ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమాల విడుదల తేదీలు వరుసగా ఖరారవుతున్నాయి. అల్లరి నరేష్ కథానాయకుడిగా రూపొందుతున్న 'ఉగ్రం' సినిమాని ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రవర్గాలు మంగళవారం ప్రకటించాయి. విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో నరేష్‌కి జోడీగా మిర్నా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాకి సంబంధించి మంగళవారం ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. అందులో నరేష్ గాఢతతో కూడిన లుక్‌లో కనిపించారు. "అల్లరి నరేష్ - విజయ్ కనకమేడల కలిసి 'నాంది' తర్వాత చేస్తున్న చిత్రమిది. 'నాంది'కి పనిచేసిన సాంకేతిక బృందం దాదాపు ఈ సినిమాలోనూ ఉంది. నరేష్ పాత్ర ఎలా ఉంటుందో ప్రత్యేకంగా విడుదల చేసిన ఈ ప్రచార చిత్రమే చెబుతోంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం తప్పక వినోదం పంచుతుంద''ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి కథ: తూము వెంకట్, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: సిద్, కూర్పు: ఛోటా కె.ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కడలి.

## 'సర్కార్ 4'.. 'ది బిగ్‌బుల్ 2'


అమితాబ్ బచ్చన్


అభిషేక్ బచ్చన్

అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో 'సర్కార్ 3', 'ది బిగ్ బుల్' నిర్మించారు నిర్మాత ఆనంద్ పండిట్. ఆయన ఈ రెండింటికి ఫ్రాంఛైజీ చిత్రాలు ఉంటాయని తాజాగా కొత్త కబురు వినిపించారు. ముంబయి గ్యాంగ్‌స్టర్ నేపథ్యంతో 'సర్కార్', స్టాక్‌మార్కెట్ కుంభకోణాల వాస్తవిక అంశాలతో 'ది బిగ్‌బుల్' తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ముంబయిలో ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'మేం రెండు, మూడు ఫ్రాంఛైజీలు రూపొందించడంపై సీరియస్‌గా పని చేస్తున్నాం. అందులో 'సర్కార్ 4' ఉంది. 'ది బిగ్‌బుల్ 2'పై కూడా పని చేస్తున్నాం. రెండో ప్రాజెక్టు ఒక పుస్తకం ఆధారంగా పట్టాలెక్కనుంది. అభిషేక్ బచ్చన్ గొప్ప నటుడు. ఆయనతో కలిసి పని చేయడాన్ని ఆస్వాదిస్తా. కానీ స్క్రిప్టు ఆధారంగానే 'ది బిగ్‌బుల్ 2' నటుల ఎంపిక ఉంటుంది' అని పేర్కొన్నారు.

## 'లవ్ రెడ్డి' ప్రేమ కహానీ


అంజన్, శ్రావణి

అంజన్ రామచంద్ర కథానాయకుడిగా స్మరన్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ రెడ్డి'. హేమలత రెడ్డి, మదన్ గోపాల్ రెడ్డి, ప్రభంజనం రెడ్డి, నాగరాజు బీరప్ప సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రావణి రెడ్డి కథానాయిక. ఈ చిత్ర గ్లింప్స్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ప్రచార చిత్రం చాలా బాగుంది. దీన్ని చూస్తుంటే నాకు కూడా ఓ ప్రేమ కథ చెయ్యాలనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. "ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో జరిగే ఒక స్వచ్ఛమైన ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. త్వరలో టీజర్, ట్రైలర్ విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రి సంగీతమందించారు.

## గీత రచయిత పెద్దాడ మూర్తి కన్నుమూత



గీత రచయిత పెద్దాడ మూర్తి (51) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సంధ్య, పిల్లలు సుగాత్రి, అభిజిత్ ఉన్నారు. కొంతకాలం పాటు పాత్రికేయుడిగా పనిచేసిన ఆయన, ఆ తర్వాత సినీ గీత రచయితగా ప్రయాణం మొదలుపెట్టారు. 'స్టాలిన్', 'ఇడియట్', 'అమ్మ నాన్న ఓ తమిళమ్మాయి', 'చందమామ' తదితర చిత్రాల్లో పెద్దాడ మూర్తి రాసిన పాటలు విశేష ఆదరణ పొందాయి. ధారావాహికల కోసం కూడా కొన్ని పాటలు రాశారు. చివరిగా ఆయన 'నాగలి' అనే సినిమాకి మాటలు, పాటల రచయితగా పనిచేశారు. ఆ చిత్రం విడుదల కావల్సి ఉంది. బుధవారం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ శ్మశానవాటికలో అంత్యక్రియల్ని నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

(c) eenadu

# కాకినాడలో గ్రాన్యూల్స్ ఇండియా ఔషధ పరిశ్రమ

**దశల వారీగా రూ.2,000 కోట్ల పెట్టుబడి**

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఔషధ పరిశ్రమ నెలకొల్పనుంది. మందుల తయారీకి అవసరమైన కేఎస్ఎం (కీ స్టార్టింగ్ మెటీరియల్స్), ఇంటర్మీడియెట్స్, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రీడియంట్స్), ఫెర్మెంటేషన్ ఉత్పత్తుల కోసం నూతన ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు గ్రాన్యూల్స్ ఇండియా వెల్లడించింది. దీనిపై వచ్చే ఐదేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి పెడతారు. దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో దశల వారీగా ఔషధ పరిశ్రమను విస్తరిస్తారు.

**విద్యుత్తు, హరిత హైడ్రోజన్ కోసం గ్రీన్‌కో గ్రూపుతో ఒప్పందం:** ఈ ప్లాంటు కోసం గ్రీన్‌కో గ్రూపుతో గ్రాన్యూల్స్ ఇండియా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం గ్రాన్యూల్స్ ఇండియా పరిశ్రమకు అవసరమైన కర్బన రహిత విద్యుత్తును, హరిత హైడ్రోజన్‌ను గ్రీన్‌కో గ్రూపు సరఫరా చేస్తుంది. డీసీడీ, పీఏపీ, పారాసెటమాల్, మెట్‌ఫార్మిన్, ఇతర ఏపీఐలు, ఇంటర్మీడియెట్ల తయారీకి హరిత హైడ్రోజన్‌ను గ్రాన్యూల్స్ ఇండియా వినియోగిస్తుంది. కర్బన రహిత విద్యుత్తును వినియోగించి ఫెర్మెంటేషన్ ఉత్పత్తులు తీసుకువస్తుంది.

**ఉద్గారాలు తగ్గించేలా:** ఔషధాలను ఉత్పత్తి చేసే క్రమంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, పర్యావరణానికి మేలు చేసే విధానాలను అనుసరించాలనేది తమ లక్ష్యమని, అందుకు గ్రీన్‌కో గ్రూపుతో భాగస్వామ్యం వీలు కల్పిస్తుందని గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ అన్నారు. వినూత్న భాగస్వామ్యాన్ని తాము కుదుర్చుకున్నందుకు ఉత్పత్తి రంగానికి, పర్యావరణానికి మేలు జరుగుతుందని గ్రీన్‌కో గ్రూప్ సీఈఓ, ఎండీ అనిల్ కుమార్ చలమలశెట్టి తెలిపారు. గ్రాన్యూల్స్ ఇండియా, గ్రీన్‌కో గ్రూప్ మధ్య కుదిరిన ఒప్పందం పర్యావరణహితంగా నిలుస్తుందని అన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న గ్రీన్‌కో అధ్యక్షుడు మహేశ్ కొల్లి, గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్

**80 దేశాలకు సరఫరా:** గ్రాన్యూల్స్ ఇండియాకు మనదేశంతో పాటు అమెరికాలో ఔషధాల ఉత్పత్తి చేసే యూనిట్లు ఉన్నాయి. దాదాపు 80 దేశాలకు ఈ సంస్థ మందులను సరఫరా చేస్తోంది. ముడి ఔషధాలతో పాటు ట్యాబ్లెట్లు విక్రయిస్తోంది. గ్రీన్‌కో గ్రూపునకు 7.5 గిగావాట్ల సౌర, పవన, జల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో దీనికి విద్యుత్తు యూనిట్లు ఉన్నాయి. వినూత్నమైన పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులను గ్రీన్‌కో గ్రూపు చేపడుతోంది.




# లక్షన్నర ఐటీ ఉద్యోగాలు పోయాయ్

కొవిడ్ సమయంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా అధిక వేతనాలపై నిపుణులను భారీగా నియమించుకున్న టెక్నాలజీ సంస్థలు.. ఇప్పుడు గిరాకీ తగ్గడంతో, సాధ్యమైనంత మందిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పని కంటే ఎక్కువ వేతనం పొందుతున్నారని భావిస్తున్న వారితో పాటు, పనితీరు సంతృప్తికరంగా లేనివారు వేటుకు గురవుతున్నారు.



- ప్రపంచవ్యాప్తంగా 2022లో ఇదీ టెక్ కంపెనీల తీరు
- లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక

ఈనాడు - హైదరాబాద్

కొవిడ్ పరిణామాల్లో దాదాపు అన్ని రంగాల సంస్థలు, తమ కార్యకలాపాలను డిజిటలీకరణ చేసుకున్నాయి. ... దీంతో సాంకేతిక నిపుణులకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. ఇందువల్లే అంతర్జాతీయ సంస్థలైన మెటా, గూగుల్, అమెజాన్, యాక్సెంచర్, కాగ్నిజెంట్ లాంటి వాటితో పాటు దేశీయంగా టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలు తమకు వచ్చిన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్నాయి. బైజూస్ వంటి అంకుర సంస్థలూ ఈ విషయంలో తగ్గలేదు.

✦ 2022 నుంచి ఐటీ కంపెనీలకు డిజిటలీకరణ ప్రాజెక్టులు తగ్గుతున్నాయి. అమెరికా, ఐరోపాలు ఆర్థిక మందగమనంలో ఉన్నాయి. అందుకే వ్యయ నియంత్రణ కోసం టెక్ సంస్థలు తమ 'అవసరానికి మించి ఉన్న ఉద్యోగులను' వదిలించుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నాయి.

✦ 2022లో ప్రపంచ వ్యాప్తంగా 1013 సంస్థలు 1,53,160 మంది ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ లైవ్ ట్రాకింగ్ వెల్లడించింది. కొవిడ్ నుంచి చూస్తే, ఇప్పటివరకు 1539 సంస్థలు దాదాపు 2,49,151 మంది ఉద్యోగులను తొలగించినట్లు పేర్కొంది. అధిక తొలగింపులు కన్స్యూమర్, రిటైల్ రంగాలలోనే ఉన్నాయి.

**లాభాలు తగ్గడంతోనే..**

టెక్ రంగం 2022లో ఒక్కసారిగా డీలాపడింది. అమెరికాలోని 5 అతి పెద్ద టెక్ కంపెనీల ఆదాయం తగ్గిపోయింది. ఆర్థిక మాంద్యం ఛాయలు కనిపిస్తుండటంతో, సాధ్యమైనంత తొందరగా ఉద్యోగులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయి. 2022లో మెటా 11,000, అమెజాన్ 10,000, సిస్కో 4,100 ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెల్లడించింది. ట్విటర్ సిబ్బందిలో దాదాపు 75% మందిని నూతన యజమాని ఎలాన్ మస్క్ ఇంటికి పంపించినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి.

**అంకురాల నుంచే 18,000 మంది**

గత ఏడాది కాలంలో మన దేశంలోని పలు అంకురాలు దాదాపు 18వేల మంది ఉద్యోగులను తొలగించాయని ఇంక్.42 నివేదిక వెల్లడించింది. బైజూస్ 2,500, ఓలా 2,300, బ్లింకిట్ 1,600, అనకాడెమీ 1,150, వేదాంతు 1,109, వైట్‌హ్యాట్ జూనియర్ 1,000 ఉద్యోగాల్లో కోత విధించినట్లు పేర్కొంది.

**ప్రాంగణ ఎంపికలు నెమ్మదిగా**

దేశీయ సంస్థలతోపాటు, అంతర్జాతీయ సంస్థలూ నూతన నియామకాల్లో ఆచితూచి వ్యవహరిస్తున్నాయని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ప్రారంభ స్థాయి, ప్రాంగణ ఎంపికలు నెమ్మదిగా సాగుతున్నాయి. కొత్తతరం సాంకేతికతలైన కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, వెబ్3, డేటాసైన్స్, అనలిటిక్స్‌లాంటి వాటికి గిరాకీ పెరుగుతోంది. సంస్థలు తమకు అవసరమైన పనిని చేయగల ఉద్యోగుల కోసం చూస్తున్నాయి. దీంతో ఇంటర్న్‌షిప్‌ల విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# క్లౌడ్‌తో పెను మార్పు

- కంపెనీలు భారీగా వినియోగిస్తున్నాయ్
- హైదరాబాద్‌లో నాలుగో రీజియన్
- డేటా మౌలిక వసతులతోనే ఏఐ ఉపయుక్తం
- మైక్రోసాఫ్ట్ ఛైర్మన్ సత్య నాదెళ్ల



ముంబయిలో ప్రసంగిస్తున్న సత్య నాదెళ్ల

ముంబయి: భారత్‌లో డిజిటైజేషన్ కార్యకలాపాలు అద్భుతంగా జరుగుతున్నాయని మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల కితాబునిచ్చారు. దేశంలో సాంకేతికత ఆధారిత ఆర్థిక వృద్ధికి క్లౌడ్, కృత్రిమ మేధ(ఏఐ) మద్దతుగా నిలుస్తాయని ఆయన అన్నారు. 2025 కల్లా క్లౌడ్ సంబంధిత మౌలిక వసతులతోనే చాలా వరకు అప్లికేషన్లు సిద్ధమవుతాయని అన్నారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న నాదెళ్ల మంగళవారం ముంబయిలో జరిగిన మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ రెడీ లీడర్‌షిప్ సమ్మిట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలో హైదరాబాద్‌లోనూ పర్యటించనున్న ఆయన ఏమన్నారంటే..

**ప్రతి చోటా క్లౌడ్ అందుబాటులోకి..:** భారత్‌లోని కంపెనీలూ క్లౌడ్ సాంకేతికతను అధికంగా వినియోగించుకుంటున్నాయి. టెక్నాలజీ రంగంలో పెను మార్పును క్లౌడ్ తీసుకొస్తుంది. క్లౌడ్ వల్ల 70-80 శాతం మేర ఇంధన భారం తగ్గుతుంది. అవసరమైనపుడే దీనిని వినియోగించుకోగలగడం ఇందుకు కారణం. 60కి పైగా ప్రాంతాల్లో 200కు పైగా డేటా కేంద్రాలను ప్రపంచ వ్యాప్తంగా కలిగి ఉన్నాం. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీస్ అయిన అజూర్ దేశంలో పుణె, చెన్నై, ముంబయి కేంద్రాలుగా అమలవుతోంది. హైదరాబాద్‌లో నాలుగో రీజియన్‌ను జత చేస్తున్నాం. ప్రతి చోటా నాణ్యమైన క్లౌడ్ మౌలిక వసతులను సిద్ధం చేయడానికి మేం కట్టుబడి ఉన్నాం. ప్రతి ఫ్యాక్టరీ, రిటైల్ స్టోర్, గిడ్డంగి, ఆసుపత్రి.. ఇలా అన్ని చోట్లా అందుబాటులోకి తెస్తాం.

## కృత్రిమ మేధపై పెట్టుబడులు

క్లౌడ్‌ను వినియోగించుకోవడంలో భారత్‌లో విపరీతమైన వేగం కనిపిస్తోంది. క్లౌడ్ ఆధారిత సర్వర్లను మేం ఇక్కడ విక్రయించాం. భవిష్యత్‌లో ఆర్థిక వృద్ధికి ఇంధన సామర్థ్యం కీలకం కానుంది. మనకు ఆర్థిక వృద్ధి కావాలంటే.. ప్రస్తుత స్థాయిలో ఇంధనాన్ని వాడకూడదు. కృత్రిమ మేధ నుంచి భారీ ప్రయోజనాలు అందుకోవాలంటే.. డేటా మౌలిక వసతులు అవసరం. అందుకే ఇందులో పెట్టుబడులు పెడుతున్నాం. ఈ దశాబ్దం చివరకు మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారే అవకాశం ఉంది. డెవలపర్లు రాణిస్తుండడం, పెరుగుతున్న ఏఐ ప్రాజెక్టులు, నైపుణ్యం పెంచుకోవడం వంటి విషయాలు ఇందుకు సానుకూలతలను తెచ్చిపెట్టొచ్చు. నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉండే మానవ వనరులు మనకు అత్యంత అవసరం. భద్రత, సహకార వ్యాపార ప్రక్రియ, సిబ్బందిలో తిరిగి ఉత్సాహాన్ని నెలకొల్పడం, క్లౌడ్‌కు మారడం, డేటా ఏకీకరణ, ప్లాట్‌ఫామ్‌లకు ఏఐ నమూనాలను అమలు చేయడం వంటి ఆరు కీలక అంశాలపై మైక్రోసాఫ్ట్ దృష్టి సారిస్తుంది.

## హైదరాబాద్‌కూ వస్తారు..

నాలుగు రోజుల తన పర్యటనలో భాగంగా సత్య నాదెళ్ల దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలోనూ పర్యటించనున్నారు. కీలక వినియోగదార్లు, అంకురాల నిర్వాహకులు, డెవలపర్లు, ఎడ్యుకేటర్లు, విద్యార్థులను కలవనున్నారు. 2020 ఫిబ్రవరి తర్వాత ఆయన మనదేశానికి రావడం ఇదే తొలిసారి.

భారత్‌లో మైక్రోసాఫ్ట్ సాంకేతికతను చిన్న, పెద్దా కంపెనీలు ఎలా వినియోగిస్తున్నాయో చెప్పేందుకు నాదెళ్ల కొన్ని ఉదాహరణలు పేర్కొన్నారు. అవేంటంటే..

✦ వివిధ వినూత్న సేవలతో పాటు దివ్యాంగులు ఏటీఎమ్ కార్డు వినియోగించుకునేందుకు ఎస్‌బీఐ మా 'పవర్ యాప్స్'ను ఉపయోగించుకుంటోంది.

✦ 'అజూర్ ఏఐ' ద్వారా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ పలు భారతీయ భాషలకు అనువాద సేవలు కల్పిస్తోంది.

✦ రియల్‌టైంలో అన్ని ప్రాజెక్టుల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడం కోసం ఎల్ అండ్ టీ కూడా 'అజూర్ ఐఓటీ, ఏఐ'ని వాడుతోంది.

✦ 'మైక్రోసాఫ్ట్ డైనమిక్స్ 365'ను వినియోగిస్తూ సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్ తన వినియోగదార్ల నుంచి సేకరించిన డేటాతో రిసోర్స్ ప్లానింగ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ చేయగలుగుతోంది.

✦ 'మైక్రోసాఫ్ట్ 365 టూల్స్' ద్వారా ఎయిరిండియా తన ఉద్యోగులకు సెక్యూరిటీ సొల్యూషన్లను అందిస్తోంది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లతో భాగస్వామ్యం

మైక్రోసాఫ్ట్‌తో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. మైక్రోసాఫ్ట్ క్లౌడ్‌తో అప్లికేషన్ పోర్ట్‌ఫోలియో అభివృద్ధి చేయడంతో పాటు, డేటా వ్యవస్థను ఆధునికీకరించడం, ఎంటర్‌ప్రైజ్ అంశాలకు భద్రత అందించడం ఇందులో భాగంగా ఉంటాయి.

**యెస్ బ్యాంక్ సైతం:** మైక్రోసాఫ్ట్‌తో భాగసామ్యం కుదుర్చుకున్నట్లు యెస్ బ్యాంక్ ప్రకటించింది. తదుపరి తరం మొబైల్ అప్లికేషన్‌ను తీసుకువచ్చేందుకు ఈ భాగస్వామ్యం ఉపకరిస్తుందని పేర్కొంది.

### కోడి గుడ్లు

3న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 541 | గోదావరి | 540 |
| చిల్లరగా(ఒకగుడ్డు) | 6.00 | విశాఖపట్నం | 555 |
| వరంగల్ | 543 | చిత్తూరు | 568 |
| 4వ తేదీకి | | | |
| విజయవాడ | 540 | చిల్లరగా (డజను) | 78 |

# టఫే చేతికి 'ఫోర్వియా' వ్యాపార కార్యకలాపాలు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయంగా ఆటోమోటివ్ ఇంటీరియర్ ఉత్పత్తులు సరఫరా చేసే ఫ్రాన్స్ సంస్థ ఫోర్వియాకు, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్, మహారాష్ట్రలోని చకన్‌తో పాటు తమిళనాడు రాష్ట్రంలో ఉన్న వ్యాపార కార్యకలాపాలను చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న టఫే (ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్) కొనుగోలు చేసింది. మనదేశంలో మొబిస్- కియా, మొబిస్- హ్యూందాయ్, ఫోక్స్‌వ్యాగన్, ఎఫ్‌సీఏ, టాటా మోటార్స్ వంటి సంస్థలకు ఫోర్వియా సేవలందిస్తోంది. తాజా లావాదేవీ విలువ రూ. 350-400 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. దేశీయ ట్రాక్టర్ల మార్కెట్లో అమ్మకాల పరంగా ద్వితీయ స్థానంలో ఉన్న టఫేకు ఇంజినీరింగ్ ప్లాస్టిక్ విడిభాగాల వ్యాపారం ఉంది. దీనికి ఫోర్వియా వ్యాపారం జత కలవడం వల్ల, వినియోగదార్లకు విస్తృత సేవలు అందించగలమని టఫే ఛైర్మన్, ఎండీ మల్లికా శ్రీనివాసన్ వివరించారు.

# ముడి చమురుపై పన్ను పెంపు

**డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపైనా**



దిల్లీ: దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడి చమురుతో పాటు డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై అదాటు (విండ్ ఫాల్) లాభాల పన్నును ప్రభుత్వం పెంచింది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఓఎన్‌జీసీ లాంటి కంపెనీలు దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడి చమురుపై పన్ను ప్రస్తుతం టన్నుకు రూ.1,700 ఉండగా, రూ.400 పెంచి రూ.2,100కు చేర్చింది. డీజిల్ ఎగుమతులపై పన్ను లీటరుకు రూ.5 నుంచి రూ.6.50కు పెంచింది. ఏటీఎఫ్ ఎగుమతులపైనా పన్నును లీటరుకు రూ.1.50 నుంచి రూ.4.50కు పెంచింది. కొత్త పన్ను రేట్లు ఈనెల 3 నుంచి అమల్లోకి వచ్చాయి.

# చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు జీవీకే ముంబయి విమానాశ్రయ కేసు బదిలీ

ముంబయి: జీవీకే గ్రూపు సంస్థగా ఉన్న ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం (ఎంఐఏఎల్) లో నిధుల దుర్వినియోగానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసు, సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి దక్షిణ ముంబయిలోని చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ అయింది. రూ.705 కోట్ల మేరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు, ఇందులో జీవీకే గ్రూపు, ఎంఐఏఎల్ ప్రమోటర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపిస్తూ ఐపీసీ, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కింద సీబీఐ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసులో ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేదని తాజాగా సీబీఐ స్పష్టం చేసింది. దీంతో కేసును చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేస్తూ సీబీఐ స్పెషల్ కోర్టు నిర్ణయం తీసుకుంది.

# పీఎన్‌బీ డిపాజిట్ రేట్లు 0.5% పెంపు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వివిధ కాలావధుల ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను 0.5% మేర పెంచింది. ఏడాది నుంచి మూడేళ్ల కాలవ్యవధి కలిగిన రూ.2 కోట్ల లోపు కాలావధి డిపాజిట్లపై వడ్డీ రేటును 50 బేసిస్ పాయింట్లు పెంచి 6.75% చేసింది. కొత్త రేట్లు ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వృద్ధులు మరో 0.5% వడ్డీని అదనంగా పొందొచ్చని బ్యాంక్ వెల్లడించింది.

# మారుతీ సుజుకీ రికార్డు ఎగుమతులు

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా 2022లో 2,63,068 వాహనాలను ఎగుమతి చేసింది. ఒక ఏడాదిలో కంపెనీకి ఇవే అత్యధిక ఎగుమతులు. 2021 ఎగుమతులు 2,05,450 వాహనాలతో పోలిస్తే ఇవి 28% అధికం. అత్యధికంగా ఎగుమతి అయిన మోడళ్లలో డిజైర్, స్విఫ్ట్, ఎస్-ప్రెసో, బాలెనో, బ్రెజా ఉన్నాయి.

# రూ.1.6 లక్షల కోట్లకు మీడియా, వినోద రంగ ఆదాయం



**2023-24పై క్రిసిల్ నివేదిక**

దిల్లీ: దేశీయ మీడియా, వినోద రంగం 12-14 శాతం వృద్ధితో సాగి, 2023-24కు ఈ రంగ ఆదాయం రూ.1.6 లక్షలకు కోట్లకు చేరొచ్చని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా వేసింది. ఈ ఆదాయంలో ప్రకటనల వాటా 55 శాతం కాగా.. చందా (సబ్‌స్క్రిప్షన్) ఆదాయాల వాటా 45 శాతం ఉంటుందని తెలిపింది. ప్రకటనల నుంచి లభించే ఆదాయ వృద్ధిలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వాటాయే అధికమని, ఆ తర్వాతి స్థానాల్లో టీవీ, ముద్రణా (ప్రింట్) మాధ్యమాలు ఉన్నాయని వివరించింది. 'ఆర్థిక వ్యవస్థ పురోగతికి అనుగుణంగా.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రకటనల ఆదాయంలో 14 శాతం వృద్ధి నమోదుకావచ్చు. 2024 మధ్యలో వచ్చే సార్వత్రిక ఎన్నికల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ప్రకటనల ఆదాయాలు పెరగొచ్చు. చందా ఆదాయంలో 12 శాతం మేర వృద్ధి నమోదు కావచ్చ'ని నివేదిక వివరించింది.

**వాటాలో టీవీ.. వృద్ధిలో డిజిటల్:** విస్తృత వ్యాప్తి కారణంగా ప్రకటనల ఆదాయ వాటాల్లో టీవీ విభాగం హవా కొనసాగుతుందని, అయితే ఆదాయ వృద్ధిలో డిజిటల్ విభాగమే ముందుందని క్రిసిల్ రేటింగ్ డైరెక్టర్ నవీన్ వైద్యనాథన్ తెలిపారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్, ఇ-కామర్స్, ఇ-లెర్నింగ్, ఆన్‌లైన్ వార్తా పోర్టళ్ల వాడకం గణనీయంగా పెరగడం ఇందుకు కారణమని తెలిపారు. 'కొవిడ్-19 పరిణామాల అనంతరం ప్రకటనల వ్యయాల విషయంలో టీవీ తర్వాత రెండో అతిపెద్ద విభాగంగా డిజిటల్ అవతరించింద'ని పేర్కొన్నారు. మీడియా, వినోద రంగ ప్రకటనల ఆదాయంలో ఈ రెండు విభాగాల వాటానే 75 శాతం ఉంటుందని తెలిపారు. ముద్రణా మాధ్యమ విభాగ ప్రకటన ఆదాయాల వాటా 20 శాతంగా ఉంటుందన్నారు.

**కొవిడ్-19 ముందు కంటే తక్కువగానే 'ముద్రణ' ఆదాయాలు:** వచ్చే ఆర్థిక సంవత్సరంలో ముద్రణా మాధ్యమ విభాగ ప్రకటన ఆదాయాల్లో 15% వృద్ధి ఉండొచ్చని వివరించారు. అయితే ఈ విభాగ ప్రకటనల ఆదాయం కొవిడ్-19 ముందుతో పోలిస్తే ఇప్పటికీ 800- 1000 బేసిస్ పాయింట్ల వెనుకే ఉందని నివేదిక తెలిపింది. రేడియో లాంటి ఇతర మాధ్యమాల ప్రకటన ఆదాయాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొవిడ్-19 ముందు స్థాయికి చేరొచ్చని పేర్కొంది. సినిమాల ప్రదర్శనకొస్తే.. థియేటర్ల వసూళ్లు లాంటి ప్రకటనేతర ఆదాయం కొవిడ్-19 ముందు స్థాయిని అధిగమించొచ్చని క్రిసిల్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బలంగా పుంజుకోవడం ద్వారా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 30 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని తెలిపింది.

# కనీస ప్రజల వాటా నిబంధన నుంచి పీఎస్‌యూలకు మినహాయింపు

దిల్లీ: నమోదిత సంస్థల్లో ప్రజలకు కనీసం 25 శాతం వాటా ఉండాలనే నిబంధన నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు (పీఎస్‌యూ) ప్రభుత్వం మినహాయింపును ఇచ్చింది. ఆ సంస్థల్లో ప్రభుత్వానికి ప్రత్యక్షంగా లేదంటే పరోక్షంగా వాటా ఉన్నప్పటికీ ఈ మినహాయింపు వర్తిస్తుందని వివరించింది. నిబంధన నుంచి మినహాయింపు లభించిన తర్వాత, ఒకవేళ ఆ సంస్థ యాజమాన్యంలో మార్పు చోటుచేసుకున్నప్పటికీ.. నిర్దిష్ట కాలం వరకు మినహాయింపు అమల్లోనే ఉంటుందని ప్రభుత్వ అధికారిక నోటిఫికేషన్ వెల్లడించింది. ఇందుకోసం సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (రెగ్యులేషన్) సవరణ నిబంధనలు- 2022ను జనవరి 2న ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ నోటిఫికేషన్ వల్ల.. ఎల్ఐసీ, ప్రభుత్వం పాక్షిక వాటాను విక్రయించినప్పటికీ ఐడీబీఐ బ్యాంక్‌కు కనీస ప్రజల వాటా నిబంధన నుంచి మినహాయింపు లభించనుంది.

# దేశవ్యాప్తంగా త్వరలో 6,465 విద్యుత్తు బస్సులు

- డీజిల్ బస్సులతో పోలిస్తే 29% తక్కువ నిర్వహణ వ్యయం
- ఇ-బస్ టెండర్‌పై సీఈఎస్ఎల్



దిల్లీ: విద్యుత్తు బస్సులకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి గిరాకీ వస్తున్న నేపథ్యంలో, ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్(ఈఈఎస్ఎల్) పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ (సీఈఎస్ఎల్) 6,465 విద్యుత్ బస్సులకు టెండర్ నిర్వహించింది. డీజిల్ బస్సులతో పోలిస్తే 29% తక్కువ నిర్వహణ వ్యయమే వీటికి అవుతుందని తెలిపింది. ఈ టెండర్‌కు 6 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి గిరాకీ వచ్చింది. ఈ జాబితాలో దిల్లీ, తెలంగాణ, హరియాణా, సూరత్(గుజరాత్), కేరళ, అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి. నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్(ఎన్ఈబీపీ) కింద తొలి టెండర్ ఇది.

**ఇవీ కనిష్ఠ ధరలు:** 12 మీటర్ల బస్సుకు నగరాల మధ్య ప్రయాణానికి రూ.54.3/కి.మీ., నగర పరిధిలో రూ.39.8/కి.మీ., 9 మీటర్ల బస్సుకు రూ.54.46/కి.మీ., 7 మీటర్ల బస్సుకు రూ.61.92/కి.మీ.గా లభించాయి. ఈ ధరల్లో సబ్సిడీ కలిసి లేదు. డీజిల్ బస్సుల వ్యయాలతో పోలిస్తే ఇవి 29 శాతం తక్కువని సీఈఎస్ఎల్ వెల్లడించింది.

**పర్యావరణానికి ఎంత మేలంటే..:** 'రాష్ట్రాల రవాణాలో మార్పు తీసుకురావడంలో వేసిన అద్భుత అడుగు ఇది. విద్యుత్ మొబిలిటీకి ఒక కొత్త మార్కెట్ ఏర్పడుతుంద'ని సీఈఎస్ఎల్ ఎండీ, సీఈఓ మాహువా ఆచార్య పేర్కొన్నారు. వచ్చే కొన్నేళ్లలో 50,000 విద్యుత్ బస్సులను తీసుకురావాలన్న కేంద్రప్రభుత్వ లక్ష్యంలో ఈ టెండర్ ఒక భాగమని ఆమె అన్నారు. 'తాజా టెండర్ విలువ రూ.30,800 కోట్లకు పైగా ఉంది. 12 ఏళ్లలో 571.8 కోట్ల కి.మీ. మేర ఈ బస్సులు ప్రయాణించొచ్చు. తద్వారా 1842 మిలియన్ లీటర్ల శిలాజ ఇంధనాలను ఆదా చేయొచ్చు. దీని వల్ల 4.62 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నిలువరించవచ్చు. ఇందువల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంద'ని సంస్థ తెలిపింది.

# ఒడుదొడుకులున్నా ముందుకే

**సెన్సెక్స్ ▲ 126 — 61294**

**నిఫ్టీ ▲ 35 — 18232**



**సమీక్ష**

ఆద్యంతం ఒడుదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ.. వరుసగా రెండో రోజూ సూచీలు లాభాలు నమోదుచేశాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాల మద్దతుతో బ్యాంకింగ్, ఐటీ, ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే బలహీన రూపాయి, విదేశీ మదుపర్ల అమ్మకాల వల్ల లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 22 పైసలు తగ్గి 83.00 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.34 శాతం పెరిగి 86.20 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 61,074.88 వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో 61,004.04 వద్ద కనిష్ఠానికి చేరింది. మధ్యాహ్నం తర్వాత కోలుకున్న సూచీ 126.41 పాయింట్ల లాభంతో 61,294.20 వద్ద ముగిసింది. నిఫ్టీ 35.10 పాయింట్లు పెరిగి 18,232.55 దగ్గర స్థిరపడింది.

✦ కంపెనీకి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గుంజన్ పటిదార్ రాజీనామా చేయడంతో **జొమాటో** షేరు 2.24 శాతం నష్టపోయి రూ.58.90 వద్ద ముగిసింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 18 మెరిశాయి. యాక్సిస్ బ్యాంక్ 2.25%, టైటన్ 1.87%, టీసీఎస్ 1.54%, టెక్ మహీంద్రా 1.44%, సన్‌ఫార్మా 1.21% లాభపడ్డాయి. ఎం అండ్ ఎం, రిలయన్స్, హెచ్‌యూఎల్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ 1.13% మేర నష్టపోయాయి.

✦ **భారత్‌పే** ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) సుహైల్ సమీర్ తన పదవికి రాజీనామా చేశారు. జనవరి 7 నుంచి రాజీనామా అమల్లోకి రానుంది. కంపెనీ సీఎఫ్ఓ నళిన్ నేగిని తాత్కాలిక సీఈఓగా నియమించారు.

✦ **ఓయో** మాతృసంస్థ ఓరావెల్ స్టేస్ లిమిటెడ్, ఐపీఓకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన ముసాయిదా పత్రాలను సెబీ వెనక్కి పంపింది. తాజా సమాచారంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించింది. దీంతో ఓయో ఐపీఓ మరింత జాప్యం కానుంది.

✦ సూరత్‌లోని కవాస్ టౌన్‌షిప్‌లో ఉన్న పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) నెట్‌వర్క్‌లో, దేశంలోనే మొదటి హరిత హైడ్రోజన్ బ్లెండింగ్ కార్యకలాపాలను ప్రారంభించినట్లు ఎన్‌టీపీసీ ప్రకటించింది.

✦ **ఎల్‌టీఐమైండ్‌ట్రీ** పూర్తిస్థాయి డైరెక్టర్, అధ్యక్షుడు (మార్కెట్లు) వేణుగోపాల్ లంబు రాజీనామా చేశారు. ఎల్‌టీఐ, మైండ్‌ట్రీ విలీనం తర్వాత కంపెనీ నుంచి పెద్దస్థాయి అధికారి నిష్క్రమించడం ఇదే తొలిసారి.

✦ **సా పాలిమర్స్** ఐపీఓ మూడో రోజున 5.35 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో 56,10,000 షేర్లను జారీ చేయగా, 2,99,95,450 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ **రిలయన్స్ క్యాపిటల్** దివాలా పరిష్కార ప్రక్రియపై ఎన్‌సీఎల్‌టీ స్టే విధించింది. హిందుజా గ్రూప్ సవరించిన బిడ్ దాఖలు చేయడాన్ని టొరెంట్ గ్రూప్ సవాల్ చేయడంతో స్టే విధించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

✦ గుజరాత్‌కు చెందిన సాఫ్ట్ డ్రింక్ తయారీ సంస్థ సాస్‌యో హజూరీ బెవరేజెస్‌లో 50 శాతం వాటాను వెల్లడించని మొత్తానికి **రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్** కొనుగోలు చేయనుంది.

✦ ఆఫర్ ఫర్ సేల్‌లో షేర్లు విక్రయించిన **ఎన్‌డీటీవీ** వాటాదార్లకు ఒక్కో షేరుకు అదనంగా రూ.48.65 చెల్లించనున్నట్లు అదానీ గ్రూపు వెల్లడించింది. ఎన్‌డీటీవీ వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ నుంచి వాటాల కొనుగోలు కోసం ఒక్కో షేరుకు చెల్లించిన రూ.342.65కు సమంగా, సాధారణ వాటాదార్లకూ చెల్లింపు జరిపేందుకే ఈ నిర్ణయం తీసుకుంది.

✦ 2022లో బీఎండబ్ల్యూ రికార్డు విక్రయాలు నమోదు చేసింది. విలాసవంత కార్లు, మోటార్‌సైకిళ్లు కలిపి మొత్తం 19,263 వాహనాలు విక్రయించింది. గతేడాది బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్ కార్ల డెలివరీలు 35 శాతం పెరిగి 11,981గా నమోదైనట్లు కంపెనీ తెలిపింది.

(c) eenadu

# రివిజన్, టెస్ట్ సిరీస్.. ఇవే విజయ సూత్రాలు

## ఈఎస్ఈ టాపర్ లక్ష్మీ వెంకటేష్

**అఖిల భారత స్థాయిలో అత్యున్నత ర్యాంకు సాధించటం అంత తేలికేమీ కాదు. ఇటీవల విడుదలైన ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్ష (ఈఎస్ఈ) ఈ అండ్ టీ స్ట్రీమ్‌లో తొలి ప్రయత్నంలోనే రెండో ర్యాంకు సాధించాడు.. ఎన్. లక్ష్మీ వెంకటేష్. తన విజయానికి ఏ అంశాలు దోహదపడ్డాయో తన మాటల్లోనే తెలుసుకుందాం!**



మా సొంతూరు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు సమీపంలోని రేపూరు. నాన్న సత్యనారాయణ రైతు. అమ్మ భాగ్యలక్ష్మీకుమారి. విశాఖపట్నం గాయత్రి విద్యాపరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈసీఈ బ్రాంచితో బీటెక్ (2015-2019) చదివాను. ప్రస్తుతం ముంబయి బార్క్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

ఈఎస్ఈ-2022లో రెండో ర్యాంకు సాధిస్తానని ఊహించలేదు. కాకపోతే పరీక్షలు బాగా రాశాను కాబట్టి మంచి మార్కులు వస్తాయని మాత్రం అనుకున్నాను. 2021 కరోనా రెండో లాక్‌డౌన్‌లో ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నాను. నా సీనియర్లు కొంతమంది ఈ పరీక్ష రాయడం మంచిదని సూచించారు. అలా సన్నద్ధమయ్యాను. బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతుండగా గేట్-2019 రాశాను. అందులో 97వ ర్యాంకు వచ్చింది. గేట్, ఈఎస్ఈల సిలబస్ చాలావరకూ ఉమ్మడిగా ఉంటుంది. అందువల్ల అప్పుడు చదివింది ఈఎస్ఈకి ఎంతో ఉపయోగపడింది.

ఈఎస్ఈలో రెండు రకాల పేపర్లున్నాయి. 1) జనరల్ స్టడీస్ 2) టెక్నికల్. నాకు జనరల్ స్టడీస్ మీద అంతగా అవగాహన లేకపోవడం వల్ల దానికి నేను 'ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ' నుంచి ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నాను. కోచింగ్ వల్ల.. ఎంత పరిమితి వరకూ చదవాలి, అందులో వేటి మీద దృష్టి పెట్టాలి అనేది బాగా అర్థమైంది. నేర్చుకోవడం సులభంగా మారింది. టెక్నికల్ 75 శాతం వరకూ గేట్‌లో చదివింది కావడం వల్ల మిగిలిన 25 శాతం సొంతంగా నేర్చుకున్నాను.

> ఈఎస్ఈనే కాదు, ఏ పోటీ పరీక్షలోనైనా అభ్యర్థి ముందుగా తనను తాను నమ్మాలి. ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లే చాలామంది ఫెయిల్ అవుతున్నారు. క్రమశిక్షణ, సన్నద్ధతలో నిలకడ అనేవి చాలా అవసరం. కొంతమంది పరీక్షను తేలికగా తీసుకుంటుంటారు. దీనివల్ల విజయం దూరమవుతుంటుంది.

### రివిజన్‌తో కాన్సెప్టుపై పట్టు

అభ్యర్థులు ముందుగా సిలబస్ అంతా ఒక్కసారైనా పూర్తిచేయడం ఎంతైనా అవసరం. బలహీనంగా ఉన్న సబ్జెక్టులు ఏవైనా ఉంటే.. కనీసం వాటి బేసిక్స్ అయినా సరే చదవాలి. తర్వాత రివిజన్ (పునశ్చరణ) ఎంతో ముఖ్యం. కనీసం 4 నుంచి 5 సార్లయినా రివిజన్ చేయాలి. పునశ్చరణ చేసిన ప్రతిసారీ కాన్సెప్ట్ ఇంకా బాగా అర్థమవుతుంది.

టెస్ట్ సిరీస్ రాయాలి. దీనివల్ల మనకు ఎంత వచ్చనేది అర్థమవుతుంది. ఇచ్చిన సమయంలోనే పరీక్ష రాయడం కూడా అలవాటవుతుంది. టెస్ట్ సిరీస్‌లో వచ్చిన తప్పులను ఒక ఎర్రర్ నోట్స్‌లో రాసుకుని, రావడానికి కారణాలను తెలుసుకుని, అవి రిపీట్ కాకుండా చూసుకోవాలి. కాన్సెప్ట్స్ మీద పట్టు రావాలంటే వాటికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు చదవడం (కనీసం ఒక్కసారైనా) ఎంతైనా అవసరం.

ఉద్యోగం చేస్తుండటం వల్ల మామూలు రోజుల్లో లైబ్రరీకి వెళ్లి 3 నుంచి 4 గంటలు.. వారాంతాల్లో 6 నుంచి 8 గంటలపాటు చదివాను. జనరల్ స్టడీస్‌లో కరెంట్ అఫైర్స్ ఉండటం వల్ల రోజూ వార్తలు అనుసరించేవాడిని. మిగిలిన సబ్జెక్టులకు నోట్‌బుక్స్ చదివేవాడిని. ఏస్ అకాడమీ టెస్ట్ సిరీస్ ఫాలో అయ్యాను. ప్రిలిమ్స్, మెయిన్స్‌కి కూడా ఇది ఎంతో ఉపయోగపడింది.

### టెక్నికల్ సబ్జెక్టులు మాత్రమే సరిపోవు

చాలామంది ఇంజినీరింగ్ నేపథ్యం వల్ల జనరల్ స్టడీస్‌కి పెద్దగా సన్నద్ధం కారు. కాకపోతే సెలక్షన్‌లో ఇది ఎంతో అవసరం. కాబట్టి టెక్నికల్ సబ్జెక్టులతో పాటు జనరల్ స్టడీస్‌కూ బాగా సన్నద్ధం కావాలి. రోజూ కొంత సమయాన్ని టెక్నికల్‌కూ, మిగిలిన సమయాన్ని జనరల్ స్టడీస్‌కూ కేటాయించాలి.

**చదివిన పుస్తకాలు**

1. Microelectronics - *Sedra Smith*
2. Electromagnetics - *Sadiku*
3. Networks - *Alexander*
4. Semiconductor Physics and devices - *Donald Neamen.*
5. Communications - B P Lathi
6. Basic Electrical Engineering - *Nptel lectures by Umanand (IISc)*
7. Control Systems - *I J Nagrath*

గత సంవత్సరాల పేపర్లు చూడటం వల్ల పరీక్ష మీద అవగాహన వస్తుంది. వాటిని నిజమైన పరీక్షలా పరిగణించి రాయాలి. రివిజన్, టెస్ట్ సిరీస్ ఈఎస్ఈ విజయానికి చాలా ముఖ్యమని మర్చిపోకూడదు. ప్రతి సబ్జెక్టూ ఎంతవరకు చదవాలనేది కూడా తెలిసి ఉండాలి. (ముఖ్యంగా జనరల్ స్టడీస్‌లో). దీనికి కోచింగ్ ఉపయోగపడుతుందనేది నా ఉద్దేశం.

మార్కులు తక్కువగా వస్తాయని.. చాలామంది టెస్ట్ సిరీస్ రాయడానికి భయపడతారు. కానీ టెస్ట్ సిరీస్‌ని మన తప్పులను తెలిపే ప్రక్రియగానే చూడాలి. వచ్చే ఫలితాలను చూసి భయపడకూడదు. టెస్ట్ సిరీస్‌లో వచ్చిన తప్పులను శ్రద్ధగా గమనించాలి. ఆ తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి.

# నైపుణ్యాలకు నగిషీ... కొలువులో ఖుషీ!

**కెరియర్ కూడా క్రికెట్ క్రీడ లాంటిదే! నేర్చుకున్న అంశాలకే పరిమితమైతే ట్వంటీ-20లా ముగుస్తుంది. కొన్నాళ్లపాటు కొత్తవి నేర్చుకుంటే వన్డే ఇన్నింగ్స్ మాదిరిగానూ, ఎప్పుడూ నేర్చుకుంటూ ఉంటే టెస్టు సిరీస్‌లా సుదీర్ఘంగానూ కొనసాగుతుంది. నేర్చుకోవడాన్ని సరిపెట్టుకుంటే ఉద్యోగాన్ని వదిలిపెట్టడానికి దగ్గరైనట్లే! అందుకే ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిందే!**



ప్రస్తుతం డిగ్రీ పట్టాలు చేతికందుకుని, ఏదైనా కోర్సు లేదా టెక్నాలజీపై పట్టు సాధించినవారికి వెంటనే కాకపోయినా కొన్నాళ్లకు ఉద్యోగం లభిస్తోంది. అయితే చేరిన విభాగం (టెక్నాలజీ)లోనే పూర్తికాలం కొనసాగే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. సాంకేతిక వినియోగం పెరగడంతో ఉన్న ఉద్యోగాల్లో కొన్ని అదృశ్యమవుతున్నాయి. అలాగే కొత్తవీ పుట్టుకొస్తున్నాయి. ఈ పరిణామంతో... నేర్చుకోవడంపై ఆసక్తి లేనివాళ్లు వైదొలుగుతున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకున్నవారు కొనసాగుతున్నారు. అందువల్ల ఒడుదొడుకులు లేని కెరియర్ సొంతం చేసుకోవడానికి కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడం తప్పనిసరి. ఉద్యోగం చేస్తూనే..విద్యార్థిలా నేర్చుకుంటూనే ఉండాలి. ఉన్న నైపుణ్యాలకే పరిమితమైతే తొలగింపునకు ఆహ్వానం పలికినవారమవుతాము.

**మార్పే మంత్రం:** కొత్త టెక్నాలజీలు.. కొత్త సంస్థలు.. కొత్త అవకాశాలు..విస్తరిస్తోన్న తరుణంలో ఇప్పటివరకు నేర్చుకున్నవాటితో అంతగా ఉపయోగం ఉండకపోవచ్చు. ప్రపంచంతో పరుగులు తీయాలంటే తాజా మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలి. మార్పునకు సిద్ధం కావడమంటే రీ స్కిల్లింగ్‌కు ఆహ్వానం పలకడమే. భవిష్యత్తులో పోటీ ఏ విధంగా ఉంటుంది, ఏ రకంగా ఎదురవుతుందో ఊహించడం కష్టం. అందువల్ల 'ఏమీ కాదులే' అనుకుంటే నష్టపోక తప్పదు. ప్రస్తుతం సంస్థలు మనుగడ కోసం పోరాడుతున్నాయి. అలాగే ఒక్క ఉద్యోగానికి వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ రెండు పరిస్థితుల మధ్య అవకాశాలు సొంతం చేసుకోవడం ఎంత కష్టమో, అందులో ఎక్కువ కాలం కొనసాగడం అంతకు మించిన సవాల్. అందువల్ల ఉద్యోగాన్ని ఆశించేవాళ్లు, ఉద్యోగ జీవితంలో ఉన్నవారు.. లెర్న్..అన్ లెర్న్.. రీ లెర్న్ విధానాన్ని తమ డీఎన్ఏగా మార్చుకోవాలి.

**మెరుగులద్దండి:** ప్రతి ఉద్యోగిలోనూ ప్రత్యేక నైపుణ్యాలుంటాయి. నేర్చుకున్న నైపుణ్యాలే బలమైన పునాదులుగా నిలబడతాయి. సామర్థ్యం ఉన్న నైపుణ్యాలపై మరింత సాధన చేయాలి. వాటిపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలి. నేర్చుకున్న అంశాలను పనిలో మరింత మెరుగ్గా ప్రదర్శించాలి. ఆ పని సులువుగా పూర్తి కావడానికి అవి తోడ్పడాలి. నిరంతర సాధన, సునిశిత పరిశీలన, అనుభవం ద్వారా చేస్తున్న పనిపై పట్టు లభిస్తుంది. దాన్ని మెరుగ్గా, నాణ్యంగా చేయడానికి వీలవుతుంది.

**విస్తరించండి:** మీ నైపుణ్యాలు, పనిని అనుసరించి వాటికి అనుబంధంగా ఉన్న అంశాలపై దృష్టి సారించాలి. ఉదాహరణకు సంప్రదాయ అడ్వర్టైజింగ్ నిపుణులు డిజిటల్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్ (ఎస్ఈఎం)ల్లో ప్రావీణ్యానికి ప్రయత్నించవచ్చు. ఇలా చేయడం వల్ల అదే వృత్తిని వేరే వేదికపై కొనసాగించడానికి వీలవుతుంది. ప్రస్తుతం వివిధ విభాగాల్లో పనిచేస్తోన్నవారు.. వాటికి సంబంధించిన లేదా అనుబంధ సాంకేతికతపై పట్టు సాధించాలి. దీంతో భవిష్యత్తు పరిణామాలు ఇబ్బందులు సృష్టించవు.

**ఆన్‌లైన్ అస్త్రం:** కొత్త అంశాలను నేర్చుకోవడానికి ఆన్‌లైన్‌ను మించిన వేదిక లేదు. నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడాన్ని సంస్థలూ ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకోసం సమయం, డబ్బునీ వెచ్చిస్తున్నాయి. పూర్తిగా సంస్థలపైనే ఆధారపడకుండా ఎవరికి వారు స్వచ్ఛందంగా నేర్చుకోవడానికి ఎన్నో దారులున్నాయి. నామ మాత్రపు ఫీజు చెల్లించి, పరీక్ష రాసి నేర్చుకున్న అంశంలో సర్టిఫికెట్ అందుకోవచ్చు. సంస్థలోపల, బయట ఉన్న ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. దీనిద్వారా భిన్న అంశాల్లో ప్రావీణ్యం పొందవచ్చు. అలాగే నేర్చుకోవడంపై మీకున్న ఆసక్తి సంస్థలకు అర్థమవుతుంది. రెజ్యూమేలోనూ ఈ స్కిల్స్ చేర్చుకోవచ్చు. భవిష్యత్తులో వచ్చే అవకాశాలను తేలికగా అందిపుచ్చుకోవచ్చు. వీలు కుదుర్చుకుని సెమినార్లు, వర్క్‌షాప్‌లు, వెబినార్లలో పాల్గొంటూ ఉండాలి.

**సాఫ్ట్ స్కిల్స్:** ఉద్యోగంలో రాణించడానికీ, ఉన్నత స్థాయికి చేరుకోవడానికీ విషయపరిజ్ఞానం ఒక్కటే సరిపోదు. సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవడం తప్పనిసరి. సృజన, భావోద్వేగ నియంత్రణ, కమ్యూనికేషన్, శ్రద్ధగా వినడం, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవడం, బృందంతో మమేకం కావడం, చొరవ, బాధ్యత తీసుకోవడం, సమస్యలను పరిష్కరించగలగడం, పనిపరమైన సవాళ్లను స్వీకరించడం..వీటన్నింటిపైనా దృష్టి పెట్టాలి.

**టెక్నాలజీపై పట్టు:** ఉద్యోగానికి ఢోకా లేకుండా అందులో కొనసాగడానికి అప్ టు డేట్‌గా ఉండటమే కీలకం. ఎవరికివారే ఉన్న నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకుని, కొత్తవి నేర్చుకోవాలి. సంస్థలు కఠిన పరీక్షలు, సాంకేతికత ద్వారా ఉద్యోగులను అంచనా వేసి అవసరం లేని వారిని తొలగిస్తున్నాయి. ఉద్యోగం శాశ్వతంగా ఉండాలంటే మార్పు తప్పనిసరి. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చినవాళ్లు.. తాజా మార్పులను ముందే పసిగట్టి సంస్థకు విలువైన ఉద్యోగిగా మారగలరు. మీకు ప్రత్యామ్నాయం లేదని సంస్థ భావించినప్పుడే భవిష్యత్తుకు ఢోకా ఉండదు. కొత్త అవకాశాలకూ పోటీ పడవచ్చు.

### ఉద్యోగార్థులూ... గమనించండి

సంస్థ ఏ రంగానికి చెందింది అయినప్పటికీ అభివృద్ధి మాత్రం మానవ వనరుల నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటుంది. విలువైన ఉద్యోగులే సంస్థ నుంచి మేటి సంస్థ స్థాయికి తీసుకెళ్లగలరు. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న తీవ్ర పోటీ తట్టుకుని వ్యాపార సంస్థలు ముందుకెళ్లడంలో నియామకాలే కీలక పాత్ర వహిస్తున్నాయి. అవసరమైన నైపుణ్యాలున్న, సరైన అభ్యర్థులపై పూర్తి దృష్టి సారిస్తున్నాయి. ఎక్కువమందిని ఆకర్షించడానికి తమను తాము ఉన్నతీకరించుకుంటున్నాయి.

### సాంకేతికతే అస్త్రం



నియామక ప్రక్రియ కోసం ఎక్కువ సమయం వెచ్చించడంతోపాటు, ఒత్తిడినీ సంస్థలు ఎదుర్కొంటున్నాయి. ఎంత పకడ్బందీగా ముందుకెళ్లినప్పటికీ మానవ తప్పిదాలకు అవకాశం ఉంది. అందువల్ల ఉద్యోగుల ఎంపికలో సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నాయి. సరైన అభ్యర్థులను ఒడిసిపట్టి, విలువైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వెబ్ బోట్స్ కీలకమయ్యాయి. సమర్థులైన మానవ వనరులను ఆకర్షించి, వాళ్ల నియామకాల్లో భాగస్వాములు కావడానికి రిక్రూట్‌మెంట్ మార్కెటింగ్ సాఫ్ట్‌వేర్ (ఆర్ఎంఎస్)ను ఉపయోగిస్తున్నాయి. అలాగే వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి అప్లికేషన్ ట్రాకింగ్ సిస్టమ్ (ఏటీసీ) సాంకేతికతను వినియోగిస్తున్నారు. బోట్స్, టూల్స్ కారణంగా నియామక ప్రక్రియ వేగంగా, సులువుగా అన్నింటికంటే ముఖ్యంగా కచ్చితత్వంతో, సమర్థంగా పూర్తవుతోంది. అర్హులను నియమించుకోవడంతోపాటు కొనసాగించడానికీ, పనితీరును సమీక్షించడానికీ, స్కిల్ గ్యాప్ అంచనా వేయడానికీ ఈ టూల్స్ ఉపయోగపడుతున్నాయి. అందువల్ల గాలివాటంతో ఉద్యోగం వచ్చే పరిస్థితి ఇప్పుడు లేదు. సత్తా ఉంటేనే ఆఫర్ లెటర్ చేతికొస్తుంది.

### సోషల్ మీడియా

సరైన అభ్యర్థులను అన్వేషించడానికి సంస్థలు పాత పద్ధతులను దాటి సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయి. ఉద్యోగార్థుల్లో ఎక్కువమందికి సోషల్ మీడియాలో ఖాతాలు ఉండటంతోపాటు, వారు వీలైనంత సమయం అందులో గడుపుతున్నారు. అందువల్ల ఖాళీల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక రెండు పనులకూ సోషల్ మీడియా చక్కని వేదికగా నిలుస్తోంది. ఎంపికైన అభ్యర్థుల సోషల్ మీడియా అకౌంట్లను నిశితంగా గమనిస్తున్నారు. రాజకీయ, మత పరమైన విమర్శలు, వివాదాస్పద అంశాలు, పరుష పదజాలం... మొదలైనవాటికి దూరంగా ఉండాలి. అభ్యర్థుల వ్యక్తిత్వానికి కొలమానంగా ఆన్‌లైన్ మీడియా ఖాతాను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

### మల్టిపుల్ స్కిల్ సెట్

పని వాతావరణం తరచూ మారుతోంది. ఇప్పటి నైపుణ్యాలు రేపటి పనికి సరిపోకపోవచ్చు. భిన్న అంశాల్లో ప్రావీణ్యం ఉన్నవాళ్లు కొత్త విషయాలు, సాంకేతికతలను సులువుగా ఆకళింపు చేసుకోగలరు. అందువల్ల నియామక సంస్థలు అభ్యర్థుల నుంచి మల్టిపుల్ స్కిల్ సెట్ ఆశిస్తున్నాయి. అవసరమైనవాటికి పరిమితం కాకుండా అవసరానికి మించి నేర్చుకోవడంపై ఉద్యోగార్థులు దృష్టి సారించాలి!

# సీఆర్‌పీఎఫ్‌లో చేరతారా?

**1458 ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు**

**సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 1458 ఉద్యోగాలను భర్తీ చేయబోతోంది. ఇంటర్మీడియట్/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన స్త్రీ, పురుషులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.**



మొత్తం ఖాళీల్లో.. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్) పోస్టులు 143 ఉన్నాయి. వీటిల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 58, ఈడబ్ల్యూఎస్‌కు 14, ఓబీసీకి 39, ఎస్సీకి 21, ఎస్టీకి 11 కేటాయించారు. హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) ఖాళీలు 1315 ఉన్నాయి. వీటిల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 532, ఈడబ్ల్యూఎస్‌కు 132, ఓబీసీకి 355, ఎస్సీకి 197, ఎస్టీకి 99 పోస్టులను కేటాయించారు.

**శారీరక ప్రమాణాలు:** పురుషులు 165 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఛాతీ 77 సెం.మీ., గాలి పీల్చినప్పుడు 82 సెం.మీ. ఉండాలి. ఎస్టీ అభ్యర్థులు 162.5 సెం.మీ. ఎత్తు ఉండి, ఛాతీ 76 సెం.మీ., గాలి పీల్చినప్పుడు 81 సెం.మీ. ఉండాలి. మహిళలు 155 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఎస్టీ మహిళలకు 150 సెం.మీ. సరిపోతుంది..

**వయసు:** 25.01.2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3 ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

**పరీక్ష ఫీజు:** రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, మహిళా అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

**ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేసన్, డిటైల్డ్ మెడికల్ టెస్ట్, రివ్యూ మెడికల్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒకరు ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయాలి. ఒకటికంటే ఎక్కువ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తారు.

**సీబీటీ:** ఈ పరీక్షలో 100 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. ఏబీసీడీ అనే నాలుగు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎలో హిందీ లేదా ఇంగ్లిష్ లాంగ్వేజ్ (ఆప్షనల్), సెక్షన్-బిలో జనరల్ ఆప్టిట్యూడ్, సెక్షన్-సిలో జనరల్ ఇంటెలిజెన్స్, సెక్షన్-డిలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

ఒక్కో సెక్షన్‌లో 25 ప్రశ్నలకు 25 మార్కుల చొప్పున కేటాయించారు. సెక్షన్ బీసీడీ ప్రశ్నలు ఇంగ్లిష్/ హిందీల్లో ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలో ఉంటాయి.

✦ సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ/ ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. అభ్యర్థుల తుది ఎంపిక సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగానే ఉంటుంది.

**స్కిల్ టెస్ట్:** సీబీటీలో అర్హత సాధించిన అభ్యర్థులను స్కిల్ టెస్టుకు ఎంపికచేస్తారు. ఏఎస్సై (స్టెనో)కు పది నిమిషాల డిక్టేషన్ ఉంటుంది. నిమిషానికి 80 పదాల వేగంతో డిక్టేషన్ తీసుకోగలగాలి. కంప్యూటర్ పైన ఇంగ్లిష్‌లో 50 నిమిషాలు, హిందీలో 65 నిమిషాల చొప్పున ట్రాన్స్‌క్రిప్షన్ చేయగలగాలి.

✦ హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) పోస్టుకు ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాల వేగంతో కంప్యూటర్‌పైన టైప్ చేయాలి. లేదా హిందీలో నిమిషానికి 30 పదాల వేగంతో టైప్ చేయగలగాలి.

✦ టైపింగ్ టెస్ట్‌ను కంప్యూటర్‌పైన మాత్రమే నిర్వహిస్తారు. అవసరమైన కంప్యూటర్లు, కీబోర్డులను రిక్రూట్‌మెంట్ సెంటర్లలో అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతారు. స్కిల్ టెస్ట్ అర్హత పరీక్ష మాత్రమే. దీనికి మార్కులు ఉండవు. అయితే ఏఎస్సై పోస్టుకు జరిగే షార్ట్‌హ్యాండ్ టెస్ట్‌లో 40 తప్పులు వస్తే ఫెయిల్ అయినట్టుగా పరిగణిస్తారు.

✦ సీబీటీలో చూపిన ప్రతిభ ఆధారంగా మెడికల్ టెస్ట్ కోసం అభ్యర్థుల జాబితాను రూపొందిస్తారు.

✦ ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో శిక్షణ, కొన్ని పరీక్షలు పాసవ్వాలి. ఆ తర్వాత పోస్టులో శాశ్వతంగా నియమిస్తారు.

**వేతన శ్రేణి:** అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనో)కు పే లెవెల్-05 కింద మూలవేతనం రూ.29,200 ఉంటుంది. హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్)కు పే లెవెల్-04 కింద మూల వేతనం రూ.25,500 చెల్లిస్తారు.

**పరీక్ష కేంద్రాలు:**

**ఆంధ్రప్రదేశ్‌లో:** అమలాపురం, అనంతపురం, బొబ్బిలి, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుత్తి, గుడ్లవల్లేరు, గుంటూరు కడప, కాకినాడ, కర్నూలు, మదనపల్లె, మార్కాపురం, నంద్యాల, నెల్లూరు, పొద్దుటూరు, పుట్టపర్తి, పుత్తూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తాడిపత్రి, తిరుపతి, తిరువూరు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. **తెలంగాణలో:** ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్గొండ, నర్సంపేట, నిజామాబాద్, సత్తుపల్లి, సూర్యాపేట, వరంగల్, వరంగల్ (అర్బన్).

**దరఖాస్తులకు చివరి తేదీ:** 25.01.2023

**కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** 22-28 ఫిబ్రవరి 2023

**వెబ్‌సైట్:** www.crpfindia.com

# ఉద్యోగం చేస్తూ సర్టిఫికెట్ కోర్సులు



బీబీఎం డిగ్రీ చేశాను. తర్వాత ఎంబీఏ చదవాలని లేదు. ఉద్యోగం చేసుకుంటూ నైపుణ్యాలను పెంచుకునే సర్టిఫికెట్ కోర్సులున్నాయా?. - వాసన్

■ బీబీఎం డిగ్రీలో మీరు ఏ స్పెషలైజేషన్ చదివారో చెప్పలేదు. మీరు చదివిన స్పెషలైజేషన్, ఏ కంపెనీలో పని చేయాలనుకొంటున్నారో అన్న అంశాలను బట్టి ఎలాంటి సర్టిఫికెట్ కోర్సులు చేయాలో నిర్ణయించుకోండి. మీరు మార్కెటింగ్ రంగంలో ఉద్యోగం చేస్తూ ఉంటే డిజిటల్ మార్కెటింగ్,



సోషల్ మీడియా మార్కెటింగ్, అడ్వర్టైజింగ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, బ్రాండింగ్ మేనేజ్‌మెంట్, సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ ఎనలిటిక్స్, మార్కెటింగ్ రిసెర్చ్‌ల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయవచ్చు. ఫైనాన్స్ రంగంలో ఉద్యోగం చేస్తూవుంటే, క్వాంటిటేటివ్ ఫైనాన్స్, ఫిన్ టెక్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మార్కెట్స్, కాస్ట్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ ఎనలిటిక్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్‌ల్లో సర్టిఫికెట్ కోర్సులు చేసుకోవచ్చు. హెచ్ఆర్ రంగంలో హెచ్ఆర్ లీడర్ షిప్, స్ట్రాటజిక్ హెచ్ఆర్ఎం, టాలెంట్ హెచ్ఆర్ఎం, రిక్రూట్‌మెంట్ అండ్ ట్రెయినింగ్, హెచ్ఆర్ ఎనలిటిక్స్‌ల గురించి కూడా ఆలోచించవచ్చు. ఆపరేషన్స్ రంగానికొస్తే, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, సోర్సింగ్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, సిక్స్ సిగ్మా, సర్వీస్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, సప్లై చెయిన్ ఎనలిటిక్స్‌ల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయవచ్చు.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

# నోటిఫికేషన్స్

## ప్రవేశాలు

### జిప్‌మర్‌లో బీఎస్సీ కోర్సులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) 2022-23 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

- బీఎస్సీ నర్సింగ్: 94 సీట్లు
- బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్: 87 సీట్లు

**అర్హత:** 50% మార్కులతో 10+2 హయ్యర్/ సీనియర్ సెకండరీ పరీక్ష (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ బోటనీ అండ్ జువాలజీ) ఉత్తీర్ణతతో పాటు నీట్‌యూజీ 2022లో అర్హత.

**వయసు:** 17 ఏళ్లు పూర్తయి ఉండాలి. గరిష్ఠ పరిమితి లేదు.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** 20-01-2023.

**తరగతులు ప్రారంభం:** 09.02.2023.

**వెబ్‌సైట్:** https://jipmer.edu.in/

### జవహర్ నవోదయ విద్యాలయాల్లో...

649 జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)ల్లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష-2023 ప్రకటన వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తారు.

**అర్హత:** విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న జిల్లాల్లో నివాసి అయివుండాలి. 2022-23 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి.

**వయసు:** 1.5.2011 నుంచి 30.4.2013 మధ్యలో జన్మించినవారై ఉండాలి.

**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయాలి. దీంతో పాటు అభ్యర్థి ఫొటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ / నివాస ధ్రువపత్రాల వివరాలు అవసరమవుతాయి.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31-01-2023

**ప్రవేశ పరీక్ష తేదీ:** 2023 ఏప్రిల్ 29

**ఫలితాల వెల్లడి:** 2023, జూన్

**వెబ్‌సైట్:** https://navodaya.gov.in/nvs/en/Home1

## ప్రభుత్వ ఉద్యోగాలు

### అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు

113 సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ) పోస్టులకు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ ప్రకటన జారీ చేసింది. మల్టీజోన్-1లో 54, మల్టీజోన్-2లో 59 ఏఎంవీఐ పోస్టులు ఉన్నాయి.

**అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ (మెకానికల్ ఇంజినీరింగ్/ ఆటోమొబైల్). లేదా డిప్లొమా (ఆటోమొబైల్ ఇంజినీరింగ్)తో పాటు హెవీ మోటారు వాహన (ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్) డ్రైవింగ్ లైసెన్స్.

**వయసు:** 01/07/2022 నాటికి 21 - 39 సంవత్సరాల మధ్య ఉండాలి.

**ఎంపిక:** రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ టైప్) పేపర్-1, పేపర్-2 ఆధారంగా.

**దరఖాస్తు, పరీక్ష రుసుము:** రూ.320.

**ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 12/01/2023.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 01/02/2023.

**పరీక్ష తేదీ (ఆబ్జెక్టివ్ టైప్):** 23/04/2023.

**వెబ్‌సైట్:** https://websitenew.tspsc.gov.in/

### డిగ్రీ కాలేజీల్లో 544 ఖాళీలు

టీఎస్‌పీఎస్సీ డిగ్రీ కళాశాలల్లో 544 అసిస్టెంట్ ప్రొఫెసర్ల (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్ల, లైబ్రేరియన్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 31.01.2023

**దరఖాస్తుకు చివరి తేదీ:** 20.02.2023.

**వెబ్‌సైట్:** https://websitenew.tspsc.gov.in

### ఎయిమ్స్-భువనేశ్వర్‌లో...

భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన 88 సీనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**విభాగాలు:** సైకాలజీ, రేడియోథెరపీ, యూరాలజీ, పాథాలజీ, డెర్మటాలజీ, బయోకెమిస్ట్రీ, అనాటమీ తదితరాలు.

**అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ/ డీఎన్‌బీ/ ఎంఎస్.

**వయసు:** 45 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** మెరిట్, రాతపరీక్ష ఆధారంగా.

**దరఖాస్తు ఫీజు:** రూ.1500

**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.

**దరఖాస్తుకు చివరి తేదీ:** 14.01.2023

**వెబ్‌సైట్:** https://aiimsbhubaneswar.nic.in/Recruitment_Notice.aspx


(c) eenadu



## ఎక్సెల్ సూత్రాలు సులువుగా

సూత్రాలను సులువుగా మార్చటానికి ఎక్సెల్‌లో నాలుగు కొత్త ఫీచర్లు వచ్చేస్తున్నాయి. వెబ్‌లో అందుబాటులో ఉండే వీటితో సమయం ఆదా అవుతుంది. ఎక్సెల్ సూత్రాల గురించి ఇంకాస్త తెలుసుకోవటానికి ఇవి తోడ్పడతాయి. ఫార్ములా సజెషన్స్ ఫీచర్ మరింత బాగా పనికొచ్చే సూత్రాలను చూపెడుతుంది. ఫార్ములా సెల్‌లో టైప్ చేయగానే ఆయా విషయాల డేటా ఆధారంగా దానంతటదే మంచి సూత్రాలను సూచిస్తుంది. 'ఫార్ములా బై ఎగ్జాంపుల్' ఫీచర్ మొత్తం కాలాన్ని సూత్రంతో ఫిల్ చేసి పెడుతుంది. కాలమ్‌లో మాన్యువల్‌గా, తరచూ ఎంటర్ చేసే డేటాను ఇది గ్రహించి పని సులువయ్యేలా చేస్తుంది. డ్రాప్ డౌన్ బాక్స్‌లో సెర్చ్ బార్‌ను ఇక చేయటానికి తోడ్పడేది 'సజెస్టెడ్ లింక్స్' ఫీచర్. ఆల్ట్, ఎఫ్12 (మ్యాక్‌లోనైతే ఎఫ్12) బటన్లను కలిపి నొక్కితే పవర్ క్వెరీ ఎడిటర్ త్వరగా ఓపెన్ అవుతుంది కూడా. ఇక 'ఇమేజ్ ఫంక్షన్' మ్యాక్ కోసం ఉద్దేశించింది. ఇది గడుల్లో ప్రత్యామ్నాయ టెక్స్ట్‌తో పాటు ఇమేజెస్‌ను ఇన్సర్ట్ చేయటానికి ఉపయోగపడుతుంది.

## ఇవి వెతికితే చిక్కులే

గూగుల్‌లో దేని గురించైనా వెతకొచ్చు. తేలికగా సమాచారాన్ని తెలుసుకోవచ్చు. కానీ కొన్ని విషయాలు గురించి వెతికితే మాత్రం చిక్కులు తెచ్చిపెట్టొచ్చు.

■ బాంబ్‌ను తయారు చేయటమెలా? ప్రెషర్ కుక్కర్ బాంబ్‌ను తయారు చేయటమెలా? అని వెతికితే పోలీసులు ఇంటి తలుపు తట్టొచ్చు. సెక్యూరిటీ సర్వీసులు ఇలాంటి హానికర అంశాలను గురించి పోలీసులకు సమాచారం ఇస్తాయి మరి. కాబట్టి వీటి గురించి ఎన్నడూ వెతకొద్దు.



■ పిల్లల అశ్లీల చిత్రాలు, పిల్లల లైంగిక వేధింపులతో కూడిన వీడియోలు నేరం కిందికే వస్తాయి. వీటిని చూసినా, డౌన్‌లోడ్ చేసినా పోలీసులు ఇంటికి ఆహ్వానించినట్టే.

■ నేరాలకు సంబంధించిన ప్రశ్నలను వెతికినా కష్టాలు కొని తెచ్చుకున్నట్టే. కిడ్నాపింగ్, నార్కోటిక్స్ వంటి వాటి గురించి వెతికితే పోలీసులు ఇంటికి రావొచ్చు.

■ అబార్షన్‌తో ముడిపడిన అంశాలను తరచూ వెతికినా ఇబ్బందే. మనదేశంలో వైద్యపరమైన అబార్షన్ విషయంలో కచ్చితమైన నియమాలున్నాయి. వీటిల్లో లోపాలను తెలుసుకోవాలని ప్రయత్నిస్తే పోలీసులు అనుమానించే ప్రమాదముంది.

# చీకటి లోకానికి చదువుల వెలుగు!




**అక్షరం జీవితానికి దారి చూపుతుంది. లక్ష్యసాధనకు బీజం వేస్తుంది. చదువులేని జీవితాన్ని సారం లేని నేలతో పోల్చుకోవచ్చు. మరి చూపు లేకపోతే? అక్షరాలను చూసి నేర్చుకోవటం, చదవటం కష్టమే. అయినా లూయీ బ్రెయిలీ బెదరలేదు. చూపు లేకపోతేనేం? స్పర్శతోనే అక్షరాలను ఔపోసన పట్టారు. రాతకే కొత్త రాతను లిఖించారు. అంధులకు కొత్త లిపిని బహూకరించారు. అదే బ్రెయిలీ లిపి. వేలి స్పర్శతోనే సమస్త విజ్ఞానాన్ని ముందుంచగల బాటను పరిచారు కాబట్టే ఆయన పుట్టినరోజును ప్రపంచవ్యాప్తంగా బ్రెయిలీ డేగా నిర్వహించుకుంటున్నాం. చీకటి లోకాన్ని చదువుల వెలుగులతో నింపిన బ్రెయిలీ లిపి వెనక పెద్ద కథే ఉంది.**

చూపులేనివారు ఇక ఎన్నటికీ చదువుకోలేరని అనుకునే రోజులవి. కళ్లతో పదాలను చూస్తే గానీ చదవటం, రాయటం సాధ్యం కాదని అనుకునే రోజులవి. లూయీ బ్రెయిలీ ఈ భావనలను తుడిచిపెట్టేశారు. చూపు లేకపోతే రోజువారీ జీవితం ఎలా ఉంటుందో ఆయనకు స్వయంగా తెలుసు. ఎదురయ్యే ఆటంకాలు, ఇబ్బందులు తెలుసు. వాటిని ఎలా అధిగమించాలో కూడా తెలుసు. చిన్నప్పటి నుంచే చదువుల మీదున్న ఆకాంక్షే ఆయనకు 'కొత్త చూపు' ప్రసాదించింది. స్పర్శతోనే అక్షరాలను గుర్తించే విద్య నేర్పించింది. ఆ నేర్చుకున్న దాంతోనే ఇతరులకు విద్యను ప్రసాదించటానికి దారి చూపించింది. చూపు లేకపోయినా తేలికగా చదువుకోవటానికి వినూత్న మార్గం వేసింది. ప్రపంచానికి కొత్త లిపిని ప్రసాదించింది. బ్రెయిలీ లిపి కోసమే పుట్టారేమో అనిపించేలా ఆయన జీవితం సాగింది.

### ప్రమాదవశాత్తు అంధత్వం



లూయీ బ్రెయిలీ కథ పందొమ్మిదో శతాబ్దం తొలినాళ్లలో మొదలైంది. ఫ్రాన్స్‌లోని పారిస్ నగరానికి సమీప గ్రామంలో జనవరి 4, 1809లో ఆయన జన్మించారు. తండ్రి తోలు వస్తువులను తయారు చేసేవారు. తోలును కత్తిరించటానికి, రంధ్రాలు పెట్టటానికి పెద్ద దబ్బనంలాంటి పదునైన పనిముట్లు ఉపయోగించేవారు. బాల బ్రెయిలీ ఒకసారి ఇలాంటి పదునైన దబ్బనంతో ఆడుకుంటూ ఉండగా.. పొరపాటున అది ఒక కంట్లో దిగబడింది. మొదట్లో అంత ప్రమాదకరంగా అనిపించలేదు. కానీ రాన్రానూ పెద్దగా అయ్యింది. ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కన్ను పోయింది. అది చాలదన్నట్టు కొద్దిరోజుల తర్వాత రెండో కంటికీ ఇన్‌ఫెక్షన్ సోకింది. అదీ పోయింది. దీంతో లూయీ ప్రపంచం పూర్తిగా చీకటిమయమైంది. అప్పటికి అతడి వయసు మూడేళ్లు. మొదట్లో అతడికేమీ అర్థమయ్యేది కాదు. తనకెందుకు కనిపించటం లేదని అమాయకంగా అడిగేవాడు. చూపు లేకపోయినా బ్రెయిలీ తెలివి అమోఘం. తల్లిదండ్రులు కూడా బాగా ప్రోత్సహించారు. తండ్రి చేసి ఇచ్చిన కర్ర సాయంతో గ్రామంలో వీధులన్నీ చుట్టబెట్టేవాడు. తన స్నేహితులతో కలిసి బడికి వెళ్లేవాడు. అందరికన్నా బాగా చదివేవాడు. అనతికాలంలోనే తెలివైనవాడిగా పేరు తెచ్చుకున్నాడు. అంధత్వం అతడి సృజనాత్మకతకు ఎన్నడూ అడ్డు తగల్లేదు. అయితే ఆ చిన్న బడిలో అంతగా సౌకర్యాలు లేకపోవటంతో వేరే స్కూలుకు వెళ్లాలని అనుకున్నాడు. అప్పుడే అంధుల కోసం ప్రత్యేకించిన రాయల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ బ్లైండ్ యూత్ గురించి తెలిసింది. అందులో చేరిన వెంటనే తండ్రిని అడిగిన ప్రశ్న చూపులేనివారు చదువుకోవటానికి పుస్తకాలు ఉన్నాయా? అనే. అదృష్టం కొద్దీ అక్కడ మందం కాగితం మీద ఉబ్బెత్తుగా, తాకితే తెలిసేలా అక్షరాలతో కూడిన పుస్తకాలున్నాయి. ఈ లిపి వ్యవస్థను బడి వ్యవస్థాపకులు వాలెంటీన్ హాయ్ కనుగొన్నారు. ఆ బడిలో 14 పుస్తకాలే అందుబాటులో ఉండేవి. బ్రెయిలీ వాటన్నింటినీ చదివేశాడు. అయితే అక్షరాలు పెద్దగా ఉండటం వల్ల పుస్తకాలూ పెద్దగానే ఉండేవి. గుడ్డిలో మెల్లలా ఇది కొంతవరకు నయమే గానీ చదవటానికే పనికొచ్చేవి. రాయటానికి వీలయ్యేది కాదు. ఉబ్బెత్తు అక్షరాలను ముద్రించటానికి పెద్ద ప్రింటింగ్ ప్రెస్ అవసరమయ్యేది. పాఠాలను వల్లె వేసుకోవటానికి నోట్స్ రాసుకోవటం కుదిరేది కాదు. అందుకే అంధుల కోసం సరళమైన, చవకైన కొత్త లిపి అవసరమని గుర్తించాడు.

### మాజీ సైనికాధికారి ప్రభావంతో

రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌లో చేరిన రెండో సంవత్సరంలో బ్రెయిలీ జీవితం కొత్త మలుపు తిరిగింది. అప్పుడే మాజీ సైనికాధికారి చార్లెస్ బార్బియర్ తోడు దొరికింది. ఆయనకు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అంధులు తేలికగా పుస్తకాలు చదువుకోవటానికి, రాసుకోవటానికి గడిలో ఉబ్బెత్తు అక్షరాలతో కూడిన విధానాన్ని రూపొందించాడు. ఒకో అక్షరం రెండు అంకెలకు సూచిక. వీటిని రెండు వరుసల చుక్కలతో రాసుకోవచ్చు. వేలితో చుక్కలను తాకుతూ, వాటిని లెక్కపెట్టుకుంటూ అక్షరాలను ఊహించుకోవటం దీనిలోని కీలకాంశం. దీంతో చదువుకోవటమే కాదు.. వేరే కాగితం మీద గుర్తులనూ పెట్టుకోవటానికి వీలయ్యేది. వీటిని ఇతర అంధులూ చదువుకోవచ్చు. నిజానికి ఈ లిపికి మూలం నైట్ రైటింగ్. దీనికి





ఆద్యుడు 19వ శతాబ్దానికి చెందిన చార్లెస్ బార్బియర్. స్పర్శ ద్వారా చీకట్లోనూ సైనికులు సమాచారాన్ని తెలుసుకోవటం కోసం దీన్ని రూపొందించారు. ఆయనే 1821లో రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌కు గడులు, చుక్కల వ్యవస్థను పరిచయం చేశారు. ఈ విధానంలో చదువుకున్న తొలి విద్యార్థుల్లో బ్రెయిలీ ఒకరు కావటం గమనార్హం. ఇందులో 12 ఉబ్బెత్తు చుక్కలతో 36 రకాల శబ్దాలను సృష్టించేవారు. బార్బియర్ విధానం గొప్పతనాన్ని బ్రెయిలీ త్వరలోనే అవగతం చేసుకున్నారు. దీన్ని మరింత మెరుగుపరచే అవకాశమూ ఉందని గుర్తించారు. దీంతో ఎన్నో ప్రయోగాలు చేశారు. దీన్ని సులువుగా, అందరికీ ఉపయోగపడేలా మార్చటానికి నిరంతరం ప్రయత్నించారు. ఉబ్బెత్తు చుక్కలతోనే అక్షరాల లిపిని రూపొందించారు. ఇదే బ్రెయిలీ లిపిగా స్థిరపడింది. దీని రూపకల్పన 1824లోనే పూర్తయినా తొలి పుస్తకాన్ని ముద్రించటానికి ఐదేళ్లు ఆగాల్సి వచ్చింది. ఆయన 1837లో ముద్రించిన పుస్తకం ఇప్పటికీ వాడుకుంటుండటం విశేషం. ప్రతి గడిలో 1-6 వరకు నిర్ణీత సంఖ్యలో ఉబ్బెత్తు చుక్కలను ఒక క్రమంలో అమర్చటం ఇందులోని కీలంకాశం. చుక్కల సంఖ్య, వాటి అమరిక ఒకో అక్షరానికి సంకేతాలు. వీటిని వేలితో తాకుతూ అక్షరాలను, పదాలను పోల్చుకోవచ్చు. తేలికగా, వేగంగా చదవొచ్చు. ఈ విధానాన్ని బ్రెయిలీ అక్షరాలకే పరిమితం చేయలేదు. పియానోలాంటి ఆర్గన్ వాద్యాన్ని వాయించటంలో నిపుణుడైన ఆయన సంగీతం నొటేషన్స్ కూడా రాశారు. అక్షరాలు, విరామ చిహ్నాల వంటివే కాదు ఉబ్బెత్తు గీతలు లేదా చుక్కల వరుసలతో బొమ్మలు, గ్రాఫ్‌లను కూడా బ్రెయిలీ లిపిలో తయారు చేయొచ్చు. కాకపోతే ఈ చుక్కలు బ్రెయిలీ లిపి కన్నా పెద్దగా ఉంటాయి.

### అధునాతన మార్పులతో

ప్రస్తుతం స్క్రీన్ రీడర్ల వంటి కొత్త పరిజ్ఞానాలు చాలానే పుట్టుకొచ్చాయి. ఇలాంటివెన్ని ఉన్నా అంధుల ప్రాథమిక విద్యకు బ్రెయిలీ లిపియే కీలకం. అక్షర క్రమం, విరామ చిహ్నాల వంటి భాషాంగాలను నేర్చుకోవటానికిది అత్యవసరం. శ్రవణ ఆధారిత పరిజ్ఞానాలతో బ్రెయిలీ లిపి ప్రాధాన్యం కోల్పోతుందని చాలామంది భావించారు. కానీ బ్రెయిలీ డిస్‌ప్లేల వంటి అధునాతన పరిజ్ఞానాల రాకతో దీని అవసరం మరింత ఎక్కువైంది. పలక, స్టైలస్‌తో కాగితం వెనకాల చుక్కలను పెట్టి బ్రెయిలీ లిపిలో రాయొచ్చు. ఎక్కడైనా తప్పులు దొర్లితే బ్రెయిలీ ఎరేజర్‌తో చెరిపేసుకోవచ్చు కూడా. ఇప్పుడు బ్రెయిలీ టైప్ రైటర్లు, ఎలక్ట్రానిక్ బ్రెయిలర్, బ్రెయిలీ నోట్ టేకర్ వంటివీ ఉన్నాయి. బ్రెయిలీ ఇన్‌పుట్ కీబోర్డులూ ఉన్నాయి. వీటితో చూపు లేనివారు స్మార్ట్‌ఫోన్‌లో బ్రెయిలీ గుర్తులను నేరుగా టైప్ చేసుకోవచ్చు. ఇవి స్క్రీన్ మీద వాటంతటవే ప్రింట్ రూపంలోకి మారతాయి.

### టైప్ రైటర్ నుంచి ప్రింటర్ల దాకా

ప్రజలు ఆమోదించిన మొట్టమొదటి బ్రెయిలీ టైప్ రైటర్‌ను ఫ్రాంక్ హావెన్ హాల్ ఆవిష్కరించారు. దీన్ని 1892లో బహిరంగంగా ప్రదర్శించారు. అనంతరం హెన్రీ స్టాన్స్ 1903లో స్టెయిన్స్‌బై బ్రెయిలరన్‌ను రూపొందించారు. ఇది అల్యూమినియం ప్లేట్ మీద కదులుతూ బ్రెయిలీ అక్షరాలను ఉబ్బెత్తుగా టైప్ చేస్తుంది. దీన్ని 1933లో మరింతగా మెరుగుపరచారు. వడ్రంగం పాఠాలు బోధించే డేవిడ్ అబ్రహం మరింత అధునాతన బ్రెయిలీ టైప్‌రైటర్‌ను తయారుచేశారు. దీని పేరు పెర్కిన్స్ బ్రెయిలర్. ఇక 1950ల్లో బ్రెయిలీ ప్రింటర్లు (ఎంబోజర్లు) పుట్టుకొచ్చాయి. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి (ఎంఐటీ) చెందిన రాబర్ట్ మాన్ 1960లో వినూత్న సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇది దానంతటదే బ్రెయిలీ లిపిని అనువాదం చేసి పెడుతుంది. ఎంఐటీకే చెందిన మరో పరిశోధకుల బృందం 'ఎంఐటీ బ్రెయిల్‌ఎంబోస్' పరికరాన్ని రూపొందించింది. ఎర్నెస్ట్ బేట్ 1991లో మౌంట్‌బాటెన్ బ్రెయిలర్‌ను తయారుచేశారు. ఇదో ఎలక్ట్రానిక్ యంత్రం. ఇది బ్రెయిలీ కాగితం మీద బ్రెయిలీని టైప్ చేస్తుంది. డేవిడ్ ఎస్.మోర్గాన్ అనే ఆయన 2011లో మొట్టమొదటి స్మార్ట్ బ్రెయిలీ మెషిన్‌ను తీసుకొచ్చారు. ఇది అక్షరాలను మాటల రూపంలోకీ మారుస్తుంది. ఎంటర్ చేసిన డేటాను డిజిటల్ రూపంలోకి మార్చటానికిది వీలు కల్పిస్తుంది.

### లాజిక్ అమరిక

బ్రెయిలీ అక్షరాలు లాజిక్ క్రమంలో అమరి ఉంటాయి. అక్షర క్రమంలోని తొలి పది అక్షరాలు (ఏ నుంచి జే వరకు) పై నాలుగు చుక్కలను ఆక్రమిస్తాయి. ఇవి నంబర్ల వ్యవస్థలో 1 నుంచి 9 వరకు.. అలాగే సున్నాను ప్రతిబింబిస్తాయి. తర్వాతి పది అక్షరాలు కింది ఎడమ వైపు చుక్కతో కలిసి ఆయా అక్షరాలను సూచిస్తాయి. అప్పట్లో అధికారిక ఫ్రెంచిలో డబ్ల్యూ ఉండేది కాదు. అందుకే మొదట్లో బ్రెయిలీ లిపిలో దీన్ని చేర్చలేదు. తర్వాత 10 అక్షరాలు కుడివైపు కింది చివరి చుక్కతో అనుసంధానమై ఉంటాయి.

### బాల్యంలో కీలకం

బాల్యంలోనే చూపు పోయినవారికి, చూపు తగ్గినవారికి వీలైనంత త్వరగా చదువు నేర్పించటం చాలా ఆవశ్యకం. ఇందుకు బ్రెయిలీ లిపి బాగా ఉపయోగపడుతుంది. బాల్యంలోనే బ్రెయిలీ లిపిలో చదువుకున్నవారు చూపు బాగున్నవారితో దాదాపు సమానంగానే నేర్చుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. బ్రెయిలీ లిపిని వేగంగా చదివేవారు అక్షరాలను నెమ్మదిగా తాకుతుంటారు. రెండు వేళ్లతోనూ తాకి చదువుతుంటారు. అయితే ఒక వేలితోనూ బ్రెయిలీ లిపిని చదవొచ్చు. వేలు ఒకసారి ఒక అక్షరాన్ని మాత్రమే గుర్తించినప్పటికీ.. మెదడు బ్రెయిలీ లిపిని నిశితంగానే అర్థం చేసుకుంటుంది. తర్వాత వచ్చే అక్షరాలను ఊహించుకునేలా చేసి పదాలను తేలికగా పోల్చుకోగలదు. ఈ ప్రక్రియ చాలావరకు మెదడులో దృశ్యాలకు సంబంధించిన భాగంలోనే జరుగుతుంది.

### వందకు పైగా భాషల్లో..

ప్రస్తుతం 133కు పైగా భాషల్లో బ్రెయిలీ లిపి అందుబాటులో ఉంది. ఇంగ్లిషు మాట్లాడే దేశాల్లో కొన్ని మార్పులతో వేర్వేరు విధంగా ఉండేది. దీన్ని 1991లో ప్రామాణికంగా మలచటానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. చివరికి యునిఫైడ్ ఇంగ్లిష్ బ్రెయిలీ రూపొందింది. దీన్ని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ ఇంగ్లిష్ బ్రెయిలీకి చెందిన 7 దేశాలు ఆమోదించాయి.

### కాస్త నైపుణ్యం

బ్రెయిలీ లిపిని చదవటానికి కొంత నైపుణ్యం అవసరం. పదాలను తాకుతూ వేళ్లను కదిలిస్తున్నప్పుడు అవసరమైతే కాస్త ఒత్తిడితోనూ నొక్కాల్సి ఉంటుంది. లిపిని అర్థం చేసుకోవటానికి రకరకాల పద్ధతులు ఉన్నప్పటికీ దేనికదే ప్రత్యేకం. రెండు చూపుడు వేళ్లతో చదివేవారు వేగంగా, బాగా చదవగలరని అధ్యయనాలు చెబుతున్నాయి. కుడి చేత్తో వాక్యం చివరను, ఎడమచేత్తో వాక్యం ముగింపును ఒకేసారి గుర్తించేవారు ఇంకాస్త వేగంగా చదువుతున్నారని బయటపడింది.

## సైజు కొంచెం ఛార్జింగ్ ఘనం

ఛార్జింగ్ సమస్యలకు చెక్ పెట్టేందుకు స్టఫ్‌కూల్ సరికొత్త ఛార్జర్‌ను తీసుకొచ్చింది. దీని పేరు పికో ప్రో 35డబ్ల్యూ గాన్. ప్రపంచంలో అతి చిన్న ఛార్జర్ ఇదేనని భావిస్తున్నారు. అలాగని పనితనంలో చిన్నదేమీ కాదు. అతివేగంగా ఛార్జ్ చేసేలా దీన్ని రూపొందించారు. పీఐ పోవిగాన్ అనే భవిష్యత్ టెక్నాలజీ దీని ప్రత్యేకత. పవర్ ప్లే స్టేషన్లు, పిక్సెల్ ఫోన్లు, మ్యాక్ బుక్ ఎం1, ఎం2, శామ్‌సంగ్, ఇతర ఆండ్రాయిడ్ ఫోన్లు, ఐఫోన్లనూ దీంతో ఛార్జ్ చేసుకోవచ్చు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఎయిర్‌పాడ్స్ వంటి వాటినీ ఛార్జ్ చేసుకోవచ్చు. గాలియం నైట్రైడ్ (గాన్) పరిజ్ఞానంతో కూడినది కావటం వల్ల అతి వేగంగా ఛార్జ్ చేస్తుంది. ఒక టైప్-సి పోర్ట్ గల ఇది 35 వాట్స్ అవుట్‌పుట్ ఇస్తుంది. తెలుపు, లేత నీలం, పర్పుల్ రంగులతో ఆకర్షించే పికో ప్రో 35డబ్ల్యూ గాన్ కొన్ని ఆన్‌లైన్ అంగళ్లలో లభిస్తుంది.



### తక్కువ ధరకే ప్రీమియం వాచ్

స్మార్ట్‌ఫోన్ల తర్వాత స్మార్ట్ వాచ్‌లను సొంతం చేసుకోవాలని ఇప్పుడు చాలామంది భావిస్తున్నారు. తక్కువ ధరలోనే ప్రీమియం లుక్‌తో ఆకర్షించే స్మార్ట్ వాచ్‌ల కోసమూ చూస్తున్నారు. ఇలాంటివారికి డిజో వాచ్ ఆర్ మంచి ఎంపిక. సిల్వర్-మెటాలిక్ ఫినిష్, రెండు బటన్లు, 1.3 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 392 పీపీఐ పిక్సెల్ దీని సొంతం. 150కి పైగా వాచ్ ఫేసెస్, 110కి పైగా స్పోర్ట్ మోడ్స్ కలిగుంది. 260 ఎంఏహెచ్ బ్యాటరీతో గల దీన్ని ఒకసారి ఛార్జ్ చేస్తే 10 రోజుల వరకు పనిచేస్తుంది. కావాలనుకుంటే బ్లూటూత్‌తో కాల్స్ కూడా చేసుకోవచ్చు.

# ఐఫోన్ అపోహల నిజమెంత?

ఐఫోన్‌కున్న ఆదరణ గురించి ఎంత చెప్పినా తక్కువే. దీన్ని విమర్శించేవారూ ఎక్కువే. ఐఫోన్ మీద దురభిప్రాయాలకూ కొదవలేదు. అలాంటి కొన్ని అపోహల్లో నిజమెంతో చూద్దాం.

■ ఒకసారి ఐఫోన్ వాడితే తిరిగి వెనక్కి మళ్లలేరని.. ఆండ్రాయిడ్, విండోస్, బ్లాక్‌బెర్రీ పరికరాలను మళ్లీ వాడలేరనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిప్రాయం. ఇది పూర్తిగా తప్పు. ఐఫోన్ నుంచి తిరిగి ఆండ్రాయిడ్ ఫోన్లకు మళ్లినవారు ఎందరో. ఐఫోన్ గలవారు కూడా డేటా సంరక్షణ కోసం ఆండ్రాయిడ్ ఫోన్లను వాడటమూ చూస్తుంటాం. స్పామ్, ఫిషింగ్, స్పైవేర్, హానికర యాప్స్ బారినపడకుండా ఆండ్రాయిడ్ కాపాడుతుంది మరి.

■ ఐఫోన్‌కు వైరస్‌లు సోకవనేది మరో అపోహ. ప్రోగ్రామ్స్ విషయంలో యాపిల్ స్టోర్ కఠిన వైఖరి అవలంబించటం నిజమే. వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేయటం నిజమే. అలాగని అన్ని ఫోన్లూ వైరస్ రహితమని అనుకోవటానికి లేదు.



■ అతిగా ఛార్జింగ్ చేస్తే ఐఫోన్ శాశ్వతంగా దెబ్బతింటుందనీ కొందరు భావిస్తుంటారు. ఒక్క ఐఫోన్లే కాదు.. లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన పరికరాలేవైనా మితిమీరి ఛార్జింగ్ చేస్తే దెబ్బతినొచ్చు. సాధారణంగా స్మార్ట్‌ఫోన్లు పూర్తిగా ఛార్జ్ అయ్యాక 'ట్రికిల్ ఛార్జింగ్' మొదలవుతుంది. ఇది ఛార్జింగ్‌ను ఒక శాతం తగ్గిస్తుంది. ఆ మేరకు ఫోన్ తిరిగి ఛార్జ్ అవుతుంది. అంటే ఐఫోన్‌ను ఓవర్‌ఛార్జ్ చేయటం అసాధ్యమనే చెప్పుకోవచ్చు. అందువల్ల రాత్రంతా ఛార్జ్ చేసినా బాధపడాల్సిన పనిలేదు.

■ అన్నింటికన్నా ఎక్కువ ఆదరణ పొందింది ఐఫోనే అనేది మరో అభిప్రాయం. ప్రపంచ మొబైల్ పరికరాల మార్కెట్లలో ఐఓఎస్‌కు తిరుగులేదని యాపిల్ సంస్థ ఐఫోన్ వాడేవారికి చెబుతుంటుంది. కానీ డేటా వివరాలు భిన్నమైన కథనే చెబుతున్నాయి. చాలా దేశాల్లో స్మార్ట్‌ఫోన్లకు ఆండ్రాయిడే ప్రధాన భూమిక. ఐఫోన్ల కన్నా ఆండ్రాయిడ్ పరికరాలే ఎక్కువగా కనిపిస్తుంటాయి.

# 'మాట సాయం' ఇబ్బంది పెట్టకుండా

**ఇప్పుడు మాటలతోనే ఆన్‌లైన్‌లో విహరిస్తున్నాం. వాయిస్ అసిస్టెంట్లతో కూర్చున్న చోటు నుంచి లేవకుండానే పనులు కానిచ్చేస్తున్నాం. సిరితో మీటింగ్ ఏర్పాటు చేసుకోవటం దగ్గర్నుంచి ఫోన్‌ను సైలెన్స్‌లోనూ పెట్టేసుకోవచ్చు. అమెజాన్ ఎకో మన ఫోన్ ఎక్కడుందో వెతికి పెడుతుంది. తలుపు గడియ వేసేస్తుంది. ఇష్టమైనవారితో ఛాట్ చేయటానికి తోడ్పడుతుంది. అయితే వాయిస్ అసిసెంట్లు అన్ని వేళలా మన మాటలను వింటుండటమే ఆందోళన కలిగించే విషయం. ఇది గోప్యతకు భంగం కలిగించొచ్చు. మరి దీన్ని ఆపటమెలా?**

### ఫేస్‌బుక్‌కు బురిడీ

ఫేస్‌బుక్ కొన్నిసార్లు వీడియో ఛాటింగ్ కోసమో, టెక్స్ట్‌ను మాటలుగా మలచటం కోసమో మైక్రోఫోన్ యాక్సెస్ చేయమని అడగొచ్చు. మైక్రోఫోన్ మీద దానికి ఆధిపత్యం ఇవ్వటం మనకు ఇష్టం లేకపోవచ్చు. ఇలాంటప్పుడు మైక్ యాక్సెస్‌ను ఆఫ్ చేసుకోవటం మంచిది.

✪ ఐఫోన్ వాడేవారైతే- సెటింగ్స్‌లోకి వెళ్లి ఫేస్‌బుక్ మీద ట్యాప్ చేయాలి. మైక్రోఫోన్ పక్కనుండే గ్రీన్ స్విచ్‌ను ఆఫ్ చేసి పెట్టుకోవాలి. దీనికి మరో మార్గం కూడా ఉంది. సెటింగ్స్ ద్వారా ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి వెళ్లి.. మైక్రోఫోన్ మీద ట్యాప్ చేయాలి. యాప్స్ జాబితాలో ఫేస్‌బుక్ కనిపించినట్టయితే ఆఫ్ చేసుకోవాలి.

✪ ఆండ్రాయిడ్ ఫోన్ వాడేవారైతే- సెటింగ్స్‌ను ఓపెన్ చేసి యాప్స్‌లోకి వెళ్లాలి. మార్పులు చేయాలని అనుకుంటున్న యాప్ (ఉదా: ఫేస్‌బుక్) మీద నొక్కాలి. పర్మిషన్స్‌ను ఎంచుకోవాలి. దీని ద్వారా పరిషన్స్‌ను మార్చుకోవచ్చు. 'అలో ఓన్లీ యూజింగ్ ద యాప్, ఆస్క్ ఎవ్రీ టైమ్, డోంట్ అలో' వంటి ఆప్షన్లలో అవసరమైనది ఎంచుకోవాలి.

### వాయిస్ అసిస్టెంట్లను ఆపటం

వర్చువల్ అసిస్టెంట్లు మనం యథాలాపంగా మాట్లాడుకునే మాటల్లోని పదాలనూ పసిగడతాయి. అలెక్సా, సిరి, కోర్టానా, గూగుల్ వంటివి వెయ్యికి పైగా ఇలాంటి పదబంధాలను గుర్తిస్తున్నట్టు ఒక అధ్యయనం పేర్కొంటోంది. దీన్ని తప్పించుకోవటానికి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిది.

✪ అమెజాన్ ఎకో వాడేవారు- పరికరం మీద మైక్రోఫోన్ లేదా వృత్తం ఆకారంలోని బటన్‌ను పుష్ చేయాలి. దీంతో మైక్ లోపలి భాగాల నుంచి వోల్టేజీ ప్రసారం కావటం ఆగిపోతుంది. ఎప్పుడైనా అలెక్సాతో పనిపడితే బటన్‌ను తిరిగి నొక్కితే చాలు. ఎకోను వాడుకోనప్పుడు, ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు మైక్‌ను ఆఫ్ చేసి పెట్టుకోవాలి.

✪ సిరి వాడేవారైతే- ఐఫోన్‌లో సెటింగ్స్‌ను ఓపెన్ చేసి, సిరి అండ్ సెర్చ్ మీద ట్యాప్ చేయాలి. 'లిజన్ ఫర్ హే సిరి' పక్కనుండే ఆకుపచ్చ స్విచ్‌ను ఆఫ్ చేసుకోవాలి. 'అలో సిరి వెన్ లాక్డ్' ఆప్షన్‌ను ఆఫ్ చేసుకోవచ్చు కూడా. దీంతో ఫోన్ జేబులో ఉన్నప్పుడు బటన్ నొక్కినా సిరి ఆన్ కాదు.

✪ గూగుల్ అసిస్టెంట్‌లో- ఆండ్రాయిడ్ పరికరాల్లో సెటింగ్స్ ద్వారా యాప్స్‌లోకి వెళ్లాలి. జనరల్ విభాగం కింద అసిస్టెంట్ మీద నొక్కితే అన్ని అసిస్టెంట్ సెటింగ్స్ కనిపిస్తాయి. ఇందులో హే గూగుల్ ఆప్షన్‌ను ఆఫ్ చేసుకోవాలి. ఐఫోన్లలోనైతే సెటింగ్స్ ద్వారా ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి వెళ్లి మైక్రోఫోన్ మీద ట్యాప్ చేయాలి. యాప్స్ జాబితాలో గూగుల్ అసిస్టెంట్‌ను వెతికి.. ఆకుపచ్చ బటన్‌ను ఆఫ్ చేసి పెట్టుకోవాలి.

# మ్యాటర్ మహత్తు

**మున్ముందు మ్యాటర్ గురించి చాలానే వినాల్సి రావొచ్చు. ఇది ఎన్నో పనులు.. ముఖ్యంగా స్మార్ట్‌హోం కనెక్టివిటీలో అద్భుతాలే చేయగలదు మరి. మ్యాటర్ అంటే ఒక ప్రామాణిక టెక్నాలజీ. కంపెనీలతో పనిలేకుండా స్మార్ట్‌హోం సాధనాలను అనుసంధానం చేయటం దీని ప్రత్యేకత.**



కొత్త డిజిటల్ సాధనాలు మార్కెట్లోకి రాగానే అధునాతన ఫార్మాట్లకే మొగ్గు చూపుతాం. కానీ కంపెనీలు మారిపోతే చిక్కులు తలెత్తొచ్చు. ఉదాహరణకు స్మార్ట్ బల్బులే తీసుకోండి. అవి ఆయా హబ్‌లతోనే పనిచేస్తాయి. వేరే కంపెనీ స్మార్ట్ బల్బును సపోర్టు చేయవు. అందుకే ఒక బ్రాండ్ వస్తువును కొంటే వాటినే మరింత మెరుగు పరచుకోవాల్సి ఉంటుంది. ఆయా కంపెనీల స్మార్ట్ బల్బులు, స్విచ్చుల వంటివే కొనాల్సి ఉంటుంది. వేరే కంపెనీలకు చెందినవి కొంటే పనిచేయవు. ఇలాంటి ఇబ్బందులను తప్పించటానికి మ్యాటర్ తోడ్పడుతుంది. ఇదో కనెక్టివిటీ ప్రొటోకాల్. పరికరాలు దీన్ని సపోర్టు చేస్తే చాలు. కంపెనీలు వేరైనా ఎలాంటి ఆటంకమూ లేకుండా పనిచేస్తాయి. మనం శామ్‌సంగ్ స్మార్ట్ థింగ్స్, యాపిల్ హోంకిట్, గూగుల్ హోం వంటి ఎలాంటి ప్లాట్‌ఫామ్‌ను వాడుకున్నా ఇది అన్ని డిజిటల్ పరికరాలను అనుసంధానం చేసేస్తుంది. అలెక్సా ఎనేబుల్డ్ స్పీకర్‌తో బోర్ కొట్టిందనుకోండి. యాపిల్ హోంపాడ్ మినీకి మారిపోవచ్చు. అప్పటివరకు అలెక్సాతో పనిచేసిన స్మార్ట్ బల్బులు ఇప్పుడు సిరితో ఎంచక్కా పనిచేస్తాయి. భద్రత, గోప్యత విషయంలోనూ మ్యాటర్ పకడ్బందీగా పనిచేస్తుంది. ఇతర స్మార్ట్-హోం వ్యవస్థలకు తీసిపోదు. ఇదో సార్వత్రిక స్మార్ట్ భాషా వేదికగా ఉపయోగపడుతుంది.

(c) eenadu

# హాయ్! బుజ్జీ!!

## పట్టికలో పదాలు!

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి చూద్దాం.
చందమామ, మానససరోవరం, హిమాలయాలు, సరస్సు, శిరస్సు, మనసు, కొలను, ఆణిముత్యం, స్వాతిముత్యం, సాహసయాత్ర, కల్పతరువు, పంచదార, శిల, అల, ఆలయం.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| హి | మా | క | ల్ప | త | రు | వు | వు | బం | బం |
| మా | ల | ల | రు | చి | మ | రు | త | గా | రం |
| యా | ఆ | ల | యం | మా | మ | మా | మ | పం | పం |
| లు | ణి | చి | ద | త | న | ర | ర | చ | పం |
| చి | ము | చం | డు | స | సు | స | ర | దా | స్సు |
| రు | త్యం | ఉ | స | స | మా | స | స | ర | స్సు |
| త | ఉ | రో | ఉ | స | స | స | శి | రో | రో |
| డు | వ | సా | హ | స | యా | త్ర | ల | అ | వ |
| రం | త | సా | హి | మా | ల | యా | లు | ర | ము |
| ఉ | డు | కొ | ల | ను | ర | స్వా | తి | ము | త్యం |

## రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి?

గాలి, కొండ, ముచ్చు, హరి, పిండి, నవ్వు, హాసం, చిరు, కర్ర, చిరుత, బొమ్మ, మర, కూర, విసన, గుండు, గాజు, సూది, పులి, వడ, వంట, ఆది, పరి, గాయ, గండ్లు, వారం, విల్లు

# అడవిలో అమ్మ!

పశువులన్నీ మేత కోసం ఊరి చివరకు బయలుదేరాయి. వెనుక పశువుల కాపరి ఉన్నాడు. ఊరి చివరకు చేరగానే వాటికి పచ్చని గడ్డి కనిపించింది. పశువులు ఆ గడ్డిని చూడగానే ఆనందంతో 'అంబా' అని అరిచాయి. కాపరి పశువులను ఆ ప్రదేశంలో వదిలి, ఒక చెట్టు కిందకు చేరాడు. అవి మేస్తుండగా.. కాపరి తలపాగా కింద పరిచి కూర్చొన్నాడు. మెల్లగా చద్ది మూట విప్పి పశువులను చూస్తూ అన్నం తినసాగాడు. తినటం పూర్తయ్యాక నిద్ర రావటంతో నడుం వాల్చాడు. మెలకువ వచ్చాక చూస్తే అప్పుడే చీకటి పడుతున్నట్లు గమనించాడు. దాంతో కాపరి వేగంగా లేచి పశువులను ఒక దగ్గరకు తోలి లెక్కించగా.. ఆవు ఒకటి తగ్గింది. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. చీకటి పడటంతో మిగతా పశువులను తోలుకుంటూ ఊరి బాట పట్టాడు. ఆ ఆవు మేత మేసుకుంటూ దారి తప్పింది. మిగతా పశువులు, కాపరి కోసం వెతికింది. ఎవరూ కనబడకపోవటంతో చీకట్లోనే భయంగా నడవసాగింది. అలా నడుస్తూ నడుస్తూ అడవిలోకి వెళ్లిపోయింది. ఆ చీకట్లో రాత్రంతా ఓ చెట్టు కింద నిలబడింది.

ఉదయాన్నే తాను అడవిలో ఉన్నట్లు గ్రహించి, భయంతో గజగజా వణికిపోయింది. ఇక అడవి జంతువులకు ఆహారం కాక తప్పదని భావించింది. ఇంతలో దూరం నుంచి రెండు పిల్ల సింహాలు ఆవు వైపు రాసాగాయి. వాటిని చూడగానే ఆవుకు భయం వేసింది. అయినా, లేని ధైర్యాన్ని కూడదీసుకుంది. ఆ పిల్ల సింహాలు ఆవును విచిత్రంగా చూడసాగాయి. మొదట భయపడినా.. కాసేపటికి ఆవు దగ్గరకు వెళ్లాయా పిల్ల సింహాలు. దాని కాళ్లను నాకడంతోపాటు పొడవైన తోకతో ఆడుకోసాగాయి. వాటితో భయం లేదని ఆవు గ్రహించింది. కొంతసేపటి తర్వాత పిల్ల సింహాలు అరవసాగాయి. వాటికి ఆకలి అవుతుందని అర్థం చేసుకున్న ఆవు, మెల్లగా కింద పడుకుంది. ఆకలి మీదున్న పిల్ల సింహాలకు పాలు ఇచ్చింది. పాలు తాగాక అవి ధైర్యంగా దాని మీద ఆడుకోసాగాయి. బుజ్జి సింహాలు తన మీద ఆడుకోవటం ఆవుకు ముచ్చటేసింది. ఇంతలో దూరంగా సింహం గర్జన వినిపించింది. పిల్ల సింహాలు అది తమ తండ్రి పిలుపుగా భావించి గుహ వైపు పరుగులు తీశాయి.

మళ్లీ సాయంత్రం సింహం పిల్లలు వచ్చాయి. ఈసారి వస్తూ వస్తూ మరో రెండు పులి పిల్లలను తీసుకొచ్చాయి. పిల్ల సింహాల మాదిరి పులి పిల్లలు కూడా ఆవు దగ్గర పాలు తాగాయి. ఆవు ఆ నాలుగింటిని తన పిల్లలుగా భావించి సంతోషంగా పాలు ఇచ్చింది. ఆ తర్వాత అవి కాసేపు ఆడుకుని వెళ్లిపోయాయి. అడవిలో గ్రామానికి చేరే దారి కోసం వెతుకుతున్న ఆవుకు నక్క తారసపడింది. దాని జిత్తులమారితనం తెలియని ఆవు, అడవి దాటే మార్గం చూపించమంది. ఆవు అమాయకత్వాన్ని గమనించిన నక్క దారి చూపేందుకు అంగీకరించి.. తనను అనుసరించమంది. ఆ మాటలు నమ్మిన ఆవు దాని వెంటే వెళ్లసాగింది. కొంతదూరం నడిచాక.. సింహం గుహ వద్ద ఆగింది నక్క. ఆవుతో 'నువ్వు ఇక్కడే నిలబడు.. క్షణంలో వస్తా' అని గుహ లోపలికెళ్లింది. ఆవు గుహ బయటే నిలబడింది. గుహ లోపలకు వెళ్లిన నక్క సింహాన్ని కలిసింది. 'మృగరాజా.. ఈరోజు మీకోసం ప్రత్యేకంగా మంచి ఆహారం తెచ్చాను. స్వీకరించి నన్ను అనుగ్రహించండి' అంది.

నక్కతో గుహ బయటకు వచ్చిన సింహానికి ఎదురుగా ఆవు కనపడింది. దాన్ని చూడగానే సింహానికి నోరూరింది. నక్కను అభినందిస్తూ.. 'ఆవును తిన్నాక.. నీకు మంచి బహుమతి ఇస్తాను' అందది. సింహం మాటలకు నక్క సంబరపడింది. సింహాన్ని చూడగానే ఆవు ప్రాణాలు పైనే పోయాయి. లేని ధైర్యాన్ని కూడదీసుకొని.. 'రాజా.. నేను తప్పిపోయి అడవికి వచ్చాను. గ్రామానికి చేరే దారి చూపించి పుణ్యం కట్టుకోండి' అని కోరింది. దానికి సింహం 'నీకు ఊరి దారి కాదు.. స్వర్గం దారి చూపిస్తా' అంటూ ఆవు మీద దాడికి సిద్ధమైంది. ఇంతలో గుహలోంచి సింహం పిల్లలు బయటకు వచ్చాయి. ఆవును చూడగానే ప్రేమతో దాని దగ్గరకు వెళ్లాయి. ఆవు వాటిని దగ్గరకు తీసుకుంది. ఇంతలో పిల్ల సింహాల స్నేహితులైన పులి పిల్లలూ అక్కడకు వచ్చాయి. ఆ నాలుగింటిని చూడగానే దానికి అమ్మతనం గుర్తుకువచ్చింది. సింహం ముందు నిలబడ్డ విషయాన్ని కూడా మర్చిపోయింది.



కథ

వాటికి కడుపునిండా పాలిచ్చింది. తనివితీరా ముద్దాడింది. అవి కూడా ఆవు పట్ల అంతే ప్రేమను చూపించాయి.

సింహం ఆశ్చర్యపోయి.. పిల్లలను ప్రశ్నించింది. ఆవు పాలు ఇచ్చిన విషయాన్ని అవి వివరించాయి. విషయం తెలుసుకున్న సింహం ఆవు ముందు సిగ్గుతో తలదించుకుంది. 'రాణిసింహం ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసింది. అప్పటి నుంచి పిల్లలు పాల కోసం అలమటిస్తున్నాయి. ఎన్ని విధాలా ప్రయత్నించినా వాటి ఆకలి తీర్చలేకపోయాను. అడవికి మృగరాజునైనా తండ్రిగా ఓడిపోయాను. నా బిడ్డల ప్రాణాలు కాపాడిన నిన్ను భక్షించాలనుకున్నాను. నన్ను క్షమించు' అంది సింహం. దానికి ఆవు.. 'పిల్లల ఆకలి నాకు తెలుసు. దారి తప్పటంతో రెండ్రోజులుగా నా పిల్లలకు పాలు ఇవ్వలేకపోయాను. మీ పిల్లలకు ఇస్తూ నా బిడ్డలకు ఇచ్చినట్లుగా భావించాను. బిడ్డల ఆకలి తల్లికే తెలుస్తుంది. తల్లిగా నా ధర్మాన్ని నిర్వర్తించా' అంది. అనంతరం నక్కను పిలిచి ఆవును గ్రామం వరకూ తీసుకెళ్లమని ఆదేశించింది. సింహానికి కృతజ్ఞతలు చెప్పి ఊరి వైపు నడిచింది ఆవు.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర

## అవునా? కాదా?

ఇక్కడ కొన్ని వాక్యాలున్నాయి. వాటిలో ఏవి అవునో, ఏవి కాదో చెప్పగలరా?

1. బంగ్లాదేశ్‌ను మయన్మార్ అని కూడా పిలుస్తారు.
2. 'చైనా వాల్' మధ్యలో కొన్ని పిరమిడ్లున్నాయి.
3. ఎవరెస్ట్ ప్రపంచంలోకెల్లా అతి ఎత్తైన శిఖరం.
4. పైనాపిల్‌ను తెలుగులో అనాసపండు అని పిలుస్తారు.
5. కోకిలకు గూడు కట్టడం రాదు.
6. నల్లబంగారం అని బొగ్గును పిలుస్తారు.



## అక్షరాల చెట్టు




ఇక్కడ ఓ చెట్టుంది. దానికి కొన్ని అక్షరాలున్నాయి. వాటిని సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ఓసారి ప్రయత్నించండి.

## ఏది భిన్నం?

వీటిలో భిన్నమైనదేదో కనిపెట్టండి

1


2


3


## తప్పులే తప్పులు

ఇక్కడున్న పదాల్లో అక్షర దోషాలు ఉన్నాయి. వాటిని సరిజేసి రాయండి చూద్దాం.

1. ఖర్మాగారం
2. ఘజరాజు
3. సాగరథీరం
4. అంఖురార్పణ
5. ఆరాదన
6. ప్రణాలిక
7. కేథనం
8. పరిపాలఖుడు

### జవాబులు

అక్షరాల చెట్టు: BIOCONVERSION
రాయగలరా!: 1.గాజుబొమ్మ 2.గాలిమర 3.విసనకర్ర 3.చిరుతపులి 4.చిరునవ్వు 5.పరిహాసం 6.ఆదివారం 7.పిండివంట 8.కూరగాయ 9.గుండుసూది 10.వడగండ్లు 11.హరివిల్లు 12.కొండముచ్చు
తప్పులే తప్పులు: 1.కర్మాగారం 2.గజరాజు 3.సాగరతీరం 4.అంకురార్పణ 5.ఆరాధన 6.ప్రణాళిక 7.కేతనం 8.పరిపాలకుడు
అవునా? కాదా?: 1.కాదు 2.కాదు 3.అవును 4.అవును 5.అవును 6.అవును
ఏది భిన్నం?: 1

email: hai@eenadu.in

# ఇది పే...ద్ద సైకిలోచ్!

హాయ్ నేస్తాలూ...! మీకు సైకిల్ తొక్కడం వచ్చుకదా! రాకున్నా.. ఫర్లేదు లే. వెంటనే నేర్చుకోవాల్సిన అవసరమూ లేదులెండి. నెమ్మదిగా దెబ్బలు తగలకుండా నేర్చుకోండి సరేనా. ఇప్పటికే సైకిల్ తొక్కడం వచ్చిన వాళ్లు జాగ్రత్తగా నడపండి. మరీ వేగంగా తొక్కకండి సరేనా! అసలు ఇప్పుడు ఈ సైకిల్ ప్రస్తావన ఎందుకో తెలుసా!

మనలాంటి పిల్లల కోసం పలు పరిమాణాల్లో బుజ్జి బుజ్జి సైకిళ్లు, పెద్ద వాళ్ల కోసం పెద్ద సైకిళ్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. సైకిళ్లలోనూ చాలా మోడళ్లు, రకాలూ ఉన్నాయి. కానీ మీరు భారతదేశంలోనే అతిపెద్ద సైకిల్‌ను ఎప్పుడైనా చూశారా! దాని గురించి ఎప్పుడైనా విన్నారా. ఆ సైకిల్ చండీగఢ్‌లో తయారైంది. దాన్ని రాజీవ్ కుమార్ అనే ఓ అంకుల్ తయారు చేశారు.

### ఎంత ఎత్తో...!

ఇంతకీ ఈ సైకిల్ ఎత్తు ఎంతో ఇంకా చెప్పనేలేదు కదూ! ఒకటి కాదు, రెండు కాదు, మూడు కూడా కాదు.. ఏకంగా ఎనిమిది అడుగుల ఎత్తు. 'అయ్య బాబోయ్! ఎనిమిది అడుగుల ఎత్తా?' అని ఆశ్చర్యపోకండి. దీన్ని పది అడుగుల ఎత్తు వరకు కూడా పెంచుకోవచ్చంట మరి!

### పదిలో మదిలో...

'పదో తరగతి విద్యార్థులు ఏం చేస్తారు?' అని ఎవ్వరైనా మిమ్మల్ని అడిగితే.. 'బోర్డు పరీక్షల కోసం చక్కగా చదువుకుంటూ ఉంటారు' అని సమాధానం చెబుతారు కదూ! కానీ ఈ రాజీవ్ కుమార్ అంకుల్ మాత్రం తాను పదో తరగతిలో ఉన్నప్పుడు సొంతంగా సైకిల్ తయారీ మీద ప్రయోగాలు చేశాడు. ముందుగా సైకిల్ సీటు ఎత్తును పెంచాడు. కానీ ఇలా పెంచితే సైకిల్ తొక్కడానికి కాళ్లు అందలేదు. అందుకే సైకిల్ చైన్ ఎత్తు కూడా పెంచాడు.

### ముచ్చటగా మూడు!

సాధారణంగా సైకిళ్లకు ఓ చైన్ ఉంటుంది కదా! కానీ అంకుల్ తయారు చేసిన సైకిల్‌కు మూడు చైన్లుంటాయి. అసలు మీకో విషయం తెలుసా...! ఈ అంకుల్ 1999లోనే 13 అడుగుల ఎత్తున్న సైకిల్‌ను తయారు చేశాడు. కానీ నగరంలోని రోడ్ల మీద నడపడానికి అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో దాన్ని అప్పట్లోనే విప్పదీసి పక్కన పడేశాడు.

### ఒకే ఒక్కడు!

రాజీవ్ కుమార్ అంకుల్ తయారు చేసిన ఈ ఎనిమిది అడుగుల సైకిల్‌ను ఎవ్వరూ నడపలేరు. దీని మీదకు చేరుకోవడం, దిగడం చాలా కష్టం. ఎంతో మంది ప్రయత్నించినప్పటికీ ఎవ్వరూ ఈ సైకిల్‌ను నడపలేకపోయారు. రాజీవ్ కుమార్ అంకుల్ ఒక్కడే ఎంచక్కా ఈ సైకిల్‌ను తొక్కుతున్నాడు. అది కూడా ఈ వీధి చివరి నుంచి ఆ వీధి చివరకు, ఆ వీధి చివరి నుంచి, ఈ వీధి చివరకో అనుకునేరు. ఏకంగా వందల కిలోమీటర్లు ఈ సైకిల్ మీద ప్రయాణిస్తున్నాడు. చండీగఢ్ నుంచి లుధియానాకు దాదాపు వంద కిలోమీటర్లు. ఈ దూరాన్ని ఆరు గంటల్లో సైకిల్ మీద చేరుకున్నాడు. 246 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిల్లీకి 16 గంటల్లో వెళ్లాడు. సిమ్లా నుంచి కల్కాకు మధ్య 104 కిలోమీటర్ల దూరం. దీన్ని కూడా ఆరు గంటల్లో ఈ సైకిల్ మీద చేరుకున్నాడు.






### రికార్డుల మీద రికార్డులు...

ఇన్ని సాహసాలు చేశాడు కాబట్టే ఈ అంకుల్ ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, యునిక్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. భవిష్యత్తులో మరింత ఎత్తైన సైకిల్ తయారు చేసి, దాని మీద చండీగఢ్ నుంచి ముంబయి వరకు దాదాపు 1662 కిలోమీటర్లు ప్రయాణించి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకోవాలని ఆశయంగా పెట్టుకున్నాడు రాజీవ్ కుమార్ అంకుల్. మొత్తానికి భారతదేశంలోనే ఎత్తైన సైకిల్ సంగతులు భలే ఉన్నాయి కదూ!

మా చిరునామా :
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

## నేను గీసిన చిత్రం



జి. గిరివర్‌సాయి, ఆరో తరగతి, పుంగనూరు, చిత్తూరు జిల్లా




గోకుల్ శ్రీహర్ష, ఏడో తరగతి, మంగళగిరి, గుంటూరు జిల్లా




పి. కీర్తిశ్రీ, తొమ్మిదో తరగతి, తాడేపల్లి, గుంటూరు జిల్లా





ఎస్కే. మహావీన్, ఏడో తరగతి, తాడేపల్లి, గుంటూరు జిల్లా

(c) eenadu

ఈనాడు ప్రతిభ

## భారతదేశ విదేశాంగ విధానం

1. 1927లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విదేశీ వ్యవహారాల విభాగానికి (Foreign Affairs Department) ఎవరు నేతృత్వం వహించారు?
   1) మోతీలాల్ నెహ్రూ
   2) సుభాష్ చంద్రబోస్
   3) జవహర్‌లాల్ నెహ్రూ
   4) సర్ తేజ్‌బహదూర్ సప్రూ
2. 'ఆలిండియా కాంగ్రెస్ కమిటీ' సమావేశాల్లో అంతర్జాతీయ పరిణామాలపై ప్రత్యేక తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశాలు ఎక్కడ జరిగాయి?
   1) 1926 - గుహవాటి 2) 1927 - మద్రాసు
   3) 1928 - కోల్‌కతా 4) పైవన్నీ
3. స్వతంత్ర భారతదేశంలో తొలి విదేశాంగ మంత్రిత్వ శాఖను నిర్వహించిన వారెవరు?
   1) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
   2) జైరాందాస్ దౌలత్‌రాం
   3) జవహర్‌లాల్ నెహ్రూ 4) కె.ఎం.మున్షీ
4. కింది వారిలో పాకిస్థాన్-భారతదేశ సంబంధాల విధాన నిర్ణయాల విషయంలో నెహ్రూకు సహకరించిన వారెవరు?
   1) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, గోవింద్ వల్లభ్‌పంత్
   2) సర్వేపల్లి రాధాకృష్ణ, గోవింద్ వల్లభ్‌పంత్
   3) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, కె.ఎం.మున్షీ
   4) రాజకుమారి అమృతకౌర్, జైరాందాస్ దౌలత్‌రాం

▲ అలీన దేశాల 16వ శిఖరాగ్ర సమావేశం ఎక్కడ జరిగింది?
1) డర్బన్ (దక్షిణాఫ్రికా)
2) హవానా (క్యూబా)
3) బాలి (ఇండోనేసియా)
4) న్యూదిల్లీ (భారత్)

**జవాబు: 3**

▲ ఒకదేశ విదేశాంగ విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించే అంశాన్ని గుర్తించండి?
1) భౌగోళిక, చారిత్రక అంశాలు
2) ఆర్థిక, సామాజిక అంశాలు
3) రాజకీయ, సైనిక, సాంకేతిక అంశాలు
4) పైవన్నీ

**జవాబు: 4**

▲ 'భారతదేశ ప్రత్యేక భౌగోళిక పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ వ్యవహారాల వేదికపై భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది' అని 1903లో ఎవరు వ్యాఖ్యానించారు?
1) లార్డ్ కర్జన్ 2) మింటో- మార్లే
3) చార్లెస్ మెట్ కాఫ్ 4) విన్‌స్టన్ చర్చిల్

**జవాబు: 1**

## ఏపీ పోలీస్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

### ఇండియన్ పాలిటీ

# భారత్‌లో తొలి అణుపరీక్షలను ఎప్పుడు చేపట్టారు?

5. కింది అంశాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) భారతదేశం, సోవియట్ రష్యాల మధ్య సత్సంబంధాల స్థాపనకు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కృషి చేశారు.
   బి) సోవియట్ రష్యా అధినేత స్టాలిన్‌తో విదేశాంగ సంబంధాల మెరుగుదలకు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కృషి చేశారు.
   సి) చైనాతో భారతదేశ సంబంధాల మెరుగుదలకు కె.ఎం. ఫణిక్కర్ కృషి చేశారు.
   డి) విజయలక్ష్మి పండిట్ సోవియట్ రష్యాలో భారతదేశ రాయబారిగా వ్యవహరించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) పైవన్నీ
6. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏ దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం (Cold War) కొనసాగింది?
   1) సోవియట్ రష్యా - అమెరికా
   2) అమెరికా - చైనా
   3) చైనా - సోవియట్ రష్యా
   4) అమెరికా - జపాన్
7. కింది వాటిలో భారతదేశ విదేశాంగ విధాన లక్ష్యానికి సంబంధించి సరైంది?
   ఎ) ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజాన్ని ఏకం చేయడం
   బి) ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించడం ద్వారా ప్రపంచ దేశాల మధ్య సమతౌల్యతను సాధించడం
   సి) వివిధ ప్రాంతీయ సంస్థల మధ్య సమన్వయాన్ని సాధించడం
   డి) ఆర్థిక, రాజకీయ, సాంకేతిక, దౌత్యరంగాల్లో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య సమన్వయాన్ని సాధించడం.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) పైవన్నీ



విజయలక్ష్మి పండిట్

8. కింది అంశాల్లో సరైంది?
   ఎ) 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైంది.
   బి) 1991లో భారత్‌లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి.
   సి) నూతన ఆర్థిక సంస్కరణలను పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టింది.
   డి) భారత విదేశాంగ విధానంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం 'LOOK EAST' విధానాన్ని ప్రారంభించింది.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) పైవన్నీ
9. భారత్ రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వద్ద తొలిసారి అణుపరీక్షలను ఎప్పుడు నిర్వహించింది?
   1) 1973, మే 18 2) 1974, మే 18
   3) 1975, మే 18 4) 1977, మే 18
10. భారతదేశం తన అణ్వాయుధ విధానాన్ని ఎప్పటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది?
    1) 1975 2) 1999
    3) 2003 4) 2014
11. భారతదేశ అణ్వాయుధ విధానానికి సంబంధించి కింది వాటిలో సరైంది?
    ఎ) అణ్వాయుధాలను ఏ దేశంపైనా ముందుగా ప్రయోగించరాదు.
    బి) అణ్వాయుధాలు లేని దేశాలపై ముందుగా ప్రయోగించకూడదు.
    సి) అణ్వాయుధ ప్రతిదాడులకు ఆదేశాలు ఇచ్చే అధికారం పౌర రాజకీయ నాయకత్వానికి మాత్రమే ఉండాలి.
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, సి 4) పైవన్నీ
12. బంగాళాఖాత తీరప్రాంత దేశాల మధ్య సహకారం సాధించే లక్ష్యంతో BIST-EC ఏర్పడింది. దీనిలో సభ్యదేశాలు ఏవి?
    1) బంగ్లాదేశ్, భారత్
    2) శ్రీలంక, థాయ్‌లాండ్
    3) 1, 2
    4) భూటాన్, నేపాల్, భారత్
13. BIST-ECను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1997, జూన్ 6
    2) 1998, జులై 9
    3) 1999, ఆగస్టు 15
    4) 2000, ఆగస్టు 29
14. 1997లో BIST-ECలో ఏ దేశం చేరడంతో BIMST-ECగా మారింది?
    1) మాల్దీవులు 2) మారిషస్
    3) మయన్మార్ 4) మలేసియా
15. 2004, జులైలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో BIMST-EC పేరు BBIMST-EC (Bay of Bengal Initiative for Multi Sectorial Technical and Economic Cooperation)గా మారింది. అయితే ఈ సదస్సు ఎక్కడ జరిగింది?
    1) బ్యాంకాక్ 2) కొలంబో
    3) ఢాకా 4) న్యూదిల్లీ
16. BBIMST-EC కూటమిలోని దేశాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) భారత్, శ్రీలంక, థాయ్‌లాండ్
    2) బంగ్లాదేశ్, మయన్మార్
    3) నేపాల్, భూటాన్
    4) ఆఫ్గానిస్థాన్, మాల్దీవులు



రచయిత
బంగారు సత్యనారాయణ
విషయ నిపుణులు

17. 'మనకు శాంతి అనేది ఒక ఇష్టమైన ఆశయం కాదు. తక్షణ అవసరం' అని ఎవరు వ్యాఖ్యానించారు?
    1) దలైలామా 2) మహాత్మాగాంధీ
    3) జవహర్‌లాల్ నెహ్రూ
    4) అంబేద్కర్
18. 1936లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ (INC) సమావేశంలో భారతదేశం సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లుగా తీర్మానం చేశారు. ఈ సమావేశం ఎక్కడ నిర్వహించారు?
    1) ఫైజ్‌పూర్ 2) కాన్పూర్
    3) కోల్‌కతా 4) వారణాసి
19. కింది అంశాల్లో సరైంది?
    ఎ) 1945 నాటికి అమెరికా అణ్వస్త్ర దేశంగా అవతరించింది
    బి) 1949 నాటికి సోవియట్ రష్యా అణ్వాయుధాలను సమకూర్చుకుంది
    సి) 1954లో భారతదేశం దక్షిణాఫ్రికాతో దౌత్య సంబంధాలను వదులుకుంది
    డి) శ్వేతజాతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జింబాబ్వే జరిపిన విముక్తి పోరాటానికి భారత్ మద్దతుగా నిలిచింది.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) పైవన్నీ

### సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-3 | 6-1 | 11-4 | 16-4 |
| 2-4 | 7-4 | 12-3 | 17-3 |
| 3-3 | 8-4 | 13-1 | 18-1 |
| 4-1 | 9-2 | 14-3 | 19-4 |
| 5-4 | 10-3 | 15-1 | |

## మరికొన్ని..

1. 1955లో ఎక్కడ జరిగిన ఆసియా-ఆఫ్రికా దేశాల సమావేశంలో అలీన విధానం అనే భావన ఊపిరి పోసుకుంది?
   1) బాండుంగ్ (ఇండోనేసియా)
   2) కైరో (ఈజిప్ట్)
   3) కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా)
   4) న్యూదిల్లీ (భారత్)
2. కింది వాటిలో అలీన విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన ప్రముఖులకు సంబంధించి సరికానిదేది?
   1) జవహర్‌లాల్ నెహ్రూ (భారత్)
   2) డా.సుకర్నో (ఇండోనేసియా)
   3) యాసర్ అరాఫత్ (పాలస్తీనా)
   4) మార్షల్ టిటో (యుగోస్లావియా)
3. 1954లో పంచశీల ఒప్పందంపై సంతకాలు చేసిన భారత్, చైనా దేశాల ప్రధానులు ఎవరు?
   1) నెహ్రూ, హూజింటావో
   2) నెహ్రూ, చౌ-ఎన్-లై
   3) నెహ్రూ, మావో సేటుంగ్
   4) నెహ్రూ, చిన్‌జియాంగ్
4. భారత్, చైనాల మధ్య జరిగిన పంచశీల ఒప్పందంలోని అంశాన్ని గుర్తించండి?
   ఎ) ఇరుదేశాలు ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాలను పరస్పరం గౌరవించుకోవాలి.
   బి) ఒకదేశ అంతరంగిక వ్యవహారాల్లో మరొక దేశం జోక్యం చేసుకోరాదు.
   సి) ఒకదేశంపై మరో దేశం దురాక్రమణకు పాల్పడరాదు. శాంతియుత జీవనాన్ని అనుసరించాలి.
   డి) సమానత్వం, పరస్పర ప్రయోజనాలను పరిరక్షించుకోవాలి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) పైవన్నీ
5. కింది అంశాల్లో సరైంది?
   ఎ) ఐక్యరాజ్య సమితి స్థాపక దేశాల్లో భారతదేశం ఒకటి
   బి) మనదేశ విదేశాంగ విధానం ఐరాస ఆశయాలకు అనుగుణంగా ఉంది
   సి) ఐరాసకి అవసరమైన ఆర్థిక, సైనిక, దౌత్యపరమైన సహకారాన్ని భారత్ అందిస్తుంది.
   డి) కొరియా, కంబోడియా, వియత్నాం, లెబనాన్, పశ్చిమాసియా తదితర దేశాల సమస్యల పరిష్కారంలో ఐరాసకి భారత్ అండగా నిలిచింది.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) బి, సి, డి 4) పైవన్నీ
6. అలీన దేశాల 7వ శిఖరాగ్ర సదస్సును న్యూదిల్లీలో ఎప్పుడు నిర్వహించారు?
   1) 1982, మార్చి 7-12
   2) 1983, మార్చి 7-12
   3) 1984, మార్చి 7-12
   4) 1985, మార్చి 7-12
7. అలీన విధానానికి సంబంధించి సరికానిదేది?
   1) దక్షిణ సుడాన్ సభ్యదేశంగా కొనసాగుతుంది.
   2) ప్రస్తుత సభ్యదేశాల సంఖ్య - 120
   3) దీని సమావేశాలు సాధారణంగా 3 ఏళ్లకొకసారి జరుగుతాయి.
   4) చైనా, బ్రెజిల్ పరిశీలక హోదాను కలిగి ఉన్నాయి.

### సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-1 | 3-2 | 5-4 | 7-1 |
| 2-3 | 4-4 | 6-2 | |

# How is N's brother related to E?

## Bank Exams Special — Reasoning

## Blood Relations

*Directions (Qs. 1 - 3): Study the following Information carefully and answer the questions given below.*

A + B means A is Father of B
A ÷ B means A is Brother of B
A × B means A is Husband of B
A – B means A is Sister of B

1. Which of the following is TRUE for the given expression L + M – N + O ÷ P?
   A) L is the father of O
   B) M is the mother of P
   C) O is the sister of P
   D) O is the nephew of M
   E) None is true

*Explanation:* $L^+$
↑
$M^-$ — $N^+$
↑
$O^+$ — P

*Ans: D*

2. Which of the following expression denotes that Q is the Sister-in-law of N?
   A) M + N – O + P ÷ Q
   B) M × N – O ÷ P ÷ Q
   C) M + O – N ÷ Q + P
   D) M + N – O ÷ P × Q
   E) None of these

*Explanation:* $M^+$
↑
$N^-$ — $O^+$ — $P^+$ ↔ $Q^-$

*Ans: D*

3. If "K × D – G + T ÷ N' is TRUE then how is N related to D?
   A) Son B) Nephew C) Daughter
   D) Niece E) Either 2 or 4

*Explanation:* $K^+$ ↔ $D^-$ — $G^+$
↑
$T^+$ — N

*Ans: E*

*Directions (Qs. 4 - 6): Study the following information carefully and answer the questions given below:*

M % N' means 'M is father of N'
M = N' means 'M is daughter of N'
M + N' means 'M is son of N'
M ÷ N' means 'M is wife of N'

4. What will come in place of question mark (?) in the given expression, if C is sister-in-law J "C = D ÷ F ? H ÷ J"
   A) % B) = C) +
   D) ÷ E) None

*Explanation:* $D^-$ ↔ $F^+$
↑
$C^-$ — $H^-$ ↔ $J^+$

*Ans: A*

5. Which of the following pairs of persons represent that the first is the mother-in-law of the second with regard to the following questions: L = P ÷ A + V % W = K
   A) VW B) AK C) KP
   D) KL E) VK

*Explanation:* $V^+$ ↔ $K^-$
↑
$P^-$ ↔ $A^+$ — $W^-$
↑
$L^-$

*Ans: C*

6. In the given expression, how is R related to T "T + Q ÷ P % R ÷ S"?
   A) Father B) Brother
   C) Mother D) Sister
   E) Son

*Explanation:* $Q^-$ ↔ $P^+$
↑
$T^+$ — $R^-$ ↔ $S^+$

*Ans: D*

*Directions (Qs. 7 - 8): In the following questions, the symbols #, &, @, *, $, % and ! are used with the following meanings as illustrated below. Study the following information and answer the following questions.*



A # B means A is the son of B
A @ B means B is the child of A
A ! B means A is the parent of B
A $ B means A is elder than B
A * B means A is the husband of B
A & B means B is the daughter-in-law of A
A % B means A is the wife of B

7. D * P & Q @ A, X @ A # Q then how is A related to D?
   A) Great grandson
   B) Either grandson or Granddaughter
   C) Grandfather
   D) Nephew or Niece
   E) Grandson

*Explanation:* $D^+$ ↔ $P^-$
↓
$X^+$ ↔ Q
↓
$A^+$

*Ans: E*

8. If G * M ! C $ E # M, the age of E is 20 yrs and age of G is 40 years then what is the probable age of C?
   A) 16 years B) 21 years
   C) 45 years D) 15 years
   E) Can't be determined

*Explanation:* 40 = $G^+$ ↔ $M^-$
↑
C — $E^+$ = 20

Here C is elder than E (C > E)

*Ans: B*

*Directions (Qs. 9 - 11): Study the following information carefully and answer the questions given below.*

P # Q means P is the spouse of Q
P & Q means P is the child of Q
P % Q means P is the sister of Q
P @ Q means P is the daughter of Q
P ! Q means P is the grandmother of Q
P µ Q means P is the father of Q

**Statements:** U µ K % J, A ! S & K # T & A, Q & Z # E @ H, E % T µ M

9. How is J related to T?
   A) Sister B) Sister-in-law
   C) Brother-in-law D) Brother
   E) Either 2 or 3
10. How is M related to E?
    A) Son B) Daughter
    C) Nephew D) Can't be determined
    E) Niece
11. How is Q related to S?
    A) Cousin B) Brother
    C) Sister D) Either 2 or 3
    E) Can't be determined

*Explanation:*
$H^+$ ↔ $A^-$ $U^+$
| ↑
$Z^+$ ↔ $E^-$ — $T^+$ ↔ $K^-$ — J
↑ ↑
Q M — S

*Key: 9-E; 10-D; 11-A.*

*Directions (Qs. 12 - 14): Study the following information carefully and answer the questions given below.*

There are Nine members - A, B, E, G, N, P, S, U and Y in a family of three generations. Number of females is more than the number of males in the family. No other persons in the family. G is the Father of N, who is unmarried. E is the Brother-in-law of N. Y is married to G, who has only one Son. S is the daughter - in-law of Y. P is the nephew of A, who is the uncle of B. S has no Siblings.

12. How is N's brother related to E?
    A) Sister B) Brother-in-law
    C) Brother D) Sister-in-law
    E) Husband
13. How is U related to G?
    A) Son B) Daughter-in-law
    C) Daughter D) Sister
    E) Son-in-law
14. How is B related to S?
    A) Daughter B) Nephew
    C) Son D) Niece
    E) Can't be determined

*Explanation:*
$G^+$ ↔ $Y^-$
↑
$S^-$ ↔ $A^+$ — $N^-$ — $U^-$ ↔ $E^+$
↑
$B^-$ — $P^+$

*Key: 12-B; 13-C; 14-D.*

*Directions (Qs. 15 - 17): Study the following information carefully and answer the questions given below.*

F is the daughter of G, who is the child of K. S is the Son of Y, who is the Spouse of T. K has only three children. T is the Brother-in-law of B, who is the Sibling of G. R is the Sister-in-law of G, who is the Spouse of D. G is the Son-in-law of Q. B is unmarried.

15. How is Q related to R?
    A) Daughter B) Father
    C) Son D) Mother
    E) Either 2 or 4
16. If K has only one Daughter, then how is B related to F?
    A) Aunt B) Uncle
    C) Father D) Either 1 or 2
    E) Can't be determined
17. If H is the Spouse of K, then how is H related to Y?
    A) Mother B) Father
    C) Mother-in-law D) Can't be determined
    E) Father-in-law

*Explanation:*
K
|
$T^+$ ↔ $Y^-$ — B — $G^+$ ↔ $D^-$ — $R^-$
↑ ↑
$S^+$ $F^-$

*Key: 15-E; 16-B; 17-D.*

*Directions (Qs. 18 - 21): Study the following information carefully and answer the questions given below.*

K, L, M, and N are males who married to four females namely, D, E, F, and G but not necessarily in the same order. R, S, T, U, and V are five children who belong to these four couples. L is married to G, who doesn't have any child. R is the only Son of E, who is not married to K. S and T are Siblings and are of different genders. M is the father of two children. U is the daughter of F, who does not have any other child. K has one Daughter T. V is the sister of R.

18. How many boys are there in the group of children?
    A) Five B) Three C) Two
    D) One E) Four
19. Who amongst the following person is the Father of V?
    A) L B) M C) K D) N
    E) Can't be determined
20. Who amongst the following pair is couple?
    A) M – F B) N – E
    C) E – K D) K – D
    E) M – D
21. U is the child of whom among the following?
    A) K B) N C) L D) E E) D

*Explanation:*
$L^+$ ↔ $G^-$ $E^-$ ↔ $M^+$
↑
$R^+$ — $V^-$

$N^+$ ↔ $F^-$ $K^+$ ↔ $D^-$
↑ ↑
$U^-$ $S^+$ — $T^-$

*Key: 18-C; 19-B; 20-D; 21-B.*

*These model questions were prepared by subject experts of **RACE Institute**, Hyderabad*

(c) eenadu